# సద్గురు శ్రీ సుబ్బరామయ్యసార్ సన్నిధి



శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్



## సద్గురువు



భక్తులకు సద్గురువే తల్లి, తండ్రి, గురువు దైవం

సద్గురువు మన నుండి కోరేది మన కాలము మనస్సు, కృతజ్ఞతా భావము

### తల్లి

**అలన**
- ఎంతో ప్రేమతో వాత్సల్యంతో బిడ్డల భయాలు, బాధలు వినడం
- వారి బలహీనతలు, దుర్గుణాలు తెలిసి కూడా అసహ్యించుకోకుండా ప్రేమ వాత్సల్యాలు కురిపించడం

**లాలన**
- బుజ్జగించడం
- బ్రతిమిలాడటం
- ప్రోత్సహించడం
- పొగడటం

### తండ్రి

**పాలన**
- దిశానిర్దేశము
- నియమపాలన
- గురువుపై ఆధారపడటం
- ఆజ్ఞాపాలన
- సమయపాలన
- ధర్మ పాలన

**పోషణ**
- ఆరోగ్యం
- ఆనందం
- ఆహ్లాదం
- ఆదాయం/ అర్జన
- చదువువిద్య
- ధర్మబలం
- మేధస్సు

### గురువు

**బోధన**
- సద్గ్రంథ రచన
- సత్సంగాలు
- సదోపదేశాలు
- సత్ (స్వప్న) దర్శనాలు
- సద్విమర్శలు
- సదాచరణ
- సద్వ్యాసంగం (లేఖలు)
- మౌనబోధ

**సాధన**
- సంస్కారాల మార్పు
- ఆశ్రమధర్మాలు
- విద్యార్థి ధర్మాలు
- చాపల్యాలపై యుద్ధం
- లీలా సేకరణ
- కాలము - మనస్సు
- గురుస్తుతి

### దైవం

**నిత్యసత్య సాగర**
- నిత్యుడు
- సత్యుడు
- నిరాకారుడు
- నిర్గుణుడు
- నిరంజనుడు
- నిరామయుడు
- నిర్ద్వందుడు

**సర్వలోక రక్షక**
- సర్వ ప్రేరణాధికారి
- సర్వ కారణ కారణం
- సర్వ వ్యాపకుడు
- సర్వసమర్థుడు
- సర్వభూతహృదయాంతర్వర్తి

శనగపిండి, పంచదార, యాలికలు, నెయ్యి, జీడిపప్పు మొదలగు వాటి రుచి విడివిడిగా తినిన అనుభూతి ఒక ఎత్తైతే వాటన్నింటినీ కలగలుపుతో తయారు చేయబడిన లడ్డు తింటే ఉండే మధురానుభూతి వేరు కదా! అలాగే తల్లి, తండ్రి, గురువు, దైవం అన్నీ తానైనా "సద్గురువు సన్నిధి" యొక్క మాధుర్యం వర్ణనాతీతం అట్టి సద్గురువు శ్రీ సుబ్బరామయ్య సార్ కు మన హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు అర్పించుకుందాం! వారు మనకు ప్రసాదించిన ప్రసాదిస్తున్న అనుభవాలను స్మరించుకుంటూ వారి శుభాశీస్సులతో అనుక్షణం ధర్మమార్గంలో పయనిద్దాం!

సద్గురు శ్రీ సుబ్బరామయ్యసార్ సన్నిధి



సంకలనం : శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

అంకితము : శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు

సేకరణ: ప్రసాద్, పర్యవేక్షణ: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

ప్రాప్తిస్థానము: శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి.

**ఈ గ్రంధ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు సమయాభావం వల్ల కొన్ని**

**చోట్ల ఏకవచన ప్రయోగం చేసియున్నాము. ఎవరి మనస్సునైనా బాధ పెట్టి వుంటే క్షమించగలరు.**

# విషయ సూచిక

విషయ సూచిక ........................................ 4
ముందు మాట ........................................ 6
ప్రార్ధన ........................................ 8
శ్రమతో సేవ - సేవతో కైవల్యం ........................................ 9
దైవం మానుష రూపేణ ........................................ 10
మహనీయుల తీర్పు ........................................ 11
శ్రీమతి పెసల శేషమ్మ (శ్రీ సార్ ధర్మపత్ని) ........................................ 17
గౌర్రె వేణుగోపాల్ ........................................ 28
V A S ప్రసాద్ ........................................ 35
నగేష్ ........................................ 47
శ్రీమతి గొర్తి లక్ష్మి గారు (దమ్మపేట) ........................................ 57
సాయి శివ ........................................ 67
G. సాయి సుబ్రహ్మణ్యం ........................................ 80
శివరత్నం ........................................ 94
బట్టు శ్రీ రామకృష్ణ ........................................ 106
పొత్తూరు వెంకటేశ్వరరావు, హైదరాబాద్ ........................................ 123
పాబోలు వెంకటేశ్వర్లు, నెల్లూరు ........................................ 135

రవికుమార్ గారు, విద్యానగర్ ........................ 140
తిరుమల శెట్టి నారాయణ .............................. 152
శ్రీ నాగేశ్వర రావు గారు, దమ్మపేట .................. 164
జగదీష్ గారు, మద్రాసు.................................. 172
శ్రీ శేషు కృష్ణ, చెన్నై.................................... 182
మదన్ కుమార్, శ్రీ హరికోట ............................ 184
వై ఉమామహేశ్వర్ గారు, అనంతపురం ............ 188
పొదిలి శివ శంకర్, హైదరాబాద్........................ 196
కిశోర్, ఓజిలి .............................................204
కార్తీక్, బెంగుళూరు .......................................204
గిరిజ గారు (USA) ....................................... 205
శివకుమారి టీచరు, గుంటూరు ....................... 212
గొర్తి రవి, తిరుపతి ......................................... 213
చింతా లక్ష్మీనారాయణ గారు, వారి ధర్మపత్ని లక్ష్మి గారు 225
మహా సమాధి ............................................... 228
నాటికి –నేటికి పిలిచిన పలికే దైవం ................. 236
సమాధి అనంతరము లీలలు.......................... 243
శ్రీ సార్ మృత్యువు పై ఘన విజయం ................ 308

# ముందు మాట

శ్రీగురుచరిత్రలో "సద్గురువును తగు రీతిన సేవించి వారి కృపతో పూర్ణులు అయిన ఉత్తమ గురుభక్తుని సాంగత్యము - సన్నిధి లభించటమే విశేష గురు కృపకు నిదర్శనం" అని చెప్పబడింది. శ్రీ సుబ్బరామయ్య సార్‌కు శ్రీ భరద్వాజ మాష్టారి తో, శ్రీ వెంకయ్య స్వామివారితో గల పరిచయాలను, వారిరువురి ఆచరణ నుండి ఎంతో (సునిశితమైన) శ్రద్ధతో గ్రహించి మనందరికీ అందించిన ఆచరణాత్మక భోధలను మనము "నాకు తెలిసిన మాష్టారు, మాష్టారి మంచి మాట  లేదా శ్రీ మాష్టారి భోధామృతము", మరియు "శ్రీ అవధూత భోధామృతము", "చూచి నేర్చుకో" అను మొదలగు గ్రంధములలో చూడవచ్చు. ఈ ఇరువురు మహాత్ములను త్రికరణ శుద్ధిగా సేవించి శ్రీ సార్ పొందిన అనుభవాలను "గురుస్తుతి", "అవధూత లీల" గ్రంధముల ద్వారా మనకు అందగా, శ్రీ సార్ జీవన విధానము, వారి దివ్యస్థితి "పరోపకారార్ధం ఇదం శరీరం", "శ్రమతో సేవ - సేవతో కైవల్యం"  అను పుస్తకాలలోను, శ్రీ సార్ ఎందరో అర్హులు, జిజ్ఞాసువులకు ప్రసాదించిన  అమృత వాక్కులు "శ్రీ సుబ్బరామయ్య

సార్ లేఖలు మొదటి, రెండు" భాగాలలో లభ్యము అవుతాయి.

శ్రీ సార్ సందేశాలలో ప్రప్రథమము అయిన సూచన సద్గురు కృపను పొందుటకు సులభము, అత్యావశ్యకము అయిన మార్గము ఆ సద్గురుడు అనంత కృపతో మనకు చేసిన మేలును కృతజ్ఞతతో స్మరించి పులకించటమే! సద్గురువు మనకు ప్రసాదించిన అనుభవాలను నిత్యము నిర్ణీత సమయంలో తప్పక స్మరిస్తూ వారి సన్నిధి అనుభవించటం, వారికి కృతజ్ఞతాంజలి సమర్పించటమే "గురుస్తుతి". అట్టి గురుస్తుతికి సహాయకారిగా ఈ పుస్తకంలో సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ ఎందరో భక్తులకు ప్రసాదించిన అనుభవాలను ఒకచోట కూర్చుకోవటం జరిగింది. అనుభవాలను పొందిన వారే కాక అందరమూ ఈ అనుభవాలను చదువుకొని వారి దివ్యస్థితి - సన్నిధి అనుభవించి గురుసేవలో కృతార్థులము కావలెనను సంకల్పముతో ఆ సద్గురుమూర్తినే ప్రార్థిస్తూ

- శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

ఈ చిన్న పుస్తకము ద్వారా సార్ మధుర స్మృతులను గుర్తించి, ఆయన సన్నిధిని నిరంతరమూ అందరూ పొంది ఆనందించాలని ఆశిస్తున్నాము.

# ప్రార్ధన

మాకు శ్రీ సుబ్బరామయ్య సార్ (సార్) గురువు, తల్లి, తండ్రి, స్నేహితుడు, మా కుటుంబ పెద్ద. అలాంటి మహనీయుని గురించి ఎన్ని వ్రాసినా తక్కువవుతుంది, మాకు గుర్తున్న వాటిలో కొన్ని వ్రాసుకుంటున్నాము. ఎన్ని అనుభవాలో ఇచ్చినవి! ఎంతటి దివ్యత్వమో వారిది! వాటి మననం ద్వారానైనా సార్‌కి శిష్యులమవ్వాలని, బిడ్డలమవ్వాలని తాపత్రయం.

శ్రీ సార్ భోదించిన, ఆచరించి చూపిన వాటిని మనస్ఫూర్తిగా అనుసరించి ఆచరించగలిగేలా అందరమూ శ్రీ సార్‌కి శిష్యులమవ్వాలనే తపనను ఆయన అంగీకరించేలాగా, ఆయనకు తగ్గ బిడ్డలమవ్వాలనే కోరికను స్వీకరించి శ్రీ సార్ అందరికీ తృప్తి, శాంతి, ఆనందాలను ప్రసాదించాలని శ్రీ సార్‌కి మనః పూర్వక ప్రార్ధన.

శ్రీ సార్ ప్రసాదించిన మధురమైన అనుభవములను మరిచిపోకుండా అనుక్షణం

గుర్తుంచుకుని ఏమరుపాటు లేకుండా సేవ చేసేటట్లు చేయమని శ్రీ సార్‌ని ప్రార్థిస్తున్నాము

సార్ లీలా చింతన మాకు అత్యావశ్యకం. ఎందుకంటే మేము ఈ రోజు ఇలా ఆనందంగా, హాయిగా ఉన్నామంటే సార్ మాకిచ్చిన అనుభవాలు, శిక్షణ, అన్నిటి కంటే మమ్ము కన్నబిడ్డలుగా చూసుకొని మా పాపపు సంస్కారాలను తుదముట్టించటం. అలాంటి సార్‌కు అనంత కోటి వందనాలు.

సార్ నేర్పించిన ప్రార్ధన "నిస్సహాయుడునై మీ పాదములను ఆశ్రయించాను. నా సర్వ బాధ్యతలు నీవే ప్రభూ! మాయ నా దరి చేరకుండా మీరే చేయండి. నా బహిరంతరముల యందున్న మిమ్మల్ని అనుక్షణం గుర్తించుచూ మీ ఆజ్ఞలు తు||చ|| తప్పక పాటించే శక్తి ప్రసాదించు స్వామీ!"

సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ భక్తబృందం

# శ్రమతో సేవ - సేవతో కైవల్యం

శ్రీ సాయి మాస్టర్ నిలయంలో బోరు ఎక్కడ వేయాలనే విషయమై దీక్ష చేయాలనుకున్న రాత్రి శ్రీ సుబ్బరామయ్య మాస్టర్(సార్)కి శ్రీ వెంకయ్యస్వామి ఇచ్చిన స్వప్నసందేశం:

"10 అ|| శ్రీ మహావిష్ణువు మౌల్డింగ్ – అ మౌల్డింగ్‌కు (V) ఆకారములో గల పూలహారంలో ఒక వైపు **శ్రమతో సేవ** రెండవవైపు **సేవతో కైవల్యం** అని స్పష్టంగా కనిపించింది"

సార్ వ్యాఖ్యానం : శ్రమ చేస్తేనే కానీ సేవ కాదన్నమాట. గనుక నేను శ్రమించటం - నా ధ్యేయంగా పుస్తకాలు వ్రాయటం, విక్రయం, సత్సంగం చేయాలి. అలా చేస్తేనే కైవల్యం పొందుటకు అర్హులమై ఉంటాము. శ్రమ చేయించేది ఆయనే అయినా శ్రమ చేసే (తత్వము) readiness మన దగ్గర వుండాలి. సోమరితనం మన ప్రథమ శత్రువు అంటారు మాస్టర్ గారు. అది దరి చేరకుండా మన శరీరాన్ని కంట్రోల్‌లో పెట్టుకోవాలి.

# దైవం మానుష రూపేణ

దేవుణ్ణి తెలుసుకునే మార్గం చెప్పమన్న భక్తులతో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు అంటారు "నీయాల్నే వస్తే నీవేమి కనుక్కుంటావయ్యా". ఇది ఈనాడు నెల్లూరు జిల్లా గొలగమూడి వాస్తవ్యులు శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్య గారి ఎడల అక్షరాల నిజమైంది. వారు మానవ రూపంలో మన ముందున్న భగవంతుడే అని భక్తుల అనుభవాలు నిరూపిస్తున్నవి.

వారెంతటి మహనీయుడో తెలియనిదే హృదయ పూర్వకమైన భక్తి,శ్రద్ధలతో నమస్కరించలేము. అందరూ నమస్కరిస్తున్నారు కాబట్టి మనమూ నమస్కరిస్తాము. వారెంతటి వారో తెలియజేసి వారి యెడల మన హృదయాలలో తగువిధమైన భక్తి,శ్రద్ధలు ఏర్పడునట్లు చేయడమే ఈ చిన్ని పుస్తక ఆశయం.

- **భగవంతునికి మూడు లక్షణాలు చెప్పారు.**

1. సర్వవ్యాపకుడు: అందుగల డిందులేడని సందేహము వలదు అన్నట్లు విశ్వమందంతనూ ఉన్నవాడు.
2. సర్వజ్ఞుడు: సర్వవిషయాలు తెలిసినవాడు. సృష్టిలోని ప్రతిదాని గురించి భూత భవిష్యత్, వర్తమానములన్నీ తెలిసినవాడు.
3. సర్వసమర్ధుడు: ఏమైనా చేయగల సామర్ధ్యము గలవాడు.

శ్రీ శ్రీ శ్రీ పెసల సుబ్బరామయ్యగారు భక్తులకు అనుగ్రహించిన అనుభవాలను పరిశీలించి అందరూ సార్ కృప పొందగలరు.

# మహనీయుల తీర్పు

## శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి తీర్పు

స్వామి సేవకుడు రోశిరెడ్డికి అత్యవసర విషయములలో ఏ వ్యక్తి ఎలాంటివాడు అనే విషయముగానీ, ఎచ్చట ఏమి జరుగుచున్నది గానీ శ్రీ వెంకయ్యస్వామి దృశ్య సంకేతములతో చూపేవారు. ఒకరోజు సుబ్బరామయ్య సార్ గురించి యోచిస్తుంటే సార్ తాళాల బుర్రలు రిపేరు చేస్తున్నట్లు చూపారు. దానికి శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు ఇచ్చిన వ్యాఖ్య "అందరి లోపాలు సరిచేయగల సమర్థుడు" అంటే సార్ సర్వజ్ఞులు (లోపాలు తెలిసిన వారు), సర్వ సమర్థులు, సర్వవ్యాపకులు (అందరి గురించి తెలిసినవారు) అయ్యి వుండాలి.

## శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గారి తీర్పు

మచ్చా రామకృష్ణ (కడప వాస్తవ్యులు) కి ఒకరోజు భరద్వాజ మాస్టారు గారు కలలో కనపడి "సుబ్బరామయ్య, నేను ఒకటే! నువ్వు సుబ్బరామయ్య చెప్పినట్లు చెయ్యి" అని చెప్పారు.

విద్యానగర్ వసంతమ్మ గారు 2008లో గొలగమూడిలో జరిగిన శ్రీ సాయి మాస్టారు సమ్మేళనంకి ఫిబ్రవరి 8 వ తేదీ వచ్చి సార్‌ని దర్శించుకుంది. సార్ ఆ రోజు వుండి తర్వాత రోజు వాళ్ళ ఊరికి వెళ్ళమన్నారు.

కానీ ఆమె ఆ రోజే వాళ్ళ ఊరు వెళ్ళిపోయింది. తర్వాత కొన్ని రోజులకి శ్రీ భరద్వాజ మాస్టర్ ఆమెకి స్వప్నంలో కనపడి "సుబ్బరామయ్య ఉండమన్నా ఉండకుండా వచ్చేసావే? ఇద్దరు మహానీయులను (శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్) సేవించిన మహనీయుడు. అలాంటి ఆయన దొరుకుతాడా!" అని గద్దించారు.

బెంగుళూరు అనితగారికి ఒకరోజు ఉదయం 4 గం|| 30 ని|| కి మెలుకువ వచ్చినా పడుకునే ఉన్నారు. ఇంతలో ఆకాశవాణిలాగా మాష్టారి గారి కంఠం. "అమ్మా! అనితా! సుబ్బరామయ్య అంటే ఏమనుకున్నావు. ఇద్దరు సజీవ మహనీయులని సేవించిన మహనీయుడు" అని వినిపించింది. అప్పటి నుండి అనితగారికి సార్ మహనీయులన్న అభిప్రాయం ఏర్పడింది. కొన్ని రోజులకి గొలగమూడి వెళ్లి సార్‌కి చెపితే సార్ నవ్వి "ఆయన మహానుభావుడు. ఆయనేదో చెపుతుంటారు" అని అన్నారు.

## నీలకంఠరావుపేట శ్రీ దర్గాస్వామివారు

వివిధ సందర్భాలలో శ్రీ సార్ గురించి చేసిన ప్రామాణికాలు

- **జిహ్వను జయించాడు**
- **సార్‌ని చూపెడుతూ "పరోపకారార్ధ మిదం శరీరమ్"**
- **వెంకయ్యస్వామికి దత్తుడు, మాకూ దత్తుడే**
- **వెంకయ్యస్వామి తెచ్చుకున్నాడు నిన్ను, నీ చేత తప్పు చేయించడు**
- **వెంకయ్యస్వామిలో సుబ్బరామయ్య వున్నాడు, సుబ్బరామయ్యలో వెంకయ్యస్వామి స్వామి వున్నాడు**

## శ్రీ సుధీంద్రబాబు గారు సార్‌కి ఇచ్చిన సందేశం

**Dont care for the world, go ahead as your will says** (ఈ ప్రపంచం గురించి పట్టించుకోకు, నీ ఇచ్ఛ ప్రకారం నడుచుకో!)

అరటిపండు ఇస్తే మంచివాడంటారు. ఇవ్వకుంటే పిసినారి అంటారు. వీళ్ళనేంటి లెక్క చేసేది అని చెప్పారు

## కొంతమంది భక్తులకు పారాయణ ద్వారా, స్వప్న దర్శనం ద్వారా నిదర్శనాలు

**నగేష్** గుర్గావ్‌లో ఉద్యోగం మానేద్దామనుకుని భగవంతుని నిర్ణయం కోసం గురుచరిత్ర పారాయణ చేస్తున్నప్పుడు సార్ ఫోన్ చేసి గుర్గావ్‌లో ఉద్యోగం మానేసి హైదరాబాద్ వచ్చేయమని చెప్పారు.

2011లో నగేష్ కి స్వప్నంలో చాలా పెద్ద మబ్బు సుబ్బరామయ్య సార్ లాగా మారి వెంటనే సాయిబాబాగా మారిపోయింది. అలా చాలాసార్లు సార్‌గా, సాయిబాబాగా మారిపోయింది.

నగేష్‌కి కలలో లక్ష్మీదేవి, సరస్వతిదేవితో పాటు మధ్యలో సార్  చాలా వేగంగా వస్తూ కనపడ్డారు. సార్ వినాయకుడని మురిసిపోయాడు నగేష్.

**బెంగుళూరు ప్రసాద్** విద్యానగర్ సాయిబాబా గుడిలో శ్రీ గురు చరిత్ర పారాయణ చేస్తూ అన్ని పాపాలు సద్గురుసేవ వలన నిర్మూలమవుతాయి కదా! సార్ ఏదన్నా పని చెప్తే చెయ్యాలి అని మనస్సులో అనుకుంటుండగా సార్ ఫోన్ చేసి కొన్ని పనులు చెప్పారు.

**రవికి** ఒకరోజు రాత్రి కలలో (10-అక్టోబరు-2005) సార్ కనపడి వెంటనే ఆ స్థానంలో

సరస్వతిదేవిగా దర్శనము ఇచ్చారు. తర్వాత రోజు సరస్వతీ పూజ!

# శ్రీమతి పెసల శేషమ్మ (శ్రీ సార్ ధర్మపత్ని)

సార్‌తో అమ్మగారి అనుబంధం

శ్రీ సార్ వాళ్ళ మేనమామ సార్ నాన్నగారికి వారి కుటుంబానికి చేసిన సహాయం దృష్టిలో ఉంచుకొని కృతజ్ఞతగా వారి మేనమామ కుమార్తెను (ఇక ముందర 'అమ్మగారు' అని సంబోధిస్తాము) వివాహం చేసుకొనుటకు సార్ నిశ్చయించుకున్నారు. ఈ నిశ్చయం ఎట్టి లౌకిక ప్రయోజనాలను ఆశించి కాక దైవ లక్షణాలను ప్రతిబింబిస్తూ జరిగింది. కానీ సార్ తల్లిగారు, తమ అన్న దీనికి వ్యతిరేకించి వారి దృష్టిలో టీచర్ గా పనిచేస్తున్న సార్‌కు చదువుకున్న అమ్మాయి వస్తే ఇటు ఇంట్లో ఉండటం, అటు ఉద్యోగం చేస్తుందని భావించారు. ఆ విషయమై వినకుంటే సార్‌కు ఆస్తి పంపకంలో కూడా అవకాశముండదని అన్నారు. కానీ శ్రీ సార్ తన మనస్సాక్షికి కృతజ్ఞత వంటి ఉన్నత భావాలకు విలువనిస్తూ అమ్మగారిని వివాహమాడారు. సార్ వివాహం 1967 సంవత్సరంలో జరిగింది.

పెళ్ళికి ముందు అమ్మగారు ఇంట్లో ఎంతో గారాబంగా పెరిగారు. సార్‌తో వివాహమ్యాక అమ్మగారికి ఎన్నో కష్టతరమైన బాధ్యతలు నిర్వహించాల్సి వచ్చింది. అప్పటికి సార్ ఉద్యోగరీత్యా కలిచేడులో ఉండేవారు. అప్పుడు శ్రీ సార్ వల్ల తల్లిగారు సార్‌తోనే ఉండేవారు. వారికీ అమ్మగారు ఎన్నో సేవలు ఎంతో ఓపికగా చేసేవారు. సార్ తల్లిగారికి అమ్మగారు చదువుకోని పిల్ల అని, పైగా తన ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్నాడని చులకన భావన ఉండేది.

అమ్మగారు ఎంతో ఓరిమి, శ్రద్ధతో వడ్లు దంచి బియ్యం చేసి అన్నం వండటం, బర్రెల పోషణ మొ॥ చూడటం, ఇంట్లో అందరి బట్టలు ఉతకటం, సార్ అమ్మగారికి కావలసినవన్నీ చేస్తుండటం, ఇలా చేస్తూ అమ్మగారికి టిఫిన్ తినటం 11 గంటలకి, అన్నం తినటం 3 గంటలకి అయ్యేది. సార్ కూడా వాళ్ళ అమ్మగారిని సముదాయించడానికి అప్పుడప్పుడు అమ్మగారి తప్పు లేకున్నా అమ్మగారిని తిడుతున్నట్లు మాట్లాడాల్సి వచ్చేది. సార్ కూడా దానికి బాధపడేవారు. అమ్మగారిని మీరు అత్తగారికి కానీ సార్‌కు కానీ చెప్పచ్చు కదా! అంటే “వినకుండా తగువు పెట్టుకుంటే అయన బాధపడతారు” అన్నారు. ఉత్తమమైన సహజ సంస్కారం ఎంతో కృత్రిమ

జీవనంలోని మనకు ఎలా వంటబడుతుంది. అయితే అమ్మగారు బాధపడి సార్‌పై కోపగించుకోవటం వ్యతిరేకించటం బదులు సార్ తల్లిగారికి నచ్చ చెప్పలేక, అమ్మగారి కష్టం చూడలేక బాధ పడుతుంటే అమ్మగారే 'ఎందుకు ఇలా బాధపడేది? అత్తయ్యగారి ముందు నన్ను ఒకటి రెండు మాటలను అంటే, ఆవిడ సంతృప్తిగా ఏమనకుండా ఉంటారు. నీవు నిజంగా తిట్టట్లేదు కదా!' అని సముదాయించేవారు. ఇది ఎంతటి ఉదాత్త గుణమో, అట్టి దంపతులు ఎంత అరుదుగా తారసిల్లుతారో మనం గుర్తించవచ్చు.

తరువాత కాలంలో వాళ్ళ అత్తగారికి కాలు విరిగి, మంచంలో ఉన్నప్పుడు చేసిన అమ్మగారు అనన్య సేవకు మాత్రం చివరకు ఆవిడ మనస్సు మారక తప్పలేదు. ఇదేరీతిన అమ్మగారు వాళ్ళ అమ్మగారికి, సార్‌కు కూడా సేవ చేసుకున్నారు.

కలిచేడు సాయిమందిర విగ్రహ ప్రతిష్టకి తెచ్చిన పెద్ద సాయిబాబా ఫోటోను తీసుకువచ్చి సార్ తమ ఇంట్లో పెట్టారు. సార్ అమ్మగారిని ఆరతులు ఇవ్వమన్నారు. అమ్మగారికి ఆరతులు చేస్తుంటే నిద్ర తూగు వస్తోందని నిలవ పచ్చళ్ళు (ఊరగాయలు) తినకూడదని

ప్రొక్కుకున్నారు. భగవంతునికి సేవకై ఎంతటి కఠోర నియమమైనా సిద్ధమే!

సార్ భరద్వాజ మాస్టారి వద్దకు వారం వారం వెళ్ళేవారు. అమ్మగారు భరద్వాజ మాస్టారి దగ్గరకు వెళ్లి వస్తే చాలా ప్రశాంతంగా ఉండటం గమనించి, ప్రోత్సహించి పంపించేవారు. ఒకరోజు అమ్మగారిని కూడా తీసుకెళ్ళినప్పుడు భరద్వాజ మాస్టారు అమ్మగారితో, ఎలా ఉన్నారు అని అడిగి సార్ గూర్చి "మాట వింటారా?" అని అడిగారు. సార్ "నాకు ఇచ్చుటికి రావటానికి డబ్బు లేకుంటే నా భార్య అప్పుడప్పుడు ఖర్చులకు ఇచ్చిన డబ్బులు ఉంచి ఇస్తుంది" అన్నారు. అమ్మగారు "శేషయ్యకు చదువు రావట్లేదని అయన అప్పుడప్పుడు దండిస్తారు" అని చెప్పారు. భరద్వాజ మాస్టర్ సార్‌తో "ప్రపంచంలో అందరూ చదువుకున్నవారే ఉండరు. అందువలన పిల్లవాడిని కొట్టకు" అని సమాధానపరిచారు. మాస్టారు శేషయ్యకు శాలువా కప్పారు. అప్పటినుండి కొన్ని నెలల పాటు శేషయ్య ఉదయం 2 గంటలకు స్వామి మందిరం వెళ్లి సేవా చేయటం అనే మార్పు రావటం జరిగింది. శ్రీ స్వామివారిని సార్ అడగకనే స్వామి ఆశీస్సులు

శేషయ్యకు ప్రసాదించక శేషయ్యలో మంచి మార్పు వచ్చింది.

సార్ తమ కష్టార్జితంతో కలిచేడులో మొదట పూరిల్లు, తరువాత రేకులిల్లు తరువాత మంచి మిద్దె ఇల్లు వెచ్చించి నిర్మించుకుని ఉంటున్నారు. సార్‌కు ఆయాసం ఇబ్బంది. శ్రీ వెంకయ్యస్వామి సన్నిధిలో తగ్గటం వల్ల సార్ ప్రతి రోజు గొలగమూడిలో నిద్ర చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అమ్మగారు సార్‌ను అనుసరించిన విధం అనూహ్యం. శ్రీ స్వామివారి సందేశం అనుసరించి సార్ ప్రతి రోజు రాత్రి నిద్రించేందుకు గొలగమూడి వచ్చేవారు. అమ్మగారు ఒక సంవత్సరం వేచి చూసి ఇంక పిల్లలను చదివించడం, సముదాయించడం చేయలేనని గొలగమూడి వచ్చేసారు. అప్పుడు గొలగమూడిలో సార్ స్వామి సమాధి దగ్గర చిన్న స్థలములో స్వామి ఆజ్ఞ మేరకు పూరి గుడిసె వేసారు. ఇల్లు, వసతి ఏమీ చూసుకోకుండా సార్ ఆరోగ్యం ప్రధానమనుకుని అమ్మగారు రావటం ఎంతటి త్యాగమో, ఎంతటి ఆదర్శ గృహస్థ జీవితమో గుర్తించగలము.

గొలగమూడిలో వంటకు కట్టెలు కొట్టించుకుని పొయ్యి వెలిగించుకుని వంట వండటం, టాయిలెట్

సౌకర్యం కూడా లేకుండా జీవించవలసి రావటం, మంచి సొంత ఇల్లు వదలి ఇల్లు లేకుండా ఒక పూరింట్లో ఉండటం, వర్షాకాలంలో పాములు (నీటి) స్వేచ్ఛగా తరచూ ఇంట్లోకి వస్తూన్న ఏమాత్రం భయపడకుండా ఉండటం మొ|| ఎన్నో అత్యంత కష్టమనిపించేవన్నీ ఆ మహాసాధ్వికి భర్త సాంగత్యం, శ్రేయస్సు ముందు ఏమాత్రం కష్టమనిపించలేదు. పైగా తరువాత ఏనాడూ ఆ విషయమై సార్‌ను ఒక్క మాట మాట్లాడలేదు.

సార్ స్వామి ఆదేశం పాటించి గొలగమూడిలో ఉండటంలో మరో ఆలోచన వస్తుందేమో అని కలిచేడులోని మంచి ఇల్లును ఎంత తక్కువ రేటుకైన అమ్మేయమని అమ్మగారే చెప్పారు. తర్వాత తాము కట్టుకున్న ఖర్చుకి 1/5 వంతుకి అమ్మేసారు. అమ్మగారిని ఈ విషయమై అడిగితే “ఇల్లు ఎందుకు? అయన బాగుండాలి కదా!” అన్నారు. అత్యాశ్చర్యమేమంటే కృత్రిమ జీవనం గడుపుతున్న మనకు ఇది సహజము, సమంజసము అనిపించదు. అనిపించినా ఇలాంటివి పాటించ సాహసించము!

ఒకసారి సుమారు 10 సంవత్సరాల వయస్సులో శేషయ్య తప్పిపోయినప్పుడు అమ్మగారు స్వామి వద్ద నిరాహారిగా రెండురోజులు “శేషయ్య

కనపడకుంటే నీవు లేనట్లే" అని వేడుకున్నారు. ఇంట్లో స్వామి పటం వద్ద ప్రార్తిస్తూనే నిద్ర పోయారు. కలలో అగ్నిగుండం జాజ్వల్యమాన వెలుగు కనపడితే అమ్మగారు ఇంక శేషయ్య దక్కడని బాధపడ్డారు. సార్ వచ్చాక "ఇంకేం భయం, కంగారు పడక్కరలేదు. శేషయ్య వచ్చేస్తాడు" అన్నారు. అట్లే సాయంత్రానికి వచ్చేసాడు. నెల్లూరు వెళ్లి తప్పిపోయిన శేషయ్యను దైవికంగా ఎలా స్వామి చేర్చింది గురుస్తుతిలో చూడవచ్చు. సార్‌ను శేషయ్య కోసం ఎందుకు వెతకలేదు అని అడిగేతే "నెల్లూరు పట్నంలో ఎక్కడని వెతుకుతాము? వెతుక్కునే దానికైతే ఇంకా గొలగమూడిలో ఉండటమెందుకు? స్వామే తీసుకొస్తారు" అని చెప్పారు.

తర్వాత కాలం నుండి అమ్మగారు స్వామిపై ఆధారపడిన వైనం కూడా అంతే అపూర్వం. అమ్మగారు స్వామికై ఏదైనా కోరి ప్రార్థించిన, మ్రొక్కిన అతికొద్ది సందర్భాలలో ఇది ఒకటి. ఈ సన్నివేశంలోనే కాక మరెన్నో క్లిష్ట పరిస్థితుల్లో సార్‌కు అమ్మగారు బదులు చెప్పక అనుగమించారు. ఉదా: వంటకు ఇంట్లో కట్టెలు లేకపోవటం, గొలగమూడిలో సార్ నిర్మించే నిర్మాణాల గురించి అమ్మగారిని మీరు ఏమీ చెప్పలేదా? అంటే 'సార్

మాటకు బదులు చెప్పలనిపించాలేదా?అంటే "ఆయన మాట వినకుంటే ఎట్లా?" అన్న సమాధానం ఇచ్చారు. సార్ దైవస్వరూపులని విశ్వాసం లేకనే ఇలా జీవించటం ఆదర్శ గృహస్థ జీవనం కాక మరేమి?

బహుశా అమ్మగారు స్వామిని కోరి ప్రార్థించిన మరొక్క సంఘటన. శ్రీ సార్‌కు కాలు విరిగినప్పుడు పుత్తూరు డాక్టర్ (తనకై తానే) వచ్చి కట్టు కట్టారు. సార్‌కు రాత్రులు ఎంతో జిల, దురద దుర్భరంగా ఉండేది. దానితో కట్టు విప్పేయమనే వారు. భరించటం చాలా కష్టంగా ఉండేది. అప్పుడు అమ్మగారు స్వామికి విన్నవించి సార్‌కు జిల తగ్గి ఇబ్బంది లేకుంటే రోజూ ఒక్క పూట మాత్రమే భోజనం చేసి ఉంటానని మ్రొక్కుకున్నారు. వెంటనే జిల తగ్గి నిద్రపట్టడం, మరలా ఇబ్బంది పెట్టకుండటం జరిగింది. అప్పటినుండి ఇప్పటికీ అమ్మగారు ఒక్కపూట భోజనం నియమం పాటిస్తున్నారు. శ్రీ స్వామిని ప్రార్థించిన ఈ అరుదైన సందర్భాలలో స్వామి స్పందిచటం అమ్మగారికి, స్వామికి ఉన్న అనుబంధం తెలుపుతుంది.

అమ్మగారు సార్ సాంగత్యం కోసం ప్రాకులాడే ఎందఱో పిల్లలను సాయి, నగేష్, ప్రసాద్ మొ|| ఎందరినో తమ పిల్లలగానే చూడటం, తరచూ వచ్చే వారి

మంచిచెడులు, ఆరోగ్యం, ఆహార విషయాలు అడగటం చూడటం వారి విశాలహృదయాన్ని, మాతృ ప్రేమను తెలుపుతుంది.

సార్‌కు అనారోగ్యమై మంచం మీద 6 సంవత్సరాలు ఉన్నప్పుడు అమ్మగారు సార్‌పై చూపిన ప్రేమ, చేసిన సేవ వర్ణనాతీతం. సార్ కూడా ఎవ్వరు చెప్పినా చేయటానికి ఇష్టపడని సమయాలలో కూడా అమ్మగారు చెప్పగా విని చేయటం వారి అనుబంధాన్ని తెలుపుతుంది. అమ్మగారు తరచూ వారి నిద్ర, ఆహారం, ఇతర అవసరాలను కూడా ఆలోచించక సార్‌కు చేసిన సేవ వారి ఆధ్యాత్మిక పరిణితినే కాక సహజసిద్ధ సంస్కారాన్ని తెలుపుతుంది. సార్ సమాధి అయ్యేవరకు అమ్మగారికి గల కాలు నొప్పి కూడా తెలియకపోవటం గుర్తించక పోవటం వారికి గల పతి సేవానిరతిని తెలుపుతుంది. సార్ సమాధి చెందుతూ చివర అమ్మగారి చేయి పట్టుకుని ఏడవద్దని సూచించి సమాధి చెందారు.

ఈ విధంగా సార్‌తో సహజీవనం చేసి, సేవ చేసిన అమ్మగారిని సార్ ఎన్నో విధాల సంస్కరించి అనుగ్రహించారనిపిస్తుంది. ఎంతో కష్టం మీదగానీ సాధించలేని అభయం, విశ్వాసం, అపరిగ్రహం అమ్మగారికి ఉండటం ఎందరికో అనుభవం. ఒకసారి

ఒక భక్తురాలితో సార్ “మా వాళ్ళు ఎక్కువ ఖర్చు పెట్టదు కాబట్టి 10 రూపాయలు నా దగ్గర ఉన్నాయి” అన్నారు.

సార్ సమాధి అనంతరం అమ్మగారికి వచ్చిన ఎన్నో కలలతో సార్ అనుక్షణం అమ్మగారితోనూ, మనందరితోనూ ఉన్నారని, వారు మనం చేసేవి చూస్తూ, మనను నడిపిస్తూ ఉంటారని తెలుపుతున్నాయి. సార్ సమాధి అయిన రెండవరోజు అమ్మగారి స్వప్నంలో ఒకరు కనపడి సార్ సాయి మాస్టర్ నిలయం వద్ద ఉన్నారని రమ్మంటున్నారని చెప్పారు. అమ్మగారు అయన ఇంకెక్కడ చాటుకు వెళ్లిపోయరంటే లేదు రమ్మంటున్నారని తీసుకువెళ్ళారు. అచ్చట సార్ అందరికీ పనులు చెప్పి చేయిస్తున్నారు. అమ్మగారికి కూడా పని చెప్పితే అమ్మగారు చేసారు. తరువాత అమ్మగారు సార్‌ని ఇంటికి రమ్మంటే సార్ “నాకు ఇచ్చటే బాగుంది, ఇక్కడే ఉంటానన్నారు”. భయం వేయదా అని అమ్మగారు అడిగితే అంటే నాకు భయమేమీ లేదన్నారు. సార్ సమాధిలో ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటారని అమ్మగారికీ, మనందరికీ తెలపటం కాదా!

సమాధి అయిన కొద్దిరోజులకు ఒకసారి అమ్మగారు రాత్రి 10:30 నుండి 11:00 గంటలకు అన్నం పెట్టి, బాబాకు దీపారాధన చేసి శేషయ్యకు పెట్టి

అమ్మగారు మరలా తిందామనుకుని ఏమీ చేయాలనిపించక బాధగా కుర్చీలో పడుకుంటే సార్ కలలో కనపడి “ఎందుకు ఏడ్చేది? నీవేడుస్తుంటే నేనేం చేసేది? నేను యాడికి పోయాను. వచ్చేసాను” అని మంచంలో పడుకున్నారు. అమ్మగారిని పిలిచి కాలునొప్పి ఎలా ఉందని అడిగి ఒకసారి నొక్కి చూసి, దేవుడికి పెట్టావు కదా! ఇడ్లీ తినేసి పడుకోమని” చెప్పారు. మెలకువ వచ్చేసరికి ఇడ్లీ తినలేదని అచ్చుటే ఉందని గుర్తొచ్చింది. ఇలా మనం చేసే ప్రతి పనీ చూస్తూ భగవంతునికి చేసేదానిని ప్రోత్సహిస్తూ అమ్మగారి చింతను ఇదివరలాగే తొలగిస్తూ ఉన్నారు. మరోసారి అమ్మగారి కమ్మలు పోయాయి. పడుకున్నప్పుడు పడిపోయి ఉంటారనుకున్నారు. వెతికినా దొరకలేదు. చివరకు సార్‌కు విన్నవించుకుంటే మరురోజు ఉదయం వంటిట్లో కనపడ్డాయి. ఇప్పటికి సార్ సాంగత్య, మధుర స్మృతులను తలచుకుంటూ అమ్మగారు కండ్లు చెమరుస్తుండటం అమ్మగారికి, సార్‌కు గల ప్రేమానుబంధాలను తెలుపగా వారి ఆదర్శ జీవితాలు మనకు చక్కటి మార్గదర్శకాలు.

# గొర్రె వేణుగోపాల్

శ్రీ సుబ్బరామయ్యగారి సాన్నిధ్యం దాదాపు 4 దశాబ్దాలు పాటు పొందిన గొర్రె వేణుగోపాల్ గారు తనని చిన్ననాటి నుండి ఎలా ధర్మ మార్గంలో నడిపారో పంచుకుంటున్నారు.

మాది తలుపూరు. మా నాన్నగారి పేరు శ్రీ గొర్రె సుబ్బరామయ్య గారు. మాది ఒక బీదకుటుంబం. ఒక చిన్న అంగడి ఉండేది. నేను చిన్నప్పటి నుండి బాగా ఉత్సాహంగా చదివేవాడిని. నా నోటు పుస్తకాలు వేరొకరికి ఇవ్వటానికి ఇష్టం ఉండేది కాదు. ఎవరైనా నా నోట్ బుక్ తీసుకుంటే ఎంతో కోపపడేవాడిని. అంతేగాక అలా ఇస్తే ప్రక్కవారికి మార్కులు ఎక్కువస్తాయని ఎంతో స్వార్థంతో ఎవరికీ ఏమీ ఇచ్చేవాడిని కాను. ఇన్ని దుర్గుణాలు ఉన్నా నా ప్రమేయము లేకుండా నన్ను ఉద్ధరించటానికి పరమాత్మే శ్రీ సుబ్బరామయ్య గారి (ఇకపై నేను ప్రేమగా పిలుచుకునే పేరుతొ "సార్" అని ప్రస్తావిస్తాను) రూపంలో నా 8 వ తరగతిలో వచ్చారు.

నేను 8 వ తరగతిలో ఉన్నప్పుడు శ్రీ సార్ సైన్సు టీచర్‌గా వచ్చారు. నేను బాగా చదవటం గమనించిన శ్రీ సార్ 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాసిన తరువాత

నాకు శ్రీ సాయిలీలామృతం గ్రంధాన్ని ఇచ్చి, పారాయణ చేయటానికి ఏ నియమాలు లేవని చెప్పారు. పైగా తమ సైన్సు పీరియడ్‌లలో ల్యాబ్‌లోకెళ్ళి శ్రీ సాయి సూక్తులు వ్రాసుకొనమనేవారు. సాయి లీలామృతం పారాయణం నా జీవితంలో ఎన్నో మార్పులు తెచ్చింది. అందులో ముఖ్యమైనవి.

- సత్యమునే పలకాలి అని శ్రీ సాయినాథుడు నూనెకి బదులు నీటితో దీపాలు వెలిగించి మార్వాడి వర్తకులకు కనువిప్పు కలిగించటం.
- అసూయ వల్ల ఏమి ఉపయోగం లేదని తెలియటం.
- వంతులు, కీచులాటలు మానితే దేవుడు కాపాడతాడని దృఢ పడింది.
- ఎవరిని ద్వేషించకూడదని, ఋణనుబంధాన్ని బట్టి అన్నీ జరుగుతాయని బలంగా నాటుకుంది.

అంతకుముందు దాకా ఉన్న నా దురభిప్రాయాలన్నీ సాయి లీలామృతం పారాయణతో తుడుచుకు పెట్టుకు పోయాయి. ఇది నాకు శ్రీ సద్గురు (సార్) కృప వల్లననే జరిగిందని నా విశ్వాసం.

10వ తరగతి పాసైన తర్వాత మాకు ఉన్న ఆర్థిక పరిస్థితుల వల్ల మా నాన్నగారు చదివినది చాలు, అంగడి చూసుకోమని చెప్పారు. ఈ విషయం తెలిసిన శ్రీ సార్

నా ప్రమేయం లేకనే నెల్లూరు, గూడూర్ పాలిటెక్నిక్ కాలేజీల అప్లికేషన్స్ తీసుకొచ్చి అప్లై చేయించారు. రెండు కాలేజీలలో సీటు వస్తే మా నాన్నగారి అనుమతి తీసుకోమని, ఆయన ఏమి చెపితే అది చేయమని చెప్పారు. మా నాన్నగారు 'మీరింత చెపుతుంటే ఎంత కష్టమైన చదివిస్తాను, కాలేజీలో చేర్పించమన్నారు'. శ్రీ సార్ తన తోటి టీచర్స్ సహాయం కూడా అడిగి ప్రతినెల కొంత డబ్బు ఇప్పించి గూడూర్ పాలిటెక్నిక్ కాలేజిలో చేర్పించారు. మొదటి సంవత్సరం ఇలానే జరిగింది. రెండవ సంవత్సరం నుండి మా లెక్చరర్ శ్రీ K V నాగరాజ శర్మ గారి ఆసరాతో ఏ ఇబ్బందులు లేకుండా నా జీవనం సాగింది. ఇలా సార్ నాకు చదివే అవకాశం ఇప్పించటమే కాక నాకప్పటికి తెలియకున్నా నాచే నా భవిష్యత్ ధర్మార్జనకు అంకురార్పణ చేసారు.

అంతేగాక ఈ మహాత్ముని సహాయంలో ఇంకొక సౌలభ్యం కుడా కల్పించారు. అది నా జీవితంలో సద్గురు సేవకు కూడా అంకురార్పణ చేయటం. శ్రీ సుబ్బరామయ్యగారు తమ గురువుగారైన శ్రీ భరద్వాజ మాస్టర్ గారి దగ్గరకి నన్ను తరచు తీసుకు వెళ్ళి, అక్కడ సేవ చేయించడం. ఆ ఇద్దరి మహనీయుల సాన్నిధ్య ప్రభావం వలన నా జీవితము ధర్మ మార్గంలో నడిచింది.

అట్టివి కొన్ని కార్య రూపంలో నడిపించిన సన్నివేశాలు మీతో పంచుకుంటాను.

మొదటి సారిగా ఉద్యోగంలో చేరాను. కాంట్రాక్టర్స్‌కి నాకు భేదాభి ప్రాయాల కారణంగా కాంట్రాక్టర్స్‌కి కోపం వచ్చి బెదిరిస్తే నన్ను ఏమి చేయ్యమంటారని శ్రీ సార్‌కి లెటర్ వ్రాసాను. శ్రీ సార్ తమ గురువుగారైన శ్రీ భరద్వాజ మాస్టర్ గారికి విన్నవిస్తే, శ్రీ మాస్టర్ ఉత్తరము వ్రాసారు. దాని సందేశం:

1. ఓ విశ్వవ్యాపకుడైన పరమాత్మా! శుద్ధ కారుణ్యమూర్తి, జ్ఞానమూర్తి నన్ను దయతో మీదరికి లాక్కోనవలసినది. అన్నం, ఆహారం, పానీయాల రూపాలలో మీరే నాయందు ప్రవేశించి నాకు శాంతి, భక్తి, శ్రద్ధ, పట్టుదల, విజ్ఞానములను ప్రసాదించవలసినది. మీరే నా శ్వాసలను సైతం నడుపుచున్నారని గుర్తుంచుకుందును గాక! ఓం సాయి – ఓం సాయి – ఓం సాయి
2. ధర్మబద్ధంగా జీవించేందుకు జీవనోపాధి ముఖ్యము. దానిని సంరక్షించుకోవాలి. తప్పని పరిస్థితులలో అన్యాయర్జితం అయిన దానిని ఎట్టి పరిస్థితులలోను స్వంతానికి వాడుకోకూడదని, దానిని పెళ్లి కాని

ఆడపిల్లలకు ఇవ్వటం వంటి సత్కార్యాలకు వినియోగించ వచ్చునని చెప్పారు.

శ్రీ భరద్వాజ మాస్టర్ పంపిన ఉత్తరం నాకు ఎంతో ధైర్యం కలిగించింది. నా శ్వాసలతో సహా నా జీవితాన్ని నిర్ణయించి నడిపేది ఒక్క భగవంతుడనే విశ్వాసం కలిగింది. నేను భయపడకపోవటం చూసి కాంట్రాక్టర్స్‌కి ఏమి చేయాలో పాలుపోక చెన్నై లోని పై అధికారులకు ఫిర్యాదు చేసారు. ఎన్నడూ జూనియర్ ఇంజనీర్ మీద కంప్లైంట్ రానిది మొదటిసారి వచ్చిందని ఆ పై అధికారులు స్వయంగా వెళ్లి నేను చేసిన పనులను, అక్కడ కూలివాళ్ళకు నా మీద వున్న అభిమానం చూసి నాకు పనిష్మెంట్ బదులు ప్రమోషన్ ఇచ్చారు! ఈ భగవంతుని లీలకు సంతోషించాను.

ఒకరోజు ఆఫీస్‌లో తెల్ల కాగితాలు నా స్వంత పనికి ఉపయోగించుకోవాలనుకున్నాను. అ రోజే శ్రీ సుబ్బరామయ్యగారి నుండి లెటర్ వచ్చింది. దాంట్లో ద్రోహం, రాజద్రోహం (నమ్మక ద్రోహం) గురించి ప్రస్తావించటం వల్ల నేను ఆఫీస్ లో తెల్ల కాగితాలు ఉపయోగించకుండా చేసారు. సార్ ఏమరుపాటు లేకుండా నన్ను గమనిస్తూ నేను చేయబోయే తప్పు

విషయం ముందుగానే తెలిసి, ఉత్తరం వ్రాసి నా ప్రవర్తనను సరిదిద్దారు.

NPCలో నేను సర్వీస్ maintenanceకి ఇన్-ఛార్జ్. దానిలో వర్కర్స్ సరిగ్గా పని చేసేవారు కాదు. ఈ విషయం శ్రీ సార్‌కు విన్నవిస్తే దానికి ఒక చిట్కా చెప్పారు. దాని వలన వర్కర్స్‌తో ఉన్న అన్ని ఇబ్బందులు తొలగిపోయాయి. పని సామర్ధ్యము కూడా పెరిగింది. ఆ చిట్కా ఏమిటంటే

1. వర్కర్స్‌ని ఎప్పుడైనా పని చేయమను కానీ కస్టమర్స్‌కి ఏ మాత్రం ఇబ్బంది కలుగకూడదు. అనుకున్న సమయంలో చేసిన వారు కావలిసినప్పుడు లీవ్స్ తిసుకోమను.
2. అందరి వర్కర్స్‌లో సేవాభావం ఉన్న ఇద్దరు ముగ్గురుని నీ దగ్గర 24గంటలు ఉంచుకుని ఎవరైనా కంప్లైంట్ ఇస్తే ఆ పని త్వరగా చేయించు. వారికి కావలసినప్పుడు లీవ్స్ ఇవ్వటమే కాకుండా ఇంక్రిమెంట్, ప్రమోషన్ లు వచ్చేటట్లు చూడమని చెప్పారు.

ఒకప్పుడు దుర్గుణాలు మనస్సులో మెదిలి చేదు (అధర్మ) మార్గంలో ఒక్క అడుగు వేయగానే, గొలగమూడికి రాగానే **"కళ్ళు పోతాయి"** అని ఒకే ఒక మాటతో నా నడవడిని సరిదిద్దిన మహనీయమూర్తి,

సర్వజ్ఞుడు. ఈ సందేశం ద్వారా నేను ఎక్కడ ఉన్నా నేను ఏమి చేయుచున్నా అదంతా సర్వజ్ఞుడైన శ్రీ సార్‌కి తెలుసునని చెప్పుటలో సందేహము లేదు.

ఇట్లాంటి అనుభవాలు ప్రసాదించిన కారణంగా, నన్ను ఎట్టి పరిస్థితులలోను ధర్మమనే వెలుతురు నుండి చీకటిలోనికి పోనివ్వకుండా, వెలుతురు లోనికి ప్రయాణించేందుకు నాకు నిరంతరం మార్గదర్శకులైన శ్రీ సార్‌కు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను! నన్నే కాక నా కుటుంబ సభ్యులకు కూడా వారి సాంగత్యము, సన్నిధి ప్రసాదించి ఎన్నో అనుభవాలిచ్చి, వారిని కూడా చక్కటి మార్గంలో నడిపిస్తున్నారు. నేను సరైన మార్గాన్ని ప్రయాణించి అంతులేని తృప్తి, ఆనందం పొందటమే శ్రీ సార్ కోరుకున్నది. సార్ నిర్దేశించిన మార్గమున పయనించి, ఆయన ఆజ్ఞలను పాటించి, శ్రమతో సేవ చేసేందుకు ప్రయత్నము చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. వారి మార్గాన ప్రయాణం చేసి, వారికి సంతృప్తి కలిగేలా ఉంచమని శ్రీ సార్‌కి మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

నమస్కారములతో, వేణు.

# V A S ప్రసాద్

శ్రీ సుబ్బరామయ్య సార్ ప్రసాద్‌ని దగ్గరకు తీసుకుని గురుసేవ చేయించటం, దాని ద్వారా నేర్పించిన పాఠాలు, శారీరిక మానసిక మార్పులు, పైగా అడగకనే ఇచ్చిన వరాలు ఇక్కడ ప్రస్తావించబడ్డాయి. ప్రసాద్ ఈ క్రింది విధంగా చెపుతున్నాడు.

శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీ వెంకటేశ్వర్లు గార్లు నా తల్లిదండ్రులు. మా అమ్మగారు ఎక్కువగా 'కృషితో నాస్తి దుర్భిక్షం' అనే మాట చెప్పటం వలన దేనికైనా మంచి కృషి చేయటం, మా నాన్నగారు పౌరాణిక విషయాలు చెప్పటం వలన దైవారాధన మీద ఇష్టం కలగటం, సాధారణంగా జీవించటం చిన్నప్పటి నుండి (కొంత) అలవాటు అయినా శ్రీ సార్ సాంగత్యం వల్లనే నా లోపాలు తెలుసుకుని, తొలగించుకునే మార్గం దొరికి చక్కటి మార్గంలో అడుగిడినాను. సార్ సాంగత్యం నాకు ఎలా కలిగిందో, వారి గొప్పదనం నాకు ఎలా అనుభవమైనదో, వారి సాంగత్యంతో నాకు నేర్పిన పాఠాలు కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను.

- **నా జీవితంలో ఊహించని మలుపు:**

నేను MTech చేస్తున్నప్పుడు శ్రీ రవికుమార్ గారు చేస్తున్న సత్సంగాలకి హాజరవటం, వాటిల్లో సాయిబాబా గురించి, శ్రీ దత్తాత్రేయస్వామి గురించి, శ్రీ వెంకయ్యస్వామి గురించి తెలిసింది. వారి జీవిత చరిత్రల పారాయణ వల్ల నాకు ఉద్యోగం వచ్చింది. శ్రీ రవికుమార్ సార్ (విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్రొఫెసార్) ద్వారా శ్రీ సుబ్బరామయ్య సార్ (సార్) గొప్ప మహనీయులని 1999వ సంవత్సరంలో చెప్పారు. వీలున్నప్పుడు శ్రీ వెంకయ్యస్వామి దర్శనం, సార్ దర్శనం చేసుకోమన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత నాకు 1999 డిసెంబర్ నెలలో సార్ మొదటి దర్శన భాగ్యం కలిగింది. రవికుమార్ సార్ 2001లో ఎంత వీలయితే అంతసేపు సార్ సేవ చేసుకోమని చెప్పారు. ఆ ప్రేరణతో తరువాత ఒక రోజు సార్‌కి ఏదైనా పని చెప్పండి సార్ అంటే "పని చేస్తావా? రా!" అని వెంటనే నన్ను ఒక పని మీద తీసుకుని వెళ్తూ శ్రీ వెంకయ్యస్వామి దర్శనానికి వచ్చిన శ్రీదర్గాస్వామి దర్శనం చేయించారు. అప్పటినుండి సార్ నా చేత ఎన్నో పనులు చేయించారు. రవికుమార్ గారు వీలున్నపుడల్లా సార్ గొప్పతనం చెప్పటం వల్ల నాకు సార్ మహనీయులనే భావం దాదాపు

మొదటి నుండి ఉండేది. ఇంతటి భాగ్యం కలిగించిన రవికుమార్ గారికి హృదయపూర్వక నమస్కారములు.

- **నా జీవితంలో ఊహించని శాశ్వత మలుపు: సార్ దర్శనం (1999 డిసెంబర్)**

సార్ మొదట నేర్పించిన పాఠం. దేవుడు మననుండి కోరేది ఏమిటి? మన మనస్సు, కాలము, కృతజ్ఞత. కృతజ్ఞత దగ్గర జ్ఞ వ్రాయాలా, ఘ్న వ్రాయాలా అని సందిగ్ధంగా ఉన్నాను. 3-4 అడుగుల దూరంలో కూర్చున్న సార్ వెంటనే ఏమి రాస్తున్నావు అని అడుగగానే కృతజ్ఞత అని స్ట్రైక్ అయ్యింది. ఈ రోజు సార్ చేసిన మేలును గుర్తుంచుకుని సార్‌కి కొంతైనా కృతజ్ఞత కలిగి ఉన్నానంటే కేవలం సార్ కృప.

ముఖ్యంగా సార్ ఏ పని చేసినా శ్రీ వెంకయ్యస్వామికి విన్నవించే వారు. ఒకరోజు ఉదయం స్కూల్ దగ్గర త్వరగా చేయాల్సిన పని ఉంది. పనికి బయలుదేరుతూ మధ్య దారిలో స్వామి దర్శనానికి తీసుకువెళ్ళుతూ "స్వామిని కాదని వెళ్ళామంటే అక్కడ పని అవదు" అని చెప్పారు. అందువలన ఏదైనా పని చేసే ముందర సార్‌కి చెప్పి చేయటం నాకు అలవాటు అయ్యింది.

- **సార్ శారీరిక దారుఢ్యం అమోఘం మరియు స్ఫూర్తిదాయకం:**

వారం వారం గొలగమూడికి వెళ్తున్నప్పుడు సార్ "ప్రసాద్‌కి చెప్పవలసిన" పనులు అని ఒక లిస్టు వ్రాసేవారు. వాటిలో ముఖ్యంగా రేకులు, చెక్కలు, బిల్డింగ్‌కు కావలసిన సామానులు. వరండాలో కూర్చుని ఏమి తీసుకురావాలో చెప్పటం మొదలుపెడతారు. ఉదాహరణకు మొదటి వస్తువు రేకులనుకోండి. కూర్చున్న 60 సంవత్సరాల సార్  ఒక ఉదుటున లేచి అక్కడే ఉపయోగించిన రేకుల నమూనా చూపెడతారు. వాటి రేటు, ఎక్కడ తీసుకురావాలో, మిగిలిన విషయాలు చెప్పేవారు. చూపెట్టి మరల వచ్చి కూర్చుంటారు. రెండవ వస్తువు చెక్కలైతే మరలా లేచి వాటిని చూపించి వాటి గురించి వివరాలు చెప్పి వచ్చి వరండాలో మరలా కూర్చుంటారు. ఇలా ఎన్ని ఐటమ్స్ ఉంటె అవసరమైన వాటన్నింటికి సార్ లేచి వివరాలు చెప్పి కూర్చునేవారు. నాకప్పటికి 25 సంవత్సరాలు. నేను సార్ యొక్క స్పీడ్ అందుకోలేక పోయేవాడిని, సార్ లాగా అన్నిసార్లు లేచి కూర్చోలేకపోయేవాడిని. నెల్లూరు వెళ్లి సార్ చెప్పిన వస్తువులు తీసుకువచ్చేవాడిని. అన్ని వస్తువులు బానే ఉండేవి! కొసమెరుపు ఏమిటంటే నేను రవ్వ పట్టించుకు

రమ్మంటే పిండి పట్టించుకు వస్తానని, ఒకటికి రెండు పనులు చేస్తానని మా నాన్న ఇప్పటికీ అత్యవసరమైతే తప్ప నాకు పనులు చెప్పరు. సార్ ఏ నమ్మకంతో నాలాంటి పని రానివాడికి పనులు చెప్పేవారో! దీనిని బట్టి సార్ చెప్పిన పనులు నేను చేసినట్లా? సారే నా చేత చేయించినట్లా?

సార్ పూజ చేసి వస్తూ వస్తూ క్యూలో ఎవరైనా అడ్డు వచ్చినా, రద్దీగా ఉన్నా క్యూ కి ఉండే ఇరుకు ఇనుప రాడ్ల మధ్యనుండి తన శరీరాన్ని భూమికి సమాంతరంగా వంచి చాలా సునాయాసంగా బయటకు వచ్చేవారు.

ఒకరోజు శ్రీ సాయి మాస్టర్ నిలయం ఆడవాళ్ళ బాత్రూంలు బాగుచేస్తూ సార్ నన్ను సుత్తి వాళ్ళింట్లో నుండి తీసుకురమ్మంటే నేను 5 అడుగుల ఎత్తు ఉన్న గోడ దూకి వెళ్ళి ఒక నిమిషంలో తీసుకువచ్చాను. సార్ చాలా ఆశ్చర్యంగా ఎలా అంత త్వరగా వెళ్ళి వచ్చావు అని అడిగి తెలుసుకున్నారు. పని అయిపోయిన తర్వాత పనిచేసిన వారందరమూ బావి వైపు నుండి సార్ వాళ్ళింట్లోకి వచ్చాము. మేము తిరిగి వచ్చేసరికే సార్ గోడ దూకి వచ్చి ముసిముసిగా నవ్వుతున్నారు.

బ్రహ్మంగారి మఠం maintenance కోసమని ఎదురుగా ఒక బిల్డింగ్ కట్టిస్తున్నారు. ఆ బిల్డింగ్‌ని నీళ్ళతో

క్యూరింగ్ కోసమని సార్ ఆ రోజుల్లో ప్రొద్దున్నే 5గం:30ని||లకి వెళ్లి చేసేవారు. సార్ మన్ననలు పొందాలని నేను సార్ కంటే ముందు వెళ్లి క్యూరింగ్ చేస్తున్నాను. సార్ వచ్చి ఆశ్చర్యంగా ఎప్పుడొచ్చావు అని అడిగి పని చేసినందుకు ప్రేమగా మాట్లాడారు. తర్వాత రోజు ఉదయం నేను 5గంటలకి వెళ్ళితే సార్ అప్పటికే సగం పైన క్యూరింగ్ చేసేశారు.

సుమారు 2007-2011 సంవత్సరాలలో మే, జూన్ నెలలు ఎండలు విపరీతంగా ఉండేవి. మధ్యాహ్నం సుమారు 2 గంటలకి బయటకి వెళ్లి పనిచేయాలంటే నేను భయపడేవాడిని. నేను అన్నం తిని సార్ ఇంట్లోకి వెళ్ళితే అక్కడ ఉండేవారు కాదు. కట్టించే బిల్డింగ్‌ల దగ్గరకి సార్ వెళ్లి క్యూరింగ్ కానీ, క్రింద పడిన మేకులు, రాళ్లు మొ|| తీయటం, మట్టి చదును పెట్టటం చేసేవారు.

ఇవన్నీ ఎందుకు చేసేవారు? సార్‌ను అడిగేవారు, ప్రశ్నించేవారు ఎవరూ లేరు? పని చేయటం అంటే ఎంత ఇష్టమో తెలుస్తుంది. భగవంతుడు మనకీ శరీరం ఇచ్చాడు కాబట్టి పరోపకారం కోసం జీవించాలని నేర్పుతున్నారు.

- **సొంత తెలివితేటలు వదలటం**

ఒక శనివారం నెల్లూరు వెళ్లి వేదాయపాలెం SBI బ్రాంచ్‌లో సార్ పెన్షన్ పని, గాంధీ బొమ్మ దగ్గర పంజాబ్ నేషనల్ బ్యాంకులో సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ పని, భక్తవత్సల నగర్‌లో మదర్ థెరిసా ఆశ్రమంలో పని చెప్పిన ఆర్డర్ లో చేయమని చెప్పారు. సార్ చెపుతున్నప్పుడే నాకు ఆ ఆర్డర్ చుట్టుతిరుగుడుగా ఉందనిపించింది కానీ సార్ చెప్పినట్లు చేద్దామని ఏమీ మాట్లాడలేదు. సార్ టిఫిన్ చేసి వెళ్ళమని చెప్పాక నేను వెళ్లి అన్ని ప్రిపేర్ చేసుకుని నెల్లూరు వెళ్ళే ముందర సార్ దగ్గరకి వెళ్ళాను. సార్ నా కోసం ఎదురుచూస్తూ నన్ను చూసి “నీ కోసమే చూస్తున్నాను, ఇందాక చెప్పినట్లు గాక మొదట వేదాయపాలెం SBIలో పనిచూసుకుని, మదర్ తెరిసా ఆశ్రమంలో పనిచూసుకుని , గాంధీ బొమ్మPNBకి వెళ్ళు. శనివారం కాబట్టి PNB త్వరగా క్లోజ్ చేస్తారని చెప్పాను. దానమ్మ నాయాల్ది, ఉంటే ఉంటుంది లేకపోతే లేదు” అని చెప్పారు. ఇది చాలా చిన్న విషయంగా ఉండవచ్చు కానీ నాకు మాత్రం నా తెలివితేటలు పెట్టటం కన్నా సార్ చెప్పినట్లు చేస్తే మంచిదని అవసరమైతే సారే మార్పులు చేస్తారని తెలుసుకున్నాను.

ఒకసారి సార్‌తో మాట్లాడుతూ ‘సార్ గురువు చెప్పిన వస్తువు కన్నా మంచి వస్తువు దొరికితే ఏం

చేయాలి' అని అడిగితే సార్ "గురువు చెప్పినట్లే చేయాలి. నష్టం వస్తే గురువుకే వస్తుంది" అని చెప్పారు.

ఒక మధ్యాహ్నం సార్ ఒక రంపం, కొన్ని చెక్కలు ఇచ్చి కొయ్యమన్నారు. రంపానికి పదును లేదు. సార్ ఇచ్చారని దానితోనే కోస్తున్నాను. సార్ ఎదురుగా కూర్చొని ఉన్నారు. మోచేయి పొడవుగా ఒక చెక్కను కోయటానికి చాలాసేపు (పది నిమిషాల పైన అని ఊహిస్తున్నాను) పడుతోంది. సార్ చెప్పిన మాట "మంచి పనిముట్టు ఉంటే సగం పని అయిపోయినట్లే" గుర్తొచ్చి సార్‌తో 'రంపం పదును పెట్టనా సార్' అన్నాను. సార్ వెంటనే చిన్నగా నవ్వి అక్కర్లేదు అని ఒక సుత్తితో నేను కోస్తున్న చెక్కను ఒక దెబ్బ కొట్టేసరికి అది ఊడిపోయింది. వెంటనే ఆ చెక్కలు లోపలి తీసుకు వెళ్లిపోయారు. నాకు వెంటనే 'ఛ! సార్‌కి ఆ మాత్రం తెలియదా! నోరు మూసుకుని చెయ్యకుండా' అని అనిపించింది.

## ● పరోపకారార్థమిదం శరీరం

శ్రీ వెంకయ్యస్వామి మందిరం నుండి మురికి నీరు పోవటానికి కాలువ కోసం లోతుగా గుంటలు త్రవ్వారు. సీతారామయ్య అంగడి ప్రక్క నుండి బ్రహ్మం గారి మఠం వెళ్ళే రోడ్డులోకి వెళ్ళేవారు చుట్టూ తిరిగి

వెళ్ళుతున్నారు. ఆ వారం శనివారం నేను సార్ దగ్గరకి వెళ్ళగానే ఒక పెద్ద నాపరాయి చూపించి దానిని నున్నగా చేయమని చెప్పి చేయించారు. ఆ తర్వాత సార్ సైకిల్ మీద ఆ నాపరాయిని సీతారామయ్య అంగడి ప్రక్కసందు గుంటకి వేయించారు. కొంతమంది నడిచి వెళ్ళటం చూసి చాలా తృప్తి పడ్డారు. కొంతమందికి నేను రాయి వేశానని చెప్పారు.

- **ఉద్యోగంలో ఇబ్బందులు లేకుండా చేసి సార్‌కి సేవ చేసుకునే భాగ్యం కలిగించటం**

నేను ఉద్యోగం మానేసి సార్ దగ్గర ఉండి నెల్లూరులో లెక్చరర్‌గా చేద్దామనుకున్నాను. సార్‌కి ఈ విషయం చెప్పలేదు. ఒక ఆదివారం ఉదయం సత్సంగంలో సార్ భరద్వాజ మాస్టర్ గురించి చెపుతూ సందర్భం లేకుండా నా వంక వేలు చూపించి “ఉద్యోగం రాజీనామా చేయద్దు” అని చెప్పారు. అంతే ఇంక ఉద్యోగం మానెయ్యాలనే ఆలోచన పోయింది. నాకు నా స్వంతంగా వ్యాపారం చేయాలనే ఒక కోరిక ఉండేది. దమ్మపేట వెంకటేశ్వరరావు వ్యాపారం పెట్టి చేస్తున్నప్పుడు అతనికి చాలామంది బాకీ పెట్టి ఇవ్వలేదు. సార్‌కి అతను ఆ విషయం చెపుతున్నప్పుడు సార్ నా

వంక చూచి "నువ్వెప్పుడు వ్యాపారం చేయకు" అన్నారు. అంతే ఆ ఆలోచన కూడా పోయింది.

ఒక తరుణంలో నా ఉద్యోగంలో నన్ను టీం లీడర్ గా ఉన్చాలనుకున్నప్పుడు సార్ ఇచ్చిన సలహా: టీం లీడర్‌గా ఉంటే డబ్బులు వస్తాయి తప్ప నీకేమి రాదు. Individual contributor గా ఉండమని, చేసే పని మీద ఇష్టం, అభినివేశం ఉండాలని చెప్పారు. ఈ నిర్ణయంతో ఆఫీస్‌లో హాయిగా ఉండేది. నా పని నేను చేసుకుంటానని మా మేనేజర్ వాళ్ళు నన్నెప్పుడూ ప్రశ్నించేవాళ్ళు కాదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు గొలగమూడి వచ్చి సార్ దగ్గర నుండి పని చేయటానికి, సార్ సేవ చేయటానికి మా కంపెనీ వాళ్ళు ఏనాడూ అడ్డుపెట్టలేదు.

సార్‌కి పని turnover తో సంబంధం లేదు; live in the present లో ఉన్నామా లేదా, పని అయినా అవ్వకపోయినా ఎలా ఉన్నాము అనేది చాలా keenగా చెపుతున్నట్లు అనిపించేది.

సార్ ఇంటి వెనుక పెరట్లో రెండు రూములు కట్టటానికి పిల్లర్ల కోసం గుంటలు త్రవ్వారు. ఒకరోజు ఆ గుంటల్లో పని చెప్పారు. ఒక 5-6 మందిమి ఒకే గుంటలో పని చేస్తున్నాము. సార్ పని చెప్పి 20నిమిషాల పైన అయ్యింది. కొంతమంది ఇంక చాలు అంటున్నారు,

నాకేమో సార్ వచ్చి చెపుతారు కదా అనిపించి పని చేస్తున్నాను. కొంతసేపటికి ప్రక్కవారి మాట విని పని ఆపాను. వెంటనే సార్ వచ్చి “ఏం స్వామీ! అప్పుడే ఆపేశావు?” అని నన్ను ఒక చురక వేశారు.

బ్రహ్మంగారి మఠం ఎదురు బిల్డింగ్ కట్టేటప్పుడు శనివారం సాయంత్రానికి పూర్తిగా లెట్రిన్ ట్యాంక్ గుంట త్రవ్వటం పూర్తి అవలేదు. నేను ఆదివారం ఉదయం మిగతా గుంట చాలా త్వరగా త్రవ్వేద్దామని ఎలా చేస్తే త్వరగా అవుతుందో ఎన్నో ఆలోచనలు చేశాను. కానీ సార్ ఆదివారం బ్రహ్మంగారి బిల్డింగ్ దగ్గర చాలా తక్కువ పని చేయించారు. లెట్రిన్ గుంట త్రవ్వటం పని అసలు చేయించలేదు. నాకైతే సార్ నీ బోడి ఆలోచనలతో ఏమి చేస్తావోయి అని అన్నట్లు అనిపించింది. ఇలాంటి సందర్భాలు ఎన్నో అనుభవం.

సార్ పనికి వచ్చేటప్పుడు ఎవరో ఒకరం సైకిల్ మీద తీసుకువెళ్ళే అవకాశం కలిగింది. ఒకరోజు మధ్యాహ్నం సార్‌ను తీసుకు వెళదాము అని నేను ముందర వెళ్లితే సార్ “నేను నడిచి వస్తాను. నువ్వెళ్ళు” అన్నారు. నేను కొంచెం disappoint అవుతుండగా సార్ చెప్పిన “సిద్ధ్యసిద్ధ్యో సమోభూత్వా” గుర్తువచ్చింది. మనస్సు ప్రశాంతం అయ్యింది. నేను బయలుదేరి, సార్

ఇంటి దగ్గర ఒకరితో మాట్లాడుతున్నాను. సార్ బయలుదేరారు. వేణుగోపాల్ గారు సార్‌ను చూసి "ఎందుకు సార్ మీరు నడుస్తున్నారు" అని అక్కడే ఉన్న నన్ను పిలిచి సార్‌ని సైకిల్ మీద తీసుకువెళ్ళమన్నారు. సార్ ఏమాత్రం అసహనం వ్యక్తం చెయ్యలేదు. నాకు సార్‌ని సైకిల్ మీద తీసుకువెళ్ళే భాగ్యం కలిగింది.

ఒకరోజు ఉదయం సాయి మాస్టర్ నిలయం-2 బిల్డింగ్‌కి, స్కూల్ దగ్గర కూడా ఏదో పనికి వెళ్ళాలి. (ఇవి రెండు ఎందుకో ఇప్పుడు గుర్తులేదు కానీ ఒక టైం లోపల చేయాలి). అందువలన సార్, నేను ముందర సాయి మాస్టర్ నిలయం-2 బిల్డింగ్‌కి బయలుదేరాము. మధ్యదారిలో స్కూల్ దగ్గర పని ఎలా చేయాలో ఆలోచనలు చేసి సార్‌కి చెప్పాను. సార్ చాలా షార్ప్‌గా "ఇక్కడ పని గురించి ఆలోచించకుండా తర్వాత పని గురించి అలోచిస్తావేంటి?" అని గట్టిగా అరిచారు.

ఒకసారి సార్ నాతో ఒకతనిని ఉద్దేశిస్తూ "నేను తిట్టానని దానినే తలుచుకుంటూ ఉంటాడు. తిట్టాము, అయిపోయింది అన్నట్లు ఉండాలి" అని చెప్పారు.

# నగేష్

నేనంటే దేవుడికి చాలా ఇష్టం అని నాకు చాల నమ్మకం. దేవుడి కంటే గురువే ఎక్కువని చెప్పారు శంకరాచార్యులు. మరి గురువుకి నేనంటే ఇష్టం కాదా?

నేను మిలారేపాని కాదు, కానీ నా గురువుగారైన సుబ్బరామయ్య సార్ మాత్రం ఖచ్చితంగా 'మార్పా' నే. అందులో సందేహం లేదు. సార్ నాకు వ్రాసిన లెటర్‌లో చూడక నమ్మిన వారు ఘనులు అన్నారు. కాని నన్ను "ఎవ్వరినైనా సరే టెస్ట్ చేసి నమ్మమని" చెప్పారు. ఒక సారి నమ్మిన తరువాత వెనక్కి తిరిగి చూడవద్దు అన్నారు.

- **సార్ కృపతో తనంత తాను వ్యక్తం చేసుకున్నారని నా నమ్మకం .**

సార్‌ని నేను నమ్మటంలో సార్ ఇచ్చే మహిమలు, నిదర్శనాలు మాత్రమే కాకుండా, సార్ జీవన విధానం, సార్ దైవీ సంపత్తి కూడా కారణం. ఎందుకంటే సత్కర్మాచరణ, నిష్కామ కర్మ (ఏమీ ఆశించకుండా సేవ చేయటం), సంపూర్ణంగా దేవునిపైనే ఆధారపడి జీవించడంలో దేవుడు ఖచ్చితంగా ఉండి

తీరుతాడు. అతని మాట దేవుని వాక్కు, అతను ఉండేదే దేవాలయం.

- **నా మనసులో ఎప్పుడూ దేవుడితో యుద్ధం చేస్తుంటాను. ఇప్పటికీ అందులో ఖచ్చితంగా విజేతను నేనే . ☺**

మొదట్లో సార్ గురించి ఏమీ తెలియదు. తరువాత సార్ చెప్పే సత్సంగం కి వెళ్ళేవాడిని. కాని సార్‌ని ఇతరుల దగ్గర విమర్శించేవాడిని. ఒక రోజు ఒక కల వచ్చింది. ఆ కలలో ఇరు వైపులా సరస్వతి, లక్ష్మీదేవి ఉండగా మధ్యలో సార్ నడుస్తూ వస్తున్నారు. నెమ్మదిగా సార్ గురించి తెలిసింది – ఆయన ఎవ్వరి దగ్గర డబ్బులు తీసుకోరు, ఎవ్వరు వండినది తినరు, వెంకయ్య స్వామి ఆజ్ఞానుసారం ఊరు విడిచి వెళ్ళరు, లాభం ఆశించకుండా తక్కువ రేటుకే మహాత్ముల పుస్తకాలు ప్రచురించి అమ్ముతారు. దేవుని మీదే ఆధారపడి జీవిస్తున్నారు అని అర్థమైంది. ఇంకా ఆసక్తి పెరిగింది.

అయినా, దేవుడు లేదా గురువు ఎవరికో ఇచ్చే అనుభవాలు నేను ఎందుకు నమ్మాలి? నాకు కావాలి కదా! అసలే నాకు అవగాహన, తెలివితేటలు అంతంత మాత్రం. అందరూ సామాన్యంగా అలోచించే దానికి

ఒకోసారి చాలా విరుద్ధంగా కూడా ఉంటాయి. అసలు సార్ చెప్పింది ఎందుకు వినాలి? ఉదాహరణకు, సార్ నాకు బయట ఇడ్లీలు రెండు మూడు తినమంటే, నేను 15 or 18 తినే వాడిని. హారతులు పాడితే చాలా చిరాకు. కాని, పోను పోను సార్ మాటలు నా మీద మంత్రాలులా పనిచేసాయి. వాటినుంచి తప్పించుకోవటం నావల్ల కాలేదు .

## ● నా నమ్మకానికి నిచ్చెనలు :

మొదటిలో సార్ లెటర్స్ రాస్తూ ఒక్కరితో అయినా సరే సత్సంగం చెయ్యమని చెప్పారు. బయట ఎక్కడా ఎవరు వండినవి తినవద్దు నువ్వే వండుకుని తిను అన్నారు. ఇక్కడి వెంకయ్య స్వామే అక్కడ (ఢిల్లీ ) నిజాముద్దీన్ రూపంలో ఉన్నారు అని చెప్పి దర్శించమన్నారు. సందేహాలకి లెటర్స్ ద్వారా సమాధానం చెప్పేవారు.

సాయిబాబా సమాధిని, ఏదైనా దేవుని విగ్రహాన్ని గాని పూజించగలం, నమ్మగలం. కాని, మామూలుగా కనిపించే, మాట్లాడే మనిషిని దేవుడిగా నమ్మటం, దివ్యత్వం గమనించడం ఎలా? ఇప్పట్లో ఎంతో మంది నకిలీ GODMAN లు ఉన్నారు కదా !

సార్‌పై నా నమ్మకం - ప్రార్థన, దానికి నిదర్శనం, అప్పుడు కొంచెం నమ్మకం, కొంచెం అనుమానం, మళ్ళీ టెస్ట్ చెయ్యటం, మళ్ళీ నిదర్శనం, మళ్ళీ నమ్మకం, మల్లి ప్రార్థన ...ఇలా STEP BY STEP జరిగింది. ఒక్కసారిగా జరగలేదు. అంత పుణ్యం లేదు కదా .

సార్ నాకు ఢిల్లీలో ఉన్నపుడు నిజాముద్దీన్ దర్గాని నియమపుర్వకంగా ఒకే టైంలో దర్శించమని చెప్పారు. అప్పటికి సార్‌పై ఏ నమ్మకం లేదు. కాని చెప్పింది చేయాలి అనిపించి చేస్తుండగా, ఒకసారి ఉద్యోగం, ఇల్లు రెండూ మారటానికి దేవుడి నుంచి సమాధానం కావాలి అని గురుచరిత్ర పారాయణ చేస్తున్నాను. పారాయణ మూడవరోజు నిజాముద్దీన్ దర్గా నుంచి వస్తుండగా మనసులో చాల ధృడంగా దేవుడి నుంచి మూడు రోజుల్లో సమాధానం రావాలి అని అనుకుంటూ మళ్ళీ వెంటనే, మూడు రోజులెందుకు, ఏం? ఈ రోజు ఇవ్వలేడా అని చాలా తీవ్రంగా అనుకున్నాను. రెండు గంటల్లో ప్రసాద్ నుంచి ఫోన్ వచ్చి 'సార్! నిన్ను జాబ్ RESIGN చేయ్యమంటున్నారు' అని సార్‌తో మాట్లాడమంటే సార్, "నగేష్! నీకు జీతం ఎంతిస్తున్నారు? ఏం, ఆ డబ్బులు ఇక్కడ సంపాదించ

లేవా అని” ఇంకా చెప్పారు. ఢిల్లీలో, మనసులోని నా ప్రార్ధన సార్‌కి ఎలా తెలిసింది?

ఇక్కడి నుంచి సార్ మనలా మామూలు మనిషి కాదు అని నిరూపణ అయింది.

నా గురువు ఎవ్వరో తెలియపరచమని దేవుడికి ప్రార్థించి గురుచరిత్ర పారాయణ చేశాను. సార్, కలలో కనిపించారు. కలలో సార్ పొట్టపై నా తల ఉంచాను, మంత్రాలు వినిపిస్తున్నాయి. నేను ఒక మంత్రం చెప్తే సార్ అవును అన్నారు. సార్‌తో ఈ విషయం చెప్పాను. సార్ , చిరునవ్వు నవ్వారు. ఇంక నా గురువు సారే అని అర్ధమయింది.

ఏపని ఐనా సరే మొదలు పెట్టడానికి ముందు సార్‌కి చెప్పి స్టార్ట్ చెయ్యడం అలవాటు అయిపోయింది . ఒక విధంగా సార్ తనకు తనే PROOFS ఇచ్చి విశ్వాసం కల్పించారు. చాలా సార్లు నేను సార్‌ని మనసులో టెస్ట్ చేసేవాడిని. అది నా విశ్వాసానికి కూడా టెస్ట్. సార్ దగ్గర నుంచి ఆదివారం రాత్రి బయలుదేరి బెంగళూరు బస్సు పట్టుకోవాలి. గొలగమూడిలో రాత్రి 8.30 తరువాత ఆటోలు దొరకటం కష్టం. కాని నాకు పది గంటలు దాటినా సరే ఎదో ఒక లా వెహికల్స్ దొరికేవి. అవి చెప్తే ఒక పుస్తకమే అవుతుంది ☺ . సార్‌కి ఒక సందర్భంలో

ఆ విషయం చెప్తే లేటుగా బయలుదేరి వెంకయ్యస్వామికి ఇబ్బంది పెట్టకూడదు అన్నారు. అంటే స్వామి నాకోసం వెహికల్స్ ఉంచుతున్నారు అని చెప్పటమే కదా ....!

GENPACT కంపెనిలో పని చేస్తుండగా ఐఐఎం కోర్స్ ఒకటి సార్ జాయిన్ అవమన్నారు.(నేను అడిగాను).

కాని ఎంత చిత్రమో ఫైనల్ ఎగ్జామ్స్ డేట్స్ కూడా మర్చిపోయాను. అంతకు ముందు రెండు వారాలు నుంచి నువ్వు చదవటం లేదు అని అంటున్నారు. నేను ఇప్పుడేం చదవాలి అనుకుంటున్నాను కాని ఎగ్జామ్స్ గురించి పూర్తిగా మర్చి పోయాను. తరువాత శనివారం ఉదయం సార్ నన్ను గుడి మూసేంత వరకు ప్రదక్షిణలు చెయ్యమన్నారు. హ్యాపీగా వెళ్లి మొదలు పెట్టాను.మధ్యాహ్నం మూయలేదు , రాత్రి కూడా మూయ్యయలేదు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి మూసారు. (అప్పట్లో శనివారం గుడి మూసేవారు కాదు...నాకు తెలియదు) ప్రదక్షిణలు కంప్లీట్ చేసి సార్ దగ్గరకు వచ్చాను. మరుసటి రోజు ఉదయం ఆఫీస్ ఫ్రెండ్ నుంచి ఫోన్ వచ్చింది. నగేష్ HOW IS THE PREPEATION? ARE YOU READY FOR THE EXAM? అని. అంతే మైండ్

బ్లాంక్ ఐపోయింది . కొన్ని వారాల నుంచి వెతుకుతున్న కోర్స్ MATERIAL వెను వెంటనే దొరికింది. ఆఫీసుకి చేరేలోపు రెండు గంటలు చదివాను. ABOVE AVERAGE గ్రేడ్‌తో ఎగ్జామ్స్ పాస్ అయ్యాను. నేనే మర్చిపోయిన పరీక్షలు సార్ హెచ్చరించి చదవమనడం హెచ్చరించినా గుర్తు రాకపోతే సార్ దీక్ష చేయించి నన్ను పాస్ చేయించడం సార్ అనుగ్రహం కాదా?

అసలు నాకు జాబ్ రావటమే సార్ అనుగ్రహం. ఎలా అంటే, బెంగుళూరు వచ్చిన తరువాత GENPACT లో 6 నెలలు ఐనా HRరౌండ్ కాలేదు. హోల్డ్ లో పెట్టేసారు. సార్ సడన్‌గా ఫోన్ చేసి నగేష్, నువ్వు గొలగమూడి రానక్కరలేదు, దగ్గరగా ఉండే గుడిలో ద్రవాహారం తీసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు ప్రదక్షిణలు చెయ్యి అన్నారు. నువ్వు జాబ్ రావాలి అని కోరుకోవాలి కోరుకోక పోతే ఎలా అన్నారు. ఇంకా... “నువ్వుఅక్కడ  ఎలా ప్రదక్షిణాలు చేస్తావో నేను ఇక్కడ (గొలగమూడి) నుంచి చూస్తుంటాను” అన్నారు. నాకింక చాల అనందం వేసింది. చెప్పింది (ప్రదక్షిణలు) చెయ్యటం నాపని – మిగిలిన బాధ్యత సార్ పని. నేనింక టెన్షన్ పడనక్కర్లేదు. అనుకుని ఒక రోజు అలా అతికష్టం మీద కూర్చోకుండా ఉదయం నుంచి రాత్రి గుడి

మూసినంత వరకు కంప్లీట్ చేశాను. సార్‌కి ఫోన్ చేసి చెప్తే ఒక రోజు గ్యాప్ తీసుకుని మళ్లి ఇంకో రోజు చెయ్యమన్నారు.అలానే చేసి ఫోన్ చేసి చెప్పాను. అప్పుడు సార్ కొంచెం కోపంగా , ఒక రోజు చేస్తాను, రెండు రోజులు చేస్తాను అని కాదు, జాబ్ వచ్చినంత వరకు రోజు మార్చి రోజు అలానే చెయ్యాలి అన్నారు. సార్ అంత ప్రేమతో చెప్పేసరికి నేనన్నాను " సార్ ! నాకు వెంకయ్యస్వామి, భరద్వాజ మాస్టర్ ఏంచేసారో తెలియదు కాని మీరు మాత్రం చాలా చేస్తున్నారు అన్నాను. సార్, "**సుబ్బరాయుడు, భరద్వాజ మాస్టారు, వెంకయ్యస్వామి వేరు కాదు ఒకే దివ్య చైతన్యం, అన్నీ వేరుగా లేవు**" అన్నారు. సార్ ఒక్కసారి అంత డైరెక్ట్‌గా చెప్పేసరికి ఆశ్చర్యం, ఆనందం రెండూ కలిగాయి – ఎందుకంటే సార్, అసలు ఎవ్వరు వచ్చినా నేనేం చేస్తాను, నేనేమైనా దేవుడినా? వెంకయ్య స్వామికి చెప్పుకోండి అంటారు.

ఇంక నా non stop ప్రదక్షిణలు మొదలు పెట్టాను (మధ్యలో బ్రేక్ ఉండకూడదు కాబట్టి 1 or 2 చిన్న పెరుగు పేకట్‌లు నా ఫుడ్. తరువాత తెలిసింది నేను 48 kgలు అయ్యాను అని). కేవలం 7 or 8 వ రోజు ప్రదక్షిణలు చేస్తుండగా కంపెనీ నుంచి ఫోన్ వచ్చింది.

Congratulations Nagesh! you are selected as Busuness analyst అని. ఇది పూర్తిగా సార్ కృపే. ఏమాత్రం నా తెలివితేటలు, అర్హతల వల్ల కానే కాదు.

ఒకసారి మా నాన్న గారికి సీరియస్‌గా ఉందని వెంటనే బయలుదేరి రమ్మని ఫోన్ వచ్చింది. బ్యాగ్ సర్దుకుని విమానం ఎక్కడానికి తయారయ్యాను. వెంటనే సార్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను. నువ్వు వెళ్లి ఏంచేస్తావు? ఇంజక్షన్ చేస్తావా? అన్నారు. అర్థం కాలేదు. ఈయనేంటి సీరియస్‌గా ఉందంటే సరదాగా తీసుకుంటున్నారు.

నాకు అసహనం వచ్చింది. క్లియర్‌గా చెప్పండి సార్ ఏం చేయమంటారు 'వెళ్ళాలా వద్దా' అన్నాను. ఒక రెండు రోజులు చూడు అప్పుడు అవసరం ఐతే వెళ్ళువులే అన్నారు. ఎమర్జెన్సిలో, తరువాత ICU లో ఉంచి ఒక రోజు తరువాత బాగుందని పంపేసారు. హార్ట్ స్ట్రోక్ వచ్చింది , మీకు తెలియలేదా అని మా తమ్ముడిని అడిగారు. మా నాన్న గారికి టెస్టులు అన్నీ చేసిన వారం తరువాత రిపోర్ట్‌లు చూసి అన్నారంట. ఈయన ఇంకా భూమి మీద ఉన్నాడా అని. అప్పటికి మా నాన్నగారు చాలా కులాసాగా ఉన్నారు. మన కర్మ ఫలితాలు నిజమైన

గురువుకు ఎగతాళి గానే ఉంటాయి ఎందుకంటే వారికి అవి చిన్నపిల్లల ఆటలు.

ఇంకా చాలా విషయాలలో సార్ నేను ప్రార్థించ కుండానే కాపాడే వారు. అవి అనుభవానికి వచ్చిన తరువాత తెలిసేది.

అలాంటి ఒక చిన్న విషయం చెప్పి ఇప్పటికి ముగిస్తాను. ఢిల్లీ రైల్వేస్టేషన్లో ట్రైన్ కోసం నిలుచున్నాను. ఒక 13 or 14 సం||ల పిల్లవాడు వచ్చి ఒక బలిష్టంగా ఎత్తుగా ఉన్న యువకుణ్ణి చూపించి హిందీలో చెప్పాడు- ఆతను నీ పర్స్ దొంగతనం చేసాడు అని , నా చేయి పట్టుకుని అతని దగ్గరకు తీసుకెళ్ళి అతన్ని నా పర్స్ అడిగి తీసుకుని నాకు ఇచ్చాడు. అసలు నా పర్స్ పోయిన సంగతి నాకేమాత్రం తెలియదు. చెక్ చేస్తే నా పర్సు లేదు . మళ్ళీ ఇలా చెప్పాడు “నువ్వు ఇక్కడుంటే అతను నీ దగ్గర పర్స్ లాక్కుంటాడు” అని నన్ను దూరంగా తీసుకుని వెళ్లి వదిలిపెట్టాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది . ఆ యువకుడు నన్ను, ఆ పిల్లాణ్ణి కలిపి కొట్టగలడు . కాని బుద్ధిగా ఒక్క మాట మాట్లాడకుండా ఎలా పర్స్ ఇచ్చేసాడు? ఎవరు ఆ పిల్లాడు?

భరద్వాజ మాస్టారు గారు చెప్పిన “నీకు అవసరం ఐనది చేస్తాను, కోరినవి కాదు” అని (ఎవరికో)

చెప్పిన వాక్యం నాకు సుబ్బరామయ్య సార్ చెప్పలేదు కాని నువ్వు ఆత్మీయుడవు అన్నారు. నాకు అవసరం ఉన్నపుడు నేను తలచక పోయినా సార్ సృష్టి మొత్తం తానే అయి నడిపిస్తున్నారు. నా అవసరం తెలుసుకోగలగటం, మా నాన్నగారి ఆరోగ్యానికి భరోసా ఇవ్వగలగటం, నా చేత ప్రదక్షిణలు చేయించి JOB వచ్చేటట్లు చేయించటం. వీటన్నిటిలో సార్ సర్వవ్యాపకత్వం, సర్వసమర్థత్వం, సర్వసమర్థత్వం క్లియర్ గా కనిపిస్తున్నాయి.

నాగేష్.K, బెంగుళూరు.

# శ్రీమతి గొర్తి లక్ష్మి గారు (దమ్మపేట)

శ్రీమతి గొర్తి లక్ష్మి గారు (దమ్మపేట) తమకు శ్రీ సాయి, శ్రీ భరద్వాజ మాస్టర్, శ్రీ వెంకయ్య స్వామి కృప పొందేటట్లు శ్రీ సుబ్బరామయ్య సార్ ఎలా మార్గదర్శకం చేసారో, ఎలా తమ పిల్లల్ని సమాజానికి ఉపయోగపడే జీవిత విధానంలో సంస్కరిస్తున్నారో ఇక్కడ పంచుకుంటున్నారు.

- **తొలి పరిచయం :**

మొదట శ్రీ సాయిబాబా అనుగ్రహం, పరిచయం 1980-81లో శ్రీ చింతా లక్ష్మీనారాయణగారి సతీమణి ద్వారా శ్రీ సాయిబాబా చరిత్ర ( శ్రీ సాయి లీలామృతం) గూర్చి, శ్రీ భరద్వాజ మాస్టారి గురించి వినడం జరిగింది. అదీ ఒక చిక్కు పరిస్థితిలోనే. మా పెద్దబ్బాయి సాయి సుబ్రహ్మణ్యంకు చిన్నతనంలో గుండెలో చిల్లు ఉందని ఆపరేషన్ చేయాలని ఆ సమయంలో తెలిసి బాధపడుతుంటే బాబా గూర్చి చెప్పి చరిత్ర పారాయణ చేస్తే మేలవుతుందని చరిత్ర కూడా వారు ఇచ్చారు. తర్వాత మద్రాసులో ఆపరేషన్ చేయించాము. అచ్చట మూడు వారాలు ఉన్న సమయంలో బాబా ఫోటో పెట్టి మొదట మా వారు పారాయణ చేసారు. బాబా దయ వలన ఆపరేషన్ సజావుగా జరిగి క్షేమంగా ఇంటికి వచ్చాము. అప్పటికి బాబాపై నాకు అంత విశ్వాసం, శ్రద్ధ కలగలేదు. అప్పుడు చిన్న పల్లెటూరులో ఉండేవారము. అప్పటికి నాలుగు నెలల తర్వాత మా బాబుకు ఒకసారి హై టెంపరేచర్ వచ్చి కళ్ళు తేలవేస్తే ప్రమాద పరిస్థితిలో బయటపడి ఏమీ తోచక 'బాబా, బాబా' అని ప్రార్థిస్తూ బాగుంటే పారాయణ చేస్తానని మ్రొక్కుకోగానే చక్కబడటంతో మొదలుపెట్టి నాలుగు సప్తాహాలు నెలరోజులూ సాయి

లీలామృతం పారాయణ చేయడంతో శ్రీ సాయినాధుని పై భక్తి, విశ్వాసం మొదలైనాయి. బాబా ఆరతులు, భజన చేసుకునేటట్లు బాబానే అవకాశం కల్గించారు.

- **సత్సంగం ప్రసాదించటం:**

దమ్మపేటకు ఉద్యోగరీత్యా వచ్చాక, 1986 లో శ్రీ లక్ష్మీనారాయణ గారి దంపతులతో పాటు ఒంగోలులో శ్రీ భరద్వాజ మాష్టారిని దర్శించే భాగ్యం కలిగింది. శ్రీ భరద్వాజ మాష్టారి గారి జన్మదిన సందర్భంగా వారి పూజలో పాల్గొని మా ఇద్దరి పిల్లలతో తిరిగి వచ్చేటప్పుడు మా ఊరులో శ్రీ మాష్టారిని బాబా గూర్చి చెప్పుటకు రమ్మని ఆహ్వానించాము. శ్రీ మాస్టారు “మీరు మీ ఊరి వారితో సత్ సంగం చేసుకోండమ్మ, వస్తాను” అన్నారు. నాకెవ్వరూ తెలియదంటే నలుగురు చిన్నపిల్లల్ని పిలచి బాబా కథ ఒక్కటి చెప్పి, బొరుగులు ప్రసాదం పెడితే అదే సత్సంగం అవుతుందన్నారు. చిత్రంగా మా ఇంటి ప్రక్కనే అంగనవాడి స్కూల్ ఉండటం, అదేరీతి స్కూల్ అయిపోయే టైం లో పిల్లల్ని పిలచి కొంచెం ప్రసాదం పెట్టడం, దాని ద్వారా వారి తల్లిదండ్రులకు బాబా సత్సంగం పరిచయం కావటం జరిగింది. మా ఊరిలో వారికి బాబా ఎన్నో దివ్య అనుభవాలు ఇచ్చారు. అట్లా శ్రీ మాస్టారి ఆశీస్సులతో సత్సంగం ప్రారంభమై మొదట

ఆడవాళ్ళు, తరువాత అందరూ పాల్గొనటం వలన మందిరం కూడా ఏర్పడింది. నిత్యసత్సంగం అప్పటినుండి జరుగుతునే ఉంది.

- **భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి, శ్రీ సుబ్బరామయ్య సార్ పరిచయం:**

శ్రీ సాయి మాస్టర్ దయ వల్ల మాష్టారి వ్రాసిన చరిత్రలన్నీ పారాయణల వలన గురుగీతలో శ్రీ గురువు యొక్క తత్వము, భావయుక్తంగా పూజ ఎలా చేయాలో, సద్గురువు, అసలైన మహనీయులు ఎలా ఉంటారో అవగాహన కల్గించారు. మొదటిసారిగా శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర పరిచయం శ్రీ దత్త సాంప్రదాయంలోకి తీసుకువచ్చారు. శ్రీ సాయిబాబా పత్రికలో మొదటిసారిగా శ్రీ వెంకయ్యస్వామివారు విజయనగరంలో సమాధి అనంతరం భౌతిక దర్శనం ఇచ్చిన సంఘటన చదివి పులకించటం జరిగింది. శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర పంపమని మని-ఆర్డర్ పంపితే, స్వామి చరిత్రతో పాటు, బోధామృతం కూడా శ్రీ పెసల సుబ్బరామయ్య గారు పోస్టులో పంపారు. స్వామి గొప్పదనం కొంత వీటన్నిటితో హృదయగతం అయ్యాక 1990లో మొదటిసారిగా గొలగమూడి దర్శించాము. ఒంగోలులో శ్రీ సాయినాధుని విగ్రహ ప్రతిష్ట చేసిన శ్రీ

గులాబ్ బాబా గారిని దర్శించుకుని శ్రీ వెంకయ్యస్వామి వారి సమాధిని దర్శించటం జరిగింది. అప్పుడే మొదటిసారిగా శ్రీ సుబ్బరామయ్య సార్‌ని దర్శించటం జరిగింది.

- **సత్సంగములో జాగ్రత్తలు, అపరిగ్రహం, ఆహార నియమం –అవ్యక్త ప్రేరణ, ఆచరణ:**

సార్ వ్రాసిన శ్రీ అవధూత బోధామృతం నాకు, సత్సంగంలో వారికి మార్గదర్శకమైంది. దానిలో శ్రీ స్వామివారి ఆచరణ వివరిస్తూ వారు వ్రాసిన విధంగా కార్యదీక్ష (పని అయితేనే గంజి ముట్టాలని) శ్రీ స్వామివారు ఎంత శ్రద్ధగా చేసారో మనము శ్రద్ధగా మహనీయుల చరిత్ర పారాయణ చేయాలనిపించేది. ఎంత పడితే అంత, ఎక్కడ పడితే అక్కడ, ఎవరు పెడితే అది తినటం గూర్చి, అట్లా దాంట్లో వివరించిన భోధలు, ఆ పుస్తకం హృదయగతమవుతూ ఆ పుస్తకాన్ని మరలా మరలా మననం జరిగేది. ఆ పుస్తకం ద్వారానే సార్, శ్రీ స్వామి ఇవన్నీ పరోక్షంగా చేయించటమే గాక సత్సంగం చేసే వారు తీసుకోవలసిన జాగ్రత్తలు, అది సజావుగా జరుగుటకు అవసరమైన మార్పులు చిత్రంగా, శ్రీ సార్ లెటర్ల ద్వారా సరైన సమయానికి అవ్యక్తంగా అందేవి.

ఒక సమయంలో సత్సంగంపై మా ఊళ్ళో వాళ్ళకే గాక, చుట్టుప్రక్కల ఎందరో ఊళ్ళ వారికీ శ్రద్ధ కలిగి చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా వెళ్ళి సత్సంగం చేస్తుండే దానిని. అప్పుడు అచ్చట భోజనం వాళ్ళింట్లో చేస్తుండే దానిని. అంతేగాక వారి కృతజ్ఞత కొద్దీ ఇచ్చిన ప్రసాదాలు పిల్లలకు ఇవ్వడం, జాకెట్ గుడ్డలలాంటివి ఏమి చేయాలో తోచక తెచ్చి ఇంట్లో ఉంచటం జరిగేది. ఒక సందర్భంలో అనుకోకుండా సార్ వద్దనుండి ఒక లెటర్ వచ్చింది. దాంట్లో "రాజద్రోహం అంటే రాజు లేదా గురువు యొక్క భక్తులు, సేవకులు అయిన వారి సొమ్మును మనం స్వీకరించటం, దానితో మనం అన్ని రూపాలలోని గురువుకు ఎంతో ఋణపడతామని" ప్రస్తావిస్తూ గుజరాత్‌లో వుండే వేణుగోపాల్ గారికి ఉద్యోగధర్మం గురించి వ్రాస్తూ చిత్రంగా ఎందుకో "మీకు పంపాలనిపించి పంపానని" వ్రాసారు. అప్పటి నా పరిస్థితికి అది స్వామి సందేశం అనిపించింది. అప్పటినుండీ ఎచ్చటకు వెళ్ళినా ఏమీ స్వీకరించేదానిని కాదు. ఇంట్లో ఉన్న ఎన్నో జాకెట్ గుడ్డలు మొ||వి పేదలకు పంచటం, ఊళ్ళో వాళ్ళు సైతం ఇచ్చే ఎన్నో పళ్ళు (మామిడిపళ్ళు) మొ|| కూడా మా పిల్లలకు పెట్టకుండా ఆకలితో ఉండే జీవులకు, భిక్ష చేసే వారికి

సాయినాధుని రూపాలుగా ఇవ్వటం చేసేదానిని. సత్సంగం చేసుకొని శ్రీ మాస్టారి ఆశీస్సులు సద్వినియోగమవటానికి ఈ అపరిగ్రహం ఎంత ముఖ్యమో తర్వాత గానీ శ్రీ సార్ సూచన, సందేశంలో బోధపడలేదు. ఆచరణలోకి రాలేదు. సార్ లెటర్‌తో ఇచ్చిన సందేశం వలన అంతకు ముందు నుండి అవధూత బోధామృతంలో మరలా మరలా సూచించే బోధ "ఎవ్వరి దగ్గర పడితే ఎంత పడితే అంత తినటం సాధకులకు తగదు" అన్నది, "విమర్శలు వింటే గంజి క్రింద పెట్టు" అన్నది,"స్వామి సేవకు తగము" అన్నవి అన్నీ హృదయంలో సమన్వయమై బయట ఊళ్లకు వెళ్ళినప్పుడు తినటం వల్లనే తరువాత బాబాపై సరిగా మనస్సు నిలప లేకపోవటం, అనవసరపు ఋణానుబంధాలు, చికాకులలో చిక్కుకోవటం జరుగుతున్నాయని గుర్తింపు కలిగి అప్పటినుండి బయట తినటం, ఇతరులు ఇచ్చినవి, వండినవి తినటం మానేయటమైనది. మా చిన్నబ్బాయికి (శివకు) శ్రీ సార్ స్వయంగా చాలా స్పష్టంగా లెటర్ లో వ్రాసిన, చేసిన సూచన కూడా దీన్ని బలపరచటంతో అప్పటి నుండి మా ఇద్దరిచే బయట తినకుండా ఉండే నియమం శ్రీ సార్ అలా ఆచరింప చేసారు.

## ● స్వామి కృపకు అవాంతరము- ఆచరణ సౌలభ్యం

తర్వాత కొద్దిరోజులకు అనుకోకుండా గొలగమూడి వెళ్ళినప్పుడు సార్ సత్సంగం చెబుతూ పులినోట బడ్డ వేట అని వివరిస్తూ స్వామి వంటి సద్గురువు కృప పొందటంలోనే మన కృషి ఉంటుంది. ఆయన కృప ఉంటే సర్వమూ ఆయన చేస్తారు, బాధ్యత ఆయనది అన్నారు. నేను స్వామి కృప ఎలా కలుగుతుంది సార్ అంటే "మీరు నెలనెలా గొలగమూడి వచ్చి స్వామిని దర్శించుకోండమ్మా, స్వామికృప కలుగుతుంది" అన్నారు. సరే సార్ అని మరునెల గొలగమూడి వెళ్లి మూడు రోజులు ఉండి స్వామి అన్నశాలలో తిన్నాను. ఇంటికి వెళ్ళాక ఆ అన్నం శరీర ఆరోగ్యానికి పడక అనారోగ్యమైంది. ఇంక ఇలా నెలనెలా అయితే ఇబ్బందని సార్‌కు నేనింక రాలేను సార్, ఇలా అనారోగ్యమైందని వ్రాసాను. సార్ ప్రత్యుత్తరంలో "అమ్మా! మీకు బయట తినటం వల్లనే కదా ఇబ్బంది వచ్చింది. మీరు వండుకోవడానికి నేను ధ్యానం చేసుకునే రూమ్, శ్రీ శ్రీ శ్రీ మాస్టర్ (ఫోటో రూపంలో) ఆసీనులైన రూమ్ మీరు రాగానే తాళం ఇచ్చి వేస్తాను. గ్యాస్ స్టవ్ కూడా స్వామి మీ కోసం పంపినట్లు వచ్చింది. కొన్ని

గిన్నెలు తెచ్చుకు రండి ఇచ్చట వండుకుని తిని స్వామిని సేవించుకోండి. స్వామి సేవలో ఇబ్బంది వస్తే **ఆ ఇబ్బంది తొలగించుకునే మార్గం చూసుకుని సేవ చేసుకోవాలి కానీ స్వామి సన్నిధిని వదులుకోకండి. స్వామిని నెల నెలా దర్శించుకోవటం చాలా గొప్ప సేవ, పుణ్యకార్యం అని వ్రాసారు**.

అలానే నెల నెల దర్శించుకుంటూ సార్ ఇచ్చిన రూమ్, ఇప్పటికీ తరచూ వచ్చే భక్తులకు కేటాయించిన రూమ్‌లో వండుకు తింటూ ఉండేదానిని. అప్పటిలో ఆర్థిక ఇబ్బందిగా ఉంటే సార్ "అవసరమైతే నేను నెలకు 500 రూపాయలు ఇస్తాను. మీరు తర్వాత ఇద్దురు. కానీ రావటం మానకండి. ఇది చాలా గొప్ప సేవ" అని వ్రాసారు. కొద్ది రోజులలోనే మా పెద్దబ్బాయికి M.Sc.లో సీట్ వచ్చి Rs 5000 స్టైఫండ్ వచ్చేది. ఒకసారి మా పెద్దబ్బాయితో నెలనెలా 1000 రూపాయలు మీ అమ్మగారికి గొలగమూడి ప్రయాణానికి ఉంచేయి అని చెప్పారు. అప్పటిలో ఆ ఇబ్బంది తొలగించి స్వామి రప్పించుకునే వారు.

- **బాధ్యత – శరణాగతి:**

తరువాత వాడికి జాబులో చేరాక శని, ఆదివారాలు శెలవవడంతో తరచూ మా పెద్దవాడు వస్తూ

ఉండటం జరిగేది. తర్వాత వాడికి కొంత అనారోగ్యం రావటం (అది బయట తినటం వల్ల కావటం) నన్ను అచ్చట ఉంచి సమయానికి ఇబ్బంది లేకుండా చేసి గొలగమూడి చేర్చి కొన్ని నెలలు అచ్చట ఉంచటం జరిగింది. తరువాత వాడి Ph.D. తో పాటు అనుకోని రీతిన నన్ను కూడా మద్రాసులో ఎవ్వరితో సంబంధం లేకుండా నిరంతరం భగవంతునిపై, స్వామిపై ఆధారపడేలా చేసి నిరంతర స్మరణ దానికి సహకారంగా ఆహారనియమం (సమయానుసారం, నేను వండుకున్నది తినటం, చిరుతిండ్లు తినాలనే యావ పోగొట్టటం) సహజసిద్ధం చేయటం జరిగింది. భౌతికంగా ఎన్నో ఇబ్బందులు అనిపించినా చెడిపోయిన తాళబుర్రల రిపేరులా ఎన్నో సంస్కారాలపై సుత్తి దెబ్బలు కొడుతూ అవసరమైనప్పుడు ఎంతో ఊరట కలిగిస్తూ చివరకు మా పెద్దవాడి Ph.D.మంచిగా చేయించారు. మా ఇద్దరు పిల్లల బాధ్యత వారే పూర్తిగా వహించి వారిని చక్కటి జీవిత విధానంలో స్థిరపరిచారు. వివాహ విషయంగానీ ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, సంస్కారం, ఇలా అన్నీ మా ఇద్దరు పిల్లలని మలుస్తూ ఇప్పుడు వారిని చక్కటి అధ్యాపక వృత్తిలో సాఫీగా వెళ్లిపోయేలా చేసారు. నాకు కూడా ఆహార నియమం సహజంగా జరుగుతూ ఒక టైం

టేబుల్ ప్రకారం పూజ, సత్సంగం, ప్రార్ధనలు ఏ కలతలూ పెద్దగా లేని జీవిత విధానంలో నన్ను మావారిని ఉంచారు. వీటన్నింటికీ అవ్యక్తమైన స్వామి, సాయి, మాస్టర్ ఆశీస్సులనుకున్నా ప్రత్యక్షంగానూ, ప్రత్యేకంగానూ సార్ లెటర్లు, బోధలు, సత్సంగాలు, సాంగత్యం, సూచనలు ఆపై వారి కృప కారణము. కృతజ్ఞతతో శ్రీ సాయినాధుని, స్వామికి ప్రీతికరమైన జీవిత విధానంలో వారి స్మరణలో నిరంతరం గడపగల శక్తినిమ్మని ప్రార్థిస్తూ.. .గొర్తి లక్ష్మి

# సాయి శివ

సాయి శివ తనకు శ్రీ సుబ్బరామయ్య సార్‌తో గల అనుభవాలను ఇలా పంచుకుంటున్నారు.

మాది ఖమ్మం జిల్లా, దమ్మపేట గ్రామం. మా తల్లిదండ్రుల పేర్లు లక్ష్మి, శ్రీరామ శాస్త్రి గార్లు. శ్రీ భరద్వాజ మాస్టర్ గారిని దర్శించుకున్నప్పుడు మాస్టర్‌గారు “సత్సంగం చేయండి, నేను వస్తాను” అని చెప్పారు. అదే మాస్టర్ ఇచ్చిన దీక్షగా మా అమ్మగారు నిత్య సత్సంగాలు చేస్తున్నారు. ఒకసారి మా అమ్మగారికి అనారోగ్యమై మంచం దిగకూడదని చెప్పారు. అందువలన మా అమ్మగారు నన్ను కడుపుతో ఉన్నదగ్గర

నుండి శ్రీ మాస్టర్ రచనలు నిరంతరం పారాయణ చేసేవారు. నాకు చిన్నప్పటి నుండి శ్రీ మాస్టర్ గురించి తెలిసినా ఏనాడూ ఉత్సాహంతో చదవలేదు. అంతేగాక నాకు 8 వ తరగతి దాకా క్లాసు మార్కులు కూడా అంతంత మాత్రమే (25 మార్కులకు 10 మార్కులు వచ్చేవి!). నేను హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతుండగా కాలేజీకి వెళ్లి వచ్చే సమయానికి నా శారీరిక పరిస్థితుల వల్ల నీరసంగా ఉండి ఏమీ చేయలేక పోయేవాడిని. అప్పుడు మా అమ్మగారు క్రింది విధంగా సలహా ఇచ్చారు.

- రోజూ ఒక అరగంట అవధూత లీల, సాయి లీలామృతం, శ్రీ గురు చరిత్రలో కొంత చదవటం
- అన్నం తినే ముందు ఒక ముద్ద బాబాకు నివేదించి కాకబలికి సమర్పించి మిగిలిన అన్నాన్ని సాయి ప్రసాదంగా తినటం
- ఇష్టమైన పదార్థం వదిలి వేస్తే శ్రద్ధ ఉంటుందని మాస్టర్ చెప్పినందు వలన అలా చేయటం

నాకు చేయాలనిపించి అప్పట్లో స్వీట్స్ వదలి మా అమ్మగారు చెప్పినట్లు చేయటం ప్రారంభించాక శ్రీ మాస్టారి చరిత్రలు క్రొత్తరీతిలో అర్ధమవటం

ప్రారంభించాయి. శారీరిక, మానసిక అలజడులన్నీ పోయి చదువుకోగలిగాను. నేను శ్రీ మాస్టర్, సాయిబాబా కృప వల్ల మాస్టారి చరిత్రలు హృదయపూర్వకంగా చదివేవాడిని. మాస్టారి కృపా అన్నట్లు శ్రీ నాంపల్లిబాబా గారి సన్నిధి లభించింది. శ్రీ మాస్టరి చరిత్రలు చదువుతూ నా లోపాలను సరిదిద్దుకొనుటకు, బాబాపై ఆధారపడుటకు చాలా సమయాలలో ఏకాహ పారాయణాలు నిరాహారంగా చేయటం, శ్రీ నాంపల్లిబాబా గారి దగ్గరకు చాలా తరచుగా వెళ్ళుతుండటం చేసేవాడిని. పరీక్షలు దగ్గర పడుతున్నప్పుడు కూడా అప్పుడప్పుడు చదువుపై నా శారీరిక మానసిక పరిస్థితుల వల్ల, అవగాహనా లోపం వల్ల చదువుపై శ్రద్ధ పెట్టక సమయం వ్యర్ధం కాకుండా సాయినాథుని మాస్టారి చరిత్రలు చదవటం ద్వారా శ్రద్ధగానో లేకుండానో గడిపేవాడిని.

ఇంటర్ తర్వాత పాల్వంచ ఇంజనీరింగ్ కాలేజీలో ECE సీటు వచ్చింది. అప్పటికి **నా అభిప్రాయంలో ఒక ప్రక్క ఈ చదువులన్నీ పొట్టకూటి చదువులు అంత ముఖ్యమైనవి కావు. భగవంతుని మన పూజ పారాయణతో మెప్పించాలని**. మరొక ప్రక్క పాల్వంచ కాలేజీ అంత పెద్ద కాలేజీ కాదు ఇక్కడ

చదవటం గాక ఒక సంవత్సరం కష్టపడి IIT కి ప్రిపేర్ అవ్వాలని. ఒక సరైన అవగాహనలేని ఈ రెండు అభిప్రాయలతో ఉన్నాను. మా నాన్నగారు EAMCETలో సీట్ వస్తే శ్రీ వెంకయ్య స్వామి వద్ద నిద్ర చేస్తామన్న మ్రొక్కుననుసరించి గొలగమూడి వచ్చి మూడు నిద్రలు చేసాము. అప్పుడు నా శక్తి మేరకు స్వామిని ప్రార్థించి శ్రీ సుబ్బరామయ్య సార్‌తో పెద్దగా పరిచయం లేకున్నా శ్రీ సార్ ద్వారా నాకు అవసరమైన సందేశం (నా దృష్టిలో ఆధ్యాత్మిక సాధనకు ఉన్నతికి అవసరమైన సందేశం) ఇప్పించమని చెప్పుకుని తిరిగి ఇంటికి వచ్చే ముందు శ్రీ సార్‌ను కలిసాము. సార్ **"వెంకయ్యస్వామి నీకు పాల్వంచ engg కాలేజీ లో సీట్ ఇప్పించారు. కనుక ఆ పనిని టాప్ మోస్ట్‌గా క్షుణ్ణంగా ఆయనను మెప్పించేంతగా చేయటమే అయన (భగవంతుని) సేవ"** అని చెప్పారు. ఇది ఎంత చిత్రమో నాకప్పుడు అవగతం కాలేదు. నేననుకున్న ఆధ్యాత్మిక సందేశమో లేక IIT కోచింగ్ రెండూ ప్రక్కన పెట్టి ఇప్పుడు పాల్వంచ కాలేజీలో సీట్ ఇచ్చినది స్వామే అని చెప్పటం, స్వామి ఇచ్చిన దానిని ఆయనకు మెప్పించేలా చేయాలనే దివ్య సందేశం ఇచ్చారు.

కానీ అప్పటివరకు ఉన్న అలవాటు, అవగాహన అనుసరించి పాల్వంచ కాలేజీకి వెళ్లి చేరాక మాస్టారు రచించిన మరెందరో మహాత్ముల చరిత్రలెన్నో పాల్వంచ తీసుకు వెళ్ళాను. ఇంతలో శ్రీ సుబ్బరామయ్య సార్ నుండి నేను అడిగిన ఒక ఆధ్యాత్మిక సందేశానికి “నిష్కామ కర్మ శ్రీ అనంతాచార్యులు ఎలా చేసారు?” ప్రతిగా ఒక లెటర్ వచ్చింది. అందులో నా ప్రశ్నకు సమాధానమిస్తూ శ్రీ సార్ **“భగవంతుడు నీకు నిర్దేశించిన పని చదువును. నీ ఆశ్రమ ధర్మాన్ననుసరించి బ్రహ్మచర్యంతోనూ, ఇంద్రియ చాపల్యాలకు, చిరుతిండ్లకు దూరంగా ఉండి ఆచరిస్తే లక్ష్యసిద్ధి కుదురుతుందనీ, మొహమాటాలకు లొంగక బురదలో లాగే ఫ్రెండ్స్ నుండీ దూరంగా ఉంటూ చక్కని చదువునే ముఖ్య పూజగా సాధించి ఆ విద్య ద్వారా నిష్కామ కర్మ చేయమని”** వ్రాసారు. నేను కోరకనే నా జీవితానికి తగ్గ సందేశాన్ని ప్రసాదించారు.

అప్పటినుండి నాకు తెలియకనే నేను సార్ లెటర్స్‌లను పారాయణలా మరలా మరలా చదువుకుని జీర్ణించుకుని ఆచరించాలనే బుద్ధి కలిగించారు. అందులో వచ్చే ఒడుదుడుకులను కూడా తన అద్భుతమైన శైలిలో భౌతికంగా వాచా బోధ ద్వారా, లెటర్స్ ద్వారా,

సర్వజ్ఞత్వ, సర్వవ్యాపక, సర్వసమర్థులైన సద్గురువుగా సందేశం, ఆత్మ పరివర్తన ద్వారా సరిచేసేవారు. అందుకు కొన్ని ఉదాహరణలు:

లెటర్ల ద్వారా విద్యార్థి లక్షణాలు గూర్చి, బ్రహ్మచర్యం గూర్చి వ్రాస్తుండటం, భగవంతుడు ఇచ్చిన పనిని శక్తినంతా వినియోగించి చేయటం ముఖ్యంగా నాకు ఎంతగానో చదువుపై మిగిలిన సమయంలో భగవంతునిపై మనస్సు నిలిచేది. శ్రీ సార్ లెటర్లు మంత్రాలుగా పనిచేసేవి.

2000సం॥లో ఆసనాలు వేయటం కూడా శారీరక, మానసిక ఆరోగ్యాలకు అవసరం అని వ్రాసారు. ఇవి నాచే శ్రీ సార్ పాటింప చేసిన విధం చిత్రంగా ఉంది. ఒకసారి గొలగమూడికి వెళ్ళినప్పుడు మా అన్నయ్యకు ఆరోగ్యరీత్యా వాటిని నేర్పుతూ నాకూ వాటిని వేసి చూపించారు. వివరంగా ఒక అనుభవజ్ఞుడు వేసి చూపించే అవకాశం కల్పించి నేర్పించారు. ఇవి పాటించటంలో అవకతవకలను కూడా సార్ సరిదిద్దేవారు. ఒకసారి ఎగ్జామ్స్ అని ఆసనాలు మానేద్దామనుకున్న తరుణంలో నా ప్రమేయం లేకుండా “శివ! ఆసనాలు సాధనలో, చదువులో కూడా భాగమే. అవి మానవద్దు'' అని లెటర్ వచ్చింది.

అలానే శ్రీ సార్ ఆహారనియమం గూర్చి కూడా గొలగమూడి వెళ్ళినప్పుడు శ్రీ రామకృష్ణ పరమహంసకు గిన్నె తాకినంతనే వండిన వారి సంస్కారాలు ఇబ్బంది కలిగించినట్లు చెప్పి చూచిన వారి సంస్కారాల నుండి బయటపడాలంటే "నీవే వండుకు తినాలని" చెప్పారు. అలా నేను వండుకోవటం మొదలుపెట్టిన తర్వాత ఎప్పుడైనా మెస్‌లో తిన్నప్పుడో, బయటకు వెళ్లి తిన్నప్పుడో, నా ఆలోచనల్లోనూ, నా శారీరక, మానసిక చురుకుదనంలోనూ బాహ్య పరిస్థితులలో కూడా తేడా వచ్చేది. అంటే మాంద్యంగా ఉండటం, అప్పటివరకు రాని, అక్కరలేని ఆలోచనలు రావటం. ఎవరో సంబంధం లేని వాళ్ళు పనులు, అనవసర కాలక్షేపాలు మొ||వి. ఇవి శ్రీ సార్‌కు విన్నవిస్తే సార్ 2001లో వివరంగా సార్ తనకు శ్రీ సుధీంద్రబాబుగారు ఇచ్చిన సందేశాన్ని, స్వామి ఇచ్చిన ఆహారనియమాన్ని, దాన్ని ఎన్ని కష్టాలు ఓర్చి పాటించే విధానాన్ని, దాని విలువను ఎంతో వివరంగా వ్రాసారు. మరియు నేను స్వయంగా వండుకు తినే ఆహారనియమం ఇతరుల కామెంట్స్‌లను లెక్కచేయక పాటిస్తే భగవంతుడు మనకిచ్చిన అనుభవాన్ని స్థితిని నిలుపుకోగలమని వ్రాసారు.

వాచా చెప్పటమే కాక లెటర్ ద్వారా నా ఆచరణలోని నిర్లక్ష్యాన్ని కానీ, చపలతను, బలహీనతను కానీ దివ్యంగా సరిచేసేవారు. ఒకసారి ఒక ఫంక్షన్లో అందరూ వండినవి తిని వేరే సందర్భంలో తినదలచుకుంటే శ్రీ సార్ నుండి అనూహ్యంగా ఫోన్ వచ్చింది. మొదటి ప్రశ్న: ఎక్కడ ఉన్నావు? అన్నం ఏమి చేస్తున్నావనే? ఇలా సార్ సర్వజ్ఞత్వంతో హెచ్చరించి ఆ సర్వసమర్ధుడు నా జీవితానికి, లక్ష్యశుద్ధికి తగ్గ నియమపాలన చేయిస్తూ "పోవాలన్నా పోనివ్వకుండా రక్షిస్తానన్న" తన మాటను నిలపుకుంటున్నారు.

అలాగే శ్రీ సార్ లెటర్లు నాకు వచ్చిన ఎంతో స్వల్ప మనోభావాలకు కూడా సమాధానాలుగా నిలిచేవి. ఒకసారి భగవంతుడు, మహనీయులు స్వప్న సందేశం ఇంకెన్నో అనుభవాలు ఇస్తున్న భౌతిక దర్శనం ప్రసాదించ లేదనుకుంటే మరురోజు శ్రీ సార్ లెటర్లో "మహనీయుల స్వప్న దర్శనం భౌతిక దర్శనంతో సమానం. వేరుకాదు" అని వ్రాసారు. శ్రీ సార్ ఎంతో casualగా మాములుగా ఇచ్చిన సలహాలే ఎంతో భవిష్యత్తును సూచించే సందేశాలుగా, వణికి సంబంధించిన హెచ్చరికలు సూచనలుగా ఉండేవి. ఒకసారి కుంగ్-ఫూ నేర్చుకుంటే బాల్యం నుండి ఉన్న

కృత్రిమ బిగింపులు తొలగుతాయని మాస్టర్ వ్రాసినది గురించి సార్‌ను అడిగితే “కుంగ్-ఫూ నేర్చుకుంటే నేర్చుకున్నావు కానీ, నలుగురులోకి వెళితే భ్రష్టుడవవుతావు” అని హెచ్చరించారు. తరువాత ఆసనాలు దానికి ప్రత్యామ్నాయంగా సూచించారు. ఒకసారి సెలవులకు ముందు గొలగమూడి దర్శించి సార్‌కు వెళ్లి వస్తానని చెబుతుండగా చేతులు పట్టుకొని మరీ “నలుగుర్లోకి వెళ్ళకు స్వామి” అని హెచ్చరించారు. చుట్టాలే కదా అని సెలవులకు ఏదో ఫంక్షన్‌కు వెళ్లి వారం పది రోజులు అక్కడ గడిపితే అనారోగ్యం పాలై కొన్నాళ్ళు బెడ్-రిడ్డెన్ అవ్వాల్సి వచ్చింది. అ తరుణంలో నా ప్రమేయం, ప్రస్తావన ఏమీ లేకనే శ్రీ సార్ “ఏమి బెంబేలు పడవద్దు. కొండంతను గోరంతలో అనుభవింప చేసి రక్షిస్తారు” అని లెటర్లో స్పెషల్ నోట్ క్రింద వ్రాసారు. సార్ లాంటి సద్గురుని ద్వారా వచ్చే సూచనలు ఎంతటి మహత్తరమైనవో కొంతైనా అర్థమైంది.

అలానే మరోసారి శ్రీ సార్‌ను దర్శించుకున్నప్పుడు సార్ తమకు వరసగా వచ్చిన కొన్ని శారీరక ఇబ్బందులు చెప్పి కాళ్ళు పడతానంటే పట్టించుకున్నారు. అప్పట్లో సార్ ఎవరినీ అలా తాకనిచ్చేవారు కాదు. తరువాత నిజానికి ఆ ఇబ్బందులు

అదే క్రమంలో నాకే వచ్చి సులభంగా తొలగింపబడ్డాయి. మనకు వచ్చే ఇబ్బందులు అనుభవాలు తన పరంగా చెప్పుకొని భరించటం, కొండంతను గోరంతగా తప్పించటం శ్రీ సార్ ఎన్నో విషయాల్లోనూ చేయటం మరికొందరికి కూడా అనుభవం.

అలానే శ్రీ సార్ భరద్వాజ మాస్టారి వద్ద సత్సంగం వినటం కన్నా సేవ ఎక్కువ చేసేవారని చెప్పినవి సత్సంగంలో విని ఒకసారి సార్ వద్దకు వెళుతూనే శ్రీ సార్ ఏదైనా నెల్లూరు వెళ్ళే పని చెపితే సేవగా చేయవచ్చు, సార్ నెల్లూరుకు వెళ్లారు గదా! అని అనుకుని గొలగమూడిలో దిగి కాళ్ళు కడుక్కుంటుంటే సార్ వెనుక నుండి నుంచుని చూస్తూ కనపడి "ఏం శివా! నెల్లూరు వెళతావా?" అని అన్నారు. నేను సార్ సర్వజ్ఞత్వం గుర్తించి నవ్వితే సార్ "నువ్వు భలే ఇంజనీర్ వయ్యా!" అని పని చెప్పారు.

శ్రీ సార్ ఒకసారి టేప్ రికార్డర్ ఆన్ చేసావా అని అడిగి "నలుగురులోకి వెళితే చిత్తం పెద్దదయి ఏకాగ్రత పోయి చెప్పుడు మాటలు విని శ్రీ స్వామి సేవకు ఇచ్చిన పనికి చదువుకు అన్-ఫిట్ అవుతామని చెప్పి శ్రీ స్వామిని ఎలా సేవించుకోవాలో కూడా సూచనగా" చెప్పారు. అప్పుడే నేను ఒక ఫంక్షన్‌కు వెళ్ళాలా వద్దా అని

ఆలోచిస్తుండగా ఈ సందేశం చెప్పి గుర్తింప జేయడంతో విరమించుకొన్నాను.

శ్రీ సార్ ఇచ్చిన ఈ శిక్షణను అనుగ్రహము ఆశీస్సుల వల్ల మాత్రమే నాకు ఎంతో చిన్న కాలేజీలో చదివినా IISc లాంటి కాలేజీలోM.S. సీట్ రావటం, అచ్చట కూడా ఇది స్వామి శ్రీ సార్ ఏర్పరచిన నియమపాలన అనుగ్రహమేనని తెలపటం, చక్కగా ఎన్నో విధాల అనుభవాలిస్తూ నడపటం చేస్తున్నారు. IISc లో కూడా చాలా చిత్రంగా ఆహారనియమం పాటించారు. హాస్టల్ లో వండుకో కూడదనే రూల్ ఉంది. శ్రీ సార్ సూచన అనుసరించి హెడ్ of ఇన్స్టిట్యూట్ కు విన్నవిస్తే అయన వ్యతిరేకించకుండటం, అచ్చట సత్సంగం ప్రసాదించటం, అలాగే శ్రీ స్వామిపై Ph.D. కి కూడా ఆధారపడేటట్లు చేయటం అన్నీ భగవంతుని కృపే. ఒకసారి Ph.D. ఆలోచనకు ముందు M.S. అయ్యాక నెల్లూరులో లెక్చరర్ జాబు చేస్తానంటే సార్ “స్వామి Ph.D. చేయించ దలచుకుంటే నీవేమి చేస్తావనటం”.

అలాగే Ph.D. అయ్యాక పోస్ట్ డాక్‌కు అప్లై చేస్తుంటే ఏమీ ఇంకా రాకున్నప్పుడే మా అన్నయ్యతో వరల్డ్ టాప్ యూనివర్సిటీలో వస్తుందని చెప్పి హార్వర్డ్ యూనివర్సిటీలో ఇప్పించటం. శ్రీ సార్ సూచించిన

విధంగా విద్య ద్వారా నిష్కామ కర్మ, విశ్వ గురు సేవ చేసుకొనుటకు శ్రీ సార్ ఏర్పరచిన అద్భుత, అనూహ్యా వసతులు, సానుకూలాలు. Ph.D.లో సీట్, చదువులలో శ్రీ సార్ నడిపిన విధం "నమ్మితే సొమ్ము- నమ్మకుంటే దుమ్ము" పుస్తకం లో చూడవచ్చు. శ్రీ సార్ పెట్టిన బోధ, అనుభవ, సానుకూల, పరిస్థితుల భిక్షను సద్వినియోగం చేసుకునేలా సార్ కోరిన విధంగా విద్య ద్వారా నిష్కామ కర్మను, సంపూర్ణ శరణాగతిని సాధించగల్గేలా నడిపించమని ప్రార్థిస్తున్నాను.

గొర్తి సాయి శివ

సాయి శివ చేత సార్ చేయించిన అద్వితీయమైన ప్రజా శ్రేయస్సుకు ఉపయోగపడే పనుల్లో కొన్ని ఇక్కడ పొందుపరచాము

1. Ph.D. చేసేటప్పుడు శివకి వచ్చిన ఐడియాస్ తో మరో ముగ్గురి Ph.D. లు జరగటం
2. Ph.D. లో చేరిన తర్వాత తన ముందర సీనియర్ 20 పేపర్స్ వ్రాసాడు సార్ అని చెబితే "వెంకయ్యస్వామి ఏమన్నా తక్కువ వాడా? నీ చేత అంతకంటే ఎక్కువ పేపర్స్ వ్రాయిస్తారని"

చెప్పారు. అలానే దాదాపు 40 పైన పేపర్స్ వ్రాయటం జరిగింది

3. హార్వర్డ్ యూనివర్సిటీ లో పోస్ట్ డాక్ చేస్తున్నప్పుడు హ్యూమన్ బ్లడ్ సెల్స్ డైమెన్షన్స్ కనుక్కోవటం
4. ఒక చిన్న డ్రాప్ of బ్లడ్ తో రక్త పరీక్ష పూర్తి చేయవచ్చని, మలేరియాను గుర్తించటం తెలుస్కోవటం ద్వారా శివని విశ్వగురు సేవకు ఉన్ముఖం గావించటం.
5. హార్వర్డ్ నుండి ఇండియా IISc లో ఉద్యోగం ప్రయత్నం చేస్తున్నాను అంటే సార్ “నీ సేవలు ఇండియా కి కావాలి” అని చెప్పారు
6. రక్త పరీక్ష చేసుకోవటానికి ఎన్నో కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన గ్రామ ప్రజలకు, వారు తమ ఇంటిలోనే ఉండి పరీక్ష చేసుకునే ఒక మొబైల్ ఫోన్ అంతటి పరికరాన్ని డిజైన్ చేయటం.
7. దాన్ని ప్రతి ఒక్కరికీ అందేవరకు చేర్చాలని దానికి శ్రమ అయినా అవసరమని IISc అనుబంధంగా ఒక కంపెనీ పెట్టించారు. దానికి

కావలసిన ఆర్థిక, మానవ వనరులను కల్పించటం.

****** సద్గురు దేవా శరణం శరణం ******

# G. సాయి సుబ్రహ్మణ్యం

G. సాయి సుబ్రహ్మణ్యం (తిరుపతి), శ్రీ సుబ్బరామయ్య సార్‌తో తనకు గల అనుబంధాన్ని ఇలా పంచు కొంటున్నాడు.

## ● గురు పరిచయం :

నా చిన్నతనంలో open heart surgey అయిన తరువాత వైద్య సదుపాయం లేని ఒక పల్లెటూరులో ఉండేవారము. ఆ సమయంలో ఒకసారి నాకు కల్గిన తీవ్ర అస్వస్థత (కండ్లు తేల వేయడం) బాబా దయ వల్ల నయం కావటంతో మా నాన్నగారైన శ్రీ రామశాస్త్రికి, మా అమ్మ గారైన శ్రీమతి లక్ష్మిగారికి బాబాపై విశ్వాసం కల్గింది. శ్రీ భరద్వాజ మాస్టర్ వ్రాసిన సాయి లీలామృతం ద్వారా, ఆరతుల ద్వారా బాబాను ప్రార్థిస్తున్న వారికి శ్రీ భరద్వాజ మాస్టారి దర్శనమప్పుడు “సత్సంగం చేసుకోమన్న” సందేశం లభించింది. దానిని ఆచరింప చేసే పరిస్థితులు కల్పించి నిత్య సత్సంగం అలవాటు అవటం జరిగింది. నాకు ఎంసెట్‌లో ర్యాంకు వచ్చి engineering లో seat

వచ్చినప్పుడు మా నాన్నగారు శ్రీ వెంకయ్య స్వామి వారి సన్నిధి దర్శించుకొని 3 నిద్రలు చేయాలనే మొక్కుతో నాకు ప్రథమంగా శ్రీ స్వామి సమాధి దర్శనం, శ్రీ సుబ్బరామయ్య సార్ భౌతిక దర్శనం లభించాయి.

అప్పటికే (1996 సం||) శ్రీ సార్ గొలగమూడిలో వెంకయ్యస్వామి సమాధిమందిరం ప్రక్క ఇంట్లో ఉంటూ సార్ రూం స్టోర్ రూమ్ గాను, సత్సంగ మందిరంగాను కూడా చేసిన రోజులవి. మా అమ్మగారు నిత్య సత్సంగం చేసుకోవటం శ్రీ సార్ ఎంతో ప్రోత్సహిస్తూ సార్ వద్ద ఉన్న ధ్యానయోగ సర్వస్వం వ్రాతపత్రిలోని విషయాలు, మాస్టారి మంచిమాట వ్రాతప్రతి విషయాలు వివరించే రోజులవి. సార్‌కు నేను హైదరాబాదులో వుండగా 1999సం|| లో వ్రాసిన letterలో శ్రీ నాంపల్లి బాబా గారి సన్నిధిని ఎలా సద్వినియోగం చేసుకోవాలని వ్రాసిన మొదటి letterకు ప్రత్యుత్తరంగా బాబా మన పరికరం(మనస్సు) మంచిది, పదునైనది అయితేనే విశ్వం రూపంలోని గురుసేవ చేయగలం, వారి సన్నిధిలో మౌనంగా మనసు నిలుపుతూ చేయవలసిన ప్రార్థన, కర్తవ్యం, నాలో ముఖ్యంగా రావలసిన మార్పు అని చెప్పారు (ఆ letter ఇచ్చుట మొదటి letter గా జతపరచటమైనది).

- **సద్గురు దరికి చేర్చుకోవటం (పులి నోట బడ్డ వేట):**

బెంగుళూరు లోచదువుకుంటూ గొలగమూడి వచ్చిన తొలి సందర్భాలలోనే 2001లో నాకు శ్రీ సార్ గొప్పదనం ఏమాత్రం తెలియకున్నా నేనెవరితో ప్రస్తావించని నా బలహీనతల వలన పడే బాధలను శ్రీ సారుకు విన్నవించుకోనేలా (అంతఃప్రేరణ ద్వారా) చేయించారు. అదే సార్ భోధనా విధానమని తరువాత తెలిసింది. అది నాకు ఇప్పటికి ఆశ్చర్యమే! నా చదువులో వచ్చే ఆ ఇబ్బందికి వాచా అతి స్వల్పంగా చెప్పినా నాచే చివటం అమ్మ, సుధీంద్రబాబు గార్ల రూపాలలోని దైవానికి నివేదించుకొనేల చేసి ఆ వ్యామోహం తాత్కాలికంగా అయినా ఇబ్బంది కాకుండా చేసి దివ్యంగా అతి తక్కువ సమయంలో నాచే నా మాస్టర్ డిగ్రీ చేయించారు. బెంగుళూరులో చదువుకోనేటపుడు నేను వ్రాసిన 3 నుంచి 5 పేజీల ఉత్తరాలను ఎంతో శ్రద్ధగా చదివి నాకు చెప్పవలసిన విషయాలు underline లు చేసి నేను గొలగమూడి వచ్చినపుడు ఎంతో సమయం వారి సాంగత్యం ప్రసాదించి వివరించటమే కాక దానికి అనువైన పరిస్థితులు కల్పించి చేయించేవారు. (ఆకాలంలో(2002 సం||) పెద్దగా సార్‌కు నేను

పరిచయం లేకున్నా సార్ వ్రాసిన ప్రత్యుత్తరంలో నా సంస్కారానికి తగ్గ సందేశం ఫ్యూచర్ లో వచ్చే ఇబ్బందితో సహా వ్రాసి అందించే వారు. నేను అలా నడుచుకోలేకున్నా ప్రత్యామ్నాయ మార్గాలను వారే ఏర్పరిచి జరిపించేవారు). అలా ఒక రకమైన ప్రేమ పాశంతో నన్ను మొదటగా హరించారు. ఉదాహరణకు ఈ letter తరువాత ఇండస్ట్రియల్ job లో join అయిన తరువాత నాలో వచ్చే (శారీరక, మానసిక) ఇబ్బందులు వస్తే గుర్తిస్తూ అనారోగ్యం వచ్చే సమయానికి మా నాన్నగారికి letter వ్రాసి మా అమ్మగారు ఉంటే నాకు కొంత బాగుంటుందని మా అమ్మ గారు బెంగుళూరు వచ్చేలా చేసారు. నాకు అరుగుదల లేకపోవటం, కండ్లు తిరగటం మొదలగు వచ్చినా బెంబేలు పడనవసరం లేకుండా గొలగమూడి రప్పించుకున్నారు, తరువాత నా మనస్తత్వానికి సరిపడ P. hD కి పంపించారు. అది చిత్రంగా జరిగింది. ఒకసారి గొలగమూడికి వచ్చి వెళుతుండగా వెళ్ళేముందు శ్రీ సార్ "సాయి! వెళ్ళాక నీ ఆరోగ్యం ఎలా ఉందో letter వ్రాయి" అని అంతలోనే సవరించుకొని "నీవు ఎలాగు 15 రోజులలో వస్తావు" కదా అన్నారు. అప్పటి నుండి సరిగ్గా 14 రోజులకు ఆఫీస్ నుండి సాయంత్రం ఇంటికొచ్చేటప్పటికి

UNCONSIOUS అయి తరువాత రోజు (15వరోజు) అమ్మ, నేను గొలగమూడి రావటం, అప్పటి నుండి కొద్ది నెలలు సార్, స్వామి సాంగత్యంలోనే ఉండటం జరిగింది.

- **నా చేత సార్ చేయించిన "గురువుపై ఆధారపడే మార్గాలు" :**

శ్రీ సార్ నాచే వారిపై, భగవంతుడిపై ఆధారపడేలా చేయటం చాలా చిత్రంగాను, వివిధ సందర్భాలలో వివిధ రీతులలోనూ జరిగింది. గొలగమూడిలో ఉన్న ఒక సందర్భంలో phd చేసే అవకాశం ఉందని బెంగుళూరు నేను చదివిన కాలేజీ నుండి letter, విద్యానగర్ lecturer interview కు రమ్మని ఇంకో letter ఒకేసారి రాగా సార్ మనం own decisions తీసుకోరాదని స్వామి వద్ద చీటీలు వేయించారు. చీటీలు వేయబోతుంటే ఏమి వ్రాశావు అని అడిగారు. 1) PhD చేయమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ 2) విద్యానగర్ లెక్చరర్ job ఇంటర్వ్యూ కి వెళ్ళమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ అని చెబితే సార్ "స్వామివారికి ఏమి option ఇవ్వవా?" అన్నారు. "ఇంకొన్ని రోజులు ఇచ్చటనే ఉండమని" అని అంటే Right అన్నారు. **చీటిలు** స్వామి సమాధిపై వుంచి ప్రదక్షిణలు

చేయమన్నారు. phd చేయమని చీటివస్తే phdకి apply చేయించారు. కాని మరోసారి phd అయిపోయిన తరువాత గొలగమూడిలో ఉండాలన్న ప్రేరణ శ్రీసార్ ఇచ్చినదే అయినా ఏ collegeలో చేరాలన్న విషయం వచ్చినప్పుడు **దీక్ష చేస్తే** స్వామి చెబుతారు 7 రోజులు దీక్ష చేయి అన్నారు. 7 రోజులు సాధ్యమైనంత సమయం స్వామి గుడిలో వుండటం చేసిన తరువాత ఏమి సందేశం రాలేదు. 8 వ రోజు ఉదయం సార్ వద్దే కూర్చొన్నాను. సార్ "ఏమి స్వామి? ఇంకా గుడికి పోలేదు? అన్నారు. 7 రోజులు అయి పోయింది సార్ అంటే ఇదే మన్నా వంకాయల బేరమా స్వామి సందేశం ఇచ్చే దాకా చేయవలసిందనే అన్నారు. నేను ఒక రకమైన బాధ, రోషంతోనే నేరుగా గుడికి వెళ్లి "స్వామి! నన్ను సార్ పంపించారు. వచ్చాను. నీవు సందేశం ఇస్తావని పంపారు. (మీ ఇద్దరు చూసుకోండి అన్నట్లుగా) నాకేమి తెలియదు" అని ప్రార్ధిస్తునో (దెప్పుతోనో తిరిగాను). ఆ రోజు రాత్రి స్వామికి బదులు శ్రీ సార్ కలలోకనపడి "Quba engineering collegeలో చేరితే నాకిష్టమయ్యా" అని ఆదేశించి భగవంతుడిని పిలిస్తే పలుకుతాడన్న విశ్వాసం కల్గించారు. పెండ్లి విషయంలో **ఆత్మ ప్రేరణ**ద్వారా "భార్య, అత్తగారు మాత్రమే వండితే

తినే" నియమంపెట్టుకునేలా చేసి దానిని ప్రోత్సహించేవారు.

- **సంస్కారాల మార్పు అనుభవైక వైద్యం:**
    - అసలు నా ఆరోగ్యంకి బయట తింటుంటే ఇబ్బంది అని తెలిసేలా చేసినా అది పాటించ లేకుంటే ఎన్నో అనుభవాలిచ్చినా సంస్కారాన్ని మార్చి దానిని సంతోషంగా పాటింపచేసారు. శ్రీ సార్ గొప్పదనాన్ని నాకు తెలిపేలా చేసిన, నా చేత సంతోషంగా వారి మాట పాటింపజేయుటకు సార్ ప్రసాదించిన కొన్ని దివ్యానుభావాలు:
    - Phd లో join అయ్యాక ఆహారం నిర్ణీత సమయంలో తీసుకునే అలవాటు లేక, weekends లో ఏమి చేయాలో తొచక గొలగమూడి వస్తుంటే సార్ నన్నుIIT MADRAS HIGHER AUTHORITIES కు నా heart operation గూర్చి చెప్పి quarters అడగమని చెప్పారు. అలా అడిగితే special case క్రింద consider చేసి quarters ఇప్పించారు. అందువల్ల మా అమ్మగారు నాతో

ఉండి వండి పెడుతుండటం, అచ్చట సత్సంగం లభించాయి.

- ఇంకా అనారోగ్యంగా ఉన్న ఆ సమయంలో ఒకసారి స్వామి వద్ద exam దగ్గర పడింది నీవే ఎలా స్థిమిత పరుస్తావో అని ప్రార్థించుకొని వచ్చిన వెంటనే చెక్క పని చేయిస్తున్న శ్రీ సార్ "sit quite I will do the needful" అని మూడు సార్లు జరిగే(చెక్క) పనితో(మాటల) సందర్భం లేకుండా నా మనః పరిస్థితిని స్థిమిత పరిచారు. సార్‌కు నా ఎగ్జామ్ విషయం కాని, గ్రేడ్ల విషయం కాని, మానసికపరిస్థితి కాని వాచా నేను చెప్పింది లేదు. వెళ్ళేటప్పుడు ఒక బుద్ధి, మనస్సుకు అతీతమైన సత్సంగం, వారి సన్నిధి, కృపతో నా మనస్సు ఎంతో స్వస్థపరిచి "S" అని పంపించారు. ఎంతో కష్టమైన ఎగ్జామ్స్, top competition లో సైతం, జావ మాత్రమే త్రాగి ఉండే శారీరిక అస్వస్థతలో, చదువుకు సమయం వెచ్చించలేని స్థితిలో వున్నావారనుగ్రహించిన మానసిక ప్రశాంతతో మన ఊహనందనంతగా top గ్రేడ్ (S) వచ్చింది. అలా సార్ సర్వజ్ఞులు సర్వ

సమర్ధులుగా అప్పటి ఎన్నో సన్నివేశాల్లో నేను వ్యక్తం చేయకుండానే, నా బాహ్య ఆరోగ్య పరిస్థితితో సంబంధం లేకుండానే జరిపించడంవల్ల average మార్కుల్లో పాస్ కావటం కష్టమైన ఆ సమయంలో టాప్ మార్కులతో course work చేయించారు.

- మరోసారి నేను ఇప్పుడు వెళ్లి ఏమి చదవలేనని చెప్పుకుంటే సార్ స్వామికి ప్రదక్షిణలు చేయమన్నారు. మధ్యాహ్నం హారతి అయ్యాక వెళుతూ చేసావా అని అడిగారు. మా అమ్మగారు నేను చేసాననుకొని చేశాడు అంటే సార్ "ఏం చేశాడు అటు, ఇటు తిరుగుతున్నాడు" అన్నారు. నిజానికి నేను ప్రదక్షిణలు చేస్తూ మధ్యలో సార్‌కు ఏదో ఏదో చెప్పుకోవాలని సగం దూరం వచ్చి మరల తిడతారని భయమేసి వెనకకు వెళ్లాను. మనం చేసేవి చూసి సరిచేసే సర్వ సాక్షి వారు.
- మరోసారి **దర్గాస్వామి** వారు గొలగమూడి వస్తే స్వామిని దర్శించుకొన్నావా అని నన్నడిగారు. లేదు సార్ అంటే **నడు! నిన్ను స్వామి దండం (కఱ్ఱ) పెట్టి కొట్టించాలి** అన్నారు. నన్ను

దర్గాస్వామి దర్శనానికి తీసుకువెళ్లి స్వామితో సాయికి అనారోగ్యంగా ఉంది అన్నారు. శ్రీ దర్గాస్వామి దండం పెట్టి శిరస్సుపై కొట్టి **భగవంతుని గుర్తిస్తే శరీరంలో అనారోగ్యం ఉండదు. "ఆలోచనలే అనారోగ్యం అతనికి"** అన్నారు. సార్ నన్ను బయటకు తీసుకు వచ్చి ఆలోచనలు తీసేసుకోమంటున్నారు అని చెప్పారు. నా అజ్ఞాన, అహంకారాలకి ప్రతీకలైన ఆలోచనలు పలుచబడి శరణాగతి చేయించుకోవటమే, ఈ ఇద్దరి మహాత్ముల ఆంతర్యం(అదిఒక్కటే) అనిపిస్తోంది.

- ఒకసారి మద్రాసులో fashion డ్రసులు వేసుకొని వెడుతున్న ఆడవాళ్ళను చూచి మనస్సులో భూతాలు కనబడ్డాయి అనుకున్నాను. ఆ తరువాత కొద్ది సమయానికి సార్‌కు ఫోన్ చేయగానే నేనేమీ చెప్పకున్నా "ఏం స్వామి భూతాలు కనబడ్డాయా" అన్నారు. నా (మన) తోడుగా వుండి ప్రతీ ఆలోచనను గుర్తిస్తున్న సర్వసాక్షే సార్ అన్న అనుభవాలు ప్రసాదించి **గుర్తించుకోమని** నన్ను హెచ్చరిస్తున్నారు.

- ఒకసారి నా భవిష్యత్తు గూర్చి నాకు గల భయాన్నింటికీ అభయంగా గొలగమూడిలో ఉందువు అన్న మాటకు ప్రతిగా ఒకటిన్నర సంవత్సరం శ్రీ సార్ సాంగత్యం గొలగమూడిలో లభించిన తరుణంలో కూడా శ్రీ సార్ ప్రేమ, దివ్యానుభవాలు బోధన దక్షత వ్యక్త మయ్యేవి. నేను గురువుగా భావిస్తుండగా కూడా శ్రీ సార్ నేను సాయంత్రం కాలేజీ నుండి వచ్చే సరికి ఆకుకూర ఎంతో పొందికగా వొలిచి నా రూమ్ లో వేసేవారు. ఆ భిక్షే నాకు ఆరోగ్యం ప్రసాదించింది. అప్పటి వరకు ఎన్ని చికిత్సలకు , ప్రయత్నాలకు లొంగని మలబద్దకం లేకుండా పోయింది. (బయట తినకుండా ఉండే) ఆహార నియమం కూడా సార్ సాంగత్యం వల్ల సంతోషము, క్రమబద్ధము అయింది.

- **శ్రీ సార్ వాత్సల్యం, సాధారణత్వం, చేయూత :**
  - శ్రీ సార్‌తో నిద్రించే అవకాశం కోసం ఆరు బయట సార్ మంచం ప్రక్క ఒకరోజు పడుకుంటే మరురోజు కల్లా ఒక మంచం ఎత్తు

అరుగు నిర్మాణం చేయించారు ఆ ప్రేమమయులు. ఎందరో ఆ సమయంలో సార్ కోసం వచ్చి సార్‌నే అడిగిన సందర్భాలు ఉన్నాయి. ఇంతటి సాదారణత్వం నరనరాల్లో జీర్ణించుకోవటం సార్‌కే చెల్లింది. నా కష్ట సమయాలన్నింటిలో, వ్యామోహాలకు లొంగిన ఎన్నో సందర్భాలలో కూడా శ్రీ సార్‌పై విశ్వాసం వల్ల మాత్రమే సంతోషంగా బయట పడేలా చేసారు. Phd సమయంలో 100కు పైగా letterలు వ్రాసి కర్తవ్య నిర్వహణ చేయించటం, ప్రతి శని, ఆది వారాలలో phone లో ఉదయం, సాయంత్రం మాట్లాడి వారి సాంగత్యం ఊరట కలిగించటం. Franceలో ఒంటరిగా ఉన్నప్పుడు సైతం రోజు మాట్లాడటమే కాక వారు నాతోనే ఉన్నారన్న అనుభవాలిచ్చి నడిపించటం వారికే చెల్లింది. శ్రీ సార్ ఆ సమయంలో ఒక ప్రక్క నుండి దైవంపై ఎరుక కల్గిస్తూ, మరో ప్రక్క సంస్కారాల మార్పు తెచ్చేలా వ్రాసిన letter మచ్చుకు ఒక్కటి ఈ సంచికలో 3 వ letter గా పొందు పరచటమైనది.

- ఫ్రాన్స్ లో ఉండగా క్రొత్త ఇంటికి మారిన ఒకరోజు పూజ చేసుకొని ఎవరైన సరే మహాత్ములు ఈ ఇంటికి రావాలని ప్రార్ధిస్తే సార్ ఫోటో అనూహ్యంగా మెయిల్ లో పూజ, ప్రార్ధన అవగానే రావటం వారి కృపను సర్వ ప్రేరణత్వాన్ని నాకు గుర్తింప చేస్తుంది.

- **సమాధి అనంతరం మార్గ దర్శకత్వం:**
  - శ్రీ సార్ సమాధి అనంతరం కూడా అదే రీతిన, ఇంకా ప్రస్ఫుటంగా నడిపిస్తున్నారు అనటానికి ఒక ఉదాహరణ చెప్పి ముగిస్తాను. సమాధి అయిన రోజు కార్యక్రమం అయ్యాక వెళ్ళుతూ trainలో సార్‌కు ఏదో చేయాలి అని సార్ ఉత్తమగతుల కోసం అన్న ఒక ఆలోచన వచ్చింది.
  - ఆ రోజు కలలో సార్ దివ్యంగా భౌతికంగా ఎప్పటి వలె మనందరితో పని చేయిస్తూ కనిపించారు. శ్రీ సార్‌కు ఉత్తమగతి గూర్చి కాదు సార్ ప్రార్ధనతో మన కృతజ్ఞతతో మనకుఉత్తమగతి శ్రేయస్సు గూర్చి అనిపించి చేయాలి అన్న సందేశం అనిపించి, మరు రోజు నుండి 3 పూటల నైవేద్యం పూజ (40 రోజులు

అనుకోని) ప్రారంభించాను. ఒక వారం తరువాత ఆఫీస్ పని మీద వేరే ఊరికి వెళ్ళినప్పుడు (శ్రద్ధ మరలి) ఉదయం నివేదన మర్చిపోయి వెళ్లి పోయాను. మరురోజు రాత్రి సార్ కలలో "ఒప్పుకున్న పని క్షుణ్ణంగా చేయి లేదా ఒప్పుకోకు" అంటూ దర్శనమిచ్చారు. మనం చేసేది చూస్తూ తప్పులు సవరించటమనే వారి కార్యం నిర్విరామంగా వారి భౌతిక జీవిత పర్యంతం కూడా సదా సాగుతుందని గుర్తింప చేస్తున్నారు.అలాగే మరోరోజు ఏదో విషయమై చర్చ వస్తే సార్ మా ఇంటి పూజ గదిలో "ఈ ఇంటి యజమానిని నేనే" అన్న రీతి కూర్చుని దర్శనమిచ్చారు.

- ఇట్టి మహనీయుని గూర్చి నా వంటి ఇంద్రియ లోలుడు ఏమి గ్రహించగలడు? వారి కృప వల్ల వారి సాంగత్యం, ఆశీస్సులు అనుభవాల రూపంలో letter ల రూపంలో నాలో తెచ్చిన మార్పుల రూపంలో కొంత వారి ప్రసాదం లభించింది. వారి ఆదేశాల మేరకు, సూచనల మేరకు నన్ను మలచమని హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. నాకు

ఎన్నో సంవత్సరములు అత్యద్భుతమైన వారి సాంగత్యం ప్రసాదించి, వారి దివ్య స్థితిని కొంతైనా ఎరుక పరుస్తూ నా అలవాట్లను, ఆరోగ్యాన్ని, ఆలోచనలను సవ్యమార్గంలో పెట్టి మార్గంలో నడిపిస్తూ చక్కటి ఉద్యోగాన్ని, పరిస్థితులను కల్పించిన శ్రీ సార్‌కు కృతజ్ఞతగా వారికి తృప్తి కల్గేలా జీవింప చేయమన్న ప్రార్థనను విన్నవిస్తున్నాను.

\- సాయి

# శివరత్నం

సార్ కృపతో తన ప్రారబ్ధ ప్రకారం వచ్చిన అలివికాని వ్యాధులను నిర్మూలన చేసుకున్న శివరత్నం తన అనుభవాలను ఇలా చెపుతున్నారు.

నా పేరు శివరత్నం. మాది సైదాపురం మండలం. కొర్లపాడు అనే పల్లెటూర్లో ఒక నిరుపేద కుటుంబం. మా నాన్నగారు నాకు 20సం||లు వచ్చేటప్పటికి మా నాన్నగారికి పెద్ద వయస్సు రావటం మా అన్న చదువుకు వ్యయం ఇలా ఉండగా ఎగ్జామ్ ఫీజు కట్టలేక MA ఎగ్జామ్స్ కూడా వ్రాయలేక పోయిన పరిస్థితి. అది 1997 వ సం|| ఇలా ఉండగా విద్యానగర్ లో శ్రీ

మాస్టర్ నిర్మించిన శ్రీ సాయిబాబా మందిర నిర్వహణకు ఒక విశ్వాస పాత్రుడైన గుమస్తా, మరియు మేనేజర్ కావలసి వచ్చి తెలిసిన వారు నన్ను రిఫర్ చేయగా నాకు బాబా ఆహ్వానం వచ్చింది. నేను ఆ భగవంతుని దయ వల్ల ఆ పనిలో నిమిత్తం శ్రీ సాయిబాబా విద్యానగర్ మందిరంలో పనిచేయుటకు ఒప్పుకుని వెళ్ళాను. అప్పటి నిర్వాహకులైన శ్రీ సూర్యనారాయణ గారు బాబా పనిలో ఉండవలసిన జాగ్రత్త హెచ్చరిస్తూ నా పర్సనల్‌వి వ్రాసుకోవటానికి ఆఫీస్ పెన్ వాడినా బాబా ఒప్పుకోరని చెప్పారు. ఈ సూర్యనారాయణ గారికి ఇదివరలో శ్రీ భరద్వాజ మాస్టారి పరిచయం వారి ఆశీస్సుల వల్ల షిర్డీ వెళ్ళటం అచ్చట సాయి అనుగ్రహం లభించటం జరిగింది. వారి మాటకు ధర్మానికి విలువ ఇస్తూ నేను అచ్చట మందిర నిర్వహణ నా శక్తి మేరకు స్వప్రయోజనాలకు వాడకుండా చేస్తుండేవాడని. శ్రీ మాష్టారి సాంగత్యం గల ఎందరో ఆ మందిరానికి రావటం వారందరి సాంగత్యం వల్ల శ్రీ భరద్వాజ మాష్టారి గొప్పదనం, అందరిలో బాబాను చూచి శ్రీ మాస్టర్ చేసిన సేవ, సహాయం నన్నెంతో ఆకట్టుకున్నాయి. శ్రీ మాస్టారు సేకరించిన మహాత్ముల చరిత్రలు చదువుతూ గడిపేవాడిని.

వానిలో యోగసాధన, ప్రాణాయామంకు సంబంధించిన పుస్తకం ఒకటి నన్ను ఎంతో ఆకట్టుకుంది. అది చదివిన వెంటనే నా మిత్రుడు ఒకరు యోగంలో MA పట్టా తీసుకుని రావటం అతను ఒక గురువుగారి యోగసాధన సూచనల CD ఇవ్వటం జరిగింది. ఆ ప్రకారం యోగాభ్యాసం చెస్తుండేవాడ్ని. ఆ యోగాభ్యాసం ఖాళీ కడుపుతో గానీ లేదా గోరు వెచ్చ నీటిలో కడుపు కొంత శుద్ధి అయ్యాక కానీ చేయాలి. ఒకరోజు అలా వీలుపడకనే శీర్షాసనం ప్రాణయామాలతో కూడిన ఆ యోగాభ్యాసం చేస్తుండగా శ్వాసక్రమం తప్పిపోయింది. ఎంతో భారమైంది. సహజంగా అందాల్సిన శ్వాస దానంతట అది అందకుండటంతో ఎంతో ప్రయాసగా పీల్చాల్సి రావటం, విపరీత భయం, దాని వల్ల అరుగుదల, నిద్ర మొ|| వానిలో ఇబ్బందులు ఇలా మొదలయ్యాయి. మాములు డాక్టర్ల నుండి ప్రముఖ డాక్టర్లను సంప్రదించినా వారు ఏమీ ఇబ్బంది లేదని చెప్పారు. కానీ నాకు మాత్రం చాలా ఇబ్బందీగా ఉండేది. ఇలా ఉండగా 1998లో శ్రీ రవికుమార్ గారితో కలిసి శ్రీ సుబ్బరామయ్య సార్‌ను దర్శించుకున్నాను. అంతకు కొద్ది ముందే శ్రీ సార్ వ్రాసిన “నాకు తెలిసిన మాస్టారు” (తక్కువ పేజీల మొదటి ముద్రణ) గ్రంథంలోని

మాష్టారితో అనుభవాలను, వారిగొప్పదన్నాన్నిచూచి ఎంతో పరవశించాను. సార్‌ను కూడా దర్శించుకోవాలన్న ఆరాటం కలిగింది. రవికుమార్ గారితో కలసి శ్రీ సార్‌ను దర్శించుకున్నప్పుడు సార్ ఒక సాధకులుగా కానీ, ఇంకా ఆధ్యాత్మికతలో పరిచయమున్న వారిగా కానీ అనిపించలేదు. శ్రీ సార్‌కు నేను ఏమీ నా బాధ చెప్పలేదు. సార్ నన్ను వారం వారం గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి వారి సన్నిధికి రమ్మని చెప్పారు. నేను casualగా సార్ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోయాను. తరువాత అప్పుడప్పుడు శ్రీ రవికుమార్ గారితో కలిసి గొలగమూడి వెళ్ళేవాడిని. సార్ అప్పట్లో దర్గా స్వామి గురించి చెప్పి దర్శించుకోమని చెప్పేవారు. నా బాధ ఆ తరుణంలో చాలా ఎక్కువగా ఉంది. శ్రీ సార్‌కు నా బాధ గురించి చెపితే శ్రీ దర్గాస్వామివారిని దర్శించుకోమన్నారు. శ్రీ దర్గా స్వామి దర్శనం చేసుకున్నప్పుడు స్వామి "ఎవరు పంపిస్తే వచ్చావని" అడిగితే నేనే వచ్చానని చెప్పాను. అ మాటకు స్వామికి చాలా కోపం వచ్చింది. వెంటనే నేను శ్రీ సుబ్బరామయ్య సార్ పంపారని, నాకు శ్వాస కృత్రిమమై భారమైనదని చెబితే స్వామి "శ్వాస ఒక ప్రవాహంలాంటిదని దానికి ఆనకట్టలు మనం వేయలేమని చెప్పి నీవు చావవని"

భరోసా ఇచ్చారు. నాకు అచ్చట కొద్దిగా ఊరట కలిగింది. కానీ నా భారం, బాధ మాత్రం తగ్గలేదు.

అప్పటికి విద్యానగర్ లోనే ఉండేవాడిని. ఆ సమయంలో తీవ్రమైన కరువు, అనావృష్టి ఏర్పడి పంటలకు ఎంతో నష్టం వాటిల్లడం వల్ల ఎంతోమంది అన్నానికి సైతం ఇబ్బంది పడటం జరిగింది. ఆ సమయంలో నాకు అందరికీ మేలుగా బాబా సేవగా ఏదో ఒకటి చేయాలనిపించింది. బియ్యం దొరకడమే ఇబ్బందిగా ఉన్న ఆ సమయంలో వర్తకులు బియ్యం రేటు కూడా మూడింతలు పెంచేసారు. నేను గూడూర్‌లో బియ్యం మిల్లులో తక్కువ ధరకు దొరికే బియ్యం అచ్చట కొని స్వయంగా తెచ్చి మా ఊరులో లాభం తీసుకోకుండా అమ్మటం గొప్ప సేవ అనిపించి సార్‌కి చెపితే 2000 రూపాయలు ఇచ్చి ఆ డబ్బు పెట్టుబడిగా పెట్టి ఆ పని ప్రారంభించమనటం అలా చేయగలగటం జరిగింది. అలాగే ఎన్నో మందిరాలు బీడుపట్టి ఉండటం బాధనిపించి సార్‌తో విన్నవిస్తే 116 రూపాయలు ఇచ్చి ఖర్చు చేయక పూజలో పెట్టి విరాళాలు సేకరించి ఆ మందిరాలలో దీపం పెట్టమంటే డబ్బు, బియ్యం, సరుకులు, సిమ్మెంటు, ఇసుక, రాళ్లు మొ|| రూపంలో విరాళాలు కొన్ని వేలు వచ్చాయి. దానితో సంతర్పణ

చేసిన రోజునే కుంభవృష్టి కురిసి అనావృష్టి తీరటం జరిగింది. ఇలా ఆర్జించిన పుణ్యం వల్లనేమో నాకు గురు దర్శనం కావాలని గురుచరిత్ర శ్రద్ధగా పారాయణ చేయగా శ్రీ సార్ కలలో దర్శన మిచ్చారు. ఇంక జాప్యం చేయక శ్రీ సార్ దగ్గరకు వచ్చి సార్‌కు సరండర్ అవ్వాలని సార్ దయతో ముందు నా శ్వాస అస్వస్థత తొలగించుకోవాలని సార్ వద్దకు వచ్చి చెప్పుకున్నాను. సార్ కొంత ధ్యానస్థమై "నీవు చనిపోవు" అని ప్రాంసరీ నోటు రాసిస్తాను అన్నారు. కొంత ధైర్యం వచ్చింది కానీ ఇంకా నా వ్యాధి తగ్గలేదు.

కొద్దిరోజులలో మరలా సార్ వద్దకు వచ్చి ఇంక మీరేమైనా చేయండి సార్ నేను ఈ రోగం మాత్రం భరించలేను అని విన్నవిస్తే సార్ 40 రోజులు వెంకయ్యస్వామి దీక్ష చేయమని గొలగమూడి దాటవద్దని దీక్ష సమయంలో ప్రదక్షిణలు చేయమని ఎన్ని గంటలు ప్రదక్షిణలు చేయాలో చీటిలువేయ మన్నారు. 5గంటలు ఒక చీటీ, 6గంటలు ఒక చీటీ, 7గంటలు ఒక చీటీ వేస్తే 5గంటలు ప్రదక్షిణలు చేయమని వచ్చింది. బ్రతుకు జీవుడా అనుకుని 5గంటలు ప్రదక్షిణలతో నా దీక్ష మొదలుపెట్టాను. కానీ నాకు ప్రదక్షిణలపై ఎట్టి విశ్వాసం లేదు. పైగా ఏవో ఆలోచనలతో చేసే ప్రదక్షిణల వల్ల నా

రోగం తగ్గదని శ్రీ సార్‌కు చెప్పడం కూడా జరిగింది. సార్ నీవన్నీ ఆలోచించకుండా ప్రదక్షిణలు చేయమన్నారు. ప్రదక్షిణలు చేస్తుండగా కొద్ది రోజుల తర్వాత ఒక అమ్మాయి నా కంటే ముందే తెల్లవారుజామున 2 గంటలు ప్రదక్షిణలు తడిబట్టలతో స్టార్ట్ చేసేది. నా ప్రదక్షిణలలో ఇంక "ఈ అమ్మయికి ఎంత శ్రద్ధ, ఇలాంటి అమ్మాయిని (ఈఅమ్మాయిని!) పెళ్లిచేసుకోవాలి" అని ఇలా ఆ అమ్మాయి గురించే ఆలోచనలన్నీ తిరుగుతుండేవి. నా శ్వాస ఇబ్బందికి చేస్తున్న సంగతి, శ్రీ వెంకయ్య స్వామి వారి సన్నిధిలో వున్న సంగతి, దీక్ష అనుకున్న సంగతి ఆ సమయంలో మరుగునపడ్డాయి! కొద్దిరోజుల తరువాత ఆ అమ్మాయి కనిపించడం మానేసింది. ఇంకా ఆ అమ్మాయి గురించే ఆలోచనలు. నాపరిస్థితి నాకే దారుణమనిపించింది. నేను ఇలా ప్రదక్షిణలు చేస్తే ఏమీ ఉపయోగం లేదనిపించి, సార్ ఒకసారి సైకిల్ మీద వెళ్లబోతుంటే handle పట్టుకుని, సార్! నా ఆలోచనలన్నీ ప్రదక్షిణలు చేస్తుంటే ఒక అమ్మాయి మీదే తిరుగుతున్నాయి. ఆ అమ్మాయిని పెళ్లిచేసుకుంటే బాగుంటుందని, అలా! ఇంక నా ప్రదక్షిణలు ఏమి ఉపయోగం అంటూ నా సంగతి తేల్చమని సార్‌ను demand చేశాను. సార్ - మన అభిప్రాయాలతో వాళ్ళ

భక్తిని ASSES చేసి పెళ్లి చేసుకుంటే ఎంత ఇబ్బంది పడాలో ఒకటి రెండు EXAMPLES చెప్పి, నువ్వు ముందు దీక్ష పూర్తి చెయ్. నాకు ఇవ్వన్నీ అనవసరం, చెప్పకు! అని విసురుగా చెప్పి వెళ్ళిపోయారు. అలా ఇంకా ప్రదక్షిణలు చేస్తుండగా 33 రోజులు కాగానే ఒక రోజు ఉదయం 9 గం. లకు స్వామి విగ్రహం ముందు కూర్చున్నపుడు ఏదో ప్రవాహంలా శ్వాస జల జల మని క్రిందకు జారి ఎంతో తేలిక అయింది. ఎంతో సంతోషంతో సార్ వద్దకు వచ్చి చెబితే సార్, స్వామితో 'స్వామి ఇదే ఇతనికి PERMANENT చేయండి. మరల ఇబ్బంది రాకుండా చేయండి' అని చెప్పారు అది 2000 సం. అప్పటి నుంచి మరల శ్వాస ప్రాబ్లెమ్ గాని మరల దాని వల్ల వచ్చే ఇతర ఇబ్బందులుగాని రాలేదు.

ఇంక ధృడంగా శ్రీ సార్, స్వామిల గొప్పదనం అనుభవమై, తెలిసి శ్రీ ఉపాసని బాబా 4.సం||లు. ఉండమంటేఉండకుండా వెళ్ళిపోయారు. నేను'సార్, స్వామి' లను వదలకుండా 4 సం|| లు అయినా ఉండాలని అనుకున్నాను. వారి సన్నిధి వదిలి వెళ్ళాలని కూడా అనిపించలేదు. సార్ "నాకు job లేదు, జీవనోపాధి ఎలా" అని విన్నవించుకుంటే ఒక గోతా పరుచుకుని, సార్ పుస్తకాలూ, మాష్టారు పుస్తకాలూ

పెట్టుకుని (ఎండలో) అమ్ముతూ ఉండమన్నారు. దానికి PERMISSION ఆశ్రమం వారి నుండి 'నేను నిరుద్యోగిని' అని చెప్పి తీసుకోమన్నారు. అలా చేయడానికి ఇబ్బందిగా నాకు నా పూర్వ వైభవం గుర్తు వచ్చింది. విద్యానగర్ లో సుఖంగా మందిరంలో గౌరవంగా జీవించడానికి, ఇక్కడ రోడ్డు మీద అమ్ముకోవడానికి ఎంత తేడానో, కష్టమో అనిపించింది. 3 రో||లు ఆలోచించాక సార్‌కు SURRENDER కావడం అంటే ఆయన చెప్పింది వినాలన్న గుర్తు, ఇది వరలో శ్రీ సార్ మాట వినటం వల్ల కల్గిన అద్భుత లాభం (అనుభవం)మననం చేసుకుని అలా పుస్తకాలు పెట్టి అమ్మడానికి ఒప్పుకున్నాను. శ్రీ సార్ చిత్రంగా ఇప్పుడు ఆ పని అవసరం లేదని, సార్ చేసే నిర్మాణాల పనులలోను ఇతర పనులలోను నన్ను పూర్తిగా నిమగ్నం చేసారు. ప్రైవేటు గా M.A. Telugu కూడా కట్టాను.

అక్కడ SAIMASTER NILAYAM కు వచ్చే భక్తుల సేవకు అవసరమైన పనుల్లో కూడా సార్ నాకు అవకాశం ఇచ్చారు. ప్రత్యేకంగాచెప్పుకోదగ్గ సేవ సాయిలక్ష్మి అనే ఆమె విషయం. ఆమెకు ఏదో అనారోగ్యం. వళ్ళంతా పొట్టుగా రావటం, మరెంతో అనారోగ్యంగాను ఉండేది. దానికి తప్పని సరిగా రోజూ

మందులు వాడాలని ఇంకెన్నో జాగ్రత్తలు చెప్పి ఇంక నయమవదని చెప్పారు. శ్రీ వెంకయ్యస్వామి వారి గొప్పదనం తెలిసి స్వామి కృపతో తగ్గుతుందని వచ్చి సాయిమాస్టర్ నిలయంలో వుంది. ఆమెకి స్వామి దయ వల్ల కొద్ది రోజులలోనే నయమయింది. సార్ ఆమెను స్వామి ఆదేశించే వరకు గొలగమూడి దాటి వెళ్ళవద్దన్నారు. కాని, ఆమె ఏదో కారణం వల్ల వెళ్లి, స్వామి సన్నిధికి వెంటనే రాలేదు. ఆ వ్యాధి మరల తిరగబెట్టి తీవ్రమయి ఇంక వేరే మార్గం లేక శ్రీ స్వామి స్వప్నంలో హెచ్చరిక, సార్ letter ల హెచ్చరికల మేరకు గొలగమూడి చేరింది. ఈసారి వెంటనే తగ్గక, వ్యాధిని భరించలేక, ఆత్మహత్య ప్రయత్నం చేసి మరింత ఇబ్బంది, తీవ్ర అనారోగ్యం తెచ్చుకుంది. కానీ శరీరంలో దుర్వాసన, వాపు మొ||వి వచ్చినా శ్రీసార్, ఆమెకు సాయిమాస్టర్ నిలయంలో ఆశ్రయం ఇచ్చి సేవ కూడా చేసేవారు. ఇంక వేరు దారి లేక నేను కూడా ఆమెకు అవసరమైన కొన్ని సేవలు ఎంతో ఇబ్బందిగా ఉన్నాచేయడం జరిగింది. అలా సార్ నన్ను స్వామిని ఆశ్రయించిన వారి సేవలో కూడా నన్ను వినియోగించేవారు.

ఇలా ఉండగా 2007 లో ఉద్యోగం గురించి ఆందోళన చెందుతున్న సమయంలో సార్‌తో ‘4 సం. లు అయ్యింది జాబ్ రాలేదు’ అంటే సార్ 6 సం. లు అవుతుంది అన్నారు (అలాగే కరెక్ట్ గా 6 సం|| తరువాత జాబు వచ్చింది). B.Ed. కి అప్లై చేస్తానని సార్‌కి చెబితే, చేయమని, డిగ్రీ certificate చేతుల్లో పట్టుకుని మరల తిరిగి రమ్మని చెప్పి B.Ed.చేయించారు. తరువాత M.Ed కూడా చేయించారు. తరువాత teacher ఉద్యోగం గొలగమూడిలోనే వచ్చింది. ఈ తరుణంలో ఒకసారి సాయి తో ‘శివరత్నం ఇంకా అటు ఇటు ఆలోచిస్తున్నాడు, కాని స్వామి గొలగమూడిలోనే స్థిరం చేస్తారు’ అన్నట్లుగానే ఇప్పుడు గొలగమూడిలో ఉంటూ ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించారు. సార్ కృప వల్ల ఎంతో అనారోగ్యం నుంచి బయటపడి (చచ్చి బ్రతికి), చక్కటి జీవనోపాధి లభించి, సద్గురు సాన్నిధ్యం లభించడమే కాక, నా ద్వారా మా తమ్ముడు, అన్న, చెల్లెళ్లను, మాకుటుంబమంతటినీ తన పంచన చేర్చుకుని నడిపిస్తున్నారు.

చివరిగా, ఒకటి రెండు సార్ సర్వసమర్థత్వం గుర్తింప చేసే సంఘటనలు మీతో పంచుకుని సెలవు తీసుకుంటాను. మాఊరిలో ఒకసారి నా కారణంగా

రెండు కరెంటు వైర్లు రాసుకుని చుట్టుపక్కల ఎలక్ట్రిక్ మోటార్లు అన్నీ కాలిపోయాయి. వారందరూ నా ఆర్థిక పరిస్థితి కూడా లెక్కచేయకుండా వారి మోటార్‌ల ధర చెల్లించమని గట్టి వత్తిడి చేసారు. నాకు దారిలేక తప్పించుకుని గొలగమూడి సార్ సన్నిధి కి వచ్చి చెప్పుకున్నాను. సార్ ఆ దారినే శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధికి వెళ్లి అగ్ని గుండంలో కొబ్బరికాయ వేసి నిశ్చింతగా మా వూరు వెళ్ళమన్నారు. అలానే వెళ్ళగా, ఇది వరకు ఏమీ జరగనట్లు ఇంక ఆ విషయమై ప్రస్తావనే లేదు! ముందు పోలీసుల వరకు వెళ్ళిన తతంగం ఇప్పుడు ఇలా సద్దుమణిగేటట్లు చేయటం ఆ సర్వసమర్థునికే చెల్లింది. మరోసారి గొలగమూడి సత్సంగంలో మరల, మరల అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఉరుకున్నందుకు భీష్ముడంతటి వారికే చెల్లదని చెప్పారు. ఆ వారం చివరి లో నేను ప్రయాణిస్తున్న బస్సులో ఒక తాగిన వ్యక్తి తన భార్యతోనే ఎంతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు అందరూ చూస్తున్నారు, గాని ఏమీ పట్టించుకోలేదు. నాకు ఏ (సార్) ప్రేరణ వల్లనో ఎదిరించే సరికి అందరూ తోడు నిలిచారు. అతను నన్ను బెదిరించి ఊరిలో ఎలా ఉంటావో చూస్తానన్నాడు. సార్‌కు చెబితే అభయం ఇచ్చారు. ఎట్టి ఇబ్బందీ కలుగలేదు. సార్ నాకు

ఆరోగ్యం ప్రసాదించడమే కాక, నా కాళ్ళపై నేను నిలబడి చక్కటి ఉద్యోగం చేసుకోటానికి కూడా చేసిన సహాయాలు అత్యద్భుతాలు. B.Ed. చదువుకి, M.Ed కి దాదాపు 60,000/- సార్ ఇచ్చి చేయించి ధర్మాచరణకు, స్వామి సన్నిధి లో ఉండటానికి ఎంతో సౌలభ్యం కల్పించారు. అవి సద్వినియోగం చేసుకుంటూ, సార్ చూపిన మార్గంలో నిష్కామ కర్మ చేస్తూ వారి కృప పొందేలా నడపమని ప్రార్థిస్తున్నాను.

\- శివరత్నం , గొలగమూడి.

# బట్టు శ్రీరామకృష్ణ

బట్టు శ్రీరామకృష్ణ తనకు భగవంతునితో ఉన్న అనుభవాలు, సార్‌తో పరిచయం, సార్ సాంగత్యం, సార్ సన్నిధిలో కల్గిన దివ్యానుభవాలు, సంస్కారాల్లో వచ్చిన మార్పులను గూర్చి ఇలా వివరిస్తున్నారు.

మాది దైవభక్తి కలిగిన కుటుంబ నేపధ్యం అవటం వల్లనూ, ఇంట్లో శ్రద్ధగా జరిగే పూజలు, పండుగలు, భగవత్ కథలు వినటం వల్లనూ, గుంటూరు నాజ్ సెంటర్‌లోని ఆంజనేయ స్వామి గుళ్ళో వినే పురాణ కథల వల్లనూ, నాకు మొదటి నుండి భగవంతుడు

ఉన్నాడన్న నమ్మకము, ఏ పనికైనా వాటి మీద ఆధార పడవచ్చునని మొక్కుకోవటం అలవాటు అయ్యాయి. ఇంకా మా నాన్నగారు (కీ.శే. సుబ్బారాయుడు గారు) నన్ను తరచూ గుంటూరులో శ్రీరామకృష్ణ మఠం వారి సేవా సమితికి తీసుకెళ్లటం వల్ల నాకు తెలియకుండానే నా ఖాతాలో పుణ్యం జమ చేసారు. ఇంకా వివేకానందుని గూర్చి, బ్రహ్మచర్య విశిష్టత గూర్చి బోధించేవారు. కానీ, కాలేజీ చదువుల టైంలో చెత్త పుస్తకాలు, సినిమాల ప్రభావం వలన అవి మరుగున పడ్డాయి.

B.Tech.3rd Yearలో నేను చేయని తప్పుకి (పరీక్షలో కాపీ కొట్టటం అనే) నిందారోపణ ఎదుర్కోవలసి రావడంతో బాగా disturb అయ్యి మనసులోనే భగవంతుని మీద నిష్ఠూరపడి తగవులాడేవాడిని. అప్పుడు, నేను గతంలో అటువంటిదే పెద్ద తప్పిదం ఒకటి చేసి తప్పించుకున్నాననీ, దానికి శిక్షే ఈ నిందారోపణ అనీ శ్రీరామకృష్ణ ప్రభ సంచిక లో వచ్చిన ఒక కథ ద్వారా అవగాహన కలిగింది.

M.Tech. చేయటానికి R.E.C. Calicut లో చేరడం నా జీవితంలో పెద్ద టర్నింగ్ పాయింట్. అక్కడ రవికుమార్ గారు తన హాస్టల్ గదినే బాబా గుడిగా మార్చివేసి, ప్రతి గురువారం సత్సంగం జరిపి ప్రసాదాలు

పెట్టటంతో పెద్దగా ఇంటరెస్ట్ లేకున్నా, casual గా వెళ్ళేవాడిని. అప్పుడే మొదటిసారిగా భరద్వాజ మాష్టరు గారి రచనలు చూడటం, బాబాని పిలిస్తే పలుకుతాడు అని వినటం / కనటం జరిగింది. కానీ నాకు ప్రత్యేకంగా ఏ అవసరం లేదు కనుక, శ్రీసాయి లీలామృతం కొని కూడా పక్కన పడేసాను. ఇంతలో నాకు టైఫాయిడ్ జ్వరం రావటం, దాదాపు ఇరవై రోజులు క్లాసులు వినకపోవడం, వెంటనే పరీక్షలు రావడంతో ఒక సబ్జెక్ట్ సరిగ్గా వ్రాయలేక పోయాను. అప్పుడు బాబాతో "నేను 3 సార్లు శ్రీసాయిలీలామృతం పారాయణ చేస్తాను. కానీ pass చేయిస్తావా / fail చేయిస్తావా అనేది నీ ఇష్టం" అని చెప్పుకుని పారాయణ చేశాను. బాబా నాకు PASS అని మెసేజ్ ఇవ్వటం, నేను నిజంగానే pass అవ్వటం జరిగింది. దాంతో బాబా పిలిస్తే పలుకుతాడు, ఏమైనా చేయగలడు అని గట్టిగా గురి కుదిరింది.

తర్వాత I.I.T. Madras లో temporary job చేస్తూ, ఒక మంచి ఉద్యోగం కోసం ప్రయత్నంలో భాగంగా కొన్ని సాఫ్ట్ వేర్ కోర్సుల్లో చేరాను. అక్కడ పరిచయం అయిన ఒక అమ్మాయి పట్ల వ్యామోహం పెంచుకుని, దానికి ప్రేమ అని పేరు పెట్టుకుని ఆ ధ్యాసలోనే బ్రతికేవాడిని. అక్కడ గుంటూరులో మా

కుటుంబ శ్రేయోభిలాషి, ఎన్నోసార్లు నాకు హోమియో మందులూ, guidance ఇచ్చి రక్షించిన వారు, అప్పటిలోనే ఎంతో గొప్ప ఆద్యాత్మిక ప్రగతి సాధించిన శ్రీ భాస్కరరావు మాష్టరుగారు నా పరిస్థితి తెలుసుకుని, నన్ను పిలిపించి వద్దని వారించారు. కానీ, వారి గొప్పతనాన్ని, మంచితనాన్ని కూడా కాదని, నాకు బాబా పిలిస్తే పలుకుతాడు గనుక ఈ విషయంలో కూడా బాబానే సహాయం చేయమని శ్రీ సాయి లీలామృతం తెరిస్తే "సోదర భావం వహించాలి" అని మెసేజ్ వచ్చింది. కోరిక బలంగా వుండటం వల్ల ఇంకో రెండు సార్లు తెరిచినా అదే పేజి, అదే మెసేజ్ 3 సార్లు వచ్చింది. దాంతో బాధపడి, మరింత పట్టుదలగా ఒకటైన వెంటనే ఒకటి వరుసగా 'శ్రీసాయిలీలామృతం' తెలుగు/ఇంగ్లీష్ పారాయణాలు (సుమారు 11-12 సార్లు), ఎట్లాగైనా సరే బాబా దగ్గర వరం పొందాలని తీవ్రంగా చేశాను. నిజానికి మనకి ఏది మంచిదో, ఏది కాదో మనకంటే ఎక్కువగా బాబాకే బాగా తెలుసు గనుక ఆ వ్యామోహం నుండి మెల్లగా నన్ను బయట పడేసారు. ఇప్పుడు ఆలోచిస్తే "ఎంతో ముఖ్యమైన నా M.Tech. రిజల్ట్స్ విషయాన్ని నీ ఇష్టం బాబా అని వదిలేసిన నేను, ఈ వ్యామోహం లో పడ్డప్పుడు మాత్రం నా కోరికే నెగ్గాలి అని పట్టుపట్టడం"

ఎంతటి అజ్ఞానమో కదా. ఇది హాస్యాస్పదమే అయినా, మనలో ఎక్కువ మంది కోరికలు ఇలాగే ఉంటాయని, కేవలం భగవంతుని కృప వల్ల మాత్రమే ఇటువంటి వాటి నుండి సులభంగా బయటపడవచ్చునని ఇప్పుడు అనిపిస్తోంది. ఇషాఇష్టాలు - బలహీనతలవల్ల కలిగిన వ్యామోహాలు బలంగా ఉన్నప్పుడు సద్గురునికి శరణాగతి చేయలేము అన్న మాట, కానీ సద్గురువు కోరికలను ప్రసాదించడమే కాక మనను ఎలా సంస్కరిస్తారో ఈ సంఘటన లో అనుభవము అయ్యింది.

శ్రీ సాయి లీలామృతంలో వైద్యుల సుధాకర్ గారి మరదలు పెళ్లికి సంబంధించిన మ్రొక్కు, శ్రీవెంకయ్యస్వామి వారి ఆశ్రమం వద్ద నిద్ర చేయటం మొ|| లీల చదివి “వెంకయ్య స్వామి అంటే, పెళ్ళిళ్ళు బాగా జరిపించే స్వామి” అని నా మనస్సులో ముద్ర పడింది. సుమారు 2000-2001 సం|| లో విద్యానగర్ వెళ్ళినప్పుడు, అక్కడ రవికుమార్ గారి ప్రోద్బలంతో మరి ఇద్దరు స్నేహితులతో కలిసి ‘ఆంధ్ర శిరిడీ’గా ఖ్యాతి గాంచిన గొలగమూడి దర్శించటం జరిగింది. అప్పుడే సాయిమాష్టర్ నిలయంలో దిగి స్వామి దర్శనం చేసుకుని, ఎవరో తీసుకెళ్లటం వల్ల శ్రీ సుబ్బరామయ్య సార్ వాళ్ళ ఇంటికి వెళ్ళి సార్‌ని మొదటిసారిగా

దర్శించాను. ఆ సమయంలో చుట్టూ పుస్తకాల కట్టల మధ్యలో సరిగా గాలి కూడా ఆడని ప్రదేశంలో సార్ కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నారు. అక్కడ ఉండలేక పోవటమే గాక, మరీ పల్లెటూరి వాతావరణం అనిపించి గొలగమూడి అంటే కూడా అయిష్టమే ఏర్పడింది.

కానీ 2002 సం|| లో మా నాన్నగారు మా చెల్లెలికి పెళ్ళి సంబంధాలు చూడటం మొదలుపెట్టాక, ఒక సంబంధం విషయమై చెన్నై నుండి చీరాల రమ్మన్నారు. నేను దారిలో “పెళ్ళిళ్ళు జరిపించే స్వామి” అన్న విశ్వాసంతో గొలగమూడి వచ్చి స్వామిని దర్శించి ప్రార్థించి వెళ్ళటం, ఏ ఇబ్బంది లేకుండా ఆ సంబంధం కుదిరి, చక్కగా మా చెల్లి పెళ్లి జరిగింది. మరుసటి సం|| 2003 లో నాకు చెన్నైలోనే ఒక మంచి ఉద్యోగం రావటం, తర్వాత నా పెళ్లి సంబంధం విషయంలో కూడా స్వామిని దర్శించి, నాకు ఏది మంచిదో అది జరిగేటట్లు చేయమని ప్రార్దించి వెళ్ళటం, మొదటి సంబంధం ఖాయం అయ్యి వివాహం జరగటం, మ్రొక్కు తీర్చుకోవడానికి మేము గొలగమూడి వచ్చి నిద్ర చేయటం కూడా జరిగింది. పైన చెప్పిన రెండు అనుభవాలు విన్న నా స్నేహితుడు, M. వెంకటరమణ, తనకి కూడా పెళ్లి కావాలి అనే కోరికతో గొలగమూడి

వచ్చి విశ్వాసంతో స్వామిని, సార్ ని దర్శించటం, వెంటనే అతని పెళ్లి కూడా జరగటం స్వామి మహత్యానికి మరో ఉదాహరణ. అతడే 'అవధూత లీల' గ్రంథం తెచ్చి నాకు బహుకరించాడు.

2004 లో నా వైవాహిక జీవితంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు కూడా స్వామి దగ్గరకే వచ్చి, ఈ పెళ్లి చేసింది నువ్వే గనుక, ఈ సమస్యకు పరిష్కారం కూడా నువ్వే చెప్పమని గొలగమూడి వచ్చినప్పుడు, సార్ చేస్తున్న సత్సంగం లోని కొన్ని మాటలు, నాకు సమాధానాలుగా తోచి, అట్లే ప్రొసీడ్ అయ్యి, రాజీ కుదుర్చుకుని తిరిగి సంసారం మొదలుపెట్టాను. ఈ అన్ని సంఘటనలులోనూ ఏదో అవసరం వచ్చినప్పుడు మాత్రం ప్రార్థన చేయటం తప్ప, తర్వాత కృతజ్ఞతగా స్వామికి సేవ చేయాలని కానీ, తిరిగి స్వామిని దర్శనం చేసుకోవాలని కానీ అనిపించేది కాదు. కనుక తర్వాత చాలా కాలం వరకు గొలగమూడి వెళ్ళలేదు.

2007 లో మా అమ్మగారికి Dengue జ్వరం వచ్చి సీరియస్ అయ్యి హాస్పిటల్‌లో అడ్మిట్ అవటంతో, దిక్కుతోచని పరిస్థితులలో దారిలో గొలగమూడిలో దిగి స్వామికి మ్రొక్కుకుని గుంటూరు వెళ్ళాను. మా అమ్మగారికి చక్కగా నయమవడంతో అప్పటి నుండి

మ్రొక్కు ప్రకారం 3 నెలలకి ఒక్కసారి గొలగమూడి వచ్చి సాయి మాష్టర్ నిలయంలో నిద్ర చేయటం మొదలు పెట్టాను. ఆ కాలంలోనే శ్రీ సుబ్బరామయ్య సార్‌ని దగ్గరగా చూడటం, అక్కడికి వచ్చే నా తోటివారంతా సార్ చెప్పిన పనులు ఎంతో శ్రద్ధతో చేయడం చూసి నేను కూడా మెల్లగా ఆ పనుల్లో పాల్గొనేవాడిని. ముఖ్యంగా నా M.Tech. స్నేహితుడు ప్రసాద్ అత్యంత శ్రద్ధగా సార్ ఇచ్చే సూచనలు ఎంత క్లిష్టమైన పరిస్థితులలో కూడా చక్కగా పాటించడం చూసి ఆశ్చర్యము, సార్‌పై గౌరవం కలిగాయి. అలానే ఒకసారి ఆరాధన టైములో అన్నదానం జరిగే చోటికి సార్ అతి సాధారణ దుస్తులు ధరించి రావడం చూసి, ఇంత పెద్ద వసతి కట్టించి, ఇంత అన్నదానం చేస్తూ, మరీ ఇంత నిరాడంబరంగా ఎలా ఉండగాలిగారో అని మరింత గౌరవం పెరిగింది. ఆ తరుణంలో **"కనీసం నెలకి ఒకసారైనా గొలగమూడి రాకుంటే ఎలాగ"** అనే శివరత్నం ప్రోద్బలంతో, నగేష్ సార్ పట్ల చూపించే ప్రేమ, శ్రద్ధ, **"గురువులు/మహాత్ములు భౌతికంగా ఉన్నప్పుడు అవకాశం వదులుకుని, తర్వాత ఏడిస్తే ఏం లాభం?** కనుక తరచుగా సార్ దర్శనం, సేవ చేసుకోమనే" అతడి మాటలు, ఇంకా సురేష్, శేషకృష్ణ మొ|| వారి

అనుభవాలు, నన్ను సార్ గొప్పతనాన్ని గుర్తించేలా, సార్ పట్ల ఆకర్షితుణ్ణి అయ్యేలా చేసాయి.

అప్పటి నుండి దాదాపు ప్రతి నెలా సార్ దగ్గరికి వెళ్తున్నా. మిగతా వారిలాగా నేను ప్రేమగా, శ్రద్ధగా వెళ్ళటం లేదని బాధపడేవాడిని. ఈ విషయమై ఒకసారి సార్ ఒక్కరే ఆకుకూర కోసుకుంటూ ఉన్నప్పుడు, "సార్,... ప్రసాద్, నగేష్, మొ|| వారంతా ఎంతో ప్రేమగా, శ్రద్ధా భక్తులతో ఇక్కడికి వస్తున్నారు. నేను మాత్రం ఏదో మ్రొక్కుకున్నాను గనుక బలవంతంగా వస్తున్నాను కదా" అన్నప్పుడు సార్ **"నీకు శ్రద్ధ ఉందో లేదో, భక్తి ఉందో లేదో తర్వాత సంగతి. ముందు నువ్వు ఎలాగైనా ఇక్కడికి వస్తూ ఉంటే, మిగతాది స్వామి చూసుకుంటాడు"** అన్న మాటలు కేవలం నాకే గాక, మనందరికీ కూడా అభయంగా నిలుస్తాయి.

సార్ సాన్నిధ్యములో నాకు తెలియకుండానే నా బలహీనతలు ఎన్నో తుడిచి పెట్టుకు పోయాయి. నేను ఇదివరలో అధర్మం అని తెలిసీ నిగ్రహించలేని / నిగ్రహించాలి అనిపించని వ్యామోహాలను సైతం ఒక్కటొక్కటిగా నరుక్కుంటూ వచ్చి, వాటి పరిధిని క్రమంగా ధర్మబద్ధంగా ఉండేలా కట్టడి చేసేసారు. ఇంకా షేర్ మార్కెట్, వాటి గురించి ఒకసారి నేనేదో చెబితే

“**అవన్నీ మనకెందుకయ్యా**” అన్న ఒక్క మాటతో ఆ ధ్యాసే లేకుండా చేసారు. ఎప్పుడైనా నేను సార్ చెప్పిన దానికి వ్యతిరేకంగా చేయబోయినా, వెంటనే తగిన హెచ్చరికలు మనసులోనో, మరో విధంగానో చేసేవారు. భగవంతుణ్ణి ఏదో ఒక అవసరానికి ప్రార్థించే మానసిక స్థితి నుండి, ఏ అవసరం లేకున్నా కేవలం ప్రేమగా శ్రద్ధా భక్తులతో సార్‌ని, స్వామి లాంటి మహాత్ములని సేవించాలని, చక్కటి దైవీ గుణాలను అలవరచుకోవాలనే దృష్టి, ధ్యేయం కలిగించారు. అప్పుడప్పుడూ సార్ “ఏమిటి చెప్పు” అనేవారు. కానీ చాలావరకు నేను “ఏమి లేదని”, కేవలం సార్‌ని ఆనందంగా చూస్తూ ఉండేవాడిని.

ఒకసారి సార్ సాన్నిధ్యంలో మౌనంగా నామస్మరణ చేసుకుంటూ ఉండగా సార్ ప్రసాద్ ద్వారా “ఏమి కావాలి” అని అడిగించారు. అప్పుడు 3 కోరికలు 1) మా నాన్నగారికి శ్రీరామకృష్ణ పరమహంస అంటే ఇష్టం గనుక, వారికి ఎప్పటినుండో చూడాలని ఉన్న ‘బేలూర్ మఠం’, ఇంకా పరమహంస నడయాడిన ప్రదేశాలు చూపించాలని, 2) కుటుంబ సమస్య ఒకటి తీర్చమని, 3) చిన్నగా ఒక కారు కొనుక్కోవాలని ఉంది అనీ చెప్పుకున్నాను. సార్ మౌనంగా చూస్తూ

ఊరుకున్నారు. అనతి కాలంలోనే చిత్రంగా నేను నా తల్లిదండ్రులతో కలిసి కలకత్తా వెళ్ళి 'బేలూర్ మఠం' మొ|| ప్రదేశాలన్నీ చూసిరావటం, ఆ తర్వాత కొద్ది నెలలకు మా నాన్నగారు సిద్ధి పొందటం జరిగింది. అలాగే మా కుటుంబ సమస్య విషయంలో కూడా సర్వప్రేరణాధికారి అయిన సార్, మా ఆత్మీయుల మనసులు మార్చి, 2017లో నా కోరిక తీర్చారు. ఇక కారు కొనటానికి ముఖ్య ఇబ్బంది అయిన పార్కింగ్ సమస్య, ఆఫీస్‌లో రేటింగ్ ఆధారిత sanction సమస్య తీర్చి కూడా, కారు కొనాలి అనే నా కోరిక అప్రస్తుతం అనిపించేలా చేసారు.

- **సార్ కృప వల్ల నాకు జరిగిన మరికొన్ని దివ్యానుభవాలు:**

ఇదివరలో గ్యాస్ ట్రబుల్ చాలా ఎక్కువగా ఉండేది. ఎలా అంటే 5 నిముషాలు మాట్లాడటానికి త్రేపుల వల్ల దాదాపు పావుగంట పట్టేది. డాక్టర్లు పరీక్షించి ఏమి లేదు, కేవలం టెన్షన్ వల్ల అన్నారు. కానీ, బాధ మాత్రం తగ్గలేదు. ఒకసారి బ్రహ్మంగారి మఠం ఎదురుగా రూమ్స్ కట్టే పని చేసే టైములో సార్ దూరం నుండి నా అవస్థ గమనిస్తున్నారు. నేను మాత్రం ఆపకుండా నా పని చేస్తూనే ఉన్నాను. తర్వాత కొద్ది

రోజులకే ఎటువంటి వైద్యమూ లేకుండా ఆ బాధ చాలావరకు తగ్గిపోయింది.

1) బ్రహ్మంగారి మఠం దగ్గరే ఒకసారి పని చేస్తూ కింద పడితే, ప్రక్కటెముకలకు, కాలికి గాయాలయ్యాయి. ప్రసాద్ ఈ విషయం సార్‌కి చెబితే “ఏమీ కాదులే” అన్నారంట. నేను కట్టు కట్టించుకుని,ఇంజక్షన్ చేయించుకుని సార్ వాళ్ళ ఇంటికి వెళితే, అమ్మగారు నొప్పిగా ఉందా అన్నారు. చిత్రంగా చూసుకుంటే ఎటువంటి నొప్పి లేదు.

2) నా నుదిటి మీద ఒక పెద్ద బొప్పి (lipoma) వచ్చి చూడటానికి కొంచెం అందవికారంగా ఉండేది. నేను దాన్ని పట్టించుకోలేదు. కాని, సార్ అప్పుడప్పుడూ దాని గురించి ప్రస్తావించి, డాక్టర్‌కి చూపించుకోమన్నారు. డాక్టర్ గారు చూసి ఆపరేషన్ చేస్తామన్నారు. సార్ అనుమతితో చక్కగా ఆపరేషన్ చేయించుకుని ఆ బొప్పి తొలగించుకున్నాను. నిజానికి ఇంజక్షన్ అంటేనే ఇష్టపడని నేను, ఆపరేషన్ థియేటర్ లో ధైర్యంగా ఉన్నానంటే కేవలం సార్ చెప్పారు గనుకనే. ఆ సమయంలో నాకు రావలసిన ఏదో పెద్ద ఇబ్బందిని

ఈ ఆపరేషన్ రూపంలో తొలగించారని నా విశ్వాసం.

3) నా భార్యతో కలిసి గొలగమూడి వెళ్ళి చెన్నై వస్తూ జనరల్ టిక్కెట్‌తో రైల్వే రిజర్వేషన్ బోగి ఎక్కాను. మాటల సందర్భంలో సార్ మీద తనకి నమ్మకం కలిగించాలని, ఇప్పుడు T.T.E. వచ్చి అందరినీ టిక్కెట్ అడిగినా మనల్ని మాత్రం అడగడు అన్నాను. చిత్రంగా అతడు అలాగే మమ్మల్ని మాత్రం అడక్కుండా వెళ్ళిపోయాడు. కానీ అది సరి కాదు గనుక, నేను అతడి వెనుక వెళ్ళి రిజర్వేషన్ చార్జీ కట్టి, రసీదు తీసుకున్నాను.

4) ఆఫీస్‌లో ఒకసారి సరైన రేటింగ్ రానందున కారు sanction అవదని బాధపడి, సార్‌తో సెకండ్ హ్యాండ్ కారు కొనుక్కుంటానంటే, సార్ 'ఏమి! వచ్చే సంవత్సరం రాదా' అన్నారు. నాకు ఏ మాత్రం నమ్మకం లేకపోయినా, మరుసటి సంవత్సరం చిత్రంగా double rating ఇచ్చారు.

5) ప్రమోషన్ కోసం ఇంటర్వ్యూకి వెళుతూ 'మీ ఇష్టం సార్' అని సార్‌ని తలుచుకుని వెళితే వాళ్ళు "ఇప్పటికే నీకు ఆలస్యం చేసాం" అని వెంటనే ప్రమోషన్ ఇవ్వటం కేవలం సార్ కృపే. అలాగే

కొత్తగా పెట్టిన డిజిటల్ టీం కోసం ఇంటర్వ్యూకి వెళుతూ కూడా 'మీ ఇష్టం సార్' అని వెళితే, నాకన్నా అర్హులు ఉన్నాకూడా నన్ను సెలెక్ట్ చేసుకున్నారు. అంతేగాక మరుసటి సంవత్సరం ఇంకో ప్రమోషన్ కూడా సార్ దయ వలననే వచ్చింది.

6) ఒకసారి నేను గొలగమూడిలో ఉండగా, మా నానమ్మకు సీరియస్‌గా ఉంది, నన్ను వెంటనే రమ్మని మా నాన్నగారు ఫోన్ చేస్తే, ఏమి చేయాలో తోచక సార్‌ని అడిగితే 'నీవు పోబళ్ళేదులే' అన్నారు. అలాగే మా నానమ్మకు ఆరోగ్యం చేకూరి, తర్వాతికాలంలో శ్రీరమణాశ్రమం కూడా దర్శించి వచ్చింది.

7) 2015 సం|| డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన వరదల వల్ల చెన్నై చాలావరకు మునిగి పోయి మొత్తం అల్లకల్లోలం అయింది. ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కూడా జరిగింది. కొన్నిచోట్ల రెండో అంతస్తు వరకు కూడా మునిగిపోయి, పడవుల్లో, హెలికాప్టర్లలో బయటపడి ఊరు విడిచిపోయారు. గ్రౌండ్ ఫ్లోర్ లో ఉండే నేను డిసెంబర్ 2వ తేదీన మా ఇంటి వద్ద క్రమంగా పెరుగుతున్న వరద ఉధృతి, ఆగకుండా జోరుగా పడుతున్న వర్షం చూసి

భయమేసి, ఇంటిలోకెళ్ళి సార్‌ని ప్రార్థిస్తూ "సార్ నాకు భయమేస్తుంది. ఈ పరీక్ష ఇక చాలు. రక్షించండి" అని వేడుకున్నాను. మరుక్షణంలో అప్పటి వరకు అంత జోరుగా కురుస్తున్న వర్షం ఒక్కసారిగా తగ్గిపోయి చిన్నగా ఒక్కొక్క చినుకుగా పడసాగింది. దాంతో సార్ నా ప్రార్థన ఆలకించారని, రక్షిస్తున్నారని తెలిసి ధైర్యంగా ఉన్నాను. అలాగే మాకు ఏ ఇబ్బంది లేకుండా ఆ గండం గట్టెక్కాము.

8) ఒకసారి స్వప్నంలో సార్ నాకు అన్నం పెట్టినా, నేను తాత్సారం చేస్తూ చివరకు తినకుండానే ఆ కల పూర్తి అయ్యే సరికి తెగ బాధపడి, మరుసటి వారం గొలగమూడి వెళ్ళినప్పుడు సార్‌కి చెప్పుకుని ఒక్కరే ఉన్నప్పుడు ప్రాధేయపడితే, సరే అన్నారు.

9) ఒకసారి సాయి మాష్టర్ నిలయంలో సార్ నన్ను తిరస్కరించారని భావించి, బాధపడి లోనికి వెళ్ళి స్వామివారి పటానికి చెప్పుకుంటే వెంటనే సార్ తిరిగొచ్చి నాతో ప్రేమగా మాట్లాడారు. అంటే సార్‌కీ, స్వామికీ బేధం లేదన్నమాట.

10) ఒకసారి చెన్నైలో బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు చూస్తే, మా ఇంటిలో మోటార్ ప్రాబ్లం

వచ్చి నీరు ఎక్కట్లేదు. ఆ టైములో మెకానిక్‌లు ఎవరూ రారు. వంక దొరికింది అని, రేపు తెల్లవారుఝామున 4 గంటలలోగా రిపేర్ అవ్వకుంటే, నేను మొదలు పెట్టవలసిన 'అవధూత లీల' పారాయణ చేయను అనుకుంటే, చిత్రంగా మా ఎదురింటి శివకుమార్ గారు రాత్రి 11 గంటలకు వచ్చి airlock అయ్యింది అని చెప్పి దాన్ని సరి చేసారు.

11) సార్ నాకే గాక మా బావ గారికి కూడా ఒక దివ్యనుభావాన్ని ఇచ్చారు. అయన దాదాపు 7-8 సంవత్సరాలు కడుపు నొప్పితో బాధ పడ్డారు. డాక్టర్లు ఎన్నో పరీక్షలు చేసి, ఏమి తేల్చలేకపోయారు. చివరికి చెన్నై వచ్చి ఒక పెద్ద హాస్పిటల్‌లో చూపించుకున్నా ప్రయోజనం లేకపోయింది. చీరాల తిరుగు ప్రయాణంలో నాతో కలిసి గొలగమూడి వచ్చి స్వామిని దర్శించుకుని, బ్రహ్మంగారిమఠం దగ్గర కొంతసేపు curing పని కూడా చేసారు. భోజనానంతరం చీరాల బయల్దేరటానికి ఆటో కూడా పిలుచుకు వచ్చిన తరువాత, సార్ వెనక్కు పిలిపించి తన దగ్గర సుమారు అరగంట సేపు కూర్చోబెట్టుకుని ఇక వెళ్ళి

రమ్మన్నారు. తరువాత కొద్ది రోజులకి మళ్లీ కడుపు నొప్పి వచ్చినప్పుడు, గుంటూరులో ఒక హాస్పిటల్‌లో చూపించుకోవడం, వెంటనే గాల్ బ్లాడర్ ప్లస్ అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకుని ఆ బాధ తొలగించుకోవటం చకచకా జరిగిపోయాయి. తరువాత ఉద్యోగంలో పదోన్నతి కూడా కేవలం సార్ కృపే అని నా నమ్మకం.

12) సార్ దగ్గరకు మనం ఎట్లా వెళ్లాం అన్న దాన్ని బట్టి సార్ ప్రవర్తన ఉండేది. కొంచెం శ్రద్ధగా పారాయణ, నామస్మరణం చేసుకుంటూ వెళితే సార్ ప్రేమగా పలకరించేవారు. అదే casual గా, ఏదో మొక్కుబడిగా వెళితే సార్ మీది ఏ ఊరు అని అడిగేవారు. “వాళ్ళుండే దాన్ని బట్టి కదయ్యా మనముండేది” అంటే ఇదే కదా.

సార్ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మన వెన్నంటే ఉన్నారని, మన తప్పులు సరిదిద్దుతూ ఉంటారని తెలిపే ఈ మధ్యనే జరిగిన ఒక సంఘటన చెప్పి ముగిస్తాను. 2018 ఫిబ్రవరిలో నగేష్ కొన్ని సార్ వ్రాసిన లెటర్స్ 3 పేజీలు ఇచ్చి టైపు చేసిపెట్టమన్నాడు. నేను ఒప్పుకుని కూడా చెప్పిన తేది తర్వాత కూడా ఆ పని పూర్తి చేయలేదు. ఆ రోజు రాత్రి కలలో నా సగం మీసం

తీసేసినట్లున్న నా ముఖం అద్దంలో రెండు సార్లు చూపించారు. దాంతో సార్ చేసిన హెచ్చరిక అర్ధమై, మరురోజు వెంటనే ఆ టైపింగ్ పని పూర్తి చేసి పంపించాను.

# పొత్తూరు వెంకటేశ్వరరావు, హైదరాబాద్

శ్రీ స్వామిని, సార్‌ను ఆశ్రయించిన వారిని ఎలా నిష్కామకర్మ చేయటంలో ప్రోత్సహించి అవకాశం కల్పించి నడిపించి వారి బాధ్యతలు, ఇబ్బందులలో ఎలా గురువుపై ఆధార పడేలా చేసి సులభం చేశారో, నిజమైన గురువు ఎలా లౌకిక బాధ్యతలు నిర్వహింప చేస్తూనే, ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తారో మనం హైదరాబాద్ వెంకటేశ్వరరావు గారి క్రింది అనుభవాలలో చూడవచ్చు.

గొలగమూడి దాటని శ్రీ సార్ వీరికి పుస్తకాలను ప్రింట్ చేసే సేవ అనుగ్రహించి సాధ్యమైనంత తక్కువ ధరకు అందరికి స్వామి పుస్తకాలు అందే అద్భుత సేవకు ప్రోత్సహించి ఆ పని చేయించి ఎన్ని విధాల అనుగ్రహించారో ఈ అనుభవాలలో చూడవచ్చు.

మనచే చేయించేది సారే నని, అనుగ్రహించేది వారెనని గుర్తించాలి.

- **సార్‌తో తొలి పరిచయాలు :**

నేను కాలికట్ (కేరళ) లో M Tech చదువుతున్నప్పుడు రవి కుమార్ గారి ద్వారా సాయిబాబా గురించి తెలిసి సత్సంగాలలో పాల్గొనేవాడిని. ఆయన గైడెన్స్ వల్ల గొలగమూడి వెంకయ్య స్వామి దర్శనం అయింది. 1999 లో సుబ్బరామయ్య సార్ గారి దర్శనం మొదటిసారి అయింది. అప్పుడు శ్రీ సాయి మాస్టర్ నిలయం కనస్ట్రక్షన్ జరుగుతోంది. సార్‌ని చూడగానే ఎంతో సాధారణంగా కనపడటమే కాకుండా చాలా బాగా మాట్లాడారు. సార్‌తో మాట్లాడుతున్నప్పుడు అక్కడ దక్షిణ ఇద్దామనుకున్నాను. అక్కడ కార్పెంటర్ అడిగిన చిన్న చిన్న వస్తువులుకి సార్ డబ్బులు ఇస్తున్నారు. కాని నా దగ్గర డబ్బులు ఉన్నా నేను ఇవ్వలేదు. వెళ్లే ముందు దక్షిణ ఇచ్చి సార్‌కి చెప్తే సార్ “నువ్వు ఎక్కడికి వెళ్ళినా దక్షిణ ఇస్తూ ఉండు నీ పనులు అవుతాయి” అని చెప్పారు.

- **ఉద్యోగం :**

మా నాన్నగారు నన్ను హాయిగా వ్యాపారం చేసుకోవచ్చు కదా అంటే నేను మూడు నెలలు ఉద్యోగ ప్రయత్నం చేస్తాను, రాకపోతే అప్పుడు వ్యాపారం చేస్తా అని చెప్పి నేను ప్రయత్నాలు చేశాను. నేను టీచర్ పోస్టింగ్‌కి JNTU హైదరాబాద్, SV యూనివర్సిటీ, తిరుపతికి అప్లై చేశాను రెండు యూనివర్సిటీల నుంచి నాకు ఉద్యోగం వచ్చింది. ఏ ఉద్యోగంలో చేరాలో సార్‌ను అడిగితే సార్ " మొదట ఏ యూనివర్సిటీ నుంచి ఉద్యోగం వచ్చింది?" అని అడిగారు. JNTU యూనివర్సిటీ నుంచి వచ్చింది అని చెప్తే సార్ దాంట్లో జాయిన్ అవమన్నారు. జాయిన్ అయిన మూడు నెలల తర్వాత వాసవి ఇన్స్టిట్యూట్ లో పర్మినెంట్ లెక్చరర్స్ కి ఉద్యోగాలు పడ్డాయి, "మీరు అప్లై చేయండి" అని ఒక సీనియర్ ఉద్యోగి చెప్తే నేను వెళ్లి వాసవి కాలేజీలో ఒక ప్రొఫెసార్‌ను ఎలా చేస్తే నాకు ఉద్యోగం వస్తుందో మెలకువలు చెప్పమన్నాను. ఆయన నేను ఎవరో కూడా ప్రశ్నించకుండా ఎలా అప్లై చేయాలో, ప్రిపేర్ అవ్వాలో కూడా చెప్పారు. నేను అలానే ఉద్యోగానికి అప్లై చేశాను. శాశ్వత ఉద్యోగం వచ్చింది.

1999 కార్తీకమాసంలో నాతో పాటు మా అమ్మ కూడా సార్ దర్శనానికి వచ్చారు. మా అమ్మగారు

సార్‌తో మా నాన్నగారి అనారోగ్యం గురించి చెప్పి రక్షించ మన్నారు. సారు మా అమ్మతో, అమ్మ, మొదట్లో ఇబ్బంది చేస్తుంది గాని తర్వాత అంతా బాగుంటుంది అని చెప్పారు. నేను వాసవి కాలేజ్‌లో ఉద్యోగం వచ్చిన తర్వాత join అవ్వక ముందు ఇంటికి వెళ్ళితే మా అమ్మ వాళ్ళు "నాన్నకు ఒంట్లో బాలేదు, హైదరాబాదుకు వస్తాము, అక్కడ డాక్టర్‌కు చూపెడదాము" అని చెప్పారు. మేము NIMS లో జాయిన్ చేసాం. ఒక రకంగా చెప్పాలంటే మా నాన్నగారు చివరి స్టేజ్‌లో ఉన్నారు. డాక్టర్లు ఎన్నో పరీక్షలు చేసినా మా నాన్నగారి రోగం అంతుపట్టలేదు. అందువలన వాళ్లకి ఏమీ పాలుపోలేదు. ఒక రోజు రాత్రి నాకు, మా అమ్మగారికి స్వప్నంలో శ్రీ శ్రీ శ్రీ వెంకయస్వామి వారు కనపడ్డారు. అదే రోజు రాత్రి మా నాన్నగారు బెడ్ మీద నుండి లేచి యూరినల్స్‌కి నడిచి వెళ్లి వచ్చారు. అప్పటి నుండి ఆయన దాదాపు 17సం||లు ఆరోగ్యంగా జీవించారు.

- **పుస్తక ప్రచురణ సేవ – సదవకాశం :**

ఉద్యోగంలో జాయిన్ అయిన తర్వాత సార్ దగ్గరికి వస్తే సార్ 70 వేలు రు || ఇచ్చి వార్తాలాపం ప్రింట్ చేయించమన్నారు. నాకు ప్రింటింగ్ గురించి ఏమీ తెలియకపోయినా సార్‌కు మాత్రం అడ్డు చెప్పలేదు.

హైదరాబాద్‌కు వెళ్ళిన తర్వాత సార్ సూచన ప్రకారం ఓం సాయి గ్రాఫిక్స్ లో ప్రింట్ చేయించాను. ఒక రకంగా చెప్పాలంటే శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారికి ఇష్టమైన వార్తాలాపం గ్రంథం ముద్రణలో లేదు. ఈ బుక్ printing చేయించడంలో నా కొచ్చిన అవకాశాన్ని నా మహద్భాగ్యంగా భావిస్తున్నాను.

హైదరాబాదులో నా రూమ్మేట్ టైపింగ్ చేసేవాడు. అందువలన నేను ఒక కంప్యూటర్ సిస్టమ్ కొన్నాను. సార్ పంపించిన గ్రంధాలని నా రూమ్మేట్ టైపు చేసేవాడు. నేను ప్రూఫ్ రీడింగ్ చేసేవాణ్ని. అలా గ్రంథ ముద్రణకి నా వంతు సేవ చేసే భాగ్యం కలిగించారు.

అంతేకాకుండా అంతకు ముందు దాకా నెల్లూరులో పుస్తకాల ప్రింటింగ్ చాలా కాస్ట్‌లీ గా ఉండేది. ఎప్పుడైతే హైదరాబాద్‌కు ప్రింటింగ్ మార్చారో అప్పటి నుండి చిన్న చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి ఒక రూపాయికి ప్రింటింగ్ జరిగేది. సార్ ప్రతి సంవత్సరం దాదాపు రెండు నుంచి మూడు లక్షల రూపాయల పుస్తకాలు ప్రింటింగ్ చేయిస్తుంటారు. అంతేకాకుండా ఎక్కడ తక్కువ ఖర్చుకి ప్రింటింగ్ చేస్తారో తెలుసుకొని చేయించడం ద్వారా సార్ గ్రంధాలు తక్కువ ఖర్చుకి

ప్రింటింగ్ అయ్యేవి, మన అందరికి తక్కువ ధరలో స్వామి లీలలు, చరిత్రలు లభ్యం కావటానికి సార్ ఆరాటం, చేయించే యత్నం మనకు మార్గ దర్శకం.

2003లో సార్‌తో నేను వెహికల్ కొనుక్కుంటాను అని అడిగితే సార్ వెంబడే నువ్వు చేసే పనికి వెహికల్ తప్పనిసరిగా అవసరం కొనుక్కో అని చెప్పారు. మా ఇంట్లో సామాన్యంగా పగలంతా వెహికల్ బయట పెట్టేవాడిని. చాలా సార్లు వెహికల్ తాళాలు బండికే ఉంచేసే వాడిని. ఆ రోజు రాత్రి సార్ కలలో కనబడేవారు. బండి క్షేమంగా ఉండేది. ఇప్పుడు అనిపిస్తోంది సార్‌ని అడిగి బండి కొన్నాను కాబట్టి దాని సర్వ బాధ్యతలు సార్‌వే అని. ఇది ప్రతి విషయంలో వర్తిస్తుంది అనిపిస్తోంది.

- **వివాహం :**

మా అన్నయ్యకి పెళ్లి సంబంధాలు కుదరట్లేదు. నన్ను పెళ్లి చేసుకోమని ఇంట్లో వారందరూ బలవంతం చేస్తున్నారు. సార్‌కి వచ్చి ఆ విషయం చెప్పాను. నువ్వు దర్గాస్వామి దగ్గరకి వెళ్ళు అని చెప్పారు. స్వామి దర్గాల దగ్గర ఉన్న హుండీని కొడుతూ “గురువు చెప్పినట్లు చెయ్యట్లేదు, మీ అన్నయ్య పెళ్ళితో నీ పెళ్ళికి సంబంధం లేదు” అని చెప్పారు. స్వామి దగ్గర నుండి బయలుదేరే

ముందర సార్ చెప్పిన మాట (దక్షిణ గూర్చి పాటించటం లేదనే స్వామి అలా అన్నారు అని) గుర్తు వచ్చి దర్గాల దగ్గర దక్షిణ సమర్పించాను. అక్కడ నుండి main రోడ్ మీదకి వచ్చి బస్సు కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఒక కారులో ఇద్దరు తెల్ల వస్త్రాలు వేసుకున్న వారు వచ్చి ఎక్కడకి వెళ్ళాలి అని కనుక్కుని, వారు చిత్రంగా నాతో "తిరుపతి వెళ్ళాలన్నా, హైదరాబాద్ వెళ్ళాలన్నా అక్కడ దించుతామని" చెప్పారు. రేణిగుంటలో మా ఫ్రెండ్ దగ్గరకి వెళతానని చెప్పాను. వాళ్ళు నన్ను రేణిగుంటలో దించి వెళ్లారు. ఆ ఇద్దరు ఎవరో ఎందుకు అలా సాయం చేసారో స్వామికి, సార్‌లకే తెలియాలి. సార్ దగ్గరకి వచ్చి స్వామి చెప్పిన విషయం చెపితే "5 వారాలు వరసగా మీ అన్నయ్యని గొలగమూడిలో స్వామి దర్శనానికి రమ్మను. ఆ తరువాత పెళ్లి కాకపోతే స్వామిది తప్పు అవుతుంది" అని సార్ చెప్పారు. నేను మా అన్నయ్యకి చెప్తే ఆతను వెంటనే 'నన్ను తీసుకు వెళ్ళు, తరువాత 4 వారాలు నేను వెళతానని' చెప్తే తరువాత రోజే తీసుకుని వెళ్ళాను. తరువాత 4 వారాలు కూడా వరుసగా వెళ్ళాడు. నెల తిరిగే లోపు అతని పెళ్లి జరిగింది. నా పెళ్లి మా అన్నయ్య పెళ్లి జరిగిన 3 సంవత్సరాలకి

జరిగింది. 2002లో మా అన్నయ్య పెళ్లి జరిగింది. 2005లో నా పెళ్లి జరిగింది.

నా పెళ్ళికి సంబంధాలు చూస్తున్నప్పుడు కలలో ఒకసారి ఒకమ్మాయి కనపడింది. అందువలన ఏ సంబంధం చూసినా అది కాదేమో అనిపించేది. చిత్రంగా ఆ అమ్మాయితోనే నా వివాహం అయ్యింది. ఇంకా చిత్రమైన విషయమేమిటంటే ఆ అమ్మాయి వివాహానికి ముందర తన నాన్నగారికి అనారోగ్యంగా ఉన్నప్పుడు విజయవాడలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఒకాయన వెంకయ్యస్వామి గురించి చెప్పి, పటం కూడా ఇచ్చి రోజూ దండం పెట్టమన్నారు. అలానే ఆమె చేస్తే వారింట్లో ఇబ్బందులు తీరటమే కాకుండా నేను పెళ్లి చూపుల్లో ఏం ప్రశ్నలు అడుగుతానో కూడా స్వామి కలలో చెప్పారు. అలా మా ఇద్దరినీ శ్రీ వెంకయ్యస్వామే కలిపారు. పెళ్లి అయిన తరువాత నా భార్యకు కూడా సార్ పుస్తక ప్రచురణ యజ్ఞంలో టైపు చేసే పని ద్వారా పాలు పంచుకునే భాగ్యం కలిగింది.

ఒకసారి మా బావగారికి బాగోక పోతే ఒక జ్యోతిష్కుడి దగ్గరకి తీసుకుపోయారు. ఆ జ్యోతిష్కుడు నన్ను చూసి నీకు ప్రాణగండం ఉంది, 40రోజులు అఖండ దీపం పెట్టాలి. అది ఆరిపోతే మంచిది కాదు.

అందువలన నువ్వు ఇంట్లో చెయ్యలేవు. ఇక్కడ పెడతాము డబ్బులు ఇవ్వు అని అన్నారు. వాళ్ళు డబ్బులు మనుషులు లాగా ఉన్నారు అనుకున్నాను. సార్‌కి చెపితే “వెంకయ్యస్వామి గాజులు తొడుక్కొని కూర్చున్నాడు అనుకున్నావా?” అని, “మీ అమ్మను ఊళ్లపాలెంలో అఖండ దీపం పెట్టమను, నీవు హైదరాబాద్‌లో పావుకిలో పొంగలి వండి కాకబలికి పెట్టు” అని చెప్పారు. మేము అలానే చేసాము. ఇబ్బందులు తొలిగాయి.

- **సొంత ఇల్లు – గృహ ప్రవేశం :**

2010లో హైదరాబాద్ లో ఒక స్థలం చూసి తీసుకోవాలో లేదో స్వామి దగ్గర చీట్లు వేస్తే స్వామి తీసుకోమని చెప్పారు. కానీ డబ్బులు ఎక్కువ అడుగుతున్నారని రెండు పోర్షనల స్థలంలో ఒక పోర్షన్ మాత్రమే కొందామనుకుని సార్‌కి చెపితే, స్వామి చెప్పింది ఎలా అయినా చేయాలి అని చెప్పి ఎంత డబ్బులు కావలి అని అడిగి, కావలసిన 3 లక్షలు రెండు రోజుల తర్వాత నా ఎకౌంటులో డిపాజిట్ చేసారు. ఆ డబ్బుతో ఆ స్థలం కొన్నాను. మేము కొందామనుకున్న ఒక పోర్షన్‌లో ఉన్న బోర్ పూడిపోయింది. సార్ కృపా అన్నట్లు రెండో పోర్షన్‌లో ఉన్న బోరే ఆధారమైంది. సార్ చెప్పినట్లు చేయటం వల్ల ఇబ్బంది తొలగిపోయింది.

స్థలంలో ఇల్లు కట్టే మేస్త్రి చాలా కోపిష్టి. అతనితో ఏదన్నా చెప్పాలంటే ఇబ్బందిగా ఉండేది. అతని ఫోటో తీసుకు వెళ్లి సార్‌కి చెప్పాను. సార్ ఆ ఫోటో తాకి ఇచ్చారు. తర్వాత నుండి అతని ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చి ప్రశాంత మనస్కుడు అయ్యాడు.

గృహ ప్రవేశానికి రాత్రిపూట ముహూర్తం నిర్ణయించారని సార్‌కి చెపితే "గృహప్రవేశం అయిన తర్వాత రాత్రంతా నామస్మరణ చేయమన్నారు". మేము అలానే చేశాము. మాకు ఏ ఇబ్బందులూ రాకుండా సార్ కాపాడుతున్నారు.

- **ఆరోగ్యం :**

నా భార్య గర్భం ధరించిన తర్వాత 5 వ నెలలో గొలగమూడి వెళ్లి సార్‌ని దర్శించుకున్నాము. అప్పట్లో నడక కష్టమని స్వామి గుడిలో 3 ప్రదక్షిణలు చేసింది. సార్ దగ్గరకి రాగానే నా భార్యతో సార్ "ప్రదక్షిణలు చేసావా అమ్మా!" అని అడిగారు. నా భార్య మూడు ప్రదక్షిణలు చేశాను అని తృప్తిగా చెప్పింది. సార్ నవ్వి రోజూ కనీసం అర గంట అయినా టైం పెట్టుకుని ప్రదక్షిణలు చేయమన్నారు. అలా చేయటం వల్ల అప్పటికి ఉన్న శారీరిక భాదలు తగ్గి, తర్వాత నార్మల్ డెలివరీ అయ్యింది. అప్పటి వరకు చాలా నెలలు నిండే వరకు

గర్భవతులు వ్యాయామం గానీ నడవటం గానీ చేయాలని తనకు తెలియదు. సార్ ఆ రీతిన అవసరమైనది చేయించి అనుగ్రహించారు.

అలానే రెండవ సారి పాప డెలివరీ సమయంలో కూడా సార్ ఇది వరలో చెప్పిన రీతిలో నామస్మరణ చేస్తూ ఉండేది. ఏ పని చేస్తున్నా స్మరణతో చేయటం కూడా అలవాటు అయ్యింది. నెలలు నిండిన తరువాత డాక్టర్ గారికి చూపించుకుని delivary కి హాస్పిటల్ కు వెళుతుంటే ఉమ్మ నీరు పోయింది. అచ్చట స్కానింగ్ ద్వారా బిడ్డ కండిషన్ చూద్దామని డాక్టర్ ప్రయత్నిస్తే ఆస్పత్రిలో ఉన్న 3 స్కానర్లు పనిచేయలేదు. నామస్మరణలో ఉండటం వల్ల భయం అనిపించక డాక్టర్‌తో "స్టెతస్కోప్ తో చెక్ చేస్తే బిడ్డ condition తెలుస్తుంది" కదా అని అడిగితే డాక్టర్ అలానే చూసి డెలివరీ చేసారు. నార్మల్ డెలివరీ అయ్యాక, మీకు కొద్దిలో ఆపరేషన్ తప్పిపోయింది. బిడ్డ మెడకు ప్రేగు చుట్టుకుని ఉంది. స్కానర్ పనిచేసి ఉంటే ఆపరేషన్ చేసే వాళ్ళము అన్నారు. స్వామి/సార్ స్మృతి రహిత ప్రసన్నులుగా మా ప్రార్థన లేకుండానే ఆపద తప్పించి, ఆపరేషన్ తప్పించారు.

మా అబ్బాయికి చిన్న వయస్సులో గవద బిళ్ళలు జ్వరం వచ్చాయి. వాటి నొప్పి భరించటం కష్టంగా ఉండేది. ఆరు నెలల వరకూ తగ్గదన్నారు. ఇంక ఉండలేక సార్‌కు ఫోన్ చేస్తే గుండంలో కొబ్బరికాయ వేస్తాను బాగుంటుందిలే అన్నారు. అప్పటి నుండీ క్రమంగా సర్దుకుని ఒక నెలలో పూర్తిగా తగ్గిపోయింది. అలానే మరోసారి నీటిలో ఎలుక చనిపోతే తెలియక త్రాగడం వల్ల టైఫాయిడ్ జ్వరం వల్ల మా పిల్లాడికి చాలా అనారోగ్యమైంది. మరలా ధునిలో కొబ్బరికాయ వేయడం, రోజూ తీర్థం, విబూది స్వీకరించటం వల్ల త్వరగా కోలుకున్నాడు. మా బిడ్డల బాధ్యతలను ఇలా సారే వహిస్తున్నారు.

- **విధి నిర్వహణ :**

నన్ను ఆఫీస్ లో కూడా సార్ కనిపెట్టి నడిపిస్తున్నారు. ఒకరోజు ఎక్కువ పని వల్ల వర్షం చీకటి ఉన్నా సాయంత్రం వరకు ఆఫీస్ లో ఉండి పని చేసుకుని ఇంటికి వస్తుంటే ఒక చెట్టు క్రింద నుండి వెళుతుంటే టప్ మని శబ్దం వచ్చింది. ఏమని వెనక్కి చూస్తే ఒక పాము ఒక్క రెండు అడుగుల వెనక నేను వచ్చే దారిలో పడి నా నుంచి దూరంగా opposite దిక్కులో పరిగెడుతోంది. అలానే నాకు Ph.d. చేయటంలో గైడ్ సహకారం

అందటానికి, ఫార్మాలిటీస్ అడ్డు వచ్చినప్పుడు చాలా డిలే అయ్యింది. సార్‌కు చెప్పుకుంటే సార్ అవుతుందిలే అన్నారు. ఆ తర్వాత వారి మనస్సులు, పరిస్థితులు మారి త్వరలో మార్గం చిక్కి Ph.d. కంప్లీట్ అయ్యింది. అలా ఉద్యోగం, వివాహం, తల్లిదండ్రులు, బిడ్డలు, చదువు, ఆరోగ్యం, ఇల్లు ఇలా అన్ని విషయాలలో సార్ అండ ఉండటం, సార్ నాకు పుస్తక ప్రచురణ సేవలో అవకాశం ఇవ్వటం వారి కృపకు నిదర్శనం. కృతజ్ఞతతో జీవించేటట్లు నడిపించమని సార్‌ని ప్రార్థిస్తున్నాను.

# పాబోలు వెంకటేశ్వర్లు, నెల్లూరు

పాబోలు వెంకటేశ్వర్లు కష్టాలలో ఉన్న తన కుటుంబాన్ని సార్ ఎలా ఆదుకుని రక్షించారో తెలుపుతున్నారు.

మాది నెల్లూరు. మా అమ్మ, నాన్నకు ముగ్గురు పిల్లలం. ఇద్దరు అక్కలు, నేను. నేను చివరి వాడిని. నాకు 6 సంవత్సరాలకి మా నాన్నగారు చనిపోయారు. మా అమ్మ ఎంతో కష్టపడి మా ముగ్గురిని పెంచారు. మా అమ్మమ్మ సార్ వాళ్ళ అమ్మకి పిన్ని కూతురు. అలా నాకు సుబ్బరామయ్య సార్ మామ వరుస అవుతారు. మా అమ్మ అప్పుడప్పుడు నన్ను గొలగమూడి తీసుకు వెళ్ళేది.

అప్పుడు సార్‌తో పరిచయం చాలా తక్కువ. నా ప్రపంచం అంతా మా అమ్మ. ఎక్కడకన్నా వెళ్ళాలన్నా ఎవరన్నా మనిషి ఉండాలి లేదా మా అమ్మ ఉండాలి. ఒక్కడినే వెళ్ళటం చాలా అరుదుగా ఉండేది.

నాకు పెళ్ళయి మొదటి పిల్లవాడు పుట్టిన తర్వాత మా అమ్మగారికి ఒంట్లో బాగోలేదు. నెల్లూరు డాక్టర్లు చెప్పినట్లు వైద్యానికి చెన్నై (అప్పట్లో మద్రాస్) కి తీసుకు వెళ్ళేవాడిని. ప్రతి పదిహేను రోజులకి చెన్నై వెళితే 50 వేల రూపాయల పరీక్షలు చేసేవారు. నేను ఒక్కడినే ఉండటం వలన అన్నీ నేను చూసుకోవాల్సి వచ్చేది అంతేగాక ఒక్కొక్క సారి నిద్ర ఉండేది కాదు (కొన్ని కారణాల వల్ల నా అక్కల నుండి ఏ మాత్రం సహాయం అందేది కాదు. మా అమ్మకి, నా భార్య మధ్య సయోధ్య లేక నా భార్య సుమారు రెండు సంవత్సరాలు మా అత్తగారింట్లో ఉన్నది. అందువలన నేను ఒక్కడినే మా అమ్మగారికి సేవ చేసేవాడిని). అలాంటి సమయంలో సార్ దగ్గరకి వారానికి ఒకసారి మా అమ్మను ఇద్దరి మనుష్యుల సహాయంతో తీసుకు వెళ్ళేవాడిని. సార్ ఒకసారి నా ముందర మా అమ్మగారి గురించి చెపుతూ “వాడికి నమ్మకముంటే గొలగమూడి తీసుకు వచ్చి ఉండమన్నారు”. మా అమ్మ ఆరోగ్య పరిస్థితి బాగా

విషమించింది. మద్రాసు డాక్టర్లు కామెర్లకు బదులు టి.బి.కి మందు ఇచ్చారు. మా అమ్మకు పక్షవాతం వచ్చింది. సుమారు 10 లక్షల రూపాయల దాకా అప్పు అయ్యింది. దిక్కు తెలియక స్థితిలో నేను సార్‌ని ఆశ్రయించాను.

సార్ మద్రాస్ డాక్టర్ల మందు ఆపించి, మా అమ్మకు పచ్చ కామెర్లకు నాటు వైద్యం చేయించారు. చాల కొద్ది కాలంలో (రెండు వారాల లోపు) మా అమ్మకు ఆరోగ్యం బాగుపడింది (పక్షవాతం కూడా తగ్గింది). మా అమ్మ తనంత తానే వాకర్ సహాయంతో నడుచుకుంటూ స్వామి దర్శనం చేసుకో గలిగేది. స్వామి దర్శనం అయిన తరువాత సార్ దగ్గరకి వెళ్ళేది. స్వామి అన్నశాల ప్రక్కన ఉన్న రోడ్డులో ఉన్న కట్టెల వెంకయ్య గారి ఇంట్లో అద్దెకున్నాము. రాత్రి పూట చీకటిగా ఉండటం వల్ల ఎక్కువ మంది ఉచ్చలు పోసేవారు. అలా మా అమ్మ స్వామి దర్శనానికి వెళుతుంటే సార్ చూశారు. తర్వాత రోజు మట్టి తెప్పించి ఆ ఉచ్చలు పోసినంత వరకు నా చేత వేయించి మా అమ్మ స్వామి దర్శనానికి ఇబ్బంది లేకుండా చేసారు.

ఎవరన్నా బంధువులు వచ్చి మా అమ్మను గొలగమూడి నుండి తీసుకు వెళతారని సార్ నన్ను మా

బంధువులు ఎవరికీ ఎక్కడ ఉన్నానో చెప్పవద్దన్నారు. మా అక్క వాళ్ళు, మిగిలిన బంధువులు ఎన్నోసార్లు నన్ను వెతకటానికి గొలగమూడి వస్తే ఏనాడూ మేము వారికి కనపడలేదు. అంత చిన్న గ్రామంలో ఒకరికి ఒకరం కనపడకుండా ఉండటం స్వామి కృప కాకపోతే ఏమిటి? ఒకసారి నా ఫ్రెండ్ నన్ను గొలగమూడిలో చూస్తే సార్ అతనికి దండం పెట్టి ఆ విషయం ఎవరికీ చెప్పవద్దన్నారు. అంటే స్వామి దగ్గర ఉంటే ఆరోగ్యం బాగుపడుతుందని సార్‌కి ఎంత నమ్మకమో! దాని కోసం చిన్న వయస్సులో ఉన్నవాడిని కూడా అభ్యర్థించటంలో సార్ సాధారణత్వము అర్ధమౌతోంది.

కొన్ని నెలల తర్వాత మా అమ్మ పత్యం ఉండక పోవడంతో ఆరోగ్యం క్షీణించి కొన్ని నెలల తర్వాత చనిపోయింది. మా బంధువులందరూ "అరేయ్! ఆమె కార్యక్రమానికి మంచి భోజనం (కాటేరర్స్ కి ఆర్డర్ ఇచ్చి) పెట్టించి ఆమెకు తృప్తిని కలిగించు" అని అందరూ అన్నారు. ఎంతమంది వస్తారో తెలియదు, కేటరింగ్ అంటే ఎక్కువ డబ్బులు అవుతాయి. ఏమి చేయాలో తెలియక సార్‌కి ఈ విషయం చెపితే సార్ "ఆ విషయం నాకు ఒదిలెయ్! నేను చూసుకుంటాను అని చెప్పారు". 13వ రోజున కార్యక్రమంలో భోజనం తిన్న వారందరూ

"ఇది ఏ హోటల్ నుండి తెప్పించారు. చాలా బాగుంది" అని చెప్పారు. సార్ మాట ఇచ్చారు అంటే ఆ మాటను నెరవేరుస్తారు.

మా అమ్మ పడే బాధను చూసి చాలా బాధ పడేవాడిని. అన్ని విషయాలు సార్, అమ్మగారితో చెప్పుకునేవాడిని. సార్ "అరేయ్ దారిలో వెళుతూ ఉంటాము, ఉన్నట్టుండి వర్షం కురుస్తుంది.....అప్పుడేమౌతుంది తడిసిపోతాము...వర్షం తగ్గిన తర్వాత మరలా మన ప్రయాణం జరుగుతుంది కదా! ఇది కూడా అంతే" అని ఓదార్చేవారు. మా అమ్మ మరణించాక మైలతో ఉన్నప్పుడు సార్ ఇంట్లోకి రానిచ్చారు. మా అమ్మ కర్మలకు సార్ ఆర్థిక, కాయిక సాయం కూడా అందించారు.

సార్ నన్ను గొలగమూడికి తెప్పించటమే కాకుండా నా బ్రతుకు తెరువు కోసం షాప్ కూడా పెట్టించారు. ఆ షాప్ ఎక్కడ పెట్టాలో స్వామి దగ్గర చీట్లు పెట్టించి దాని ప్రకారం నడిపించారు. షాప్ పెట్టటానికి డోర్ తయారుచేయించటానికి వండ్రంగిని పిలుద్దామనుకుంటే సార్ నాతో "నువ్వు చేయలేవా?" అని అడిగారు. అందుకు ప్రయత్నించి నా అంతట నేను

డోర్ తయారు చేశాను. సార్ చెప్పినట్లు చేయటం వల్ల నాకు తృప్తిగా ఉంది. అంతేగాకుండా రకరకాల పనులు చేయటం వచ్చింది.

ఈ రోజు మేము హాయిగా తృప్తిగా ఉన్నాము అంటే సార్ కృపే!

నా భార్యకి నేను ఎక్కువ మా అమ్మ దగ్గర ఉంటున్నానని, లేకపోతే సార్ దగ్గర ఏదో ఒక పని చేస్తూ ఇంట్లో ఉండనని సార్ అంటే కోపం. అందువలన సార్‌ని అనవసరమైన మాటలు మాట్లాడేది. సార్‌కి చెప్పి బాధ పడితే ఓర్పుగా ఉండమనేవారు. అలానే ఉన్నాను. సార్ సమాధి అయిన తర్వాత మా అత్తగారికి, నా భార్యకి సార్ సమాధి దగ్గర ఆరతులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా వెళితే హాయిగా ఉండేది. ఎంతో వ్యతిరేకంగా ఉన్న మా వాళ్ళ మనస్సులలో స్వామిపై సార్‌పై విశ్వాసం భక్తి చిగురింపచేయటం, వారి సేవ చేయించుకొనుటకు మరల్చటం వారి దివ్య కృప కాక మరేమిటి? కృతజ్ఞతతో స్వామి అండలో ఎప్పుడు జీవించాలని కోరుకుంటున్నాము.

# రవికుమార్ గారు, విద్యానగర్

రవికుమార్ గారు విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో మెకానికల్ డిపార్టుమెంటులో ప్రొఫెసార్ గా పనిచేస్తున్నారు. సార్‌తో ఉన్న అనుబంధాన్ని, నేర్చుకున్న విషయాలు, పొందిన లబ్దిని ఇక్కడ తెలియచేస్తున్నారు.

నేను విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో బి.టెక్ చేస్తున్నప్పుడు శ్రీ భరద్వాజ మాస్టారి గారి విద్యార్థి శ్రీ చెన్నయ్య గారి ద్వారా శ్రీ భరద్వాజ మాస్టారి గురించి తెలిసింది. ఆయన ద్వారానే మొదటిసారి శ్రీ సుబ్బరామయ్య గారి దర్శనం 1994 వ సంవత్సరం నవంబర్ లో అయ్యింది. అప్పుడు సార్ శ్రీ వెంకయ్యస్వామి సమాధి మందిరం వెనుక రేకుల షెడ్డులో ఉండేవారు. మొదటి దర్శనంలో సార్ మాతో ఉదయం 10గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మాట్లాడుతూనే ఉన్నా మాకు కాలగతి తెలియలేదు. మాకు ఎందుకు వచ్చామో, ఉద్యోగం గురించి గుర్తే రాలేదు. శ్రీ చెన్నయ్య గారు నన్ను గొలగమూడి శ్రీ వెంకయ్యస్వామిని దర్శించమని, సుబ్బరామయ్య సార్‌ని కలవమని ప్రోత్సహించే వారు. దాని తర్వాత సార్‌ని రెగ్యులర్ గా కలుస్తూ ఉండేవాడిని. సార్‌కి అప్పట్లో మేము తీసుకువెళ్ళిన పంచదార ఇస్తే

తీసుకునేవారు. కానీ తర్వాత అకస్మాత్తుగా తీసుకోవటం ఆపేసారు.

బి.టెక్ అయిన తరువాత నేను నాగపూర్‌లో ఇంజనీరింగ్ కాలేజీలో మా అక్కయ్యతో కలసి పనిచేసాను. ఎప్పుడు ఇంటికి వెళ్ళినా దారిలో గొలగమూడిలో ఆగి శ్రీ స్వామి దర్శనం, సార్‌ని కలిసేవారము. సార్‌ని చూసినప్పుడు విపరీతమైన ఆనందం ఉండేది. ఒక్కొక్కసారి మా కోసమే సార్ ఎదురు చూస్తున్నట్లు ఉండేది. నేను భరద్వాజ మాస్టారి లిటరేచర్ చదవటం వలన, విద్యానగర్‌లో మాస్టారి విద్యార్థుల వల్ల శ్రీ భరద్వాజ మాస్టర్ గారి మీద గురుత్వ భావముండేది. సార్ మీద నాకు అలాంటి భావముండేది కాదు. కానీ సార్‌ని చూస్తే ఒక పరిపూర్ణ వ్యక్తిగా కనపడేవారు. నాకు సార్ మాత్రమే భరద్వాజ మాస్టారు గారు చెప్పిన విషయాలు యదాతథంగా పాటించిన వారు అనిపించేది. సార్ చెప్పేదానికి చేసేదానికి ఏమాత్రం తేడా ఉండేది కాదు.

నా MTech పూర్తి అయిన తర్వాత విద్యానగర్ లో లెక్చరర్ గా చేరిన తర్వాత శివరత్నంతో పరిచయం ఏర్పడింది. మేమిద్దరమూ ప్రతి శనివారం రాత్రి గొలగమూడి వచ్చి శ్రీ వెంకయ్యస్వామి దగ్గర ప్రదక్షిణలు

చేసుకుని సార్‌ని కలిసి వెళ్ళేవారము. ఏదో సార్ మమ్మల్ని పిలిచినట్లు ఉండేది. నాకు భరద్వాజ మాస్టారి గురించి అప్పట్లో ఎక్కువ చదవటం, వినటం వలన సార్ మీద గురుత్వ భావన కలగలేదేమో అని అనిపిస్తుంది. కానీ నేను గమనించింది ఏమిటంటే సార్ దగ్గర వచ్చిన వాళ్ళు ఎలా ఉండాలి, వారి గురించి అన్ని విషయాలు, వారికి ఏమవుతుందో అనేది సార్‌కి పూర్తిగా అవగాహన ఉండేది. నాకు తెలిసిన శ్రీ భరద్వాజ మాస్టర్ భక్తులు సార్ దగ్గరకొచ్చి తమ బాధలు చెప్పుకునేవారు. సార్ వారిని వెంకయ్యస్వామి దగ్గర 40రోజులు ఉండండి, మీ సమస్య తీరకపోతే నాదీ పూచీ అని ఎంతో భరోసా ఇచ్చేవారు. దాదాపు అందరూ ఆ మాటలిని పాటించలేకపోయారు. వారు ఆ సమస్యలతో జీవితాంతం బాధపడుతున్నారు.

సార్ చెప్పింది చేస్తారు. చేసేదే చెపుతారు. ఒకసారి సార్ అమ్మగారికి చెయ్యి విరిగితే వైద్యానికి పుత్తూరు ఊరికి రెండు మూడు కిలోమీటర్ల శివార్లలో ఉన్న వైద్యాలయానికి తీసుకు వెళ్లారు. సార్ అక్కడికి వెళ్ళిన రోజు రాత్రి 11గంటలకు కాలు విరిగిన ఒకతనిని కొందరు మోసుకు వచ్చారు. వారు చాలా దూరం నుండి వచ్చినట్లున్నారు అందువలన అలసిపోయారు.

అందువలన అతని తీసుకు వచ్చిన వెంబడే వాళ్ళు నిద్రపోయారు. కానీ ఆ కాలు విరిగిన అతను నొప్పని, ఆకలి అని అంటున్నా ఎవరూ పట్టించుకోలేదు. సార్ అతని ఆకలి బాధకు చలించి అంత రాత్రి పూట రెండు మూడు కిలోమీటర్ల దూరం నడిచి ఊర్లోకి వెళ్ళి అక్కడ ఏదో ఒక ఇంటిలో వెలుగు కనిపిస్తే ఆ ఇంటి వారిని విచారించి, ఆ దగ్గరలో ఉన్న హోటల్ కు వెళ్ళి, వాళ్ళను నిద్ర లేపి, అల్పాహారాన్నిచేయించి, దాన్ని తీసుకు వెళ్ళి ఆ కాలు విరిగిన అతని ఆకలి తీర్చారు. సార్‌కి ఎవరో కాని వాళ్ళ కోసమో అంత చేసే సరికి ఆయనకి ఎంతటి కరుణ అని అనిపిస్తుంది. అంతేగాక సార్ రిస్క్ టేకర్ అనిపిస్తుంది.

సార్‌ని చూస్తూ ఉంటే నాకు ఒళ్ళు తేలిపోతున్నట్లు ఉండేది. వెంకయ్యస్వామి గురించి చెపితే స్వామి నా కళ్ళ ముందర కనిపిస్తున్నట్లు ఉండేది. సార్ రాత్రుళ్ళు ఏదో విద్యార్ధి పరీక్షకు ప్రిపేర్ అయినట్లు వ్రాస్తూ ఉండేవారు. తెల్లవారుఝామున పూజ చేసి వచ్చిన తర్వాత కూడా వ్రాస్తూ ఉండేవారు. ఆ సన్నివేశాన్ని చూసినప్పుడు, ఎప్పుడు తలుచుకున్నా ఆశ్చర్యం కలుగుతుంది.

శివరత్నం, నేను సార్ దగ్గరకి వచ్చి మా ఆరోగ్య సమస్యలు సార్‌కి చెప్పుతూ ఉండేవారము. ఒకసారి సార్ మాస్టర్ ఇ.కె. గారి హోమియో సంస్థ నెల్లూరులో ఉన్నదని, అక్కడ దాన్ని నడుపుతున్న శ్రీ దాసు గారిని కలవమని చెప్పారు. దాసు గారు మందులు ఇస్తూంటే తీసుకుని వెళ్లి వస్తూండేవారము. ఒకసారి దాసు గారి ఇంటికి వెళితే వారి శ్రీమతి మీరే మందులు ఇవ్వచ్చు కదా అంటే మేమెట్లా ఇస్తామనుకున్నాము. ఆవిడ శ్రీ ఆంజనేయులు గారు క్లాసులు తీసుకుంటారు, ఆయనను అడగండి అన్నారు. ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వేస్తూ చివరికి ఒకరోజు స్వామి దండం పెట్టుకుని ఆంజనేయులు గారిని కలిసిన తర్వాత అయన మాకు, ఇంకొంత మందికి క్లాసులు తీసుకుని హోమియో వైద్యం నేర్పించి, విద్యానగర్‌లో హోమియో హాస్పిటల్ పెట్టించారు. దాని వల్ల మేము ఎంతో మేలు పొందుతున్నాము. ప్రక్కవారికి చేయగలిగిన చిన్న సాయం చేస్తున్నాము. నాకు ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది ఏమిటంటే ఈ కాలంలో నెలకి ఒక ఇంట్లో వేల రూపాయల ఖర్చు ఉంటే ఇన్ని సంవత్సరాలు అయినా మా ఇంట్లో మందుల ఖర్చు 100 నుండి 200 రూపాయలు మాత్రమే. సుబ్బరామయ్య సార్ కూడా

హోమియోని ఎక్కువ ప్రోత్సహించేవారు. భరద్వాజ మాస్టారు కూడా సార్‌కి టిస్స్యూ సాల్ట్స్ గురించి కొన్ని పేపర్లు ఇచ్చారు. ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటుంటా సార్ మా చేత హోమియో పెట్టించి మాకు, సమాజానికి ఉపయోగపడే పని చేయిస్తున్నారని.

సార్ మనకి సరైన దృక్పథం ఉండాలని, దాని ప్రకారం నడుచుకోవాలని ఉన్నట్లు అనిపించేది. నా ఉద్యోగంలో చిన్న చికాకు వచ్చినా సార్‌ని పట్టుకునేవాడిని. సార్ అన్నింటికీ సమాధానం ఇస్తూ నన్ను సముదాయించి పంపించేవారు.

నాకు పెళ్లి చేసుకోవాలని ఉండేది కాదు. ఇంట్లో వాళ్ళు పెళ్లి సంబంధాలు చూస్తూ ఉండేవారు. ఒక సంబంధం ఖాయం చేసారు. నేను సార్‌కు అన్ని విషయాలు చెపుతూ ఉండేవాడిని. నా పెళ్ళికి నా వైపు బంధువులు రాలేకపోయారు. నా కాలేజీ లెక్చరర్స్ వాన్ వేసుకుని వస్తూ ఉంటే సరిగ్గా గూడూరు నుండి నెల్లూరు వచ్చే దారిలో గొలగమూడి అడ్డరోడ్డు దగ్గర ఆక్సిడెంట్ అయ్యింది. వాన్ తుక్కు తుక్కు అయ్యింది. ఎవరికీ ఏ ప్రమాదం జరుగలేదు. ఏదన్నా జరిగి ఉంటే మా జీవిత కాలం బాధపడేవాడిని. బాగా చెప్పగలను ఇది స్వామి కానీ, సార్ కానీ చేసే ఉంటారు. ఆ తర్వాత రోజు

ఉదయం నా పెళ్ళికి సార్ శ్రీమతి గారు(అమ్మగారు), శేషయ్య రావటం విశేషంగా అనుకుంటాను. పెళ్లి అయిన తర్వాత సార్ దగ్గరకి వెళ్ళితే సార్ నవ్వుతూ "పెళ్లి చేసుకోను అన్నావు, చేసుకున్నావే!" అని చమత్కరించారు.

సార్ నాకు కొన్ని హింట్స్, సూచనలు ఇచ్చేవారు. కానీ అన్నీ నేను అందుకోలేకపోయాను. విద్యానగర్ మందిరంలో సత్సంగం చేయమన్నారు, నేను చేయలేకపోయాను. నాకు లేట్‌గా పిల్లవాడు పుట్టాడు. ఒక విషయం ఇప్పటికీ అనిపిస్తుంది ఏమిటంటే : 'నాకు పిల్లవాడు పుట్టక ముందు ఒక మెడికల్ రిపోర్ట్ తీసుకుని స్వామి దగ్గరకి వచ్చాను. స్వామి దర్శనం చేసుకున్న తర్వాత సార్‌కి చెప్పి వెళదామనిపించింది. కానీ వెంటనే సార్‌ని అడుగుతున్నామంటే భిక్షము అడిగినట్లే, ఎన్ని కోరికలని తీర్చమని సార్‌ని అడగాలి అని అనుకుని సార్‌ని కలవకుండా వెళ్ళిపోయాను. ఆ రోజు సార్‌ని అడిగి ఉంటే మాకు ఏమీ ఇబ్బందులు లేకుండా త్వరగా పిల్లవాడు పుట్టేవాడు అనేది నా అభిప్రాయం'.

నేను భగవంతునికి కాలం ఇస్తున్నాను అంటే కేవలం సార్ కృప మాత్రమే. సార్ పుస్తకాలలో చదివి భగవంతునికి ఒకే సమయం ఇవ్వటం ప్రారంభించాను.

మధ్యలో ఆరతులు చేయలేక పోతున్నాను అని సార్‌కి లెటర్ వ్రాస్తే **సార్ "నాకు ఆరోగ్యం బాగుండే ప్రొద్దున్న రెండు గంటలకు లేస్తున్నానా, స్నానం చేస్తున్నానా, పూజ చేస్తున్నానా?"** అని చెప్పినది నన్ను మార్చేసినది. తర్వాత నుండి కొన్నిసార్లు ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా పూజ కోసం సమయం కేటాయించగలిగాను అంటే సార్ స్ఫూర్తిదాయక జీవిత విధానం మాత్రమే!

నాకు భరద్వాజ మాస్టారు కలలో కనపడి "వార్తాలాపం చదువు మలదోషం పోతుంది" అని చెప్పారు. ఆ విషయమై సుబ్బరామయ్య సార్‌తో చెప్పాను. అప్పుడు వార్తాలాపం గ్రంథం ఎక్కువ ముద్రణలో లేదు. సార్ వెంబడే భరద్వాజ మాస్టారు గారి ధర్మపత్నిని, విద్యానగర్‌లో కొంతమందిని ప్రచురిస్తారా అని వాకబు చేయిస్తూ చాలా ప్రయత్నాలు చేసారు. పుస్తకం ప్రింట్ చేసిన వారి గారి అనుమతి తీసుకుని, చివరికి సార్ శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ ద్వారా ప్రచురించాలని నిర్ణయం తీసుకున్నారు. సార్ ప్రోద్బలంతో కొంతమంది భక్తులను విచారించి బెంగుళూరులో చాలా పాత గ్రంధము (ముట్టుకుంటే కాగితం చినిగి పోతుందా అన్నట్లు) ఉందని తెలుసుకుని, వారిని సంప్రదించి, ముద్రించాము. ఈ రోజు మనకు

వార్తాలాపం అనే గ్రంథము మనకు వచ్చిందంటే సార్ ప్రయత్నము, మాస్టారి కృప వల్ల మాత్రమే సాధ్యమయ్యింది.

- **సార్ చెప్పగా, సార్ గురించి తెలిసిన వారు చెప్పిన విషయాలు:**

1. గొలగమూడి వచ్చిన కొత్తలో సార్ సత్సంగం చేసే విధానం, ఋజుప్రవర్తన వలన కొంతమందికి గుర్రు అయ్యింది. వారు సార్‌ని చంపేద్దామనుకున్నారని (తలుపులు బయటనుండి గడియబెట్టి తగలబెడదామనుకుంటున్నారని) సార్‌కి ఒకావిడ తెలియజేసింది. సార్ సైకిల్ మీద పారిపోబోతూ శ్రీ వెంకయ్యస్వామికి దండం పెట్టుకుంటూ చచ్చేది ఎట్లాగయినా చస్తాం కదా (నాగుపాము కాటేసినా, లారి క్రిందపడినా) ఇంక ఎక్కడకీ వెళ్లనని ఇంట్లోకెళ్ళి పడుకున్నారు. స్వామిదయ వలన ఏ అపాయమూ జరుగలేదు.
2. సార్ శ్రీ భరద్వాజ మాస్టారి గారి మాట ప్రకారం ప్రతిరోజూ ఉదయం 6గం||ల నుండి పూజ చేసేవారు. ఒకరోజు పటాల వెనుక నాగు పాము

పడుకుని ఉంది. సార్ ఏ మాత్రం భయపడకుండా పూజ చేయటమే గాక పాము వెళ్లి పోయే దాకా ఆ గదిలోనే ఉన్నారు. ఆ గది కేవలం 4 అడుగుల వెడల్పు, 6 అడుగుల పొడుగు మాత్రమే!

3. ఒకసారి సార్ ఒక పాము వైపు చేయి పెట్టగానే దాని నోట్లోంచి కప్ప బయటకు వచ్చింది. ఇది చెన్నబసప్ప, వీరభద్రప్ప పూర్వజన్మ సన్నివేశం లాగా ఉంది.

- **సార్‌తో దివ్యానుభవాలు:**

1. నేను ఉద్యోగంలో చేరిన తర్వాత నా మనస్సు గందరగోళంగా ఉండి విద్యార్థులకు సరిగ్గా పాఠం చెప్పలేకపోతున్నానని బాధగా సార్‌తో చెప్పుకున్నాను. సార్ నన్ను శ్రీ వెంకయ్యస్వామి ధుని మందిరంలో 3 గంటలు ఉండమన్నారు. నేను అలానే 5 గంటలుకు పైగా ధుని మందిరంలో ఉన్నాను. అంతే తర్వాత నుండి మనస్సు చాలా ప్రశాంతమయ్యి ఆ తర్వాత నుండి విద్యార్థులకు పాఠం చక్కగా చెప్పగలుగుతున్నాను.
2. మా అక్కయ్య MTech REC Calicut లో కంప్యూటర్ ఇంజనీరింగ్ లో చేరింది. ఆ సబ్జెక్టులు

బాగా చదివేది. క్లాసు మొదటి రాంక్ వచ్చినా, రెండవ సెమిస్టర్ నుండి ఎందుకు చదవాలి అనే విషయమై ఆలోచిస్తూ ఏమీ చదవకుండా ఉంది. అప్పుడు మా అమ్మగారు మా అక్క విషయం సార్‌కి చెపితే సార్ మా అక్కకు లెటర్లు వ్రాసి, స్వామి స్మరణలో ఉండేటట్లు చేసారు. అంతేగాకుండా తన క్లాసులో మొదటి రాంక్ రావటం, ఉద్యోగం రావటంలో సార్ పాత్ర గణనీయమైనది.

- **రవికుమార్ గారిలో గుర్తించిన ఈ క్రింది విషయాలు వారికి సార్‌తో అనుబంధం తెలుపుతున్నాయి:**

రవికుమార్ గారు MTECH చేస్తున్నప్పుడు కలలో భరద్వాజ మాస్టారు కనపడి అన్నం పెట్టారు. అంటే ఆయనకు భరద్వాజ మాస్టారే అన్నం పెడతారని, లక్షల రూపాయల ఉద్యోగాలకు ప్రయత్నించకుండా విద్యానగర్ ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా చేరి అక్కడ మందిరంలో, మాస్టర్ E.K. హోమియో వైద్యాలయంలో సేవ చేస్తున్నారు.

రవికుమార్ గారి గైడెన్స్ వల్ల కొంతమంది భక్తులు పొత్తూరి వెంకటేశ్వరరావు, బట్టు శ్రీ రామకృష్ణ, ప్రసాద్ లు సార్‌ని గురువుగా ఆశ్రయించారు. వారు

ఎప్పుడయినా దానికి కృతజ్ఞతను వ్యక్త పరిచినప్పుడల్లా రవికుమార్ గారు ఆ మాటను తోసిపుచ్చుతూ “మీ అదృష్టం నాయనా! ఎవరి కష్టం వాళ్ళు పడాల్సిందే, దీనిలో నేను చేసిందేమీ లేదు” అంటారు.

వార్తాలాపం గ్రంథ ముద్రణకు రవికుమార్ సార్ యొక్క కృషి అనిర్వచనీయము – ఆ గ్రంథము ఉన్నవాళ్ళను కనుక్కొని, బెంగుళూరు నుండి గ్రంథము తెప్పించుకుని, తనకు తెలిసిన వారికి ఆ గ్రంథము యొక్క గొప్పతనము తెలియజేసి వారిచ్చిన హృదయ పూర్వక దక్షిణతో గ్రంథాన్ని ప్రింట్ చేయించటం అనేవి పైకి కనపడే కొన్ని పనులు మాత్రమే.

# తిరుమల శెట్టి నారాయణ

తిరుమల శెట్టి నారాయణ తనకు శ్రీ సుబ్బరామయ్య సార్ తనను కన్న బిడ్డలా చూసి చదువు, ఉద్యోగం ఇప్పించడమే గాక తన ప్రాణాలును కాపాడిన విషయాలు చెపుతున్నారు.

- **సార్ నన్ను చదివించటం:**

నేను 10వ తరగతి అయిన తర్వాత తరచుగా స్వామి దగ్గర సేవ చేస్తుండే వాడిని. అప్పట్లో ప్రతిరోజు స్వామికి ఉదయము సాయంత్రము అభిషేకం చేసే

వాళ్ళం. సుబ్బరామయ్య సారు నన్ను చూసి స్వామి సేవ చేయటానికి ఎక్కువ ఎంకరేజ్ చేసే వాళ్ళు.

ఒకసారి నాతో అరే నువ్వెక్కడుంటే మీ నాయన ఎక్కడికి వెళ్ళనివ్వడు. నీవు చదువుకోలేవు. అందువలన నీవు నెల్లూరు ట్యూషన్‌కి వెళ్లి నీవు 10 వ తరగతిలో తప్పిపోయిన సబ్జెక్ట్ ని క్లియర్ చేయి అని చెప్పారు. నేను సుబ్బరామయ్య సార్ చెప్పినట్లే నెల్లూరులో ట్యూషన్ కి వెళ్లి సెప్టెంబర్ కల్లా నా సబ్జెక్ట్సి క్లియర్ చేశాను.

తర్వాత గొలగమూడి వచ్చి మా నాన్నతో పాటు పనిచేస్తూ ఉండే వాడిని. మాకు వ్యవసాయం ఉంది, బర్రెలను చూసుకోవాలి. స్వామి మందిరంలో సేవ చేసుకునే అవకాశం ఉండేది. అందువలన నాకు ఒక్క క్షణం తీరిక ఉండేది కాదు. కొన్ని రోజులకి ఎవరికీ చెప్పకుండా నేను స్వామి దగ్గర చీట్లు పెట్టాను - ఏమని ఇంటర్మీడియట్లో చేరాలా, ఐ టి ఐ లో చేరాల, పాలిటెక్నిక్‌లో చేరాలా అని పెడితే స్వామి పాలిటెక్నిక్‌లో చేరమని చెప్పారు. దాన్ని తగ్గట్లుగా ఫిబ్రవరి-మార్చిలో అప్లికేషన్ తీసుకువచ్చి సార్‌కి ఇచ్చాను. అప్పుడు సార్ వాళ్ళ అమ్మాయి సుమతక్క రాహుకాలం చూసి మంచి ముహూర్తంలో పాలిటెక్నిక్ అప్లికేషన్ ఫిల్ చేసింది. నేను పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష రాస్తే 12000 రాంక్

వచ్చింది. రెండు నెలల తర్వాత పాలిటెక్నిక్ కౌన్సిలింగ్‌కి కాల్ లెటరు వచ్చింది. సార్ మా నాన్నతో పాలిటెక్నిక్ ఇంగ్లీష్ మీడియం అయితే నారాయణ ఎట్లా చేస్తాడు అని ఎన్నోసార్లు వాపోయేవారు.

నేను ఎప్పుడైతే వచ్చి స్వామి దగ్గర చీట్లు పెడితే స్వామి పాలిటెక్నిక్‌లో చేరమని చెప్పారని చెప్పానో అప్పటినుండి సుబ్బరామయ్య అయ్యవారు స్వామి చెప్పినట్లే పాలిటెక్నిక్ ప్రోత్సహించారు. 1990 అక్టోబర్ లో కౌన్సిలింగ్‌కి పిలిచారు. సుబ్బరామయ్య సార్ 'మీ నాయనకి తెలియదు నేను వస్తాను' అని చెప్పి నన్ను తిరుపతికి తీసుకుని బయలుదేరారు. ప్రయాణంలో ఒక చిత్రం జరిగింది. గూడూరులో మేము రైల్వేస్టేషన్ బస్టాండ్‌కి రిక్షాలో వస్తున్నాము. మేము రిక్షా దిగుతున్నప్పుడు సార్ ఒక బస్సును చూపి అది తిరుపతి బస్ ఏమో చూడమని చెప్పారు. నేను అది గుంటూరు బస్సు అని చూసి వచ్చి చెప్పాను. అక్కడ అది తిరుపతి బస్సు కాదని తెలిసింది. ఈ లోపల రిక్షావాడు వెళ్ళిపోయాడు. దాంట్లో నా సర్టిఫికెట్లు ఉన్న బాగ్ ను మర్చిపోయాను. మేము అక్కడ బస్టాండ్లో వెయిట్ చేస్తూ ఉంటే రిక్షా తొక్కే అతను మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి ఆ సర్టిఫికెట్లు ఇచ్చాడు. అది భగవంతుని కృప అని

అనుకుంటున్నాను. తిరుపతి వెళ్ళిన తర్వాత కౌన్సిలింగ్లో శ్రీశైలంలో మెకానికల్ ఇంజనీరింగ్ సీటు ఉంది కానీ మా నాన్న నెల్లూరు దగ్గర మాత్రమే చేర్పించమని, అలా చేస్తేనే డబ్బులు తక్కువ ఖర్చు అవుతాయని చెప్పటం వలన ఆ సీట్ నేను తీసుకోలేదు. గూడూరులో సివిల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్ లో సీట్లు ఉన్నాయి. అప్పుడు సారు “మనకు మైనింగ్లో తెలిసిన వాళ్ళు ఉన్నారు. నువ్వు తీసుకో అందువలన దాంట్లో మంచి ఉద్యోగాలు ఉంటాయి జాయిన్ అవ్వు” అని అన్నారు. అందువలన నేను మైనింగ్ కోర్సులో జాయిన్ అయ్యాను.

కాలేజీలో ఇంగ్లీష్ మీడియం వలన నాకు పాఠాలు అర్థం గాక ఇంటికి వచ్చేసాను. సుబ్బరామయ్య వారికి ఈ విషయం చెప్పలేదు. అంతేగాక సార్ అంటే భయం అందువలన సార్‌కి కనపడకుండా ఇంటి దగ్గరే ఉండే వాడిని. ఒకసారి బోర్‌లో నీళ్లు తీసుకొస్తుంటే, దూరం నుంచి సుబ్బరామయ్య సార్ నన్ను చూసి పిలిపించి కాలేజీ ఎలా ఉంది, ఏంటి సంగతులు అని అడిగారు. నేను ఇంగ్లీష్ మీడియం పాఠాలు అర్థం కావట్లేదని, నేను కాలేజీకి వెళ్ళను అని చెప్పాను. “అరే స్వామిని అడిగితే పాలిటెక్నిక్ తీసుకోమని చెప్పారు కదా అందువలన ఆయనే చూసుకుంటాడు. నీకంటే మొద్దు

వాళ్ళు ఉంటారు. కాలేజీకి వెళ్ళు, అన్నీ స్వామి చూసుకుంటాడు" అని సార్ ప్రోత్సహించారు. సార్ మాట కాదనలేక భయంతో కాలేజీకి వెళ్లాను. అక్కడ ప్రతిరోజు క్రికెట్ ఆడటం, క్లాసులకు హాజరు అవడం, పాఠాలకి నోట్స్ ప్రిపేర్ చేసుకోవడంతో రోజంతా గడిచిపోయేది. అందువలన ఇంటికి వెళ్ళాలి అనే భావన పోయింది. అట్లనే చిత్రంగా నాకు గవర్నమెంట్ వాళ్లు హాస్టల్ రూమ్‌ని అలాట్ చేశారు. తర్వాత రెండు మూడు నెలలకి గొలగమూడికి వచ్చినప్పుడు సుబ్బరామయ్య సారు నన్ను చూసి "ఏమోయ్ ఎలా ఉంది కాలేజీ" అని అడిగారు. నేను ఆనందంగా చాలా బాగుంది సార్ నాకంటే చదవని వాళ్ళు ఉన్నారు అని చెప్పాను. అలా నాకు మూడు సంవత్సరాలు జరిగిపోయింది. చివర్లో ఆరు సబ్జెక్టులు మిగిలిపోయాయి. నేను ఇంటికి వచ్చి సార్ దగ్గరకు కూడా వెళ్లలేదు. మా నాన్న చేత చెప్పి పంపించారు. మా నాన్నని సార్ అడిగి వాడిని ఒకసారి నా దగ్గరికి వచ్చి మాట్లాడమను అని చెప్పారు. నేను వెళ్లి సార్‌తో మాట్లాడితే తడవుకు రెండు చొప్పున వ్రాస్తే సంవత్సరంలో సబ్జక్ట్స్ అయిపోతాయిరా, నువ్వు ట్యూషన్ చెప్పించుకొని సబ్జెక్టులు రాయి అన్నారు. నేను అట్లానే

సార్ చెప్పినట్టు చేశాను నాలుగు సబ్జెక్టులు పూర్తి అయిపోయాయి.

మా నాన్నకి సుబ్బరామయ్య సార్ సాధన చేస్తున్నారని, అక్కడున్న స్వామి సేవకులు అందరికీ ఇష్టం కాబట్టి అభిమానం. అలాంటి వారికి నన్ను పని చేయమని చెప్పి ప్రోత్సహించేవారు. మా నాన్న సుబ్బరామయ్యసార్‌కి ఏదైనా పని ఉంటే నన్ను ప్రోత్సహించి మిగిలిన పనులు ఏమీ చెప్పకుండా ఉండేవాడు. అందువలన సుమతి అక్క పెళ్లికి సార్‌తో పాటు దగ్గరుండి పనిచేసేవాడిని. సుమతక్క పెళ్లి అయిన తర్వాత సార్ నన్ను కలిచేడులో తనతో పాటు పనిచేసిన నారాయణరావు అనే ఫ్రెండ్‌తో మాట్లాడి ఆయన దగ్గర మ్యాథమెటిక్స్ ట్యూషన్ చేరమన్నారు. అంతేకాదు చూపించడానికి సార్ స్వయంగా వచ్చి, ఆయనతో మాట్లాడి ఆయన్ని సార్ తనదైన శైలిలో బలవంతం చేసి ఒప్పించారు. ఆయనకి ఏదో శాస్త్రం తెలుసు-అందువలన మేము ఏ దిక్కు నుండి వచ్చాము అనే విషయాలు చూసి సుబ్బరామయ్య సార్‌తో నేను పాస్ అవుతాను అని, సాయంత్రం మాత్రమే చెప్తాను రమ్మని చెప్పారు. ఆయన చెప్పినట్లు నేను రోజుకి ఏడు గంటలు

కష్టపడే వాణ్ణి. దానితో అప్పుడు రాసిన మ్యాథమెటిక్స్ సబ్జెక్టు క్లియర్ అయిపోయింది.

ఇంకొక సబ్జెక్టు సర్వే ఉంది. నేను గూడూరు వెళ్లి అక్కడే కాలేజీ దగ్గర హాస్టల్లో ఉండి ప్రిపేర్ అవుతూ ఉండే వాడిని. ఒకసారి ప్రిపేర్ అవుతూ ఉంటే మా మైనింగ్ హెడ్ నన్ను చూసి కొన్ని ఇంపార్టెంట్ క్వశ్చన్స్ చదువుకోమని చెప్పారు. నేను అట్లానే చదివాను. ఆ క్వశ్చన్స్ ఎగ్జామ్‌లో రావటం, నేను ఆ సబ్జెక్టు క్లియర్ చేయటం చాలా చిత్రంగా జరిగిపోయింది. స్వామి పాలిటెక్నిక్ అని చీట్ల ద్వారా చెప్పటమే గాక పాలిటెక్నిక్ డిగ్రీ కూడా స్వామి ఇప్పించారు. నాకు మంచి ఉద్యోగం వచ్చి ఉద్యోగంలో మంచి పేరు వచ్చింది. మా పై ఆఫీసార్‌కి నా పనితనం మీద చాలా నమ్మకం. అది నా అదృష్టం.

సుబ్బరామయ్య వారు చెప్పినట్లు చేస్తే ఇబ్బందులన్నీ తొలగిపోతాయి. చెప్పినది చేయకుండా ఉంటే ఇబ్బందులు వస్తాయి అనటానికి ఇది ఒక ఉదాహరణ. మా సొంత అక్క తన భర్తతోతో తగుబడి మా ఇంటికి వచ్చి ఉంది. మా నాన్నతో సుబ్బరామయ్య సార్ “మనం ఆడపిల్ల వాళ్ళం తగ్గి ఉండాలి. నువ్వు వెళ్లి మీ అల్లుడితో మాట్లాడి అమ్మాయి కాపురం సరిచేసిరా” అని

చెప్పారు. కానీ మా నాన్న మొండి పట్టుదలతో వెళ్లలేదు. కొంతకాలం తర్వాత మా బావ రెండో పెళ్లి చేసుకున్నాడు. మా అక్క ఆత్మహత్య చేసుకుంది. సార్ మాట వింటే బాగుండేది అని నాకు అనిపించింది.

నాకు మ్యారేజ్ విషయంలో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు అని చెప్పాను, ఇప్పుడు పెళ్లి చేసుకున్నఅమ్మాయి గురించి "ఆమెకు ఏమీ రాదు ఎక్కువ చదువుకోలేదు, ప్రపంచ జ్ఞానం లేదు" అని సార్‌తో చెప్పాను. సార్ "పెళ్లి చేస్తే నీకే బయట ప్రపంచం గురించి నేర్పిస్తుంది లేరా" అని చెప్పారు. ఆ అమ్మాయితోనే నా పెళ్లి జరిగింది. ఇప్పుడు ఆ అమ్మాయే నాకు వాట్సాప్ ఎలా ఉపయోగించాలో, వాట్సాప్ లో కాలింగ్ ఎలా చేయాలో, మెసేజ్‌లు ఎలా చూడాలి అన్నీ కూడా నేర్పిస్తుంది. సార్ చెప్పిన మాట జరుగుతోంది.

నేను సార్‌ని సామాన్య మనిషిగానే చూశాను కానీ ఆయన గొప్ప మహానీయుడని నాకు తెలియదు. వేణుగోపాల్ సారు ఎప్పుడైతే సార్‌కి నమస్కారం చేసి, సార్‌కి అన్నీ తెలుసు నారాయణ అన్నప్పుడు మాత్రమే నేను సార్‌కి నమస్కారం చేసుకోగలిగాను. అంతేకాకుండా సార్ ఇంటి దగ్గర బావి త్రవ్వేటప్పుడు ఒక రాత్రి వర్షం వచ్చింది. సార్, నేను దగ్గరగా వదుక్కొని

పడుకొని ఉన్న సంఘటనను గుర్తు చేసుకుంటుంటే సారు అంత గొప్ప మహనీయులయ్యైనా ఎంత సామాన్యంగా నాతో ప్రవర్తించారు అనేది అర్థం అవుతోంది.

- **సార్‌కు అన్ని విషయాలు తెలుసు:**

అంతేకాదు సారు దగ్గర నాకు ఎన్నో సార్లు ఆయనకి అన్ని విషయాలు తెలుసు అనే సంఘటనలు కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తాను.

1. సాయి మాస్టర్ నిలయం నిర్మాణం జరుగుతున్నప్పుడు కసుమూరు వెళ్లి బెడ్ కంకర తీసుకురా అని చెప్పి నన్ను పంపించారు. అక్కడ ఎవరితో మాట్లాడాలి, అడ్రస్ అన్నీ చెప్పారు. నేను అక్కడికి వెళ్ళి సార్ చెప్పిన అడ్రస్ ప్రకారం వెళితే అన్ని పనులు చాలా త్వరగా అయిపోయాయి. సార్ దగ్గరికి వచ్చి మీకు అక్కడ అడ్రస్ ఎలా తెలుసు అంత కరెక్ట్‌గా చెప్పారు అంటే ఒక నవ్వు నవ్వారు.
2. ఇంకొకసారి స్టోన్ హౌస్ పేట మస్తానయ్య అనే మెడికల్ రిప్రజెంటేటివ్ ఇంటి అడ్రస్ ఇచ్చి జ్వరానికి, విరేచనాలకు, ఒళ్లునొప్పులకు మందులు తీసుకురమ్మన్నారు. ఈ మందులను సార్ దగ్గరకు ఎవరైనా వచ్చి ఇబ్బంది అంటే

వాటిని వాళ్లకి ఇచ్చేవారు. కరెక్టుగా అడ్రస్ చెప్పారు మీరెప్పుడైనా మస్తానయ్య ఇంటికి వెళ్లారా అంటే "ఎప్పుడూ వెళ్ళలేదు. ఎప్పుడో నా చిన్నప్పుడు ఆ ఏరియా చూశాను. అందువల్ల నాకు తెలిసింది అట్లా" అన్నారు. మస్తానయ్య అమ్మాయి చాలా బాధపడుతూ ఒక ఉత్తరం రాసి సార్‌కి అందించమంది. నేను గొలగమూడిలో సార్‌కి ఇస్తే సార్ చూడకుండా "అంటు రాకూడదు, బొంటు రాకూడదు" వ్రాసి ఉంటుంది అని ఆ ఉత్తరం ప్రక్కన పెట్టి సార్ స్నానానికి వెళ్లారు. నేను ఆ లెటర్ తీసుకుని చదివాను. దాంట్లో కరెక్ట్‌గా ఆ అమ్మాయి తన పెళ్లికి అంటు రాకుండా చేయమని వెంకయ్య స్వామిని ప్రార్థించమని వ్రాసింది.

భరద్వాజ మాస్టర్‌ని నేను నమస్కారం చేశాను అంటే, ఆయన కృప పొందిన అంటే అది కేవలం సారీ చెప్పడం వల్ల మాత్రమే నేను నమస్కారం చేస్తున్నాను.

ఒకసారి మా నాన్న గురించి 'స్వామి దగ్గర ఉన్నా ఏం లాభం, కొన్ని పనులు చేస్తున్నాడు' అని అంటే **సార్ "వాళ్ల పూర్వజన్మ సుకృతం. వాళ్ళ తప్పులు**

**కాకుండా వాళ్ళలో ఉన్న మంచిని గుర్తించి అది తీసుకోవాలి"** అని చెప్పారు.

మా ఇంట్లో సార్ ప్రత్యేకంగా వచ్చి గుంట త్రవ్వించి శంకుస్థాపన చేశారు. ఆ గుంట ప్రకారం సార్ చెప్పినట్లుగానే మేము ఇల్లు కట్టుకొన్నాము.

నా పెళ్లప్పుడు సారు నన్ను ఒక 30 నిమిషాలు పూజ చేయరా, తర్వాత నువ్వు చేయలేవురా అన్నారు. సార్ చెప్పినట్లే చేసాను. పెళ్లి అయిన తర్వాత నుంచి నాకు పూజ చేయటం బొత్తిగా సమయం దొరకటం లేదు.

2011 సంక్రాంతినాడు నేను సార్ దగ్గర ఉండి పని చేసి సార్ దగ్గర కూర్చొని ఉన్నాను. మధ్యాహ్నం రెండున్నర గంటలకు సారు నాతో ఇక్కడే ఉంటే ఆ అమ్మాయి తినదురా, నీకోసం ఎదురు చూస్తుంది వెళ్లి తిను అన్నారు. అంతేకాకుండా నాకు ఏ ఇబ్బందులు వచ్చినా కూడా సార్ దగ్గరకు వస్తే ఆ బాధలు తొలగి పోతాయి.

పని రీత్యా చీమకుర్తిలో నేను ఇల్లు తీసుకున్నాను. అక్కడి నుండి ఒంగోలుకి రావాలని చాలా ప్రయత్నించాను. ఎక్కడా ఇల్లు దొరకలేదు. నేను సార్ దగ్గరకు వచ్చి చెప్పాను. సార్ "దొరుకుతుందిలే" అని ఉత్సాహపరిచారు. దాంతో నేను ఏ ప్రయత్నం

చేయకుండా ఉన్నాను. మా మేనేజరు ఒక ఆయన తనకు తెలిసిన వాళ్ళు ఒంగోలులో ఉన్నారు వాళ్ళ ఇల్లు అద్దెకు ఇస్తారు అంటే పై పోర్షన్ అద్దెకు తీసుకున్నాం. కానీ అది మెడ మీది పోర్షన్ అవడంవల్ల మేము ఇంకొక ఇల్లు కోసం ప్రయత్నిస్తే 4500 రూపాయలు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక ఇల్లు దొరికింది. సార్ నాకు ఏ ఇబ్బందులు వచ్చినా కూడా తీస్తున్నారు

- **నన్ను ప్రాణాపాయం నుండి కాపాడిన సార్ :**

ఒకసారి ఏప్రిల్ 24 2016 నేను పని చేసే మైన్స్‌లో ఒక చోట పై నుండి ఒక బండ కింద పడింది నేను ఒక సంవత్సరం క్రితం ఆ బండ తీసేయాలి అని చెప్పాను. అప్పుడు ఎవరు ఆ మాట వినలేదు ఇప్పుడు పైనుంచి పడటం వల్ల తీసేసారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగలేదు.

2016 ఏప్రిల్ 2 నేను మైన్‌లో పని చేస్తున్నప్పుడు నా కాలికింద బండ జారిపోయింది. నేను వెనక్కి పడ్డాను బండ ముందుకు పడింది. అలా కాకుండా నేను ముందరకు పడినట్లయితే నాకు ప్రాణాపాయం కలిగేది ఇది కేవలం సార్ కృప వలన మాత్రమే జరిగింది. అంతకు ముందు ఒకరోజు రాత్రి కలలో సార్ కనబడ్డారు, నవ్వుతున్నారు. స్వామి ఈ రూపంలో కనబడ్డారు అని అనుకున్నాను. అంతే కాకుండా నేను అంతకు ముందు

దర్గా స్వామి దగ్గరికి వెళ్ళినప్పుడు స్వామి నాతో “నీవు కష్టపడి పని చెయ్, నేను చూసుకుంటాను మంచి పేరు వస్తుంది” అని ఆశీస్సులు ఇచ్చారు. నేను పని బాగా చేస్తానని మా ఆఫీసులో నేను అంటే చాలా అభిమానం.

- **సార్, భరద్వాజ మాస్టారు వేరు కాదు:**

చాలాసార్లు నాకు ఇంట్లో విషయాలు ఇబ్బందులు మాస్టర్ గారి దగ్గర బాధపడుతుంటే ఆ రోజు రాత్రి గానీ ఆ తర్వాత రోజు రాత్రి కానీ సార్ కలలో కనబడి నా మనసుని సమాధాన పరుస్తారు. స్వప్న దర్శనం ద్వారా మేము ఇద్దరం ఒకటే అని మాస్టర్ గారు చెప్పినట్టు ఉంది

అంతేకాకుండా సార్ ఒకసారి నాతో నీవు నాలుగు రూమ్ లు వేసుకుంటే నీ జీవితం గడిచిపోతుంది అన్నారు. సార్‌కు నా కృతజ్ఞతాభివందనాలు.

# శ్రీ దారా నాగేశ్వర రావు గారు, దమ్మపేట

శ్రీ దారా నాగేశ్వర రావు గారు దమ్మపేట వారికి స్వామితోను శ్రీ సార్‌తో గల అనుబంధాలను అనుభవాలను ఇలా పంచుకుంటున్నారు.

సుమారు 1983 సంవత్సరంలో స్వామి దర్శనానికి మొదటిసారి మావూరు దమ్మపేట సత్సంగ సభ్యులు లక్ష్మీ గారు మొదలగు కొందరితో నేను గొలగమూడి వచ్చాను. అప్పటికి భక్తులకు నీటి వసతి కానీ, మరుగుదొడ్లు కానీ, భక్తుల నివాసయోగ్యంగా కానీ ఏమీ లేవు. స్వామి మందిరం లోపలి దారిలోనే ప్రదక్షిణలు చేసేవారు. ఇంకేం కట్టడాలు లేవు. శ్రీ సార్‌ను సత్సంగ సభ్యులందరం కలిసినప్పుడు, ఎచటి నుండి వచ్చారు? అని విచారించి, మా అందరికీ సామాన్లు పెట్టుకోవడానికి వాళ్ళ ఇంటిని స్టోర్ రూమ్‌లా చేశారు. అంతేకాక లేడీస్‌కి బాత్రూములు వినియోగించుకోడానికి, మా ఇతర అవసరాలకు తల దాచుకోవటానికి ఇంటిని ఇచ్చారు. అంతేకాక స్వామితో వారికి గల అనుబంధాన్ని, గడిపిన సన్నివేశాలను హృదయానికి హత్తుకునేలా చెప్పారు. "శ్రీ భరద్వాజ మాస్టర్ బోధామృతం" అప్పటికి వెలుగులోకి రాకున్నా, ఆ వ్రాత ప్రతి నుండి కొన్ని సంఘటనలు వివరించేవారు. వారి ప్రేమ, మానవత్వదృష్టి, గృహస్తుగా ఉండి అంతటి పరోపకారం, భక్తులకు సేవ చేయడం మా హృదయాన్ని ఆకట్టుకున్నాయి. వారి మాటపై విశ్వాసం కూడా ఏర్పడింది.

శ్రీ సుబ్బరామయ్య సార్ అప్పట్లో ఖచ్చితంగా ఉదయం రెండు గంటలకు వెళ్ళి అభిషేకం, పూజ చేస్తుండటం, శ్రీ మాష్టారి మాట "కాలం-మనసు భగవంతుడు మన నుండి కోరేది" అని చెబుతుండడం నాకు నాటుకున్నాయి. దమ్మపేట లో సత్సంగంకి కూడా హాజరవుతుండడం వల్ల బాబాపై, స్వామిపై కొంత భక్తి విశ్వాసాలు ఏర్పడ్డాయి. కానీ నాకు చాలా ముందు నుండి అలవాటు పడిన ఒక దురలవాటు ఉండేది. Baba అది హెచ్చరించడమే కాక, మాన్పించడం చాలా చిత్రంగా జరిగింది.

2000 సంవత్సరంలో ఒకసారి నేను ఖమ్మంలో ప్రయాణమై దమ్మపేట వచ్చే బస్సు ఎక్కుతుండగా ఒక వ్యక్తి వచ్చి "నీకు ఒక వ్యసనం ఉంది. అది మానుకుంటే, మీకు ఎంతో మేలు జరుగుతుంది. నీ వల్ల ఎంతో మంచి పనులు జరుగుతాయి" అన్నారు. ఆ వ్యక్తి నాకు పరిచయం లేకపోవడమే కాక అంతకు ముందు కానీ, తర్వాత కానీ నేను ఎప్పుడూ చూడలేదు. నేను బస్సు ఎక్కి ఎందుకు ఇలా చెప్పారు అని ఆలోచిస్తే నేను పేకాట సమయం, సందర్భం లేకుండా ఎందరు చెప్పినా వినకుండా ఆడడం గుర్తు వచ్చింది. చిత్రంగా అది మొదలు నాకు పేకాట ఆడాలి అనిపించలేదు. ఫ్రెండ్స్‌కు

ఏవో మాయమాటలు చెప్పిన కొద్ది రోజులకి ఆ వ్యసనం సమూలంగా నిర్మూలమవటమే గాక పేకాట ఆడే చోటుకి కూడా ఏనాడూ వెళ్ళలేదు.

సార్ మాట **"నిర్ణీత కాలం-మనసు ఇవ్వటం"** కూడా లోతుగా నాటుకోవడంతో రోజు ఉదయం పది నిమిషాలు, సాయంత్రం పది నిమిషాలు బాబాకు ఇవ్వడం నియమంగా జరిగేది. ఆ సమయం ఇవ్వకుంటే ఆ రోజు మరు పూట వరకు నిరాహారిగా ఉండడం చేసేవాడిని. నా కూతురు పెళ్ళికి, కొడుకి ఉపనయనానికి దమ్మపేటలో ఉండి నియమం తప్పినందుకు శిక్షగా ఆహారమేమీ తీసుకోలేదు. మహాత్ముల నోట వచ్చిన మాటల నుండి ఎలా మార్పు వస్తుందో నాకు అనుభవమైంది. అనుభవాలు కూడా అలానే ఉండేవి.

ఒకసారి మార్నింగ్ స్కూల్ అని రెండు నిమిషాల ముందు వెళితే స్వామి ఒకనాటి రాత్రి కలలో కనబడి గడియారం చూపిస్తూ ఆరు గంటల ఇరవై ఎనిమిది నిమిషాలు చూపడం జరిగింది. రోజు 6 గంటల 30 నిమిషాలకు వెళ్ళే నేను రెండు నిముషాలు ముందు వెళ్లడమే స్వామికి సమ్మతం కాలేదు, సమయపాలన తప్పినట్లే లెక్క. అలానే రోజు మూడు పొర్లు దండాలు పెట్టడం కూడా చేసేవాడిని. ఒకవేళ ఏదో ఊరు వెళితే ఆ

రోజులు లెక్క పెట్టు కొని దమ్మపేట వచ్చాక రోజూ చేయాల్సినవి చేసిన తర్వాత సాయంకాలంగా బాకీ ఉన్నవి చేసేవాడిని.

ఒకసారి బొంబాయి మా అమ్మాయి వాళ్ళ ఇంటికి వెళ్లి 16 రోజులు చేయలేదు. తిరిగి వచ్చాక కూడా అశ్రద్ధ చేశాను. కాలునొప్పి వచ్చి తగ్గకుంటే నా భార్యకి స్వామి కలలో కనబడ్డారు. ఆవిడ మొరపెట్టుకుంటే స్వామి కలలో నా కాలు నొక్కి వెళ్ళిపోతూ అభయ హస్తం చూపించారు. అందులో 16 అంకె! బాకీ ఉన్నవి తప్పని సరిగా చేయాలని స్వామి చెపుతున్నారని నొప్పి అయినా ఆ పోర్లు దండాలు చేసాక నొప్పి పూర్తిగా దూరమైంది.

గొలగమూడి వచ్చినప్పుడు ఒకసారి సార్ ఒంటరిగా ఉండగా "స్వామిని ఎలా ప్రార్థించాలి" అని సార్‌ను అడిగాను. స్వామిని ఏమీ అడగకూడదు. ఎందుకంటే మనకు ఏది మంచిదో మనకంటే బాగా స్వామికే తెలుసు కదా! అన్నారు అప్పటివరకు స్వామి వద్దకు వచ్చినప్పుడల్లా కోరిక list తెచ్చి ప్రార్థించే నేను అప్పటినుండి ఏమి అడిగే వాడిని కాను.

**సార్ "స్వామిని నెలకొక సారైనా కృతజ్ఞతగా దర్శించుకుంటే ఆయన మనను ఎప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటారు"** అని చెప్పినది విని

నెలనెలా మా కుటుంబం నుండి ఒక సభ్యులు దర్శించుకోవడం ఎన్నో సంవత్సరాలుగా జరుగుతోంది. సార్ నుండి వచ్చిన మాట ఆచరణకు సులభంగా సహకరిస్తుంది అనటానికి ఇది నిదర్శనం. స్వామి దర్శనానికి వచ్చినప్పుడు స్వామి అన్నప్రసాదం తప్ప మరేమీ బయట తినకూడదనే నా మనస్సులోనే నియమం పెట్టుకున్నాను. మా అమ్మాయి ఒకసారి “మీరు తింటే నేను తింటాను. లేకుంటే టిఫిన్ తినను” అని పట్టుబట్టడంతో బయట తిన్నాను. స్వామి రాత్రి కలలో దీనంగా “అందరూ చెప్పే వారే నయ్య! చేసే వారు లేరు” అని అన్నారు. మనం మన మనస్సులోనే చెప్పుకుని, చేసే ప్రతి పనీ చూస్తూ రెస్పాండ్ అవుతూ అనుగ్రహిస్తారని అనుభవం ప్రసాదించారు.

ఇలాంటి వన్నీ చేస్తుంటే మా బంధువులు స్నేహితులు కొందరు “ఏమి ఆశతో అలా వెళుతున్నావు?” అని, “నీ పిచ్చి అని” అంటుండే వారు. నాకు ఏ కోరిక లేదు, “స్వామికి కృతజ్ఞతగా ప్రీతితో వెళ్లడమే” అనే వాడిని. కానీ ఒకసారి సార్‌తో ఇలా అంటున్నారు అని చెబితే “మీ ఇంట్లో దొంగలు పడినప్పుడు, ఎవరూ లేని సమయంలో, ఒక్క చిల్లిగవ్వ

కూడా పోకుండా కాపాడిన దెవరు?" (అనే) వాళ్ళు ఎవరైనా ఏమైనా చేయగలరా! అన్నారు.

మా అమ్మాయి వాళ్లకు సంతానం వెంటనే కలగలేదు మా అమ్మాయి నన్ను ప్రార్థన చేయమని చెబితే, నేను సార్‌కు చెప్పాను. సార్ "ఎవరి ప్రారబ్ధం వారే కడిగేసుకోవాలి అని వారిని వీలున్నప్పుడల్లా క్రమం తప్పకుండా స్వామిని దర్శించుకోమన్నారు." అలా చేయగా కొద్ది సంవత్సరాల్లోనే సంతానం కలిగింది. తరువాత "మీకు దగ్గరలో ఉన్న నాంపల్లి బాబా సమాధి, స్వామి సమాధి ఒక్కటే, నాంపల్లి బాబా గారిని సేవించుకో" మన్నారు. మా అల్లుడు ఇప్పటికీ తరచు శ్రద్ధగా దర్శించుకొని, పారాయణ కూడా చేస్తారు.

మా అబ్బాయి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తుంటే దొంగ (ఫేక్) సర్టిఫికెట్ పెడితే కానీ ఉద్యోగం రాదని, ఫ్రెండ్స్ అందరూ పెడుతున్నారు అని, ఏం చేయమంటారు అని సార్‌ని అడిగితే "మీ నాన్నగారు నెల నెలా వస్తుండగా నీవు అలా ఫేక్ సర్టిఫికెట్ పెట్టడం నాకు ఇష్టం లేదు, ధర్మం కాదు. ఉద్యోగం రాకుంటే మీ నాన్నగారు పోషిస్తారు" అన్నారు. మా అబ్బాయి ఏ ఫేక్ సర్టిఫికెట్ పెట్టకనే చిన్న టీచింగ్ జాబ్‌లో జాయిన్ అయ్యి

ఇప్పుడు పెద్ద లెక్చరర్‌గా, డిపార్టుమెంటు హెడ్ అయ్యి మంచి జీతంతో హాయిగా ఉన్నాడు.

నియమం అందరికీ ఒక్కటే సరిపోదు అన్నట్లు నా భార్య గొలగమూడిలో బయట, స్వామి వద్ద కూడా తినదు. ఒకసారి అనుమానం వచ్చి స్వామి వద్ద తినడానికి చీటిలు పెడుతున్నాను అంటే సార్ ముభావకంగా సరే అన్నారు. స్వామి వద్ద చీటీలు పెడితే వద్దు అని వచ్చింది. ఆ విషయం సార్‌కి చెపుదామని వస్తుంటే నేనేమీ చెప్పక మునుపే సార్ వద్దని వచ్చిందా! అని నవ్వుతూ అన్నారు. సార్ పరంగా వచ్చిన మార్పులు మా అందరికీ ఎప్పటికీ జరగడం సార్ దైవత్వాన్ని తెలుపుతున్నాయి.

సార్ సమాధి అయ్యాక ఒక వారం స్వామి సన్నిధిలో జరిగిన అనుభవం చెప్పి ముగిస్తాను. నేను గొలగమూడిలో ఉంటే ప్రతిరోజూ ఉదయం నాలుగున్నర గంటలకు గుడికి వెళ్లడం ప్రదక్షిణలు చేయటం అలవాటు, నిత్యవిధి. శుక్రవారం ఉదయం సార్ సమాధి చెందారు. ఆ ఆదివారం నాలుగు గంటలకు ఒక కలలో “సాయిమాస్టర్ నిలయం - తిరుపతయ్య గారు లేచి ప్రదక్షణలకు ఇంకా వెళ్లలేదా? అని అన్నారు.” నేను కలలోనే “ఈ రోజు ఆదివారం కదా! ఇంకా స్వామి

ప్రదక్షిణలు చేయలేము. గేటు మూసి వేసి ఉంటుంది.” అని అంటే శ్రీ సార్ “సమాధి నుండి బయటకి వస్తూ ఏమి? అక్కడ కాకుంటే ఇక్కడ (తమ సమాధికి) చేయకూడదా?” అని మూడుసార్లు అన్నారు. స్వామికి, సార్‌కి బేధం లేదని వారు నిత్య సత్యులై మన నియమాలను, నిత్య కృత్యాలను చూస్తూ పాటింప చేస్తుంటారని వారి కృప పొందేలా నడిపించమని ప్రార్థిస్తున్నాను.

# జగదీష్ గారు, మద్రాసు

మద్రాసు వాస్తవ్యులు జగదీష్ గారు, వారి సతీమణి ఉషారాణి సార్‌తో వారికి గల అనుభవాలను ఇలా పంచుకుంటున్నారు.

నేను (జగదీశ్ గారు) 1999 సంవత్సరంలో మా అక్క వివాహ సంబంధ విషయమై వెతుకుతూ తగినది దొరకని సమయమున శ్రీ వెంకయ్యస్వామిని గూర్చి మొదటిసారి విని, తగిన వరుడు దొరికి అన్ని సానుకూలంగా జరిగినచో వచ్చి దర్శనం చేసుకుంటానని చెప్పుకున్నా. త్వరలోనే మంచి సంబంధం కుదిరి వైభవంగా వివాహం జరిగినది. అప్పట్లోనే స్వామివారిని మొదటిసారి దర్శనం చేసుకోవడం మరలా మా

వివాహానంతరం, 2003 లో మరలా స్వామిని కలిసి దర్శించుకున్నాము. నా వివాహానికి ముందే నా భార్యకు వాళ్ళ అన్నయ్య ద్వారా  సాయినాధుని పరిచయం వారిపై అమిత విశ్వాసం ఉన్నవి. మేము ఉద్యోగరీత్యా 2005 చెన్నైకి మారిన తర్వాత స్వామివారిని దర్శించుకున్నప్పుడు స్వామి వారిపై పుస్తకము ఏదైనా కొనాలనుకుంటే  వెతుకగా పుస్తకాలు అమ్ము ఆయన "అవధూత లీల" ను ఇచ్చి ఇది చాలా గొప్ప పుస్తకం అని వాటి యందు లీలలు రచయిత ప్రత్యక్షంగా పరిశీలించి చక్కగా రాశారని ఎంతగానో చెప్పగా తీసుకొనడం చదవడం జరిగినది. ఆ పుస్తకం నందు స్వామివారి గూర్చి మరియు  సూక్ష్మంగా జీవిత లక్ష్యం గురించి తెలిపిన సార్‌పై గౌరవ భావము వారిని దర్శించుకోవాలి అన్న ఆసక్తి కలిగినది.

సుమారు 2010 సంవత్సరంలో సార్  సాయి మాస్టార్ నిలయంలో ఉంటారని తెలిసి దర్శించుకొనుటకు  వెళ్లడం జరిగినది అది సాయంత్రం హారతి పూర్తి అయిన సమయం, సార్ లోపల అటుపక్కగా తిరిగి సత్సంగంలో ఉన్నారు లోపలకి చూస్తున్న నా భార్యను సార్ గమనించి ఎంతో ఆప్యాయంగా నవ్వుతూ పలకరించి రమ్మని పిలిచారు.

మా భావనలకు భిన్నంగా సార్ ఎంతో నిరాడంబరంగా చాపపై కూర్చుని ఉన్నారు అప్పుడు జరిగిన సంభాషణ వివరములు: సార్! మేము అవధూత లీల చదివి మిమ్మల్ని, మీరు ఎలా ఉంటారు అని దర్శించ వచ్చాము అన్నాము. సార్ "నేనా వ్రాసాను అమ్మ! వెంకయ్య స్వామి రాయించారు. ఎగ్జాంపుల్‌గా పడుకుందాం అనుకుంటే ఆయన బుర్రలో ఏదో మెరుపు ఇస్తాడు. నా భార్యకు రాత్రిపూట లైట్ వేస్తే పడదు (ఉంటే నిద్రకు ఇబ్బంది) అయినా లైట్ వేసి రాయవలసి వస్తుంది" అని చెప్పారు సార్. "మీకు స్వామి కనబడుతూ ఉంటారా" అంటే నవ్వుతూ, ఒక్కసారి కనపడినందుకే నోరు కట్టేసాడు. ఉప్పు, పులుపు, కారం, నూనె ఏమీ లేకుండా చేశారు. అయినా స్వామి కనబడటం ఎందుకమ్మా అని, ధ్యానం చేయమని, స్వామి నీకే కనబడతారని చెప్పారు. రోజూ ధ్యానానికి నిర్ణీత కాలం ఇవ్వమని చెప్పారు అలా సార్‌తో మొదటి పరిచయం జరిగింది. సార్ ఎంతో హుందా అయిన మంచి బట్టలు వేసుకొని చేతిలో పుస్తకాలతో కనబడతారు అనుకుంటే అతి నిరాడంబరంగా ఎంతో పరిచయం ఉన్నట్లు వారిలా మాట్లాడడం మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. మరుసారి అతి త్వరలోనే స్వామి వారి దగ్గర నిద్ర చేసి సాయి

మాస్టర్ నిలయమునకు వెళ్లగా సార్ బయటకు వెళ్ళిపోతూ దర్శనం ఇచ్చారు. అరే ఏమి మాట్లాడ లేకపోయాము అని విచారించి బయటకు రాగా సార్ వేణుగోపాల్ గారి ఇంటి ముందు ఉన్నారు. సార్‌ని పలకరిస్తే అచ్చటనే మెట్లపై కూర్చొని ఉదయం 10 గంటల నుండి సుమారు మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎంతో ఆత్మీయంగా సార్ స్వామి వారితో గల వారి పరిచయం, అనుభవాలు చెప్పి సారు మమ్మల్ని స్వామివారికి మరియు సార్‌తోనూ తెలియని అనుబంధంతో కట్టి వేశారు. ఆ మరుసటి దర్శనంలో సార్ బ్రహ్మంగారి మఠం ఎదుటి బిల్డింగ్ నిర్మాణ పనులులలో ఉండగా దర్శించడం, వెంటనే బయల్దేరుదాం అని అనుకున్న మమ్మల్ని మరు రోజు స్లాబ్ పని ఉంది అని చెప్పి మమ్మల్ని నిలువరించి సేవ చేయుట యందు ప్రోత్సహించారు.

మొదటి, రెండవ దర్శనంతోనే శ్రీ సార్‌పై మాకు ప్రత్యేకమైన భక్తి భావం ఏర్పడింది. సార్ దర్శనం మరలా చేయాలని, ఆ దర్శనంలో ఎంతో తృప్తి ఉండేది. మా పాపలకు నేర్పిన పాటలు మొదలైనవి సార్ వద్ద పాడించి వారి కృప పొందాలని ఉండేది. సార్‌ను సందర్శించక ముందు వెంకయ్యస్వామి దర్శనానికి వచ్చే దానికి,

తరువాత దర్శనాలకు మా జీవన విధానంలోనూ ఎంతో మార్పు వచ్చింది. అంతకు ముందు సినిమా పాటలు ఏవో కబుర్లతో దర్శించే మేము, సార్ సాంగత్యం, సార్ నోటితో స్వామితో వారి పరిచయాలు, సత్సంగం, వారి కృప పొందాలనే ఉత్సాహం, వారు స్వామి పిలిస్తే పలుకుతారు, తోడుండి నడిపిస్తున్నారు అనే అనుభవాలు, ఆ గుర్తింపు కలిగాక ఎంతో మార్పు వచ్చింది. అవధూత లీల, స్వామి గూర్చి మాట్లాడుకుంటూ రావటంగా మా ప్రయత్నం పెద్దగా లేకనే మారిపోయింది. జీవన విధానంలో కూడా ఎంతో మార్పు వచ్చింది. ఇదివరలో ప్రతి చిన్న విషయానికి కోపం వచ్చేది, ఇప్పుడు అయిష్ట పరిస్థితి వచ్చినా కోపం, బాధ అదుపులో ఉంటున్నాయి. అలానే ఇంటి వద్ద కూడా సమయం సద్వినియోగం చేసుకోవటం మొదలైనవి, స్వామి మీద ఆధారపడటం, ఏ పని ఆలోచించకుండా చేయకుండా, ధర్మమా, మంచి చెడులు ఆలోచించి అడుగు వేయటం, చదివింది ఆచరించే ప్రయత్నం చేయటం, అనవసరమయిన పట్టుదల పోయాయి.

ఈ మార్పులు వారి సత్సాంగత్యం, సన్నిధి, కృప వల్ల ఈ మధ్యలో ప్రసాదించిన అనుభవాల వల్ల

అనిపిస్తుంది. కొన్ని శ్రీ స్వామి, సార్ అనుగ్రహించిన అట్టి దివ్య అనుభవాలను మీతో పంచుకుంటాను.

మా ఇంటి పని జరుగుతుండగా ఒక ఇరుకైన సందు గల పొడుగాటి గోడకు పెయింటింగ్ వేయటం మాత్రం ఎన్ని రోజులైనా జాప్యం జరుగుతూ వచ్చింది. మా ప్రయత్నాలు ఎంత ఉన్నా తగిన పెయింటర్ దొరకలేదు. నాకు ఏది ఉన్నా బాబా, స్వామి వద్ద చెప్పుకోవటం చీట్లు వేయటం అలవాటు.

నేను ప్రార్దిస్తున్నప్పుడు సుబ్బరామయ్య మాస్టారు తమ ఇంటికి ఏ బేలుదారి చేత కట్టించాలనే విషయంలో స్వామి మీద ఆధార పడటం గుర్తు వచ్చి నేను చీట్లు వేసాను. ఏమని – మేము అనుకున్న పెయింటర్‌తో పని చేయించాలని ఒక చీటీ, స్వామి పంపించిన పెయింటర్‌తో పని చేయించమని శ్రీ స్వామి వారి ఆజ్ఞ అని రెండవ చీటీ పెట్టి తీస్తే రెండవ చీటీ వచ్చింది. ఈ విషయం మా వారికీ చెపితే ఆయన ‘స్వామి పంపడమేమిటి? మనమేమైనా సుబ్బరామయ్య మాస్టారిమా, మనకు స్వామి పంపినట్లు ఎలా తెలుస్తుంది’ అని అన్నారు. నేను సందిగ్ధంలో పడ్డాను. కానీ ప్రార్థిస్తున్నాను. ఒక నెలలో పెయింట్లు కూడా ఎండిపోతుండడంతో నా ఆత్రుత మరింత పెరిగి బాబాను

ప్రార్థిస్తున్నాను - నేను నిన్ను అడిగితే ఇలా చెప్పావు, మా వారు ఇలా అంటున్నారు. నేను ఇప్పుడు ఏమి సమాధానం చెప్పను అని. అంతలో ఇదివరలో ఎప్పుడో మాకు తెలిసిన వారితో చెప్పిన విషయం నేను మరిచినా, వారికి గుర్తు ఉండి వాళ్ళు ఒక వ్యక్తిని తీసుకువచ్చారు. నాకు స్వామి పంపిన వ్యక్తి అతనే అని అనిపించి బేరం కూడా చేశాను. కానీ తర్వాత అతను చెప్పిన వ్యక్తి అవునా కాదా అని సందేహం వచ్చింది. చీట్లు వేస్తే స్వామి అతనే అని చెప్పాడు. మేము మరలా అడగకుండా అతనే వచ్చి పని చేసి వెళ్ళాడు.

జగదీశ్ గారు ఇలా చెపుతున్నారు: సార్‌తో పరిచయ మయ్యాక మేము స్వామి దర్శనానికి వచ్చినప్పుడల్లా సార్ దర్శనానికి వెళ్ళేవారం. అలా వెళ్లినప్పుడు వేరే వాళ్ళు ఎవరైనా ఇంటి లోపలికి వెళ్ళి దర్శించుకుంటే నేను వెళ్ళే వాడిని కానీ నా అంతటా నేను వెళ్ళే వాడిని కాదు. ఒకరోజు నేను స్వామి దగ్గరకు వెళ్ళి వచ్చేటప్పటికీ రాత్రి తొమ్మిది గంటలు దాటింది. మరురోజు ఉదయం తెల్లవారుజామున నేను వెళ్లి పోవాల్సిన పరిస్థితి ఉంది అని చెప్పుకుంటూ ఎదురుచూస్తున్నాను. ఇంతలో ఏదో సంఘటన జరగడంతో అమ్మగారు తలుపు తీశారు. నేను సార్‌ను

మంచం మీద నుండి చూసి నమస్కరించుకుంటే సార్ పలకరించడం ఎంతో సంతోషం, సంతృప్తి అనిపించింది.

అలానే 2013 దసరా రోజు మా పెద్దమ్మాయి స్కూల్‌కి వెళ్లి పూజలో పాల్గొంటున్నప్పుడు మా రెండవ పాపని వచ్చే ఏడాది నుండి స్కూల్‌లో చేర్చాలి కదా, ఈ మంచి రోజున సార్ చేత అక్షరాభ్యాసం చేయిస్తే బాగుంటుందని, ఆ మధ్యాహ్నం చెన్నై నుండి బయలుదేరి రాత్రి సుమారు 9 గంటలకి గొలగమూడి చేరి సార్ దగ్గరకు వెళ్లగా అమ్మగారు విషయం అడిగి స్వామి దగ్గర అక్షరాబ్యాసం చేస్తారు, అయినా ఇప్పుడు టైం అయిపోయింది కదా అన్నారు. నా భార్య "సార్ చేతనే అక్షరాబ్యాసం చేయించాలని వచ్చాము" అని చెప్పింది. అమ్మగారు ఆయనకు బాగుండడంలేదు అని అంటున్నారు. ఇంతలో సార్ లేచి "సరంజామా తెచ్చుకున్నవా?" అని అడిగారు. బియ్యం, పలక, పుస్తకం అన్ని ఉన్నాయి కానీ పళ్ళెం సాయిమాస్టర్ నిలయం నుండి అవ్వను అడిగి తెచ్చుకుంటాను అని అంటే "ఎందుకు అమ్మగారు ఇస్తారని" చెప్పి అమ్మగారి దగ్గర నుండి పళ్ళెం తెప్పించి, అందులో బియ్యం పోసి మా చిన్న పాప చేత అక్షరాలు దిద్దించారు.

జగదీశ్ గారి భార్య ఇలా చెపుతున్నారు: మాకు 2015లో సార్‌కి బాగా సుస్తీ చేసి మాట్లాడట్లేదు అని తెలిసింది. నేను బాధపడి సార్‌కి బాగుండాలని అందుకు ప్రతిరోజూ హనుమాన్ చాలీసా చదువుతానని చెప్పుకుని చదువుతున్నాను. కొన్ని రోజుల తర్వాత సార్ దగ్గరకి మధ్యాహ్నం కి చేరుకున్నాము. సార్ దర్శనం చేసుకుందామని సార్ ఇంటి లోపలకి వెళ్ళితే అమ్మగారు 'సార్‌కి బాగాలేదు అని మమ్మల్ని బయటకు వెళ్ళమన్నారు. మనస్సులో బాధపడుతూ వెనక్కి తిరిగి బయటకు వెళ్లబోతున్నాము. అంతలోనే సార్ చిత్రంగా పడుకున్న వారు చేతికి ఆసరాగా ఉంచిన తాడును లాగి లాగి చుట్టి లేవడానికి యత్నిస్తున్నారు. ఇది గుర్తించిన నగేష్ సార్‌తో 'లేస్తారా సార్' అని అడిగి ముందుకు కూర్చోబెట్టారు. సార్ నన్ను చూసి ప్రేమగా అడిగి మమ్మల్ని అందరిని దగ్గరగా పిలిచి ఆశీర్వదించారు. శరీరం సహకరించక పోయినా సార్ నా మనస్సులో ఉన్న ఆర్తిని గుర్తించి ప్రేమగా మాట్లాడటం నా అదృష్టంగా భావిస్తున్నాను.

2018లో స్కూల్ వార్షికోత్సవానికి వచ్చినప్పుడు అందరూ ఉండమన్నా మా పాపకు స్కూల్ వర్క్ ఉందని

రాత్రి బయలుదేరి చెన్నైకి కారులో వెళ్తున్నాము. అప్పటికే కారు బ్యాటరీ వీక్ గా ఉండటం వల్ల start చేయటానికి తోయవలసి వచ్చింది. అందుకు ఒకసారి స్టార్ట్ అయ్యాక మరల ఆపకుండా నడుపుతున్నాను. సుమారు 80 కిలోమీటర్ల తర్వాత టీ త్రాగుదామని కారుని ఇంజను ఆపకుండా పక్కకు నిలిపాను. టీ త్రాగి వచ్చి చూస్తే కారు వెనుక కుడి వైపున డోర్ లాక్ అవ్వకుండా ఉండటమేగాక, ఎవరో అదృశ్యంగా పట్టుకున్నట్లు పట్టి ఉంది. ఆ డోర్ కి ఆనుకుని మా పెద్ద పాప నిద్ర పోతోంది. 90 కిలోమీటర్ల స్పీడ్ తో వెళ్ళుతున్నా, స్పీడ్ బ్రేకర్లు ఎన్ని వచ్చినా, టర్నింగ్‌లు ఎన్ని తిప్పినా డోర్ రాకపోవటం, మా పాపకు ఏ గండం లేకుండా చేసిన సార్‌కి, స్వామికి ఏమి ఇచ్చినా వారి ఋణం తీర్చుకోలేము.

శ్రీ సార్ ఒకసారి నా భార్యతో “అమ్మా! ఈ మధ్య దర్శనం ఎవరికీ ఇవ్వలేదు.ఈ రోజే ఇలా బైటికి రావడం” అని అన్నారు. సార్ దివ్యస్థితిని పూర్ణంగా గుర్తించినా, గుర్తించకున్నా వారి సాంగత్యం, ప్రేమలతో వారిపై దైవంపై భక్తిని ప్రసాదించి మా మనసులను హరించి మా అలవాట్లు, జీవనంలో కూడా ఎంత మంచి

మార్పు తీసుకు వచ్చిన ఆ గురుమూర్తికి హృదయ పూర్వక నమస్కారాలతో

– మీ జగదీశ్

# శ్రీ శేషు కృష్ణ, చెన్నై

శేషుకృష్ణ ఇలా చెబుతున్నాడు. ఒకసారి గొలగమూడి లో ఉన్నప్పుడు మధ్యాహ్నం భోజనం చేసేసి రెండున్నర మూడు గంటలకు, సార్ ఏం చేస్తున్నారా అనే ఆలోచనతో సార్ వాళ్ళ ఇంటికి వెళ్లి తలుపు గుండా తొంగి చూస్తే అమ్మగారు కూర్చొని ఉన్నారు. మరలా కొంచెం సేపు ఆగి తలుపు నుండి తొంగి చూస్తే అమ్మగారు అక్కడే కూర్చున్నారు. శేషు సాయిమాస్టర్ నిలయం లోనికి వెళ్లాడు. సార్ వెంటనే సాయిమాస్టర్ నిలయం ముఖ ద్వారం గుండా లోపలికి వచ్చి "ఏమైనా కావాలా" అని శేషును ఎంతో ప్రేమపూర్వకంగా అడిగారు. శేషు "మీరేం చేస్తున్నారో చూద్దామని సార్" అని చెప్పాడు. సుబ్బరామయ్య సార్ అది విని వెళ్లిపోయారు. ముఖ్యంగా ఈ సన్నివేశంలో అంత వయస్సులో కూడా ఏమి కావాలి అని ఓరిమిగా అడుగుతున్నందుకు ఆయన ప్రేమకు శేషు చాలా ముగ్ధుడయ్యాడు.

6 ఫిబ్రవరి 2010 న శేషుకృష్ణ (చెన్నై) 'గత ఒక సంవత్సరం నుండి ప్రతి శని, ఆదివారాలు చెన్నై నుండి గొలగమూడి వెళుతున్నాము కదా, ఈ ఒక్క శనివారం ఇక్కడే ఉందాంలే' అని బద్దకించినాడు. ఆ రోజు రాత్రి శేషుకృష్ణ కలలో సార్ కనబడి "నువ్వు రా! మనకి ఇక్కడ పని ఉంది" అని చెప్పారు. శేషుకృష్ణ మనసులోని ఆలోచనకి రెస్పాన్స్ ఇచ్చారు సర్వవ్యాపి, సర్వజ్ఞులు, సమర్ధ సద్గురువు అయిన శ్రీ సార్.

ఒకసారి శేషుకృష్ణ వాళ్ళ అమ్మగారు, అక్క గొలగమూడిలో ఉన్నారు. సార్ వారి దగ్గరకు వచ్చి “అమ్మా! సాయి మాస్టర్ నిలయం పైన అంతా కూడా చాలా దుమ్ము, ధూళిగా ఉంది. అది శుభ్రం చేసి పెడతారా! నేను నా అనే వాళ్ళకు మాత్రమే చెపుతాను” అని చెప్పారు. అప్పుడు శేషు అమ్మగారు, అతని అక్క ‘సార్! మీరు చెప్పింది మేము చేస్తాము’ అని చెప్పి మొదటి అంతస్తులో ఉన్న రూమ్ ని శుభ్రం చేసారు. ముఖ్యంగా పని చేయటం కన్నా కూడా సార్ అన్న మాట “నా అనే వాళ్ళకే చెప్తాను” అనేది వారి మనసులో అలా నిలిచిపోయింది.

శేషు కృష్ణ ఒకసారి పెళ్లి సంబంధాల కి వెళుతూ గొలగమూడి లో ఉన్న తన తమ్ముడు రామకృష్ణను

స్వామి ధునిలో కొబ్బరికాయ సమర్పించమని చెప్పాడు. ఈ విషయం రామకృష్ణ సుబ్బరామయ్య సార్‌తో చెప్పాడు. సార్ వెంబడే కొబ్బరికాయ తెప్పించి మందిరానికి వెళ్ళి, ప్రదక్షిణలు చేసి కొబ్బరికాయను ధునిలో సమర్పించారు. అంటే సార్ ఎవరికైనా స్వామి సేవ అనే భావంతో అన్యధా భావించక చేస్తారు.

# మదన్ కుమార్, శ్రీ హరికోట

నాకు శ్రీ భరద్వాజ మాస్టర్ గారి రచనలు, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారి రచనలు చదివాక మహనీయులు గురించి, దైవం గురించి, భగవంతుడు అంటే అప్పటి వరకు ఉన్న అపోహలు కొంచెం తొలిగాయి. భగవంతుడు మనకు సర్వకాల సర్వావస్థలయందు తోడు ఉండి మనకు ఏది మంచో అదే చేస్తారు అనే భావం నిదానంగా దృఢ పడసాగింది.

ఒకసారి మాకు బంధువులతో ఆర్థిక లావాదేవీల విషయంలో ఏవో మనస్పర్థలు వచ్చాయి. మా కుటుంబ సభ్యులు తాడో పేడో తేల్చుకుందాం అంటారు. కానీ నేను కల్పించుకొని “ప్రతిదానికి అలా అనడం సబబు కాదు, నేను వెళ్లి మాట్లాడుతాను సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుందాం” అని చెప్పాడు. నేను చెప్పినట్లే

తన బంధువులతో (అప్పటివరకు గత కొంతకాలంగా వారి కుటుంబ సభ్యులతో సఖ్యతగా లేనివారితో) సామరస్యంగా మాట్లాడి వచ్చాను. మూడు నెలలు గడిచినా ఫలితం లేదు. మా కుటుంబంలో నన్ను నిందించడం మొదలుపెట్టారు, అదేమంటే "మన మంచితనాన్ని అవతలి వారు చేతకానితనంగా తీసుకుంటున్నారు, అంతా ఇతని వల్లే" అని.

అప్పుడు సార్‌కి నేను బాధతో నా పరిస్థితిని ఇలా చెప్పుకున్నాను. "వెంకయ్య స్వామివారు, మీరు నా జీవితంలోకి వచ్చాక నా ఆలోచనా విధానం మారిపోయింది (అంతకుముందు చాలా ఆవేశం, ఎలాగైనా మాట నెగ్గించుకోవాలి అనే గుణాలు ఎక్కువగా ఉండేవి). మా వాళ్లు నాతో పాటు, నేను నమ్మే మిమ్మల్ని కూడా సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఎలాగైనా మీరే మీ సర్వసమర్థత్వాన్ని నిరూపించుకోవాలి" అని ప్రార్థించాను.

ఈ విషయంలో చాలా చిత్రంగా శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు తమ సర్వసమర్థతను, "నన్ను నమ్మిన వారి కోసం ఏమైనా చేయగలను" అని నిరూపించారు. అవతలి వారి హృదయాలను ఎలా ప్రేరేపించారో ఏమోగాని ఊహకందని విధంగా వారు

పాత పగలు, పట్టింపులు అన్నీ మరిచిపోయి, ఇతని కుటుంబంతో చక్కగా కలిసిపోయి, వీళ్ళకు ఇవ్వవలసిన డబ్బులు కూడా ఇచ్చారు. కానీ ఈ జఠిల సమస్య అంత త్వరగా పరిష్కారం అవుతుందని నేను కలలో కూడా ఊహించలేదు, ఎందుకంటే మా కుటుంబాల మధ్య మనస్పర్ధలు అంతగా పెరిగి ఉన్నాయి. అప్పటి నుంచి మా కుటుంబంలో కూడా శ్రీ స్వామి వారి మీద, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారి మీద నమ్మకం బలపడింది.

- **16.01.2017, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్-సేవాభాగ్యం**

ఈ రోజు కలలో నాకు ఒక అద్భుతమైన అవకాశము కలిగింది. నేను మానసికంగా ఆరాధించే సద్గురుమూర్తి శ్రీ సుబ్బరామయ్య మాస్టారు గారు నాకు కలలో కనిపించి నేను ఎప్పటి నుంచో పరితపించే వారి సేవాభాగ్యాన్ని కలిగించారు. నన్ను దగ్గరికి పిలిచి తమకు స్నానం చేయించే మహత్తరమైన అవకాశాన్ని అందించారు. శ్రీ సుబ్బరామయ్య మాస్టారు గారు ఇదే నాకు మొట్టమొదటిసారి కలలో కనిపించడం. నాకు చాలా ఆనందం కలిగింది.

- **జనవరి 30, 2017 లో వచ్చిన కల, సమస్యలు – పరిష్కారాలు**

శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు గొలగమూడిలో వారి ఇంట్లో సత్సంగం చేస్తున్నారు. అక్కడ సాయి గారు, ప్రసాద్ గారు ఇంకా కొంతమంది సేవకులు ఉన్నారు. శ్రీ సార్ అంత అనర్గళంగా మాట్లాడడం చూసి (తను సార్ ప్రత్యక్షంగా మాట్లాడడం అప్పటివరకు ఎప్పుడూ వినలేదు కాబట్టి) ఎంతో ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత ఆయన పాదాలకు నమస్కరించి "సార్ సర్వజ్ఞుడు కదా! ఈనాడు, ఈ క్షణం తన మనసులో ఇతని తమ్ముడి గురించి ఉన్న ఆలోచన సార్‌కి తెలిస్తే తను చెప్పకుండానే సార్ దాని గురించి తనతో మాట్లాడాలి" అని కలలో మనసులోనే అనుకున్నాడు.

అప్పుడు సార్ తనకి సంభ్రమాశ్చర్యాలు కలిగేటట్లు "అవునయ్యా! అవ్వట్లేదు, ఏం చేయమంటావు ఆయన్ని అక్కడికి (ఢిల్లీ) పంపిస్తే అలా అయింది, ఇక్కడికి (హైదరాబాద్) పంపిస్తే ఇలా అయింది. కష్టంగానే ఉందయ్యా" అని అన్నారు. ఇతను ఒక్క నిమిషం మౌనంగా ఉన్నాడు. సార్ అంతలో ఆయన చెప్పే సత్సంగం కంటిన్యూ చేశారు. ఇతను వెంటనే సార్ పాదాలకు మరొకసారి నమస్కారం చేసుకొని 'సార్ ఎక్కడా అవ్వట్లేదు అనే కదా మీ దగ్గరికి వచ్చింది' అని

మనసులోనే చెప్పుకున్నాడు. అప్పుడు సార్ ఒక్క క్షణం ఆలోచించి "సరే ఇక్కడికి తీసుకొని రా! దాని (కష్టం) సంగతి ఏమిటో చూద్దాం" అని అభయమిచ్చారు. అంతటితో ఇతనికి ఎక్కడ లేని సంతోషం, ఉత్సాహం కలిగింది.

సార్ దయవల్ల సార్ చెప్పినట్లే తన తమ్ముణ్ణి గొలగమూడి తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత నుంచి ఇతని తమ్ముడిలో ఆందోళన, గందరగోళం తగ్గి తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించ గలుగుతున్నాడు. ఇతని మనసులో అనుకున్నది చెప్పడం ద్వారా శ్రీ సార్ తమ సర్వజ్ఞతను, తమకు అప్పటివరకు ఉన్న కష్టాన్ని తొలగించడం ద్వారా వారి సర్వ సమర్థతను నిరూపించుకున్నారు. త్వరలో అతనికి SHAR హాస్పిటల్ లో మంచి ఉద్యోగం కూడా వచ్చింది.

# వై ఉమామహేశ్వర్ గారు, అనంతపురం

నా పేరు వై ఉమామహేశ్వర్. మాది అనంతపురం. నాకు గొలగమూడి ప్రథమ దర్శనం 2003లో అయింది. నేను దర్శనానికి ముందే శ్రీ పెసల

సుబ్బరామయ్య మాస్టర్ గారు రచించిన అవధూత లీల అనే గ్రంథం మూడు సప్తాహాలు చేసిన తర్వాత గొలగమూడి దర్శించాను. అటు తరువాత 2004లో మేము గొలగమూడికి సైకిల్ యాత్ర చేసి వచ్చాం. అప్పుడు సుబ్బరామయ్య మాస్టర్ గారి గురించి నేను విచారించాను, ఆయనను దర్శించాలని. వారు సాయంకాలము బ్రహ్మంగారి గుడిలో సత్సంగం చేస్తారు, అప్పుడైతే ఫ్రీగా మాట్లాడగలరని చెప్పారు కొంత మంది. అదే విధంగా మేము గొలగమూడిలో బ్రహ్మంగారి గుడిలో సత్సంగం జరుగుతుండగా వెళ్లాం. అక్కడ సుబ్బరామయ్య సార్ గారు పుస్తకం చదువుతున్నారు. ప్రథమంగా వారిని అక్కడ దర్శించాం. వారు చాలా నిరాడంబరంగా వున్నారు. మేము సుబ్బరామయ్య సార్ గారిని ఒక సాధకుడుగా గుర్తించాము. మేము గొలగమూడికి వెళ్ళినప్పుడు అలా వారిని దర్శించే వారం. కానీ ఏమీ మాట్లాడే వాళ్ళం కాదు. కానీ మాస్టర్ గారు ఒకసారి దర్శించినప్పుడు మాది అనంతపురం అని చెప్పగానే మాకు ఇలా చెప్పారు: “అనంతపురం నుండి శేష సాయి రాజు అని ఒకరు వచ్చారు, వారి వెంట ఒక అబ్బాయిని కూడా తెచ్చారు, ఆ పిల్లవాడిని నాకు (సుబ్బరామయ్య సార్‌కు) పరిచయం చేస్తూ ఈ పిల్లవాడు

డైరెక్ట్‌గా దేవునితో మాట్లాడుతాడు అని చెప్పారు. అప్పుడు నేను ఒక చిన్న పరీక్ష పెట్టాను. ఒక చీటీ రాసుకొని మడిచి నా చేతిలో ఉంచుకున్న. అప్పుడు ఆ అబ్బాయిని అడిగాను. నాకు సమస్య ఉంది. ఆ సమస్య ఏంటో ఈ చీటీలో రాసి ఉంచాను, ఈ సమస్యకు పరిష్కారం దేవుడిని అడిగి చెప్పగలవా అన్నాను. ఆ పిల్లవాడు ఏదేదో చేసి చాలాసేపు తర్వాత వెంకయ్య స్వామి గుడికి 108 ప్రదక్షిణాలు చేస్తే నీ సమస్య తీరుతుంది అన్నాడు. అప్పుడు నేను నా చేతిలో ఉన్న చీటీ తెరిచి చూయించాను. ఆ పిల్లవాడు నివ్వరపోయాడు. విషయం ఏమంటే అందులో నా డేట్ అఫ్ బర్త్ ఎంత.! అని రాశాను. అప్పుడు నేను అడిగా 108 ప్రదక్షిణలు చేస్తే నా డేట్ అఫ్ బర్త్ నాకు తెలుస్తుందా అని! ఆ పిల్లవాడు చిన్న పోయాడు. వెంటనే నేను అయ్యా రాజు ఇంకొకసారి ఇలాంటి వాళ్ళను నా దగ్గరికి తీసుకురావద్దు అని చెప్పేసాను అన్నారు". ఆ తర్వాత శ్రీ సుబ్బరామయ్య సార్ గారు 2017 లో సమాధి చెందారు.

గొలగమూడికి వచ్చినప్పుడల్లా వారి సమాధి దర్శిస్తూ మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల దాకా సార్ గారి సమాధికి ప్రదక్షణం చేసేవాడిని. అలా 11 రోజులు చేశాను. మధ్యలో వారు నాకు స్వప్న దర్శనం

ఇచ్చారు. సుబ్బరామయ్య సార్ గారు అనంతపురం జిల్లా నూతిమడుగు అను మా స్వగ్రామంకి సైన్ క్లాత్ బనియన్ వేసుకొని సాధారణమైన ప్యాంటు తొడుక్కొని తెల్లని గడ్డం తెల్లని జుట్టుతో మొహం నల్లగా మెరిసిపోతూ వచ్చారు. వారి వెనుక వరుసగా పదిమంది. అలా నాలుగు వరుసలు అనగా 40 మంది ఉన్నారు. మా ఊర్లో ఒక వైశ్యుల ఇంటి దగ్గరికి వచ్చారు. ఆ ఇంటి ముందు ఆవరణంలో అక్కడ సార్ గారు, పరివారము అందరూ కూర్చున్నారు. వారిని చూడడానికి మా ఊరు అందరూ వచ్చి చూస్తున్నారు. నేను అందరితోనూ సుబ్బరామయ్య సార్ అంటే వారే అని చూపిస్తున్నాను. కానీ సార్ గారు ఎవరితో మాట్లాడలేదు. అక్కడ చాలా సేపటి వరకు ఉండి వెళ్లి పోయారు. ఆ విధంగా నాకు మొదటి స్వప్నదర్శనమిచ్చారు.

నేను మాస్టర్ గారి బోధామృతం పారాయణ చేస్తున్నప్పుడు మొదట భరద్వాజ మాస్టర్ గారు స్వప్న దర్శన మిచ్చారు. అటు తర్వాత సుబ్బరామయ్య సార్ గారు స్వప్నంలో మా ఇంటికి వచ్చారు. నేను మేడ పైన లైబ్రరీలో ఉన్న పుస్తకాలు చూస్తూ ఉన్నాను. మా పిల్లలు డాడీ సుబ్బరామయ్య సార్ గారు వచ్చారు మీకోసం అన్నారు. నేను వెంటనే ఒక పుస్తకం తీసుకొని సార్‌తో

పుస్తకం చదివిద్దామనుకున్నా. నేను కిందికి వచ్చేలోపు సార్ గారు వెళ్లిపోయారు. అటు తర్వాత మాస్టర్ గారి బోధామృతం పూర్తి అయ్యే రోజు నేను భరద్వాజ మాస్టర్ గారిని స్వప్న దర్శనం కోరాను. కానీ వారికి బదులుగా సుబ్బరామయ్య సార్ గారు నాకు స్వప్న దర్శనమిచ్చి చిరు మందహాసంతో నా వైపు చూస్తూ ఉన్నారు. నేను భరద్వాజ్ మాస్టర్ గారి దర్శనం కోరగా సుబ్బరామయ్య సార్ గారు దర్శనం ఇవ్వడం అంటే సుబ్బరామయ్య సార్ గారు, భరద్వాజ మాస్టర్ గారు, వీరు ఒక్కటే అన్నమాట.

అటు తర్వాత మార్చి నెల 2023 లో టీం గొలగమూడి సత్సంగంలో శనివారం రాత్రి జరిగిన సత్సంగంలో శేషు గారు "నాకు తెలిసిన మాస్టారు" పుస్తకం చదివి వినిపిస్తున్నారు. అందులో భరద్వాజ్ మాస్టర్ గారు పడుతున్న కష్టాల గురించి, ఇతరులు అనుకున్న మాటలను, శ్రీ సుబ్బరామయ్య సార్ గారు బాధతో మాస్టర్ గారి వద్దకు వెళ్లి "సార్ అందరూ మిమ్మల్ని ఆయనకేమీ ! ఒకరు కూరలు ఇస్తారు, మరొకరు అన్నం తెచ్చిస్తారు, జరిగిపోతుంది కదా!" అంటూ హేళన చేస్తున్నారు, "నాకు బాధగా ఉంది సార్" అన్నప్పుడు భరద్వాజ మాస్టర్ గారు "అయ్యా! అందరికీ ఇచ్చేది ఆ సాయినాథుడే. అలాగే నాకు వారు ఇస్తారు.

అలా ఇవ్వలేదు అనుకో, మా కులవృత్తి ఉంది కదా! భిక్షాటన!!" అన్న సన్నివేశం ఆ రోజు సత్సంగంలో చర్చించుకున్నాము. ఆ రోజు సత్సంగం చాలా బాధాకరంగా ఉంది. నేను అదే తలచుకుంటూ నిద్రపోయాను. ఆ రోజు రాత్రి శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు నాకు స్వప్న దర్శనం ఇచ్చి నా వైపే చూస్తూ చాలాసేపు నవ్వారు. నా బాధ అంతా పూర్తిగా తొలగిపోయింది. మొదట నేను సుబ్బరామయ్య సార్ గారిని ఒక సాధకుడుగానే భావించాను. ఆయన ఒక గొప్ప భక్తుడు అన్న భావంతో వారి సమాధికి 11 రోజులు ప్రదక్షిణ చేశాను, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంకాలం ఐదు గంటల వరకు. మరొకసారి 13 రోజులు ప్రదక్షిణ చేశాను, అటు తరువాత 12 రోజులు ప్రదక్షిణ చేశాను. తర్వాతనే ఆయన నాకు ఈ విధంగా స్వప్న దర్శనమిచ్చారు. వారు కూడా మహాత్ములని తెలియపరిచారు. నేను అలా ప్రదక్షిణాలు చేసేటప్పుడు కొంతమంది నన్ను అడిగారు, నువ్వు సార్ సమాధికి ప్రదక్షిణ చేస్తున్నావే? ఆయనంటే ఎందుకంత నమ్మకం అని. అప్పుడు నేను అన్నాను సారు గొప్ప సాధకుడు, వెంకయ్య స్వామి భక్తుడు, చాలా ఆచరించి చూపించారు కాబట్టి ఎంతోమందికి ఆదర్శప్రాయలైనారని చెప్పాను.

తరువాత వారు సద్గురువు అని స్వప్నాల ద్వారా నాకు తెలియపరిచారు.

నేను సద్గురు శ్రీ పెసలసుబ్బరామయ్య మహారాజు గారి జీవిత చరిత్ర టైప్ చేసి ప్రతిరోజు ఒక అధ్యాయాన్ని వాట్సాప్ గ్రూప్ లో పంపుతున్నాను. గ్యాప్ లేకుండా ప్రతిరోజు పంపాలని శ్రద్ధగా పంపుతున్నాను. ఒకరోజు డ్యూటీ ఒత్తడి వల్ల టైప్ చేసి పోస్ట్ చేయలేకపోయాను. సాయంకాల మవుతోంది. ఎలాగైనా రేపటికి పంపాలి అనుకున్నాను. నాకు ఈవెనింగ్ టైం లో 7pm to 10pm దాకా డ్యూటీ ఉంది. మాకు ట్రాఫిక్ Point లో ఐలాండ్ అను ఒక బాక్స్ ఉంటుంది. అందులో నిల్చుకొని సిగ్నల్స్ ఇస్తుంటాం. ఆ రోజు నేను ఆ ఐలాండ్ లోనే కూర్చొని వాయిస్ టైప్ చేసి పంపాలని నిశ్చయించుకుని సుబ్బరామయ్య సార్ గారి చరిత్ర పుస్తకం తీసుకొని వెళ్లి ఎంత డిస్టర్బ్ అయినా వదలకుండా వాయిస్ టైప్ చేశాను. అటు తర్వాత గర్వంగా ఫీల్ అయ్యాను. ఇక ఉదయాన్నే గ్రూపులన్నిటికీ సెండ్ చేయడానికి ప్రయత్నించాను. ఆ సమయంలో సరిగా ఏదో ఒక ఫోన్ రావడం, ఆ తర్వాత మర్చిపోవడం, ఇంట్లో ఏదో ఒక పని చెప్పడం ఇలాగ మూడు రోజులు జరిగిపోయింది. ఎంత ప్రయత్నించినా

సెండ్ చేయలేకపోయాను. అప్పుడు అనుకున్నాను నా తప్పును నేను గ్రహించాను: "డ్యూటీలో ఉండి కూడా ఈ విధంగా చేశాను కదా! నేను గ్రేట్ కదా అనుకున్నాను". సార్ గారు ఈ విధంగా నాకు గుణపాఠం చెప్పారని తెలుసుకొని వెంటనే సుబ్బరామయ్య సార్ గారిని నా పొరపాటును మన్నించమని వేడుకున్నాను. మూడవ రోజు సాయంత్రానికి నాకు టైం కుదిరి సెండ్ చేశాను.

మరొక విషయం శ్రీకాకుళంకు చెందిన మురళి అనే ఒక అబ్బాయి ఎప్పుడూ గొలగమూడికి వస్తూ శ్రీ సాయి మాస్టర్ నిలయంలోనే ఉంటారు. ఈ మురళి 52 శ్లోకాలు తో కూడిన శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వాములవారు రచించిన గురుచరిత్ర పారాయణం చేశాడు. ఆ రోజు రాత్రి స్వప్నంలో ఈ మురళి నదీ స్నానానికి వెళ్లి స్నానం చేసి వస్తున్నారు. వారికి ఎదురుగా సుబ్బరామయ్య సార్ నదికి వెళుతున్నారు స్నానం చేయడానికి. మురళి గమనించకుండా ముందుకు వెళ్ళిన తర్వాత అరే సుబ్బరామయ్య సార్ లా ఉన్నారు అని వెనక్కి తిరిగి వచ్చి చూస్తే నిజంగానే సుబ్బరామయ్య సారే! వెంటనే వారికి పాదాభివందనం చేశాను. "వారు నా తల మీద చేయి పెట్టి ఆశీర్వదించారు" అని చెబుతూ గురుచరిత్ర పారాయణ

చేస్తే సుబ్బరామయ్య సార్ గారు స్వప్న దర్శినమిచ్చారంటే వారు కూడా సద్గురువేనని ఈ స్వప్నం ద్వారా నాకు ఋజువయింది అని నాకు చెప్పారు.

# పొదిలి శివ శంకర్, హైదరాబాద్

శ్రీ సార్‌తో ఎన్నో సంవత్సరములు అతి సమీప సానిధ్యం కలిగిన శివ శంకర్, శివ రత్నం (గొలగమూడి) తమ్ముడు, సార్‌తో తనకు గల అనుభవాలను ఇలా పంచుకుంటున్నాడు.

నాకు మా అన్న శివరత్నం ద్వారా శ్రీ భరద్వాజ మాస్టర్ గారు, సాయినాథుల పట్ల భక్తి ప్రపత్తులు చిగురించాయి. సామూహికంగా జరిగే భజనలలో, సాయి సేవలో పాల్గొనటం, పారాయణ చేయడం చేసేవాడిని. పారాయణ వల్ల నాకు, మా కుటుంబ సభ్యులకు అద్భుత అనుభవాలు కూడా జరిగేవి. ఉదాహరణకు మా పెద్దన్నయ్య SVSet లో మంచి ర్యాంకు వచ్చినా SVU లో సెలెక్ట్ కాలేదు అని విన్నాడు. వినటంతోనే బాధలో ఉన్న మా పెద్ద అన్నయ్య కోటేశ్వరరావుకు, మా చిన్న అన్న శివరత్నం

సాయిలీలామృతం, గురు చరిత్ర పారాయణ చేయమని చెప్పటం అలా శ్రద్ధగా చేయగా తదుపరి కాల్ లెటర్ వచ్చి సీట్ రావటం జరిగింది.

## ● సార్ పరిచయం- పరోక్షం – ప్రత్యక్షం :

మా చిన్న అన్న శివరత్నం సాయిబాబా గుడిలో మేనేజర్‌గా పనిచేస్తూ ఉండటం వల్ల బాబా గారి గూర్చి చెబుతూ ఉండటం వల్ల భక్తి ఏర్పడింది. మా అన్న శివరత్నంకు 2003 లో ప్రాణాయామం అభ్యాసం చేస్తుండగా శ్వాస సరిగా తీసుకోక, శ్వాస సంబంధమైన తీవ్రమైన అనారోగ్యం చేసింది. ఎందరో డాక్టర్ల వద్ద తిరిగినా, ఎన్నో ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి. శ్రీ రవికుమార్ అనే మిత్రుని సలహాపై గొలగమూడి వెంకయ్యస్వామి వారి వద్దకు వెళ్లడం, అచట శ్రీ సుబ్బరామయ్య సార్‌ను కలవటం, వారి వద్దకు తరచూ వెళుతుండటం జరిగేది. శ్రీ సార్ సలహా అనుసరించి చివరి ప్రయత్నంగా 40 రోజులు దీక్ష చేస్తుండగా 33వ రోజున స్వామి కృప వల్ల, శ్వాస మామూలై , స్వామి సన్నిధిలోనే స్వస్థత చేకూరింది. శ్రీ సార్ ఈ సందర్భంలో ఎలా నడిపింది, స్వామి కృప చెందేలా ఎలా చేసారు అనే విషయం మా అన్న (శివరత్నం) అనుభవాలలో వివరంగా చూసాము. మా అన్నకు ఈ రీతి శ్రీ సార్

సాంగత్యం, వారి వద్ద అనుభవం కలగటం వల్ల నాకు సార్‌ను దర్శించుకోమని ప్రోత్సహించాడు.

నేను 2003 సంవత్సరంలో సార్‌ను దర్శించాను. 2004-2005 సం || లో M.Sc చదివేటప్పుడు సార్‌ను తరచూ దర్శించే వాడిని.

ఒకరోజు శ్రీ సార్ తన చేతితో అచ్చుట మురికి కాలవలో శుభ్రం చేస్తూ కనపడ్డారు. శ్రీ సార్ చేస్తుండడంతో నేను పనిలోకి దిగాను. శ్రీ సార్ ప్రతిదీ ఆచరించి చూపించిన తర్వాతే మనకు చెప్పేవారు. వారి ఆచరణకు ఆకర్షితమై వారి సాంగత్యం కోసం ఇష్టము, మరలా, మరలా రావాలి అనిపించడం జరిగేది.

ఇట్టి సన్నివేశాలు చూశాక సార్ గూర్చి ( మహాత్ముల గూర్చి) వినటం ఒక ఎత్తు అయితే, వారి ఆచరణ చూడటం దానికి ఎన్నో రెట్లు అద్భుతమైన, ఆశ్చర్యమైన ఆనందాన్ని మార్పును తీసుకు వస్తుంది అని అనిపిస్తుంది. అంతకు ముందు భక్తి, ఆధ్యాత్మికత అంటే నాకున్న భావం వేరు. సార్‌ను చూశాక వారి సాంగత్యంలో కొంత కాలం గడిపాక కలిగిన భావన మరొకటి. ఎన్నో రెట్లు భిన్నము, అద్భుతము.

- **సార్ సాంగత్యం :**

2006-07 నేను నెల్లూరు లో లెక్చరర్‌గా పని చేసేటప్పుడు గొలగమూడిలోనే సాయిమాస్టర్ నిలయంలో ఉండే భాగ్యం కలిగింది. అంతకుముందు సార్ గురించి వినటం, అప్పుడప్పుడు దర్శించుకోవడం జరిగేది. కానీ ఈ సమయంలో వారి సాంగత్యంలో కొన్ని నల్ల పాటు ఉండే అవకాశం కలిగింది.

ఈ సందర్భంలో అప్పుడప్పుడు శ్రీ సార్ సర్వజ్ఞత, ఆచరణతో కలగలపు కొని అనుభవం అయ్యేది. శ్రీ సాయి మాస్టర్ నిలయంలో క్రింది ఆడవాళ్లకు, పైన మగవాళ్లకు అని నిర్ణయించారు. అలానే పడుకునేవారు. అప్పుడు నేను సాయి మాస్టర్ నిలయంలో ఉంటూ, క్రింద వరండా గదిలో అన్నతో పాటు ఉండేవాడిని. ఒకరోజు శ్రీ సార్ ఉన్నట్లుండి రాత్రి చెకింగ్‌కు వచ్చారు. అచట ఒకళ్ళిద్దరు మగవాళ్ళు క్రింద రూమ్‌లో ఉంటే విపరీతంగా తిడుతున్నారు. నేను ఆశ్చర్యపోయాను. సార్ అంత గట్టిగా తిట్టడం చూడలేదు. అదే కొత్తగా అచ్చట ఉండటం. వాళ్లు వెళ్లిపోయారు. నేను సార్ ఎందుకు ఇంతలా తిడుతున్నారు అని మనస్సులో అనుకున్నాను. మరు రోజు సార్ వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు, నవ్వుతూ “నిన్న నేను అంత అలా ఎందుకు తిడుతున్నాను

అనుకున్నావా?" వాళ్ళు త్రాగి వచ్చి క్రింది ఆడవాళ్లు ఉండే రూములో పడుకుని, వాళ్లను డిస్టర్బ్ చేస్తున్నారు. అందుకు తిట్టవలసి వచ్చింది అన్నారు. శ్రీ సార్ సర్వజ్ఞత్వం, ధర్మాచరణ ఇలా నాకు ఎరుక పరిచారు.

శ్రీ సార్ ఎప్పుడూ ఏదో కట్టడం పని చేస్తూ చేయిస్తూ ఉండే వారు. నేను ఇదివరలో వ్యవసాయ పనులు చేయడం అలవాటు ఉండడం వల్ల, కొన్ని కష్టమైన పనులు నాకే అప్పగిస్తూ ఉండేవారు. శ్రీ సార్‌తో కలిసి పని చేస్తూ ఉంటే అసలు అలసట తెలిసేది కాదు. ఎంత పని చేసినా మరో రోజుకు అస్సలు శ్రమ ఉండేది కాదు. మరల ఏ బడలిక లేకనే అలా ఎన్ని రోజులైనా పని జరిగేది. శ్రీ సార్‌తో పనిచేయడం, ఆరతిలో పాల్గొనడం, సత్సంగంలో ఉండటం, వారితో తిరగడం నాకు ఇప్పుడు అద్భుత అనుభవాలుగా తోస్తాయి. మరి ఆ సన్నిధి, ఆనందం, అట్టి అదృష్టం ఇంక ఎప్పుడు లభిస్తుందో ?

- **ధర్మాచరణ :**

2008-2009 లో గూడూరు లో లెక్చరర్ గా పని చేసే టప్పుడు కూడా ప్రతి ఆదివారం సార్‌ను దర్శించుకుంటూ ఉండేవాడిని.

శ్రీ సార్ నాచే ధర్మాచరణ ఎలా చేయించి, దానిని ఎలా ఆశీర్వదించారో ఒక సన్నివేశంలో

పంచుకుంటాను. గూడూరులో ఉద్యోగం చేసేటప్పుడు నాకు ఒకసారి ఆత్మకూరులో ఒక ఇంటర్ కాలేజ్‌లో ఎగ్జామ్స్ ఇన్విజిలేషన్ డ్యూటీ పడింది. నేను చూస్తుండగానే కాలేజీ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు తెచ్చి కాపీ కొట్టించమని, వారికి బెస్ట్ మార్క్స్ వచ్చేలా చేయమని stress చేశారు. మా కాలేజీ ప్రిన్సిపల్‌కు కూడా చెప్పి, ఆయనతో నాకు చెప్పించారు. అది వీలు కాదని ఖచ్చితంగా చెప్పాను. స్టూడెంట్స్ ల్యాబ్ చేసి వ్రాయగలిగిన అంత వ్రాయడమే అని చెప్పాను. అలానే ఖచ్చితంగా ఉండడం జరిగింది. వాళ్లు ఎక్కువ ఇచ్చే డబ్బులు ఇవ్వము అన్నా, మరి ఏం చెప్పినా వినక పోవడంతో రూమ్‌లో కొట్టడానికి రెడీ అయినట్లు అరవటం మొదలు పెట్టారు. నేను ధైర్యంగా ఎదురు నిలబడేటప్పటికి వాళ్ళు కాళ్ల బేరానికి వచ్చారు. కానీ నా డ్యూటీ మేరకు చేసి వచ్చేసాను. తర్వాత ఈ విషయం శ్రీ సార్‌కు చెబితే, "నీవు అలాగే ధర్మానికి అంటి పెట్టుకొని ఉండు. నువ్వు ఎక్కడ ఉన్నా స్వామి రక్షణగా ఉంటారు" అని సార్ చెప్పారు. ధర్మాచరణ చేయగల శక్తి శ్రీ సార్ సాంగత్య ప్రభావమే, ప్రసాదమే.

- **గురు చరిత్ర పారాయణ-సార్ స్పందన-పరిష్కారం :**

2009 లో గేట్ ఎగ్జామ్ రాసి 2010 లో ఇండోర్ లో M.Tech కు జాయిన్ అయ్యాను. ఎంత దూరంగా ఉన్నా శ్రీ సార్ కృప మనపై ఉంటుందని, మనం భాధ, కష్టంలో స్మరించగానే మనకు శ్రీ సార్ పలుకుతారు అనే అనుభవం ఒకటి అప్పుడు ప్రసాదించారు.

M.Tech లో భాగంగా ప్రాజెక్ట్ వర్క్ చేయడానికి అక్కడ ఒక గైడ్ వద్ద చేరాను. తర్వాత తెలిసింది. ఆమె వద్ద ఎవరు ఇన్ టైం లో complete చేయలేదని. చాలా tough guide ఆమె అని. ఆమె నాకు కూడా చదవమని చెప్పేటప్పుడు చాలా తీవ్రంగా చెప్పేది. భయంతో దిక్కు తోచక శ్రీ గురు చరిత్ర పారాయణ చేశాను. పారాయణ పూర్తయ్యేటప్పటికి శ్రీ సార్ స్వప్నంలో కనబడి ఒక చిరునవ్వు నవ్వారు. ఆ నవ్వుతో నాకు ఎంతో ఉరట, సంతోషం, ఉత్సాహము కలిగాయి. ఇదివరలో కూడా ఆ చిన్న ప్రేమ పూర్వక నవ్వుకు నా కష్టం తీరిపోయినట్టే అనిపించేది. కరిగి పోవాల్సిందే. తీసిపారేసినట్లు నా బాధ, సమస్య పరిష్కారం అయ్యింది.

అప్పటి నుండి మా guide వద్దకు వెళితే, ఆమె ఎంతో ఆప్యాయంగా నా డౌట్లు క్లారిఫై చేయడం, నా సీనియర్లకు చెప్పి అవసరమైన సాయం చేయించడం అలా జరిగి ప్రాజెక్ట్ చక్కగా complete అవ్వడం జరిగింది. మరెన్నో సమస్యలు సార్ చిరునవ్వుతో దూరం అవడం నాకు, మరెందరికో కూడా అనుభవం. వారి సర్వజ్ఞత, సర్వ సమర్ధతను ఏమి వర్ణించగలం?

M.Tech కంప్లీట్ అయ్యాక 2012లో శ్రీ సార్ కాలు విరిగినప్పుడు రెండు నెలలు పూర్తిగా గొలగమూడిలో ఉండి, ఎంతో దగ్గరగా సార్‌కు సేవ చేసుకునే భాగ్యం కల్పించారు. ఆ తర్వాత శ్రీ సార్ స్నానం సమయంలో మాత్రమే దర్శించే అవకాశం ఉండేది. అప్పుడు నాకు హైదరాబాదులో ఉద్యోగం రావడం జరిగింది. ఇలా శ్రీ సార్ వారి సేవ ఎంతో దగ్గరగా చేసుకునే అవకాశం ఉన్నంత వరకు వారి దగ్గర ఉంచి, తరువాత నన్ను ఉద్యోగంలో చేర్పించారు అనిపించింది. శ్రీ సార్ ఇదివరలో ఒకసారి PhD చేయమన్నారు. ఆ మాట ఇప్పుడు జరుగుతోంది.

శ్రీ సార్ ఈ రీతి నాకు చదువు ధర్మాచరణ, ఉద్యోగము, భక్తి, వారి సాంగత్యం, సేవ కూడా

అనుగ్రహించారు. వారి సానిధ్యంలో గడిపిన క్షణాలు ఎప్పుడు తలచుకున్నా అది ఓ మధురానుభూతి.

# కిశోర్, ఓజిలి

శ్రీపాద శ్రీ వల్లభ స్వామి అంతర్ధానమైన కురువపురం వెళ్ళినప్పుడు క్రింద పడ్డాను. ప్రక్కటెముకలు దగ్గర నొప్పి ఉండేది. స్వామి విభూతి వ్రాసినా నొప్పి తగ్గలేదు. బ్రహ్మం గారి మఠం దగ్గర సార్‌కి చెపితే విభూతి రాయమన్నారు. సార్ చెప్పినట్లు విభూతి రాసిన రెండు రోజులకు నొప్పి తగ్గిపోయింది. సార్ మాట ఆచరిస్తే మేలు పొందుతాము.

# కార్తీక్, బెంగుళూరు

సార్ చేత స్వామి దారం కార్తీక్ కట్టించుకుందామనుకున్నాడు. సార్‌తో పాటు కార్తీక్ స్వామి కుటీరానికి వెళ్లి దారం తీసుకునే లోపల సార్ బయటికెళ్ళి పోయారు. సార్ వెళ్లిపోయి ఉంటారనుకున్నాడు. కానీ సార్ బయట ఆకాశంకేసి చూస్తున్నారు. బయటకు వెళ్ళగానే కార్తిక్ వైపు చూసి చేయి చాచి ఏదో ఇవ్వు అన్నట్లు అడిగారు. వెంటనే దారం ఇచ్చాడు కార్తీక్. సార్ కుడిచేతికి దారం

కడుతుంటే ఒకతను ఎడమ చేతికి కట్టాలని చెప్తున్నాడు. సార్ వెంటనే "ఏ! ఈ చెయ్యి కట్టించుకోదా!" అని అడిగి దారం కట్టారు.

# గిరిజ గారు (USA)

2010-11 సంవత్సరం ముందు భరద్వాజ మాస్టర్ గురించి గానీ, శ్రీ సుబ్బరామయ్య సార్ గురించి గానీ నాకు ఏమీ తెలియదు. మా కుటుంబంలో కూడా ఎవరికీ తెలియదు. అప్పటికే నాకు వివాహం అయ్యి మేము అమెరికాలో ఉన్నాము. నాకు ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బందులు వచ్చి నేను ఎవరితోనూ కలవకుండా ఒక షెల్ లోకి వెళ్ళిపోయాను. నా చిన్నప్పుడు మా నాన్నగారి దగ్గర పరమహంస యోగానంద గారి బుక్కు ఉండేది. ఏమైనా ఇబ్బందులు వస్తే ఆ పుస్తకం చదివితే నాకు ఎంతో సాంత్వన కలిగేది. ఇప్పుడు అలాంటి బుక్స్ కోసమే వెతుకుతుంటే భరద్వాజ మాస్టారి సందేశం ఒక వెబ్సైట్లో కనబడింది. ఆ తర్వాత మాస్టారి పుస్తకాలు వెబ్సైటులో చూసి ఎవరో రచయిత అనుకున్నాను. కానీ ఆ పుస్తకాలు అన్నీ ఉచితంగా ఆన్లైన్ లో ఉండటంతో ఆయన మీద గౌరవం పెరిగింది. "నేను దర్శించిన మహాత్ములు" అనే శీర్షిక మీద రాసిన

గ్రంథాలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. అయస్కాంతంలా నా మనస్సును లాగేసాయి. మాస్టర్ గారి రచనలు చదువుతుంటే "నేను ఒంటరిగా ఉన్నాను" అనే భావన అంతా పోయింది.

ఒకసారి మా నాన్నగారి హెల్త్ బాగోలేదు. అన్ని పరీక్షలు జరిగాయి. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న రోజు మధ్యాహ్నం నా స్వప్నంలో నేను, మా నాన్న ఉన్నాము. అప్పుడు భరద్వాజ మాస్టారు గారు వచ్చి మాకు కమలాకాయ ప్రసాదంగా ఇచ్చారు. తర్వాత reports లో మా నాన్నగారికి అన్ని పాజిటివ్‌గా వచ్చాయి. అంతే అప్పుడు మా నాన్న గారికి హెల్త్ ప్రాబ్లం పోయింది.

ఒకసారి 2012 సంవత్సరంలో నా కలలో నేను నా చెల్లెలు ఒక ఆశ్రమంలో ఉన్నాము. అక్కడ వచ్చిన భక్తులకు భోజనాలు పెడుతుంటే మేమిద్దరం కూడా కూర్చున్నాము. అంతలో గురువు గారు వస్తున్నారు, అని అందరూ గౌరవంగా లేచి నిల్చున్నారు. మేమిద్దరం కూడా లేచి నిలిచియున్నాము. ఆ గురువు గారు వచ్చి నా నోట్లో మజ్జిగన్నం ఒక ముద్ద పెట్టారు. ఇప్పటికీ ఆ రుచి గుర్తు ఉన్నది. తర్వాత 2013 లో శ్రీ సార్‌ను

దర్శించుకున్నాక తెలిసింది, ఆ గురువుగారు శ్రీ సుబ్బరామయ్య సార్ అని!

2012 లో వెబ్ సైట్స్ చూస్తూ ఉంటే సాయి సేవా ట్రస్ట్ వెబ్సైట్లో సుబ్బరామయ్య సార్ సత్సంగంలో ఆయన గొంతు (వాయిస్) వింటుంటే నాకు కన్నీళ్లు అప్రయత్నంగా వస్తుండేవి. 2013 లో అమెరికా నుండి ఇండియా వెళ్తున్నప్పుడు నా భర్తను కోరుకున్నది ఒకటే. నన్ను ఎక్కడికి తీసుకెళ్లినా, తీసుకెళ్లక పోయినా గొలగమూడికి తీసుకు వెళ్లి అక్కడ సుబ్బరామయ్య గారి దర్శనం చేయించండి అని అడిగాను. అప్పుడు సార్ దగ్గరికి వచ్చిన తర్వాత ఆయనతో మాట్లాడాలని ఉంది కానీ ఆయన్ని చూస్తూ ఉండి ఎమోషనల్ అయ్యి ఏమీ మాట్లాడలేకపోయాను. సార్ అక్కడే ఉన్న నగేష్ ద్వారా మమ్మల్ని సాయి మాస్టర్ నిలయంలోకి వెళ్ళమన్నారు. సాయి మాస్టర్ నిలయంలో కూర్చున్నప్పుడు అప్రయత్నంగా నాకు ఏడుపు వస్తోంది. నా మనసులో ఇదే నా ఫైనల్ డెస్టినేషన్. ఇక్కడ చచ్చిపోయినా ఏమీ భయం లేదు అని అనిపించింది. ఆ విషయమే నా భర్తకు చెప్తే, మా ఆయన సుబ్బరామయ్య సార్ దగ్గర అలౌకిక శక్తి ఉంది. అందువల్లనే అలా అనిపిస్తుంది అన్నారు.

సార్ దగ్గర నుంచి వచ్చిన తర్వాత నాకు, నా భర్తకి మధ్య ఉన్న కొన్ని పర్సనల్ సమస్యలు సమసిపోయాయి.

నన్ను ఎవరైనా అంటే వాళ్ళని మనస్సులో తిట్టుకునే దాన్ని. కానీ సుబ్బరామయ్య సార్ దగ్గరికి వెళ్లి వచ్చిన తర్వాత నుంచి ఎవరైనా అన్నా "అలా మన కర్మలు తీసేశారు" అనే భావన వచ్చేది. ఒకసారి కలలో నేను గొలగమూడి సాయిమాస్టర్ నిలయంలో ఉన్నాను. అక్కడ లెట్రిన్లు కడుగుతున్నాను. కడిగిన తర్వాత అన్నీ క్లీన్‌గా కడిగాను అనుకున్నాను. ఇంతలో ఒక అతను వచ్చి ఇంకా క్లీన్ చేయాలి అని చెప్పాడు. అవునా అని చెప్పి క్లీన్ చేస్తుంటే సుబ్బరామయ్య సార్ వచ్చి ఇంకేమీ క్లీన్ చేయనక్కర్లేదు, బాగుంది అన్నారు. ఈ కల యొక్క అర్ధం సార్‌కి మాత్రమే తెలుసు అని అనుకుంటున్నాను.

నా భర్త అమెరికా వాషింగ్టన్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్‌గా, టీచర్‌గా పని చేసేవారు. అది నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ అందువలన భగవంతుని సేవగా (తక్కువ జీతానికే) చేసేవారు. వారి టీచింగ్ స్టూడెంట్స్ బాగా లైక్ చేసేవారు. ఐదు సంవత్సరాలలో నాలుగు సార్లు బెస్ట్ టీచర్ అవార్డు వచ్చింది. దానితో కొంతమందికి ఇబ్బంది కలిగింది. కొన్ని సంవత్సరాల తరువాత అంటే దాదాపు ఏడేళ్ళ తర్వాత కొత్త మేనేజర్

వచ్చి మా వారికి ఎక్స్ట్రా డ్యూటీ ఇవ్వటంతో పాటు సూటిపోటి మాటలు అనేవాడు. మా వారికి చాలా ఇబ్బందిగా ఉండేది. ఒకసారి మేనేజర్ పిలిచి నువ్వు మెడికల్ అసిస్టెంట్స్ తో రూడ్ గా ప్రవర్తించావు. అందువల్ల ఈ విషయం కోర్ట్ దాకా వెళ్తుంది అని చెప్పి భయపెట్టాడు. అంతేకాకుండా HR మీటింగ్ ఏర్పాటు చేసి ఆ విషయాలే చెప్పాడు. ఆ సంఘటన జరిగిన తర్వాత నాకు చాలా బాధ వేసింది. అంతకుముందు చాలా మంది మమ్మల్ని మోసం చేశారు. కానీ మా కర్మ పోయిందిలే అని అనుకునేదానిని. ఈ విషయంలో మానసికంగా చాలా బాధపడ్డాను. అప్పుడు నేను శివరత్నంతో శ్రీ సార్ గూర్చి మాట్లాడిన తరువాత "సార్ చూసుకుంటారు" అని తర్వాత కొంత స్వాంతన కలిగింది. శివరత్నం వెంకయ్యస్వామి ధునిలో కొబ్బరికాయ సమర్పించారు. ఆ తర్వాత రోజు HR మీటింగ్ జరిగింది. చాలా చిత్రంగా హెచ్ ఆర్ మేనేజర్ 'మీలాంటి డాక్టరు, టీచర్ దొరకటం కష్టం! నేను అన్ని ఇన్వెస్టిగేషన్ చేశాను. మీరు ఎవరికి భయపడనక్కర్లేదు. మీరు జాబ్ మానకండి' అని చెప్పే సరికి మా వారు ఆశ్చర్యపడ్డారు. అది విని నేను చాలా ఆనందించాను. అది కేవలం సార్ కృపే అని అనుకున్నాము.

మా వారు వాషింగ్టన్ లో ఉద్యోగం వదిలేసి సియాటెల్ యూనివర్సిటీలో జాయిన్ అయ్యారు. అక్కడ రీసెర్చ్ చేయడానికి కూడా అవకాశం ఉండటం వల్ల, మావారు డాక్టర్ cum టీచర్ గా పని చేస్తున్నారు. అక్కడ చేరిన అపార్ట్మెంట్లో కొత్త మేనేజర్ ఏదో రూల్స్ మాట్లాడుతూ చాలా తలనొప్పిగా తయారయ్యాడు. ఏ కారణం లేకుండా మమ్మల్ని పదివేల డాలర్లు (సుమారు 7 లక్షల రూపాయలు) కట్టమన్నారు. అలా చెప్పిన తర్వాత ఒకరోజు online సత్సంగం జరుగుతుంటే నేను సార్‌తో 'మీరు డబ్బులు తీసుకోండి, కానీ మీరు వాళ్లకి డబ్బులు వెళ్లనివ్వవద్దు' అని మ్రొక్కుకున్నాను. ఆగస్టు 2021 సత్సంగ సభ్యులు మదన్ కుమార్ (సూళ్లూరుపేట) వెంకయ్య స్వామి మందిరానికి దక్షిణ ఇచ్చేవారు ఇవ్వండి, అని వాట్సాప్ లో మెసేజ్ పంపించారు. అది చూసి భగవంతుడు మా కోసం అలాంటి ఏర్పాటు చేశాడా? అనుకొని మేము దక్షిణ సమర్పించుకున్నాము. కొన్ని రోజుల తర్వాత అదే మేనేజర్ మాతో మాట్లాడుతూ ఎందుకు టెన్షన్ పడతారు, మినిమం ఫీజ్ పే చేయండి అది సరిపోతుంది అన్నారు. మేము అలానే చేసాము. పదివేల డాలర్లుకు చాలా తక్కువ పే చేసి బయట పడ్డాము.

2015లో సుబ్బరామయ్య సార్ గారితో ఒకసారి ఫోన్ లో మాట్లాడాను. మాట్లాడుతూ (ఈ సారి ఇండియా వచ్చినప్పుడు) మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను సార్ అంటే, సార్ నవ్వి " అప్పటి దాకా ఉండాలి కదా" అని అన్నారు. తర్వాత 2017 లో సమాధి అయిన తర్వాత అనిపించింది. అంటే సార్‌కి ఎప్పుడు శరీరం వదిలేది కూడా తెలుసు అని!

సుబ్బరామయ్య సారు సమాధి అయ్యాక ఒకరోజు వెంకయ్య స్వామి గ్రంథంలో స్వామి సమాధి అయిన సన్నివేశం చదువుతున్నాను. దాంట్లో స్వామి శరీరం వదిలేసిన తర్వాత కూడా ఆయన శరీరం ఎంతో మృదువుగా, ప్రాణ సహితంగా ఉంది అని చదివాను. ఆ తరువాత కలలో సుబ్బరామయ్య సార్ గారు కనిపించి నన్ను "బాత్రూంకి తీసుకెళ్తావా, అమ్మా!" అని అడిగారు. మీరు మా నాన్నగారు లాంటి వారు, తప్పకుండా తీసుకు వెళతాను, అని బాత్ రూం కి తీసుకెళ్లి బయటకు వచ్చాను. కొంచెంసేపు తర్వాత సార్ పిలిస్తే సార్‌ని బాత్రూం నుండి తీసుకు వచ్చేటప్పుడు సార్ చర్మం స్పర్శ వెంకయ్య స్వామి బుక్ లో వ్రాసినట్లు ఉండటంతో చాలా ఆశ్చర్యపడ్డాను. సార్ దర్శనం మాత్రమే కాకుండా

భౌతికంగా ఉన్న అనుభూతి ఇప్పటికీ ఉన్నది. ఇదంతా సుబ్బరామయ్య సార్ గారి కృపే!

# శివకుమారి టీచరు, గుంటూరు

2004 వ సం|| ఫిబ్రవరి నెలలో గుంటూరు శివకుమారి టీచరు గారు తెల్లవారు ఝామున 5 గం|| 30 ని||లకి పూజ అయిన తర్వాత గొలగమూడి స్వామి సమాధి దర్శనం చేసుకుంటుంటే సార్ మందిరంలో కూర్చుని కనిపించారు. బాగా గడ్డం, నీరసంగా వున్నారు. చలి వలన అలా ఉందనుకుని అక్కడ ఉన్న ఒకతనిని ఆయన ఎవరు అని అడిగితే 'సుబ్బరామయ్య అయ్యవారు' అని చెప్పాడు. దర్శనం చేసుకున్న వెంటనే సార్ దగ్గరకి వెళ్లి 'ఏమిటి సార్ ఆరోగ్యం బాగోలేదా?' అని అడగంగానే సార్ పైకి లేచి "ఏం నువ్వేమన్నా బాగు చేస్తావా" అని అంటూ నాలుగు అడుగులు బయటకు నడుస్తూ అదృశ్యం అయిపోయారు. ఒక్కసారి షాక్ చెందిన శివకుమారి గారు తేరుకుని సార్ సాయిమాస్టర్ నిలయంలో ఉదయ ఆరతికి వస్తారు కదా అని వెంటనే సాయిమాస్టర్ నిలయంకి వెళ్ళారు. అక్కడ సార్ తెల్ల పంచె, కండువా లో నీటుగా గడ్డం లేకుండా చాలా హుందాగా వున్నారు. శివకుమారి గారిని చూసి

చిరుదరహాసం చేసి ఆరతిలో నిమగ్నమై పోయారు. ఈ విషయం తెలిసి వేణుగోపాల్ గారు సార్ ని అడిగితే "'చైతన్యం ఎక్కడ లేదు, వేణూ!" అని నిర్లిప్తంగా అన్నారు.

# గొర్తి రవి, తిరుపతి

నా పేరు గొర్తి రవి. నేను 2004 సం||లో చదువుకునే రోజులలో తమ్ముడు సాయిశివతో కలిసి తరుచుగా గొలగమూడికి వెళ్ళడం జరిగేది. అప్పుడు సార్ సాంగత్యము భగవంతుని అనుగ్రహమువలన లభించింది. సార్ ఇచ్చిన అనుభవాలను, వారి బోధలను, తమ మార్గ దర్శకత్వంతో నడిపించిన సంఘటనలను ఇక్కడ గురుబంధువులతో పంచుకుంటున్నాను.

- **సార్ ప్రేమతత్వం:**

ఆ రొజులలో శని ఆదివారాలలో గొలగమూడిలో సార్ దగ్గరకు అనేకమందిమి వచ్చేవాళ్ళము. ఉదాహరణకు - బెంగుళూరు నుండి శివ, ప్రసాద్, నగేష్, రామకృష్ణ, ఫణి, నేను, చెన్నై నుండి - మా అన్నయ్య (సాయి), పెద్దమ్మ (లక్ష్మిగారు), శేషు కృష్ణ, హైదరాబాదునుండి - వెంకటేశ్వర్లు, సంపత్, ఇలా అనేకమంది తరచూ గొలగమూడి వచ్చేవారము.

ఇందులో చాలామందిమి, ఎవరి వంటలు వారు చేసుకునేవారము కాబట్టి, మాకందరికీ అక్కడ గిన్నెలు, గ్యాస్ మొ|| కావాలి. మేము అక్కడ సార్ కట్టించిన సాయిమాస్టర్ నిలయంలో కొందరము, సార్ ఇంటిలోని గదిలో కొందరము ఉంటూ ఉండేవాళ్ళము.

మన ఇంటికి ఎప్పుడో సంవత్సరానికి ఒకసారి బంధువులో లేక స్నేహితులో వస్తేనే వారి అవసరాలు చూసుకోవడం మనకు ఎంతో శ్రమగా, కష్టంగా తోస్తుంది! అలాంటిది, ప్రతి వారం, 10-15 మంది అక్కడకు వస్తున్నా, ఏ మాత్రం విసుక్కోకుండా, వాళ్ళందరూ అక్కడ సౌకర్యంగా ఉండడానికి, వండుకోవడానికి ఏర్పాట్లు చేసి, సత్సంగాలు చేసి, వారు స్వామి సేవ చేసుకోవడానికి అవకాశాలు కల్పించి, అందరి సమస్యలు ఓర్పుగా విని వాటిని పరిష్కరించడం సామాన్యమైన విషయం కాదు.

అక్కడికి వెళ్ళిన మనము శ్రీ వెంకయ్యస్వామి వారికి ప్రదక్షిణలు, పారాయణ, సేవ చేసుకుంటే సార్‌కి మనమేదో గొప్ప మేలుచేసినట్లుగా ఎంతో సంతోషించేవారు. అక్కడికి వెళ్ళిన మేమెవరమూ నిజమైన భక్తులము కాకపోయినా, మన ఎడల శ్రీ సార్ ప్రవర్తన, సాయిబాబా హారతులలో చెప్పబడిన “నీ భక్తుల

దాసిని” అన్న వాక్యానికి ఆచరణాత్మక నిర్వచనం. అకారణమైన సార్ ప్రేమ, మన శ్రేయస్సుపట్ల వారికి గల శ్రద్ధ, ఎంతోమదిని వారి సన్నిధికి రప్పించి, ఎంతో మేలు కలిగించేది.

సార్ నన్ను ధర్మమార్గంలో నడిపించిన అనుభవాలను కొన్నింటిని ఇక్కడ పంచుకుంటాను.

- **స్వామి ఇచ్చిన ఆదేశాన్ని పాటించకుంటే పుట్టగతులు ఉండవు ! :**

నేను బెంగుళూరులో నా M. Tech. పూర్తి అయిన తర్వాత PhD ఎక్కడ చెయ్యమంటారు? అని శ్రీ వెంకయ్యస్వామివారి ఆదేశాన్ని అడుగుతూ స్వామి పటంవద్ద చీటీలు వేసాను. అందులో, (1) ఇండియాలోనే PhDకి ప్రయత్నం చేయమని, (2) ఇతర దేశాలలో PhDకి ప్రయత్నం చెయ్యమని, (3) M. Tech. డిగ్రీతోనే టీచర్ ఉద్యోగానికి ప్రయత్నం చేయమని చీటీలు వేసి, స్వామివారి ఆదేశాన్ని తెలపమని ప్రార్థిస్తే, ఇతర దేశాలలో PhD చెయ్యమని స్వామివారి ఆదేశం వచ్చింది. దానితో ఇతర దేశాలలో PhD చేయడానికి కావలిసిన పరీక్షలు వ్రాసి, అమెరికాలోనూ, ఇంకా మరికొన్నిచోట్ల అప్లై చేసాను. కానీ నా M. Tech. పూర్తయ్యే సమయానికి ఎక్కడా సీటు రాలేదు.

నా M. Tech. గైడు, నేను ఒప్పుకుంటే బెంగుళూరులోనే (IIScలో) నన్ను PhDకి తీసుకుంటానని చెప్పారు. ఇతర దేశాలలో PhD సీటు రాలేదు కాబట్టి, ఇంక బెంగుళూరులోనే జాయిన్ అవుదామా అని అనిపించి, సార్‌ని ఈ విషయమై అడిగాను. అప్పుడు సార్, “మనకు నచ్చినట్లు చేద్దామనుకుంటే, అలాంటప్పుడు మీ ఆదేశం ఏమిటని స్వామిని అడగకూడదు. ఆయనను ప్రార్ధించుకుని, మనకు తోచిన ప్రయత్నాలు చేసుకుంటూ పోవాలి. అలాకాక, మనము ప్రత్యేకంగా, ఆయన ఆదేశం అడిగితే, ఆయన ఆజ్ఞ ప్రకారం తు.చ. తప్పకుండా ప్రయత్నించాలి. ఒకసారి స్వామి సందేశం ఇచ్చాక, దాని ప్రకారంకాక, మన ఇష్టం వచ్చినట్లు చేస్తే మనకు పుట్టగతులు ఉండవు!” అని చెప్పి ఆపేసారు.

సార్ చెప్పిన ఆ మాటలకు, నా గుండెలో రాయి పడినట్లైంది. ఇక ఇండియాలో PhD ప్రయత్నాలు ఆపివేసి, టెంపరరీగా ప్రోజెక్ట్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యి, ఇతర దేశాలలో PhD అవకాశాలకోసం ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉన్నాను. కొద్దికాలం తర్వాత, ఊహించని విధంగా, స్విట్జర్లాండ్‌లో EPFL అనే చాలా మంచి యూనివర్సిటీలో PhD సీటు వచ్చి, అక్కడ

జాయిన్ అయ్యి, PhD పూర్తి చెయ్యడం జరిగింది. ఇప్పుడు IIT-తిరుపతిలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను.

ఆ రోజు సార్ అంత గట్టిగా స్వామి ఆదేశం పాటించడం గురించి హెచ్చరించి, ఆ ఆదేశాన్ని పాటించేటట్లు చేయకుంటే, నన్ను గురువు మాటను ఉల్లంఘించి నడుచుకున్న పాపం, బాధ జీవితాంతం వెంటాడేవి. ఇటు లౌకికంగా చూసినా, ఎంతో గొప్ప అవకాశాన్ని కోల్పోయి ఉండేవాడిని. ఈ విధంగా సార్ నన్ను ఇటు లౌకికంగానూ, అటు ధర్మం తప్పి నడుచుకోకుండాను సరి అయిన మార్గంలో నడిపించారు. అలా మనలను నడిపించడం - ధర్మాచరణ సహజసిద్ధమైపోయిన సార్‌లాంటివారికి తప్ప సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కానే కాదు.

- **సార్ సర్వజ్ఞత్వం:**

సార్‌తో జరిగిన ఎన్నో సన్నివేశాలలో వారి సర్వజ్ఞత్వం ఎంతో సహజంగా తొంగిచూసేది. అది ఎంత సహజంగా ఉండేదంటే, సార్ కాకతాళీయంగా (coincidence) అలా అన్నారేమో అని మనం పొరబడేటట్లు ఉండేది. కొన్ని ఉదాహరణలు:

(i) ఒకసారి సద్గురు కృప అనే పత్రికలు కొన్ని సార్ వద్ద ఉన్నాయి. వాటిని అక్కడ ఉన్న వాళ్ళకి ఇస్తూ, నాకుకూడా ఒకటి ఇవ్వబోతుంటే, నేను నా మనసులో "నాకెందుకు సార్ ఈ పత్రిక! నేను ఎలాగా చదవను" అని అనుకుంటూ, మౌనంగా చెయ్యిమాత్రం పుస్తకం తీసుకోవడానికి ముందుకు చాపాను. సార్ గట్టిగా నవ్వుతూ, "నువ్వు ఈ పత్రిక చదవకపోయినా, మీ రూంలో ఉన్న శివ చదువుతాడులే!" అని ఆ పత్రిక నా చేతిలో పెట్టారు.

(ii) ఒకసారి సాయి అన్నయ్య సాయిమాస్టర్ నిలయానికి కొంత దక్షిణ సార్ చేతికి ఇచ్చాడు. అపుడు నా మనసులో, "సార్ ఒకవేళ మరిచిపోతే, ఆ డబ్బులు ఆయనతోనే ఉండిపోతాయి కదా!" అని ఆలోచన కలిగింది. అప్పుడు వెంటనే సార్ అన్నయ్యతో, "నేను మరిచిపోతానేమో! ఆ డబ్బులు నువ్వే తీసుకుని వెళ్ళి హుండీలో వెయ్యి" అని చెప్పారు.

(iii) M. Tech. చదువుకునే రోజులలో, శనివారం ఉదయం గొలగమూడికి వచ్చి, మరలా ఆదివారం రాత్రి బయలుదేరి వెళ్ళేవారం. రాత్రి సుమారు 8:30 గం||లకు గొలగమూడి నుండి నెల్లూరుకి ఆఖరి బస్సు ఉండేది. బయలుదేరే ముందు సార్ దర్శనం

చేసుకుని, వారి వద్ద సెలవు తీసుకుని వెళ్ళేవారం. ఒక్కొక్కసారి సార్ దర్శనం చేసుకునే సమయానికి ఆలస్యమయ్యి, మనసులో కంగారు పడుతూ వారి వద్దకు వెళ్ళినప్పుడు, “శుభం, ఇంక బస్సు వస్తుంది బయలుదేరండి” అని పంపేవారు. చిత్రంగా మాకు బస్సు అలానే దొరికేది.

- **ఓం భక్తభారభృతాయ నమః**

2007వ సం|| లో బెంగుళూరులో నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తూ ఉండేవాడిని. ఒకసారి శని, ఆదివారములలో గొలగమూడిలో ఉండడానికి తమ్ముడు సాయి శివతో శ్రీ సాయిమాష్టరు నిలయమునకు వచ్చాము. ఆ సాయి మాష్టరు నిలయమునకు ఆనుకుని మేడపైకి వెళ్ళే మెట్ల దగ్గర సుమారు 5-6 అడుగుల ఎత్తుగల ప్లాస్టిక్ వాటర్ టాంక్ ఉంది. అచటకు వచ్చిన భక్తుల అవసరములకు కావలసిన నీటిని, దగ్గరలో ఉన్న బావి నుండి మోటరు ద్వారా ఆ టాంక్ లోనికి తోడేవారు. ఆదివారం సాయంత్రం నేను, శివ, ప్రసాద్ మరి కొంతమంది శ్రీ సుబ్బరామయ్య సార్ ఇంటి బయట సార్ దగ్గర కూర్చుని ఉన్నాము. అప్పుడు సార్, “సాయిమాష్టరు నిలయము వద్దనున్న వాటర్ టాంక్ కడిగి చాలారోజులు అయింది” అని అన్నారు. ఆ

టాంకుని శుభ్రం చెయ్యడానికి అక్కడ ఉన్న అందరము సంసిద్ధత తెలియజేసాము. అప్పుడు సార్ నాతో, "ఇక్కడ ఉన్న అందరిలో నువ్వు పొడుగుగా ఉన్నవు కదా! కాబట్టి నువ్వు శుభ్రం చేద్దువుగాని" అని అన్నారు. అప్పుడు అందరము ఆ టాంక్ దగ్గరకు వెళ్ళాము. నేను ఉత్సాహంగా ఆ టాంక్ లోకి దిగి లోపల శుభ్రం చేసాను. సార్ అక్కడే నిలబడి పర్యవేక్షిస్తున్నారు. క్లీనింగ్ పూర్తవడంతో ఆ టాంక్ బయట ఉన్న అంచుల మీద చేతులు ఉంచి, టాంక్ లోపలనుండి ఫోర్స్‌గా పైకి లేచాను. అలా ఫోర్స్‌గా రావడంలో, ఆ టాంక్‌ని ఆనుకుని ఉన్న సాయిమాష్టర్ నిలయం యొక్క సన్-షేడ్ నా తలకు బలంగా తగిలి, బొప్పి కట్టింది. అలా జరిగిన వెంటనే సార్ శ్రీ వెంకయ్యస్వామి వారి మందిరం వైపు తిరిగి, స్వామికి నమస్కారం పెట్టి, నాతో, "మరేం ఫరవాలేదు. నీ తలకు ఏదో పెద్దదెబ్బ తగలాల్సి ఉంటే, శ్రీ వెంకయ్యస్వామి వారు నీకు ఈ చిన్న దెబ్బతో తొలగించారు" అన్నారు. కొంతసేపటికి ఆ నొప్పి తగ్గిపోయింది. ఆ రోజు రాత్రి బయలుదేరి బెంగుళూరు తిరిగి వెళ్ళిపోయాము.

కొద్ది వారాలు గడిచాయి. తమ్ముడు సాయిశివ ఉపనయనం దమ్మపేటలో చేస్తున్నారు. నేను కూడా

అక్కడకు వెళ్ళి ఉత్సాహంగ పనులలో పాలు పంచుకుంటున్నాను. అక్కడి వారికి వంటలు చేయడం కోసం పెద్ద గిన్నెలు అవసరమయ్యాయి. వారి ఇంటిగదిలోని పైన ఉన్న సిమెంటు తో కట్టిన షేడ్ మీద ఉన్న గిన్నెలు అవసరమయ్యాయి. నేను ఒక నిచ్చెన ఎక్కి వారికి కావలసిన పాత్రలను ఇచ్చి, క్రిందకు దిగిపోయాను. ఆ తరువాత ఆ గదిలోనే చాలా మంది కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నాము. ఇంతలో హఠాత్తుగా పెద్ద శబ్దమయింది. ఏమిటా అను చూస్తే పాత్రలు సద్దిన షేడ్ మీదనుండి (సుమారు 10 అడుగుల ఎత్తు ) ఒక పెద్ద గుండ్రటి బరువయిన (సుమారు 30 కిలోలు) ఇత్తడి గుండుగ పైనుండి దొర్లి, నాకు కొద్ది అంగుళముల దూరములో క్రింద పడినది. నేను అంతకు ముందు గిన్నెలు సర్దినపుడు అవి సరిగా బేలెన్స్ అవ్వకపోవడం వలన కొద్దిసేపటికే దొర్లుతో క్రింద పడింది. నేను ఒకవేళ కొద్ది అంగుళములు అటుగా కూర్చుని ఉంటే, ఆ గుండుగ నేరుగా నా తలపై పడి, నా తల అక్కడికక్కడే పగిలి ఉండేది! ఈ సంఘటన జరిగిన వెంటనే, కేవలం స్వామివారి అనుగ్రహం వలన, కొద్ది వారాల ముందు గొలగమూడిలో జరిగిన ఇంతకు ముందు వివరించిన సంఘటన స్ఫురణకు వచ్చింది.

టాంక్ క్లీన్‌చేసి బయటకు వస్తుండగా సన్-షేడ్ తగిలి నాకు బొప్పి కట్టినప్పుడు, శ్రీ సుబ్బరామయ్య సార్ వెంటనే వెంకయ్య స్వామి వారికి నమస్కరించి, నాతో, “నీకు ఎంతో పెద్ద దెబ్బ తగలవలసి ఉంటే స్వామివారు ఈ చిన్న దెబ్బతో ఆ కర్మను తొలగించారు” అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

భవిష్యత్తులో ఎటువంటి ఆపదలు రాబోతున్నాయో మనలాంటి వారికి ఎంత మాత్రము తెలియదు. మనపై అపారమైన ప్రేమ, కారుణ్యములతో మహనీయులు తమ వద్దకు వచ్చేవారిని అట్టి ఆపదలను - గొడ్డలి దెబ్బ అంతటి తీవ్రత అనుభవించవలసినవి - గోరు గీసుకున్నంత సులభంగా తొలగించడం ఎంతటి అదృష్టమో! అలా తొలగించడమే గాకుండా, వారి కృప వలన అలా తొలగబోతున్నది అని చెప్పడం, అట్టి సంఘటన జరిగిన క్షణములోనే, వారి కృపవలన మాత్రమే మనము రక్షింపబడ్డాము అని మన మనసులో స్ఫురింపజేయడము ఇంకెంత అదృష్టమో! ఆవిధంగా సద్గురువుపట్ల కృతజ్ఞతను మరింతగా నిలుపుకునేందుకు ఆసరాగా నిలబడిన మహనీయులయిన శ్రీ సుబ్బరామయ్య సార్ గారి

పాదపద్మములకు హృదయ పూర్వకముగా నమస్కరించుచున్నాను.

రవి ఒకసారి "ఆలోచనలు పిచ్చి పిచ్చివి వస్తున్నాయి సార్" అని అడిగితే సార్ ఈ క్రింది విషయాలు చెప్పారు (సాయి శివ డైరీ నుంచి).

11-07-2004 ఈరోజు మధ్యాహ్నం సార్ ఇంటి వెనకాల కూర్చొని మాట్లాడిన విషయాలలో కొన్ని (అచ్చుట ప్రసాద్ గారూ నేను, రవి అన్నయ్య ఉన్నాము):

1) నిత్యం కొంత సమయం ఆలోచనలు లేకుండా కూర్చునేందుకు aim పెట్టుకొని కూర్చొని - వచ్చే ఆలోచనలు డైరీ వ్రాయాలి.

2) వర్క్ గురించి వచ్చే ఆలోచనలు పరవాలేదు. మంచిదే.

3) ధ్యానానికి కానీ, పూజకు కానీ కూర్చునే ముందు కొంచెం చక్కర చీమలకు పెట్టి కుర్చోంటే మనసు ఆనందంగా ఉంటుంది. (వాటిల్లో ఉండే ఆత్మే మనలోనూ ఉంది. అవి సంతోషించడం వల్ల మనకు కూడా ఆనందంగా ఉంటుంది.

4) ప్రయాణాలు అప్పుడైనా పూజ మొ|| కుదరకపోతే, ఆ టైంకి కనీసం ఒక పదిహేను నిమిషాలు

క్లుప్తంగానైనా చేస్తే, ఆ టైం అలవాటు తప్పిపోకుండా ఉంటుంది.

5) వయసులో ఉండేవారు తప్పకుండా ఆసనాలు వేయాలి లేకుంటే చాలా చెడ్డ చేస్తుంది.

సార్ కుస్తీ పహిల్వాన్లల వద్ద నేర్చుకున్నారట. దండాలు, బస్కీలు అన్ని బాగా చేసేవారట! 50 సంవత్సరాల వయసులో గుళ్ళో, వెంకయ్య స్వామి సమాధి మందిరంలో శీర్షాసనం మొ|| చేసేవారట.

“రోజు దైవానికి టైం ఇచ్చి చేయాలి. కొన్ని నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు. నాకు మూడు సంవత్సరాలు పట్టింది.”

“పనిచేస్తూ ఉండాలి. ఏం చేస్తాం ! పని లేకపోతే (ఆలోచనలు) వస్తాయి. కాబట్టి ఏదో ఒక పని చేస్తుండాలి” అన్నారు. మాస్టారికి చెప్పుకోమన్నారు. నన్ను రోజూ ఆసనాలు వేస్తున్నావా? అని అడిగి పై విషయాలు కొన్ని చెప్పారు. మాస్టర్ చెప్పారట “ఆయన నిరంతరము మన వైపు చూస్తూ ఉంటే మనం ఎక్కడో చూస్తూ ఉండటం అపచారం కదా” అని.

# చింతా లక్ష్మీనారాయణ గారు, వారి ధర్మపత్ని లక్ష్మి గారు

శ్రీ వెంకయ్య స్వామి సన్నిధిలో రెండు మండలాలు (80 రోజులు) గడుపుతున్న చింతా లక్ష్మి నారాయణ గారు, వారి ధర్మ పత్ని చింత లక్ష్మి గారు తమకు శ్రీ సుబ్బరామయ్య సార్ అనుగ్రహించిన అనుభవాలను ఇలా పంచు కొంటున్నారు.

ఈ రోజుల్లో లక్ష్మి గారికి రోజు ఆరతికి ముందు సాయి మాష్టర్ నిలయంలో కొంత సమయం ప్రదక్షిణలు చేయటం, గడపటం చేసేవారు. ఒక రోజు అచ్చట శ్రీ సార్ లెటర్స్ పుస్తకం ఒక పేజి తెరచి సందేశం కోసం చూస్తే శ్రీ సార్ "మౌనము గూర్చి ఒక భక్తులు అడిగిన ప్రశ్నకు అంతరంగ మౌనము అవసరము, అది సాధించకుండా బాహ్య మౌనము మాత్రమే పాటిస్తూ పలకల మీద వ్రాయటం, సైగలు తో చెప్పటం మొ || వాని వలన ప్రయోజనము లేదు "అని చెప్పిన పేజి తెరుచుకుంది. ఇది వరలో లక్ష్మి గారు తరచూ బాహ్య మౌనము పాటించే వారు. చిత్రంగా అది వారి

అలవాటును సంస్కరిస్తూ - సంస్కారానికి తగ్గ సందేశం కావటంతో ఆశ్చర్యము- ఆనందము కలిగాయి.

అలానే మరో రోజు ఆరతి ముందు ప్రదక్షిణాలు అయ్యాక పెద్దగా ఇంటికి వెళ్ళాలి అనిపించక ఆరతికి ఉండిపోయారు. ఆ రోజు ఆరతి సమయంలో శ్రీ మాష్టరి ఫోటో కేసి చూస్తూ ఆరతి ఇస్తున్న వీరికి శ్రీ మాష్టారి ఫోటోలో క్రమంగా శ్రీ సార్ ముఖము - దర్శనము లభించింది. ఆరతి సమయములో చాలా సేపు ఇటు సాయి మాష్టార్ నిలయం పీఠంపై ఉన్న మాష్టారి ఫోటో క్రింద ఉన్న శ్రీ సార్ ఫోటో ఒకేలా ఉన్నాయి. వీరు భోతికంగా సేవించుకొన్న వారి గురువైన మాష్టారికి, శ్రీ సార్ కూ భేదం లేదు అని తెలిపినట్లు ఉంది ఈ అనుభవం.

గతంలో ఒక భక్తురాలికి "గొలగమూడిలోని సాయి మాస్టర్ నిలయంలో వెంకయ్య స్వామి వారి ఫోటో కదా మధ్యలో ఉండవలసినది, భరద్వాజ మాష్టారి ఫోటో ఎందుకు మధ్యలో ఇంపార్టెన్స్ ఇచ్చేట్లుగా ఉంది ? అనుకుంటే ఒక వెలుగు శ్రీ స్వామి నుండి శ్రీ సాయినాధుని ఫొటోకు తరువాత శ్రీ మాస్టారి ఫోటోలో లయం అయ్యినట్లు దర్శనం అయ్యింది." దీనితో ఆ

ముగ్గురు అభేదులు అయిన పరమాత్మ స్వరూపమే అని నిరూపణ అయ్యింది.

పై అనుభవాలతో శ్రీ సుబ్బరామయ్య సార్, మాష్టారు, స్వామి, సాయి అభేదులై శ్రీ సాయి మాస్టర్ నిలయంలో కొలువు ఉన్నారని, కొలువుండి భక్త రక్షణ, మార్గ దర్శకత్వం చేస్తున్నారు అని తెలుపుతున్నాయి.

- **శ్రీ భరద్వాజ మాస్టారికి సన్నిహితులు మరియు స్వామి భక్తులు నాతో ఇలా చెప్పారు:**

సుబ్బరామయ్య గారు B.SC B.ED , స్కూల్ టీచర్ ఆయనకు ఏమాత్రం ఆభిజాత్యం ఉండేది కాదు. ఆయన ఎటువంటి పని అయినా చేసేవారు. ఆయన ఒక మాట అంటే వెంకయ్యస్వామి ఆ మాటను నిజం చేయిస్తారు. ఉదాహరణకు

కొన్ని కారణాల వల్ల నా తప్పు లేకపోయినా నన్ను బ్యాంకునుండి సస్పెండ్ చేశారు. నేను ఇంట్లో పూజలు ఒక 11 నెలలు చేశాను. ఆ సమయంలో నా కొడుకు గొలగమూడిలో వెంకయ్యస్వామిని దర్శించుకొని సుబ్బరామయ్య గారిని కలిసాడు. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు నా సస్పెన్షన్ గురించి చెప్పారు. వెంటనే సుబ్బరామయ్య గారు “మీ నాయనని గొలగమూడికి వచ్చి ఉండమని. నెల రోజులలో ఆర్డర్లు

వస్తాయి” అని చెప్పారు. నేను ఆయన మాట ప్రకారం వెళ్లి ఉంటే 30 వ రోజుకి ఆర్డర్లు వచ్చాయి.

సుబ్బరామయ్య గారు ఒకరోజు ఫోన్ చేసి “గొలగమూడిలోని మీ స్థలం ట్రస్ట్ కు ఇవ్వండి “ అని అడిగారు. నేను ఆ స్థలం మా అబ్బాయిది. ఒక మాట అడిగి చెప్తాను అనేసరికి సార్ చిరుకోపంతో ఏ నువ్వు చెపితే ఇవ్వనంటాడా” అంటూ “ఇప్పటికే కోట్లు ఉన్నాయి ఈ స్థలం ఇవ్వమను” అని ఫోన్ పెట్టేసారు. నా కొడుకుని అడిగిన వెంటనే ఇచ్చెయ్యమన్నాడు. అలానే సార్‌కి ఆ స్థలాన్ని ఇచ్చే అదృష్టం కలిగింది. దాని తర్వాత నా కొడుకుకి కోట్లు కలిగాయి. సుబ్బరామయ్య గారు అన్నవి జరిగాయి.

# మహా సమాధి

**సార్ 2017 వ సం|| జ్యేష్ట శుద్ధ పౌర్ణమి రోజున ( జూన్ 9) శుక్రవారం ఉదయం 7 గం|| 20 ని||లకి తుది శ్వాసని విడిచారు**. సార్ భౌతికదేహాన్ని శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సమాధి చేసారు. సార్ సమాధి చెందినా తర్వాత కూడా భక్తులకు అయన నిత్యసత్యులని అనుభవాలిస్తున్నారు.

దమ్మపేట నుండి వచ్చిన ఒక పెద్దావిడ సార్ సమాధి చూసి మామూలు మనిషిని సమాధి చేయటమేమిటని అనుకుని జూన్ 10వ తేది ఉదయం 10గం||30ని||లప్పుడు శ్రీ సాయి మాస్టర్ నిలయంలో పడుకుంటే సార్ ఫోటోలో నుండి బయటకు వచ్చి దత్తాత్రేయుని ఫోటోలో కలిసిపోయారు. వెంబడే మెలుకువ వచ్చిన ఆవిడకి మనస్సులో 'సుబ్బరామయ్యగారికి, దత్తత్రేయునికి తేడా లేదని' అనిపించి అక్కడ వున్న వేణుగోపాల్ గారితో చెప్పింది.

బెంగుళూరు శైలజ అనే భక్తురాలు సార్ సమాధి దర్శనము అయిన తర్వాత శ్రీ దర్గాస్వామి దర్శనము చేసుకుంది. శ్రీ దర్గాస్వామి ఆశీస్సులు ఇస్తూ "నీకేమమ్మా, సుబ్బరామయ్య నీకు ఎప్పుడూ తోడూ వుంటాడు" అని చెప్పారు. అంటే సార్‌నిత్య సత్యులని స్వామి చెప్పటం భక్తులందరికీ ఎంత భరోసానో కదా!

సమాధి అనంతరం సార్ అమ్మగారికి తోడు నీడగా నడుపు సన్నివేశాలు:

సార్ సమాధి అనంతరం అమ్మగారికి వచ్చిన ఎన్నో కలలతో సార్ అనుక్షణం అమ్మగారితోనూ, మనందరితోనూ ఉన్నారని, వారు మనం చేసేవి చూస్తూ, మనను నడిపిస్తూ ఉంటారని తెలుపుతున్నాయి. సార్

సమాధి అయిన రెండవరోజు (11 మే 2017 న) అమ్మగారి స్వప్నంలో ఒకరు కనపడి సార్ సాయి మాస్టర్ నిలయం వద్ద ఉన్నారని రమ్మంటున్నారని చెప్పారు. అమ్మగారు అయన ఇంకెక్కడ చాటుకు వెళ్లిపోయారంటే లేదు రమ్మంటున్నారని తీసుకువెళ్ళారు. అచ్చట సార్ అందరికీ పనులు చెప్పి చేయిస్తున్నారు. అమ్మగారికి కూడా పని చెప్పితే అమ్మగారు చేసారు. తరువాత అమ్మగారు సార్ ని ఇంటికి రమ్మంటే సార్ ''నాకు ఇచ్చటే బాగుంది, ఇక్కడే ఉంటానన్నారు". భయం వేయదా అని అమ్మగారు అడిగితే అంటే నాకు భయమేమీ లేదన్నారు. సార్ సమాధిలో ఇప్పటికీ, ఎప్పటికీ ఉంటారని అమ్మగారికీ, మనందరికీ తెలపటం కాదా!

I AM HERE

సమాధి అయిన కొద్దిరోజులకు ఒకసారి అమ్మగారు రాత్రి 10:30 నుండి 11:00 గంటలకు అన్నం పెట్టి, బాబాకు దీపారాధన చేసి శేషయ్యకు పెట్టి అమ్మగారు మరలా తిందాము అనుకుని ఏమీ చేయాలనిపించక బాధగా కుర్చీలో పడుకుంటే సార్ కలలో కనపడి "ఎందుకు ఏడ్చేది? నీవేడుస్తుంటే నేనేం చేసేది? నేను యాడికి పోయాను. వచ్చేసాను" అని మంచంలో పడుకున్నారు. అమ్మగారిని పిలిచి కాలునొప్పి

ఎలా ఉందని అడిగి ఒకసారి నొక్కి చూసి, దేవుడికి పెట్టావు కదా! ఇడ్లీ తినేసి పడుకోమని" చెప్పారు. మెలకువ వచ్చేసరికి ఇడ్లీ తినలేదని అచ్చటే ఉందని గుర్తొచ్చింది. ఇలా మనం చేసే ప్రతి పనీ చూస్తూ భగవంతునికి చేసే దానిని ప్రోత్సహిస్తూ అమ్మగారి చింతను ఇది వరలాగే తొలగిస్తూ ఉన్నారు.

MISSING EAR RINGS

మరోసారి అమ్మగారి కమ్మలు పోయాయి. పడుకున్నప్పుడు పడిపోయి ఉంటారనుకున్నారు. వెతికినా దొరకలేదు. చివరకు సార్‌కు విన్నవించుకుంటే మరురోజు ఉదయం వంటిట్లో కనపడ్డాయి.

సార్ భార్యగారికి (అమ్మగారికి) 27 జూన్ 2017 రాత్రి స్వప్న వృత్తాంతం

''అయ్యవారు పిలుస్తున్నారని చెప్పటం వలన అమ్మగారు సాయి మాస్టర్ నిలయంకి వచ్చారు. అక్కడ సార్ చాలామందితో కలసి పనిచేస్తున్నారు. అమ్మగారిని చూసిన సార్ ఒక వస్తువిచ్చి కడుక్కురమన్నారు. కడిగి తీసుకు వచ్చిన తర్వాత సార్, అమ్మగారు అక్కడ పనిచేసే చిన్నపిల్లవాడిని చూసి నవ్వుకున్నారు. తర్వాత అమ్మగారు సార్‌తో 'ఏడకి పోయావు, ఇంటికి రా'

అన్నారు. సార్ “నేనింటికి రాను, నేనిక్కడే ఉంటాను’ అని చెప్పారు.

ఈ లీలలు బట్టి సార్ అన్నివేళలా అన్నిటినీ గమనిస్తున్నారనీ, అంతేగాకుండా మనల్ని సరైన మార్గంలో నడిపిస్తున్నారని తెలుస్తోంది! శ్రీ సార్ నిత్యసత్యులు.

సాయి సుబ్రహ్మణ్యం ఎలా తనను సార్ నిర్నిద్రులై కాపాడుతున్నారో చెపుతున్నారు:

శ్రీ సుబ్బరామయ్య సార్ సమాధి చెందిన రెండవరోజు సార్ సమాధి కార్యం అయ్యాక తరువాత సార్‌కి ఏమి చేయాలా అనే ప్రస్తావన వచ్చింది. అచ్చుటివారు 13వ రోజు ఏమి చేయాలో నిర్ణయించారు. నేను మరురోజు ప్రయాణం చేస్తూ నగేష్‌తో సంభాషణలో సార్ మనల్ని సొంత బిడ్డలలాగా చూసారు, మనకు తండ్రి కంటే ఎక్కువ కదా సార్ సమాధి అనంతరం మహాత్ములకు ఏ కార్యం చేస్తే బాగుంటుంది అని కొంత డిస్కషన్ వచ్చింది. మనస్సులో తండ్రి ఉత్తమగతుల కోసం కుమారులు చేసే క్రియలు ముఖ్యమని భరద్వాజ మాస్టర్, సార్ (శివనేసన్ స్వామి మాటలు) చెప్పినది గుర్తుకు వచ్చి సార్‌కు ఏదో కొంచెమైనా

చేయాలనిపించింది. అ రోజు రాత్రి కలలో ప్రాణం లేకుండా ఉన్న శరీరాన్ని స్నానం చేయించడానికి కూర్చోబెట్టడం చేస్తున్నారు. అంతలో సార్ శరీరంలోకి ప్రాణం వచ్చి “ఓం సాయినాధాయ నమః, ఓం గురుదేవ” అని పలుకుతున్నారు. వెంటనే కొంతమంది సార్‌కి ప్రాణం వచ్చిందని ఫ్యాన్ తీసుకు వస్తున్నారు. ఈ స్వప్న దర్శనంతో ఉత్తమగతికై సామాన్యులకు చేసే క్రియల కన్నా మృత్యువుపై ఘన విజయం సాధించిన మహాత్ములకు ఉత్తమ లోకాల నుండి వారి ఆశీస్సులు మనకు అందేందుకు కృతజ్ఞతగా చేయవలసిన పూజ, నిత్య నైవేద్యం (కొంత ఎక్కువగా) ఇస్తే బాగుంటుందని సార్ ప్రేరణగా భావించాను.

ఆ ప్రేరణతో రోజూ లఘు పూజ, సార్‌కు నైవేద్యంగా ప్రతిపూట కొంత ఎక్కువగానే నివేదించటం ప్రారంభించాను. కొన్ని రోజుల తర్వాత ఒక టూర్ కు వెళ్ళవలసి వచ్చి ఆ ప్రయాణాలలో రెండు మూడు రోజులు శ్రద్ధగా నివేదన చేయలేదు. ఆ తర్వాత రోజు రాత్రి సార్ కలలో నగేష్ వడిలో కనపడి తలపెట్టుకుని కనిపించారు. సార్ నాకు ఏదో పనులు వరుసగా ఆదేశించి చేయిస్తున్నారు. ఇంతలో ఒకరెవరో అవధూత లీల గ్రంథాన్ని ఇమ్మని అడిగారు. నేను ఇస్తాను

అన్నాను కానీ నేను సార్ దగ్గరే కూర్చున్నాను. సార్ నన్ను 'పద పద, ఒప్పుకున్నా పని క్షుణ్ణంగా చేయాలి' అన్నారు. నన్ను శ్రద్ధగా లఘుపూజ, మూడుపూటలా తగినంత నివేదన చేయమని సార్ హెచ్చరిస్తున్నారని స్ఫురింప చేసారు. సార్ సమాధి చెందినా నిత్యసత్యులని తెలిపి వారి కృపకు కృతజ్ఞతగా లఘుపూజ, నైవేద్యం చేయటం మొదలుపెట్టించి దానిలో జాప్యాన్ని భౌతికంగా వున్నప్పుడు ఎలా హెచ్చరించేవారో అదే రీతిలో ఇప్పటికీ హెచ్చరిస్తూ నడిపిస్తున్నారు. మనం చేసేది చూస్తూ తప్పులు సవరించటమనే వారి కార్యం నిర్విరామంగా వారి భౌతిక జీవిత పర్యంతం కూడా సదా సాగుతుందని గుర్తింప చేస్తున్నారు.

సార్ గారి భార్యగారికి (అమ్మగారికి) 27 జూన్ 2017 రాత్రి స్వప్న వృత్తాంతం

అయ్యవారు పిలుస్తున్నారని చెప్పటం వలన అమ్మగారు సాయి మాస్టర్ నిలయంకి వచ్చారు. అక్కడ సార్ చాలామందితో కలసి పనిచేస్తున్నారు. అమ్మగారిని చూసిన సార్ ఒక వస్తువిచ్చి కడుక్కురమన్నారు. కడిగి తీసుకు వచ్చిన తర్వాత సార్, అమ్మగారు అక్కడ పనిచేసే చిన్నపిల్లవాడిని చూసి నవ్వుకున్నారు. తర్వాత అమ్మగారు సార్‌తో 'ఏడకి పోయావు, ఇంటికి రా'

అన్నారు. సార్ "నేనింటికి రాను, నేనిక్కడే ఉంటాను" అని చెప్పారు.

సార్ భార్యగారికి (అమ్మగారు) సార్ కలలో కనపడిన విషయాన్ని హైదరాబాద్ వీరప్రతాప్ జూన్ 29వ తేదిన తన భార్యతో చెప్పాడు. ప్రతాప్ భార్య పడుకోబోయే ముందు 'సార్ నాకు దర్శనం ఇస్తారా? అక్కడికి వెళ్లేవారికి మాత్రమే ఇస్తారు కాబోలు' అని అనుకుంది. రాత్రి కలలో సార్ ఇలా చెప్పారు

**"అక్కడికి వస్తేనే దర్శనం ఇస్తాను అని కాదు, కల్మషం లేని మనస్సుతో ఎవరు ఎక్కడ అనుకున్నా వాళ్ళకు దర్శనం ఇస్తాను. కల్మషం లేని మనస్సు ఎవరికి ఉంటుందో వారికి నా ఆశీర్వాదం ఎప్పుడూ ఉంటుంది.**

తన భవిష్యత్ గురించి భయమేస్తోంది అన్నదానికి సార్ ఆమెకు 40సం||లు అప్పుడు, 50సం||లు అప్పుడు, 60సం||లు అప్పుడు ఎలా వుంటారో చూపించి, చూడు ఇక్కడ ఎంత సంతోషంగా ఉన్నారో, ఏమీ దిగులుపడకు అని చెప్పారు

తను ఏమన్నా తప్పు చేసానా సార్ అని అడిగితే తలమీద చేయి వేసి "ఏం తప్పు చేయలేదు తల్లీ!" అని అన్నారు.

# నాటికి –నేటికి పిలిచిన పలికే దైవం

సార్ తమ శరీరం చాలించటానికి ఒక వారం ముందర గురువారం సాయంత్రం స్నానం చేయించిన తర్వాత కోటేశ్వరరావు గారితో మాట్లాడుతూ "వారం తర్వాత ఉండను" అని మరోసారి "వారం తర్వాత ఉండను" అని చెప్పి కోటి గారితొ "ఎవరితొను చెప్పవద్దు" అని అన్నారు. కోటి గారికి సార్ అన్న మాటలు పూర్తిగా అర్థం కాలేదు. సార్ చెప్పవద్దు అన్నారు కాబట్టి ఎవ్వరితోను చెప్పలేదు. ఆ రోజు రాత్రి కలలో ఒక దివ్య దర్శనం అయ్యింది. శ్రీ సార్ వాళ్ళ ఇంటి వద్ద ఎందరో గుమ్ముగూడి ఉన్నారు. షామియానాలు వేసి ఉన్నాయ్. సార్ వాళ్ళ ఇంటి దగ్గరకు అందరిని తోసుకుంటూ వెళుతుంటే కొందరు అక్కడ ఏడుస్తూ ఉన్నారు. లోపల చుస్తే సార్ కూర్చొని నవ్వుతూ వీళ్ళంతా పిచ్చి వాళ్ళు. ఏమిటి వీళ్ళు అందరు ఏడుస్తున్నారు? నేనెక్కడి పోయాను. ఇక్కడే ఉన్నాను కదా అంటున్నారు. కల మెలుకువ వచ్చింది. మరు రోజు ఉదయం బయలుదేరి కోటేశ్వరరావు గారు వారి బందువుల ఇంటికి వెళ్ళవలసి రావటంతో వెళ్లారు. వారం గడిచింది. శుక్రవారం రోజు ఉదయమే సార్

చెప్పినది ఏమవుతుందో చూడాలనే ఉత్సుకతతో గొలగమూడి బయలుదేరుతుండగా వేంకటేశ్వర్లు వద్ద నుండి సార్‌కు బాగులేదని ఫోన్ వచ్చింది. వెళ్లి చుస్తే సార్ చెప్పినట్లే సార్ శరీరం చాలించారు అని తెలిసింది. పూర్తి స్పృహతో, ఎరుకతో సార్ తనువు చాలించారు అనటానికి ఇది ఒక నిదర్శనం.

సార్ చివరి రోజుల్లో సంవత్సరం పైగా కోటి గారు సార్‌కు స్నానం చేయించే వారు. సమాధి అనంతరం కూడా రోజు అభిషేకానికి ఉదయ హారతికి వచ్చి సార్‌ను సేవించు కొంటున్నారు. ఈ మధ్య జరిగిన ఈ క్రింది అద్భుతమైన అనుభవం సార్ ఇప్పటికి శ్రద్ధతో వారి సమాధిని వారిని సేవించే వారిపై తన దృష్టి అంతకంటే ఎక్కువగా నిలుపుతారని తెలుపుతోంది.

2018 మే లో ఒకరోజు నారాయణకి సార్ కలలో కనపడ్డారు. స్వప్న వృత్తాంతం

సార్ : వాడు వారం రోజులు నుండి రావట్లేదు. నాకు తెలుసు ఎందుకు రావట్లేదో

నారాయణ : ఎవరు సార్?

సార్ : వాడేరా ఒళ్ళు తుడుస్తాడు కదరా వాడే. నువ్వు అయినా రావచ్చు కదా.

నారాయణ వెంటనే బయలుదేరి సార్ సమాధి దర్శనం చేసుకున్నాడు. ఎప్పుడు ఉదయం అక్కడ ఉండే కోటేశ్వరరావు గారు లేక పోయేటప్పటికి, సార్‌తో స్వప్నంలో జరిగిన సంభాషణ అర్థమై కోటేశ్వరరావుకి ఫోన్ చేసి "ఏం సార్ దగ్గరకు రావట్లేదు?" అని అడిగితే కోటేశ్వరరావు "వారం క్రితం కుడి చేయి భుజం పట్టేసింది నారాయణ! మందులు వాడుతున్న తగ్గట్లేదు" అని చెప్పారు. నారాయణ తనకు జరిగిన స్వప్న వృత్తాంతం చెప్పాడు. వెంటనే నొప్పి అయినా సార్ అభిషేక సేవకు వెళ్ళటం మరలా మొదలు పెట్టారు. మూడవ రోజుకు ఏ మందులూ లేకుండా నొప్పి తగ్గిపోయింది. అంటే సార్ నిర్నిద్రులై ఎవరు సేవ చేస్తున్నారు, వారు ఏమారుతున్నారు అని ఇప్పటికి మన progress చూడటమే కాక తన ప్రత్యేక పద్ధతిలో సరి చేసి సేవా భాగ్యం కల్గిస్తూ, ఆ సేవ ద్వారా అన్ని ఇబ్బందులు తొలగిస్తామని తెలియచేస్తున్నారు.

సాయి మాస్టర్ సేవట్రుస్ట్ కార్యక్రమాలు ఏవి చేసేటప్పుడైన శ్రీ సార్‌కు ముఖతా నివేదించుకొని ఆశ్శీసులు అడిగి సార్ సుభాశీస్సులు వాచా ఇచ్చిన తరువాత నే మొదలు పెట్టడం సాయి మాస్టర్ ముఖ్య నిర్వాహకులైన వేణుగోపాల్ గారికి అలవాటు.

సార్ మొదటి ఆరాధనకు (జూన్ 9, 2018) ఇంకా కొన్ని రోజులు ఉంది. ఆరాధన కార్యక్రమాలు ఎలా జరుగుతాయని వేణుగోపాల్ గారు ఉద్విగ్నతగా ఉన్నారు. సార్‌కు నివేదించు కొంటున్నా సార్ మాటగా శుభాశీస్సులు పొందలేము కదా అని వెలితిగా ఉన్నారు. ఒకరోజు ఉదయం స్నానం చేస్తుంటే భౌతికంగా ఉన్నప్పటి సార్ మాటగా హృదయానికి చాలా స్పష్టంగా "అంతా బాగా జరుగుతుంది" అని వినపడింది. అంతే వెంటనే వేణుగోపాల్ గారికి మనస్సు ప్రసన్నం అయ్యింది. అలానే అన్ని కార్యక్రమాలు సజావుగా జరిగాయి. కానీ కార్యక్రమాలు బాగా జరిగాయి అని మనం ఎలా నిర్ణయిస్తాము? కొన్ని గుర్తులు:

సాయి, వేణుగారు, ప్రసాద్‌లు శ్రీ వెంకయ్యస్వామిని, సార్‌ని ప్రార్థిస్తూ "మీకు తృప్తికరంగా ఈ ఆరాధన జరిగేటట్లు చూడండి" అని స్వామి ధునికి టెంకాయ సమర్పించారు. (ఈ విషయం తెలపకుండా చేసినవారూ ఉంటారు)

ఆరాధనలో అందరూ తమ వీలును బట్టి ఒకటి, రెండు రోజులు ముందర వచ్చి తమ ఇంటిలో పనిలాగా సేవ చేసుకోగలిగారు

సార్ సత్సంగం, పూజ, సార్‌తో పాటు సార్ కట్టించిన భవనాల సందర్శనం, భజన, సార్ యొక్క వీడియోలు మొదలైన కార్యక్రమాలలో అందరకీ సార్‌తో ఉన్నామనే భావన కలిగింది.

సార్ గొప్పదనం గూర్చి తరచు వచ్చే వారికీ కూడా తెలియని క్రొత్త విషయాలు తెలిశాయి.

వేణుగోపాల్ గారి తమ్ముడు నారాయణతో మార్చి 2018లో మాట్లాడుతూ 'సర్లే సార్ ఆరాధనకు వస్తాలే' అని చెప్పాడు. తర్వాత మర్చిపోయాడు. జూన్ 8 వ తారీఖున అతని కలలో సార్ కనపడి "ఆరాధనకు వస్తానని మాట ఇచ్చి మర్చిపోయావే" అని హెచ్చరించారు. ఆరాధనకు వచ్చి అతను సార్ దర్శనం చేసుకున్నాడు.

ఈ లీలలు బట్టి సార్ అన్నివేళలా అన్నిటినీ గమనిస్తున్నారనీ, అంతేగాకుండా మనల్ని సరైన మార్గంలో నడిపిస్తున్నారని తెలుస్తోంది! సార్‌నిత్యసత్యులు.

- సార్ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ మన వెన్నంటే ఉన్నారని, మన తప్పులు సరిదిద్దుతూ ఉంటారని తెలిపే ఒక సంఘటన శ్రీ రామకృష్ణ భట్టు ఇలా చెబుతున్నారు: 2018 ఫిబ్రవరిలో సార్ వ్రాసిన

లెటర్స్ 3 పేజీలు నగేష్ నాకు ఇచ్చి టైపు చేసి పెట్టమన్నాడు. నేను ఒప్పుకుని చెప్పిన తేది తర్వాత కూడా ఆ పని పూర్తి చేయలేదు. ఆ రోజు రాత్రి కలలో నా సగం మీసం తీసేసినట్లున్న నా ముఖం అద్దంలో రెండు సార్లు చూపించారు. దాంతో సార్ చేసిన హెచ్చరిక అర్థమై, మరురోజు వెంటనే ఆ టైపింగ్ పని పూర్తి చేసి పంపించాను.

- దమ్మపేట వాస్తవ్యులు దారా నాగేశ్వరరావు గారు గొలగమూడిలో ఉన్న ప్రతిరోజూ ఉదయం 4 గంటలకు స్వామి సమాధి మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఒక ఆదివారం ఉదయం నిద్ర లేచినా మందిరంలో ప్రదక్షిణలు చేయనీయకుండా గేట్లు వేసి ఉంటారని పడుకునే ఉన్నారు. ఆయనకు కలలో తిరుపతయ్య గారు కనపడి ఆయనతో టైం అయ్యింది. వెళ్లి ప్రదక్షిణలు చేయండి అని చెపుతున్నాడు. దానికి ప్రత్యుత్తరంగా నాగేశ్వరరావుగారు ఇవాళ ఆదివారం. గేట్లు వేసుంటాయి అని చెప్పారు. అంతలోనే సార్ శ్రీ సాయి మాస్టర్ నిలయం లోపల నుండి వస్తూ నాగేశ్వరరావుగారితో “ఏం అక్కడ చెయ్య లేకపోతే ఇక్కడ చేయొచ్చు కదా!” అని సార్ సమాధిని

చూపెట్టారు. నాగేశ్వరరావుగారు వెంటనే లేచి సార్ సమాధికి ప్రదక్షిణలు చేసారు. ఈ లీల ద్వారా సార్ అందరి హృదయాలలో ఉండి వారు చేసే పనులు సాక్షిగా చూస్తున్నారని, ఏదైనా తప్పు చేయబోతుంటే అదీ ముఖ్యంగా ఒప్పుకున్న పని చేయకపోతే సరి దిద్దుతున్నారు. అంతేగాకుండా స్వామి సమాధి దగ్గర ప్రదక్షిణలు చేయలేకపోతే తమ సమాధికి చేయమని చెప్పటం ద్వారా మన కొక పవిత్ర ప్రదేశాన్ని చూపెట్టి మన సాధనాలు చేసుకోమంటున్నారు.

- సార్ తమ దగ్గర ఉన్న భక్తులను ప్రోత్సహించి మహనీయుల లీలలను సేకరింపచేసి ముద్రించేవారు. ముద్రించే ముందర సార్ గ్రంథస్థం చేసి ఎలా వ్రాయాలి, ఏ విషయాలను ఎక్కువ ప్రస్తావించాలి అనేది చెపుతూ ప్రూఫ్ రీడింగ్ చేస్తారు. శ్రీ శ్రీ శ్రీ దర్గాస్వామి భక్తుల లీలలను ప్రసాద్ చేత సార్ సంకలనం చేయించారు. రెండవ ముద్రణకు ముందరే సార్ మహా సమాధి చెందారు. ముద్రణకై శ్రీ దర్గాస్వామి ఆశీస్సులు కోసం వెడుతున్నానని ప్రసాద్ వేణు గోపాల్ గారికి చెపితే ఆయన "ఒక కాపీ పుస్తక రూపంలో ప్రింట్ చేయించి స్వామి

ఆశీస్సులు తీసుకో" మన్నారు. ఆ రోజు రాత్రి ప్రసాద్‌కి కలలో సార్ వారింటి పెరట్లో ఉన్నారు. ప్రసాద్ ఏదో పని మీద ఇంటి ముందరకు వస్తూ "అరెరే సార్‌కి ప్రూఫ్ రీడింగ్ చేయమని బుక్ ఇస్తే బాగుంటుందని, వెళ్లి బుక్ ఇచ్చాడు". తర్వాత రోజు ఉదయం నిద్ర లేచిన తర్వాత తెలిసింది ఏమిటయ్యా అంటే ప్రతిసారి సార్ అనుమతి, ఆశీస్సులకై ఒక కాపీ ప్రూఫ్ రీడింగ్‌కు మొదట ఇవ్వటం అలవాటు. కానీ ప్రసాద్ సార్ సమాధి అయ్యారు అనుకుంటున్నాడు కానీ ఆయన నిత్యసత్యులనే విషయం మరచిపోయినా సార్ అనంత కరుణతో గుర్తు చేసారు. ప్రసాద్ అలానే ఒక కాపీ సార్ సమాధి దగ్గర పెట్టి విన్నవించాడు. సార్ దయ వలన దర్గాస్వామి ఆశీస్సులు కూడా లభించి ఆ గ్రంథం ముద్రితమైనది. కొసమెరుపు ఏమిటంటే దర్గాస్వామి కొన్ని రోజులు పాటు ఆ గ్రంధాన్ని ప్రతిరోజూ తమ సన్నిధిలో కొంతసేపు ఉన్న భక్తుల చేత చదివించి వినిపించుకున్నారు.

# సమాధి అనంతరము లీలలు

## మదన్ కుమార్

- **19.05.2019, శ్రీ సుబ్బరామయ్య మాస్టర్-నిత్యసత్యుడు**

ఈ సంవత్సరం మే నెలలో ఒక శనివారం రోజు నేను, మా తమ్ముడు ఆధ్యాత్మిక విషయాలపై చర్చించుకుంటూ ఉన్నప్పుడు తనకు మహాత్ముల లీలలు (వారికి అంత శక్తి ఎలా వచ్చింది అని) ఇంకా అర్థం కావడం లేదు అని చెప్పాడు. వారి లీలలు అర్థం చేసుకోవాలంటే కూడా మనము అర్హత సాధించాలి, నిత్యమూ మనపై ప్రసరించే వారి కృపను గుర్తించాలంటే వారి చరిత్ర పారాయణ, మననము చేయాలి అని చెబుతూ సుబ్బరామయ్య మాస్టార్ గారి చరిత్ర తీసి కొన్ని లీలలు చదివి వినిపించాను.

అందులో వేణు సార్, సాయి సార్, ప్రసాద్ సార్, శివ సార్, శివ రత్నం గారు ఇంకా మరికొందరి సేవకులకు ఊహకందని విధంగా మాస్టర్ గారు వారి జీవితాలను మార్చారు గనుకనే వారు సుబ్బరామయ్య మాస్టర్ ని అంత గొప్పగా ఆరాధించ గలుగుతున్నారు. మీరు చేసే ప్రతి పని, ప్రతి ఆలోచన అన్నీ నాకు తెలుసు అని వాళ్లకి ఎన్నో అనుభవాలు ఇచ్చారు. అందుకే వారు అంత గొప్పగా విశ్వసించగలుగుతున్నారు అని చెప్పాను.

ఆయన ఇప్పటికీ నిత్యసత్యుడే, సమాధి అనంతరం కూడా ఎన్నో లీలలు చేస్తున్నారు అని మాట్లాడుకున్నాము. కానీ అటువంటి లీలలు మనకు లేవు కదా అనేది మా తమ్ముడి ప్రశ్న? దానికి సమాధానంగా శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ నాటి రాత్రి కలలో కనిపించారు. కల ఈ విధంగా మొదలయ్యింది.

సార్ సమాధి చెందిన రోజున అక్కడ సమాధి నిర్మించే పనులలో అందరూ బిజీగా ఉన్నారు. నేను కూడా నా వంతు పని చేస్తున్నాను. సమాధి కార్యక్రమములు అన్ని పూర్తయ్యాయి. ఆ సాయంత్రం సుబ్బరామయ్య మాస్టర్ వారింటి నుంచి సాయిమాస్టర్ నిలయంకి వస్తున్నారు. దానిని చూచి నేను అందరికీ గట్టిగా చెప్తున్నాను. 'సార్ సమాధి చెందలేదు చూడండి, ప్రత్యక్షంగా ఎలా వస్తున్నారో!' అని ఈ కల ద్వారా మాస్టర్ గారు ఎప్పటికీ నిత్య సత్యుడనే అనే విషయం బోధించారు. “పోయేదెక్కడికయ్యా సూర్యచంద్రులు ఉన్నంతవరకు ఉండేదే కదా!” అన్న శ్రీ వెంకయ్య స్వామి వారి మాట శ్రీ సార్ పట్ల కుడా అక్షరాల నిజం అనిపిస్తుంది.

మదన్ కుమార్ పిల్లవాడికి మార్చి 2020 లో జలుబు దగ్గు గా ఉండేది. కనీసం మూడు నెలల నుంచి

ఇబ్బంది పడేవాడు. ఆ సమయంలో కరోనా అని చెప్పి డాక్టర్ దగ్గరికి తీసుకు వెళ్లి పరీక్షించడానికి భయపడ్డారు. ఎప్పుడైతే ప్రతిరోజూ 8:30 గంటలకు సత్సంగం స్టార్ట్ అయిందో ఆ తర్వాత మూడు రోజుల కల్లా మదన్ కుమార్ పిల్లవాడికి జలుబు, దగ్గు తగ్గిపోయాయి

- **సర్వ సమర్థుడు (Aug 2021)**

శ్రీ సార్ తమ సర్వ సమర్ధత్వాన్ని ఎలా నిరూపించారో మదన్ కుమార్ ఇలా చెబుతున్నాడు.

నాకు ఏప్రిల్ నెలలో ఆఫీసులో చేస్తున్న ప్రాజెక్టులో ఊహించని సమస్య వచ్చింది. దానిని ఎలా పరిష్కరించాలో ఏమీ తోచని పరిస్థితి. నాకు తెలిసిన మార్గాలన్నీ వెతుకుతున్నాను పరిష్కారం కనిపించట్లేదు. కానీ ప్రతిరోజు శ్రీ సార్ కి దండం పెట్టుకునే వాడిని. సార్ చాలా unexpected సమస్య వచ్చింది మీరు దానిని సాల్వ్ చేయడానికి నాకు శక్తిని ఇవ్వాలి, సమస్య నుంచి పారిపోయే ప్రయత్నం మాత్రం చేయలేను (అంటే దీనిని మా టీం పరిష్కరించలేదు అని పై ఆఫీసర్ కి చెప్పి, సారీ చెప్పడం) అని దండం పెట్టుకునేవాడిని.

మా టీం మెంబర్స్ తో కలిసి నేను చేయని ప్రయత్నం లేదు చివరికి ఎలా ప్రయత్నం చేసినా ఈ సమస్యకు 100% పరిష్కారం రాదు కనీసం 60 నుంచి

70 శాతం అయినా పరిష్కారం చూద్దామని వివిధ రకాల ప్రయత్నాలు చేసాము. అన్నీ నిష్ఫలం అయ్యాయి.

కానీ ఊహకందని విధంగా శ్రీ సార్ ఒకరోజు ప్రేరణ పెట్టి కంప్యూటర్ లో ఒక మైనర్ సెట్టింగ్ మార్పు చేయించారు. అంతే అన్ని రోజుల నుంచి నన్ను, మా టీమ్ మెంబర్స్ ని ఇబ్బంది పెట్టిన సమస్య గాలి బుడగలా మాయమైపోయింది. ఆ మహనీయుని సర్వ సమర్థత్వానికి అవధులు లేవు.

మన కర్మ ని ఏదో ఒక రూపంలో కరిగించాలని ఆ మహనీయుడు మనకు పరిస్థితులను ఏర్పాటు చేస్తాడు, కానీ మనం మాత్రం దానిని గుర్తించకుండా ఇప్పుడు ఇబ్బందిగా ఉందని కష్టాన్ని అతి తొందరగా తొలగించమని ప్రార్థన చేస్తాము. మనకు ఏర్పరచే అన్ని (ఇష్టమైనవి, కష్టమైనవి) పరిస్థితులను ఆయన ప్రసాదంగా స్వీకరించడమొక్కటే ఆయన మార్గాన నడవడం, అటువంటి శుభ్రమార్గంలో నన్ను నడపమని హృదయ పూర్వక ప్రార్థన చేస్తున్నాను.

- **30.05.2020 స్వప్న వృత్తాంతము**

ఈ రోజు సుమారు 70 రోజుల తర్వాత (కరోనా కారణంగా) భగవాన్ వెంకయ్య స్వామి వారి గుడికి వెళ్లి స్వామివారికి అభిషేకము, పూజ చేసే భాగ్యం కలిగినది.

నేటి కలలో శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు వచ్చారు. మాస్టర్ గారు ప్రతిరోజు జరిగే పిల్లల సత్సంగం ని ఆశీర్వదించారు అన్నదానికి సంకేతముగా మా ఇంటిలో హాలులో ఆ స్థలంలో కూర్చుని దర్శనం ఇచ్చారు. శ్రీ సార్ తో పాటు వేణుగోపాల్ సార్, ప్రసాద్ సార్, సాయి సార్ ముగ్గురు వచ్చారు. సాయి సార్ తిరుపతి నుంచి వచ్చారట, వేణుగోపాల్ సార్ కల్పాకం నుంచి వచ్చారట, ప్రసాద్ సార్ సుబ్బరామయ్య సార్ ని గొలగమూడి నుంచి సూళ్లూరుపేట లో మా ఇంటికి తీసుకువచ్చారట.

శ్రీ సార్ ఎంతో సంతోషంగా, ప్రశాంతమైన ముఖముతో ఉషారుగా కనిపించారు. ఎవరో సార్ తో కరెంట్ బిల్స్ ఎక్కువగా వచ్చాయి సార్ అని చెప్తున్నారు. దానికి నేను కూడా సార్ మాకు కూడా ఎక్కువ వచ్చాయి అని చెప్పాను. దానికి సార్ అవునయ్యా మనకు కూడా సాయి మాస్టర్ నిలయంలో గత రెండు నెలలుగా ఎక్కువగానే వచ్చాయి, ఇకనుంచి మామూలుగా ఉంటుంది లే అని అభయం ఇచ్చారు. ఆ తర్వాత నేను సార్ ని, లాక్ డౌన్ కదా సార్ ఎలా వచ్చారు? అని అడిగాను ఇదిగో ఈయన తీసుకొచ్చారు అని ప్రసాద్

సార్ ని పరిహాసమాడుతూ చూపించారు. చాలా సంతోషం అనిపించింది. అంతలో మెలకువ వచ్చింది.

ఇప్పుడు ఉన్న కరోనా పరిస్థితులు కారణంగా మానసికంగా ఎంతో కృంగిపోయి ఉన్న నాకు శ్రీ సార్ స్వప్న దర్శనం, పిల్లల సత్సంగం, ఆశీర్వాదం ఎంతో ఉత్సాహాన్ని ధైర్యాన్ని ఇచ్చాయి.

- **"అమ్మగారు సుబ్బరామయ్య సార్ పార్వతీ పరమేశ్వరుల స్వరూపం" అని తనకు వచ్చిన కలను మదన్ ( 04-07-2020 న) ఇలా చెపుతున్నారు.**

ఒకప్పుడు కుటుంబ సమస్యలతో మదన్ కు మనసు చికాకుగా ఉండింది. కానీ నిత్య పారాయణ మాత్రము క్రమం తప్పకుండా చేస్తూ ఉండేవాడు. ఒకనాటి రాత్రి కలలో సుబ్బరామయ్య సార్ వారి ఇంట్లో చెక్క కుర్చీ లో కూర్చుని, తెల్లటి వస్త్రాలు ధరించి కనిపించారు. మదన్ వెంటనే 'సుబ్బరామయ్య సార్ సమాధి అయ్యారు కదా! నాకు ఇప్పుడు భౌతికంగా కనిపిస్తున్నారు, నేనెంత అదృష్టవంతుడిని' అని వెంటనే సార్ కాళ్ల మీద పడి 'సార్ చాలా ఇబ్బందిగా ఉంది, నా వల్ల కావట్లేదు' అని కన్నీటితో అప్పటి అతని సమస్యలు చెప్పుకున్నాడు. దానికి సార్ "అన్నింటికీ నీవు ఎందుకు

బాధ పడతావు? మీ అమ్మా-నాన్న ఏం చేస్తున్నారు? వాళ్లు చూసుకుంటారులే!" అని అభయమిచ్చారు. అంతటితో మదన్ మనసు స్థిమిత పడి, సార్ అతని అమ్మా నాన్నలకి హృదయ ప్రేరణ పెట్టి వారిని చక్కగా నడిపిస్తారు అని ధైర్యం వచ్చింది.

సార్ ఈ విధంగా భౌతికంగా కనిపించడం, అతని సమస్యలన్నింటిని సార్ కి చెప్పుకోవడం ద్వారా అతను సంభ్రమాశ్చర్యాలతో ఉంటే, కలలోనే అమ్మగారు (సార్ వాళ్ళ ధర్మపత్ని) మాత్రం గుమ్మం దగ్గరికి వచ్చి "ఈ రోజు మీకు ఏ కూర కావాలి?" అని సార్ ని అడుగుతున్నారు. అమ్మగారు సార్ ని ఈ విధంగా అడిగేటప్పుడు చాలా సాధారణంగా ఉన్నారు, అంటే అమ్మగారికి సార్ నిత్యమూ భౌతిక దర్శనం ఇస్తున్నారు కాబోలు అందుకే ఇంత సాధారణంగా మాట్లాడగలుగుతున్నారు అనిపించింది. అంతటి భాగ్యం కలగాలంటే అమ్మ గారు కూడా సార్ స్థితిని పొంది ఉండాలి, "అమ్మగారు, సార్ వేరు కాదు, వారు ఆదిదంపతులయిన పార్వతీ పరమేశ్వరుల స్వరూపం" అనిపించింది.

- **18.10.2021, శ్రీ సార్ స్వప్న దర్శనం**

నిన్న అనగా ఆదివారం 17. 10. 2021 సత్సంగం చాలా అద్భుతంగా జరిగింది. చాలా చక్కటి విషయాలు డిస్కషన్ చేయడం జరిగింది. మరుసటి రోజు అనగా సోమవారం నాన్నగారిని హాస్పటల్ కి తీసుకెళ్లాలని తొందరగా పడుకుందామని పదిన్నర గంటలకు బెడ్ రూం లోకి వెళ్లాను. కానీ ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి, నిద్ర సరిగా రావడం లేదు. మరలా 11:30 కి లేచి శ్రీ భరద్వాజ మాస్టర్ 13 వ భక్తజన సమ్మేళనం సావనీర్ చదువుతూ ఉన్నాను. నా భార్య నిద్ర లేచి ఇక పడుకో ఉదయాన్నే ప్రయాణం ఉంది కదా అంది. రాత్రి 12:15 కి నిద్రపోతూ ఈ వారం శ్రీ సార్ దివ్య బోధ "శ్రమతో ఆలోచనలు నిలపటం కూడా ఆయన సేవ" అని మననం చేసుకుంటూ ప్రసాద్ సార్ చెప్పినట్టు రెండు నిమిషాలు అయినా నా ఆలోచనలు ఆపుదాం! అని పడుకున్నాను. నాకు తెలియకుండానే నిద్ర లోకి జారుకున్నాను.

శ్రీ సార్ స్వప్న దర్శనం: శ్రీ సార్ ఎంతో ఉషారుగా ఎనర్జిటిక్ గా పనులు చేసుకుంటున్నారు. నేను సార్ దగ్గరికి వెళ్లి నమస్కారం చేసుకొని ఇలా చెబుతున్నాను.

మదన్ : సార్ మీ దగ్గరకు వచ్చింది కష్టాలు తొలగించుకోవడానికి కాదు!

(అయ్యో ఏమిటి ఇలా అన్నాను అని మనసులో అనుకొని) సార్ నా ఉద్దేశ్యం కష్టాలు తొలగించుకోవడానికి మాత్రమే కాదు మీరు నన్ను ఉద్ధరించాలి సార్ అని చెప్పాను.

ఇంట్లో నుంచి బయటకి వచ్చిన సార్ దేని కోసమో వెతుకుతూ నా ప్రశ్నకి చక్కటి ఉదాహరణతో సమాధానం చెప్పాలని నీకు ఆ సత్సంగ సభ్యురాలు (పేరు గుర్తు లేదు) గురించి తెలుసా? అని అడిగారు. సార్ నాకు తెలియదు అని చెప్పాను. అంతలో శ్రీ సార్ ఆయనకే గుర్తొచ్చినట్టు, ఓహ్! నువ్వు ఆ అన్నదమ్ముల బ్యాచ్ కదా, ఎలా ఉన్నారు అన్నదమ్ములు అని అడిగారు. బాగున్నాము సార్ అని చెప్పాను (సార్ కి తెలియనట్టు, నాకు తెలిసినట్టు) ను. శ్రీ సార్ ఇలా అన్నారు : 4 శ్వేత విత్తనాలు వేసి వదిలాను అన్నారు.

మరలా సార్ ఇంటి లోపలికి వెళ్లారు. నేను కూడా సార్ ని వెంబడిస్తూనే ఉన్నాను. సార్ నా సంగతి ఏంటి? అని అడిగాను. దానికి శ్రీ సార్ వెలిగిపోతున్న ముఖంతో తల పైకెత్తి నా వైపు చూసి నన్ను ఆటపట్టిస్తున్నట్టు "నీదంతా మోడీ స్టైల్ కదయ్యా"

అన్నారు. అంతలో “నేను అయ్యో సార్ నా గడ్డం, డ్రెస్ చూసి అలా అంటున్నారు ఏమో!” అని ఉలిక్కిపడి నిద్ర లేచాను. సమయం చూస్తే ఉదయం ఐదున్నర గంటలు. మనస్సు ఎంతో తేలికగా ఉంది.

నాలుగు శ్వేత విత్తనాలు వదలడం అంటే నలువైపులా స్వచ్ఛమైన మనసున్న మనుషులను తయారు చేసి వదిలాను అన్నారేమో అనిపించింది.

- **శ్రీ సార్ ఈ స్వప్న దర్శనం సుమారు 15 నెలల తర్వాత అంటే జూలై 2020 లో స్వప్న దర్శనం తర్వాత ఇవ్వడానికి గల కారణాలు:**

1. సత్సంగం శ్రద్ధగా విని ఇంపార్టెంట్ పాయింట్స్ నోట్ చేసుకుని, summarize చేశాను. ఇంతకుముందు ఎప్పుడూ అలా చేయలేదు అంటే కొంచెం శ్రమ యాడ్ అయిందన్నమాట దాన్ని శ్రీ సార్ ఆశీర్వదించారు అనిపించింది.

2. రాత్రి నిద్ర రానప్పుడు యూట్యూబ్ ఓపెన్ చేసి అవసరం ఉన్నా లేకపోయినా కొన్ని వీడియోస్ చూసే అలవాటు వద్దనుకొని శ్రీ మాస్టారు భక్తుల అనుభవాలను చదవడం ద్వారా మనసు చికాకుగా ఉండి మానసికంగా శక్తి లేనప్పుడు కూడా తక్కిన విషయాలు కాకుండా

మహాత్ముల చరిత్ర పారాయణ చేస్తే నాకు సంతోషము అని ఇంకొకసారి చెప్పారనిపించింది

3. పనిగట్టుకుని ఆలోచనలు ఆపాలి అనే సత్సంగ అ మాటను రెండు నిమిషాలైనా ఆచరించాలి అని సంకల్పం చెప్పుకోవడం కూడా (అంటే మన రెడీనెస్ ని) శ్రీ సార్ ఆశీర్వదించారు అనిపిస్తుంది.

పై పనులు అన్నింటిలోనూ కొంచెం శ్రమ ఉంది అంటే మనం చేసే నిత్య కార్యక్రమాలలో కూడా కొంచెం శ్రమ ని add చేసి చేస్తే ఆయన గొప్పగా తృప్తి పడతారని బోధించారనిపిస్తుంది.

- **శ్రీ శ్రీ శ్రీ కంచి పెద్ద స్వామి స్వప్న దర్శనం**

నిన్న అనగా 11-12- 2021 నాడు భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి ధ్యాన మందిరం, సూళ్లూరుపేట నందు విగ్రహ ప్రతిష్ట ద్వితీయ వార్షికోత్సవం సందర్భముగా పూజలు, ప్రసాద వినియోగం అన్నప్రసాద వితరణ, గ్రామోత్సవము గొప్పగా జరిగాయి. నేను మా నాన్నగారికి ఆరోగ్యం బాగుండాలి అని, శనివారం స్వామి వారి కార్యక్రమాలలో అన్నింటిలో తప్పక పాల్గొనాలి అని నిర్ణయించుకున్నాను. అలాగే శనివారం స్వామివారి కార్యక్రమంలో అన్నింటిలో పాల్గొనే అవకాశం కలిగింది. రాత్రి ఇంటికి

వచ్చిన తర్వాత 9:30 గంటల శనివారం ఆన్లైన్ సత్సంగంలో పాల్గొన్నాను, స్వామి వారి పారాయణ మెసేజ్ గ్రూపులో పెట్టి నిద్రపోయాను.

- **శ్రీ కంచి పెరియవ స్వప్న దర్శనం**

అదొక సత్రం, అక్కడ అందరు యాత్రికులు వారి వారి సామాన్లతో బస చేసి ఉన్నారు. మా లగేజ్ బ్యాగ్ ను కూడా మా తమ్ముడు అక్కడ పెట్టి ఉన్నాడు. ఆ సత్రం లో కంచి పెద్ద స్వామి విడిది చేసి ఉన్నారు అనే విషయం మాకు తెలిసి బయటనుంచి సత్రముకు తిరిగి వస్తున్నాము. మా పెద్దబ్బాయి మనో ధ్రువ మాకు చెప్పకుండా ముందుగానే సత్రమునకు వచ్చి ఉన్నాడు. తనకోసం మార్గమంతా వెతికి కంచి స్వామి వారి దగ్గర కనపడగానే సంతోషపడి, చెప్పకుండా ముందు ఎందుకు వచ్చావు? ఎప్పుడూ ఇలా చేయకూడదు అని నేను కొంచెం మందలిస్తున్నాను.

స్వామి వారు మా ఇద్దరి వైపు తిరిగి ఏమిటి పిల్లవాడు అల్లరి చేస్తున్నాడా? అని అడిగారు. అవును స్వామి! అని చెప్పాను. ఏమన్నా చదవడం, రాయడం నేర్చుకున్నాడా? అని శ్రీ స్వామివారు ప్రశ్నించారు. పరవాలేదు స్వామి, మూడవ తరగతి చదువుతున్నాడు కొంచెం చదవడం, రాయడం చేస్తాడు. కానీ ఈయన

కంటే ఇంటి దగ్గర ఉండే చిన్న వాడి గురించే కొంచెం దిగులుగా ఉంది స్వామి! అబ్బాయికి మాటలు కూడా ఇంకా సరిగా రావడం లేదు అని చెప్పాను. ఆ తరువాత స్వామి వారు నువ్వు ఏమి చదువుకున్నావు? అని అడిగారు. నేను 'ఎలక్ట్రానిక్స్' అని చెప్పాను, స్వామి వారు వినపడనట్టు ఆ! అన్నారు. మరలా కూడా చెప్పాను అలా నా చేత నాలుగైదు సార్లు చెప్పించారు.

తర్వాత పూర్తిగా "ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్" చదివాను అని చెప్పాను. 'ఎలక్ట్రానిక్స్' అని నేను మొదట్లో చెప్పినది సరిగా వినిపించకపోవడం వలన దానిని ఉద్దేశించి స్పష్టంగా చెప్పాలి కదా! అదే (ఆ స్పష్టతే) అక్కడ వస్తుంది అని మనోధ్రువ వంక చేయి చూపారు. ఆ తరువాత ఒక్క క్షణం ఆగి గాయత్రీ మంత్రాన్ని ఆరు సార్లు పిల్లలకి చెప్పించు అని చెప్పారు.( రోజుకు 6 సార్ల? లేక వారానికి 6 సార్ల? అని స్వామి వారిని అడుగుదామని మనసులో వెంటనే శ్రీ సుబ్బరామయ్య సార్ గుర్తొచ్చి, మహాత్ముల దగ్గర అధిక ప్రసంగం పనికిరాదని ఆచరణకు వారే మార్గం చూపుతారు అనిపించి ప్రశ్నలు అడగలేదు).

తరువాత స్వామి వారు వేరే వాళ్ళతో మాట్లాడుతూ ఉంటే నేను మరొక చిన్న ప్రశ్న స్వామి అని

అడిగి మా నాన్నగారి అనారోగ్యం గురించి చెప్పాను. స్వామి వారు ఒక్క క్షణం మౌనం వహించి చెప్పినదానికి ఆలకించి వారి అనుగ్రహం ఉన్నట్లు తల ఊపారు. ఇంకేమీ మాట్లాడలేదు. నేను నాకు ఉన్న సమస్యలను ఆయనకి చెప్పుకోవడమే ఒక గొప్ప భాగ్యంగా భావించి, అలౌకిక ఆనందంలో ఉన్నాను. నాకు ఇంతటి భాగ్యం కలిగిందా? కంచి పెద్ద స్వామి దర్శనం నాకు కలిగిందా? ఇది నిజమా! కలా? అన్న ఆలోచనతో ఉలిక్కిపడి నిద్ర లేచాను. సమయం చూస్తే తెల్లవారుజామున నాలుగున్నర గంటలు. ఆ అపార కరుణా సింధు, అనంత ప్రేమ మూర్తి కీర్తిని ఏమని వర్ణించగలము?

## ● పిలిచిన పలికే దైవం

పిల్లల చదువు గురించి, క్రమశిక్షణ గురించి 2 వారాల క్రితం నా భార్య వాళ్ళని మందలిస్తుంటే మా అమ్మ నాన్న మేము పిల్లలకి చెప్పే విధానం బాగాలేదని చాలా బాధ పడ్డారు. పిల్లల్ని కొట్టకుండా చెప్పండి అని చెప్పారు. అప్పుడు ఇంట్లో కొంచెం ఇబ్బందికర వాతావరణం ఏర్పడింది. నేను స్వామి వారి పటం ముందు కూర్చుని ఏమి చేయాలో తెలియని అభాగ్యులము మీరే మా యందు దయ తలచి నడిపించాలి తండ్రి అని ప్రార్థించాను.

అలాగే నేను సైన్స్ గురించి (విజ్ఞాన వీచికలు ప్రేరణతో) రక రకాల పుస్తకాలు చదివి, చదివిన విషయాలు సమన్వయం చేసుకోలేక, ఇంకా పూర్తిగా చదవే సమయం లేక, ఆఫీస్ వర్క్, personal work balance చేయలేక మనసు confusion స్టేట్ లో ఉంది. స్వామి ఇవన్నీ నేను చేయలేను, ఈ శనివారం మొత్తం మీ సేవలో ఉంటాను. మీరే నన్ను శుభ్ర మార్గంలో నడిపించాలి అని ప్రార్థించాను. అలానే శనివారం మొత్తం స్వామివారి సన్నిధిలో ఉండే భాగ్యం కలిగింది. శ్రీ స్వామివారి సన్నిధిలో ఉండి సేవ చేస్తే కంచి పెద్ద స్వామి (నాకిప్పటి వరకు కంచి మఠానికి వెళ్లే భాగ్యం కూడా కలగలేదు) దర్శనమిచ్చి నా కష్టాలను విని అనుగ్రహించడం ద్వారా అందరి మహాత్ముల రూపంలో (శ్రీ స్వామి) బాబానే ఉన్నారని మాస్టర్ గారు చెప్పిన మాట అక్షర సత్యం అనిపిస్తుంది. అలానే మన కష్టాలను మనఃస్ఫూర్తిగా స్వామివారికి విన్నవించు కుంటే పిలిచిన పలికే దైవం అనిపిస్తుంది...

- **మదన్ కు శ్రీ స్వామివారి రూపంలో శ్రీ సార్ మరియు శ్రీ మాస్టర్ గారి స్వప్న దర్శనం: (మార్చి 20 2022 ఆదివారం)**

ప్రసాద్ సార్, నాగలక్ష్మి అక్కయ్య గార్ల అబ్బాయి భరద్వాజ ఉపనయనం సందర్భంగా గొలగమూడి వెళ్ళాము. గురు బంధువులను సార్ సన్నిధిలో కలుసుకున్నందుకు చాలా సంతోషం అనిపించింది. ఈ మధ్యకాలంలో ఆఫీస్ పనులు, కుటుంబ వ్యవహారాలు వలన గొలగమూడికి వెళ్లడం శ్రీ స్వామివారి, శ్రీ సార్ సమాధి మందిరాల దర్శనం కుదరలేదు. కానీ వీలు దొరికినప్పుడల్లా సూళ్లూరుపేటలోని భగవాన్ వెంకయ్య స్వామి వారి ధ్యాన మందిరం దర్శించుకుంటున్నాను.

ఆదివారం నాటి రాత్రి స్వప్నం ఇలా మొదలైంది:

శ్రీ సాయి మాస్టర్ నిలయంలో పెద్ద వేడుక జరుగుతుంది, గురుబంధువులతో ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. సూళ్లూరుపేటలోని భగవాన్ వెంకయ్య స్వామి వారి విగ్రహ రూపంలో శ్రీ సుబ్బరామయ్య సార్ పాలరాతి విగ్రహానికి అభిషేకం జరుగుతుంది. అరే! ఇది ఏమిటి స్వామివారి విగ్రహం లాగే సార్ విగ్రహం ఉంది! అనుకుంటుండగా అదే విగ్రహంలో శ్రీ మాస్టారు గారి ముఖం దర్శనమిచ్చింది. సంభ్రమాశ్చర్యాలతో ఈ దృశ్యాన్ని చూస్తూ పక్కనే ఉన్న

సాయి సుబ్రహ్మణ్యం గారితో 'సార్! మీరు గమనించారా శ్రీ సార్ విగ్రహం మాస్టర్ గారి లాగా కనబడుతుంది' అంటే 'అవును మదన్! నాకు భౌతికంగానే దర్శనం అవుతున్నారు' అని చెప్పారు. అంతలో స్వప్నం ముగిసింది.

ఈ స్వప్నం ద్వారా స్వామి వారు, మాస్టారుగారు, సార్ రూపాలు వేరైనా మేమంతా ఒక్కటే అని మరియు సూళ్లూరుపేటలో స్వామివారిని దర్శించుకుంటుంటే అదే రూపంలో లో శ్రీ సార్ స్వప్న దర్శనం ఇవ్వడం ద్వారా మనం ఎక్కడ ఉండి ప్రార్థన చేసినా అది గురువుకే చెందుతుంది అని బోధించారనిపిస్తుంది.

- **మదన్ కుమార్, మరో అనుభవాన్ని ఇలా పంచుకుంటున్నారు:**

జూన్ 11వ తేదీ, 2022, శనివారం ఉదయం 11:30 గంటలకు మా నాన్నగారు అనారోగ్య కారణంగా శ్రీ స్వామివారిలో ఐక్యమయ్యారు. నాన్నగారు భౌతికంగా లేరు అన్న ఆలోచన నన్ను శూన్యంలోకి నెట్టి వేస్తుంది, ఎందుకంటే ఈ ప్రపంచంలో నాకు ఊహ తెలిసినప్పటి నుంచి అపరిమితంగా నేను ఎవరినైనా ప్రేమించానంటే అది మా నాన్నగారినే. ఆయనే నాకు

సర్వస్వం నా జీవితంలో ప్రతి సందర్భంలోనూ అంటే చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి కీలక సందర్భాలలో నాకు తోడుండి నడిపించారు. ఆయనలోని ఆత్మవిశ్వాసం, పట్టుదల ఎప్పుడు నాకు గొప్పస్ఫూర్తినిచ్చేవి. ఆయన పక్కనుంటే కొండంత ధైర్యంగా ఉండేది.

మనం జీవితంలో ఎన్నో అనుకుంటాము, అన్నీ మనం అనుకున్నట్టు జరగవు కానీ కారణం లేకుండా ఏదీ జరగదు. మా నాన్నగారిని భౌతికంగా దూరం చేయడం కూడా ఆ భగవంతుని ఆటలో భాగమే అనిపిస్తుంది.

- **శ్రీ స్వామి వారు మా నాన్నగారికి ఉత్తమ గతి కలిగించడం:**

నాన్నగారి 13వ రోజు కార్యక్రమం మా సొంత ఊరు తెలుగురాయపురంలో నా చేతుల మీదుగా జరిగింది. ఇంటిలో అన్ని కార్యక్రమాలకి ముందుండి మమ్మల్ని నడిపించే నాన్న లేని లోటు ఈ సమయంలో ఇంకా ఎక్కువగా కనపడింది, అదొక బాధకు మించిన మానసిక స్థితి.

నాటి రోజు నాన్నగారి ఆత్మకు ఉత్తమ గతిని కలిగించమని భగవంతున్ని హృదయపూర్వకంగా ప్రార్థించాను. ఆరోజు రాత్రి శివాలయంలో నిద్ర చేయడానికి మా ఊరికి దగ్గరలో ఉన్న కోటితీర్థం గ్రామం

వెళ్లాను. శ్రీ స్వామి వారు తపస్సు చేసిన స్థలంలో నిద్ర చేయడం గొప్ప అనుభూతి. నాన్నగారి స్మృతులతో, స్వామిని తలుచుకుంటూ నిద్రలోకి జారుకున్నాను. నాటి తెల్లవారుజామున శ్రీ మాస్టర్ గారు, శ్రీ సార్ స్వప్న దర్శనమిచ్చారు. మా ఇంటి మిద్దె పైన శ్రీ మాస్టర్ గారు మరియు శ్రీ సార్ సమాధులు దర్శనమయ్యాయి. మొదట నేను మాస్టర్ గారి సమాధి వద్ద నిలుచుని (నాకు తెలిసిన) వారి గొప్పతనం గురించి మా ఊరి వాళ్లకు చెబుతున్నాను. ఆ తరువాత శ్రీ సార్ సమాధికి అభిషేకం చేస్తున్నాను. చాలా ఆనందంగానూ, మనసు ఎంతో తేలికగా, గొప్ప తృప్తి, శాంతులతో నిండి ఉంది. వెంటనే మెలుకువ వచ్చింది.

నాన్నగారి కార్యం అయిన రోజునే శ్రీ మాస్టర్, శ్రీ సార్ సమాధులు మా ఇంటి మిద్ది పైన దర్శనం ఇవ్వడం ద్వారా నాన్న గారి ఆత్మకు కచ్చితంగా ఉత్తమ గతిని కలిగించారనిపిస్తుంది. ఈ స్వప్న దర్శనం తర్వాత నా హృదయంలో బాధ చాలావరకు తగ్గింది. ప్రార్థించని సమయాలలో కూడా వచ్చి ఆదుకుంటున్న వారిని ఏమని పిలవాలి? నువ్వు కన్న తండ్రి భౌతికంగా దూరం అయ్యాడని బాధపడుతున్నావు, ఆయనను మేమే

తీసుకెళ్లాము నీకు తండ్రి వలె ఎప్పటికీ మార్గదర్శకులము మేమే, నీ బాధ్యత మాదే అని భరోసా ఇచ్చారనిపిస్తుంది.

-------- సద్గురు దేవా శరణం శరణం ---------

- **శ్రీ స్వామి వారికి శరణాగతి అయ్యే పరిస్థితులు కల్పించడం :**

నాకు మార్చి 2024 నెలాఖరు నుంచి రెండు వారాలపాటు వడదెబ్బతో కూడిన వైరల్ జ్వరం వచ్చింది. మానసికంగా, శారీరకంగా చాలా ఇబ్బంది పడ్డాను. ఏమీ తోచని పరిస్థితి, మన కర్మనీ శ్రీ స్వామి ఇలా క్షాళన చేస్తున్నాడని భావరూపంలో అనుకుంటున్నానే గాని మనసు మాత్రం స్థిమితాన్ని కోల్పోయింది. నిద్ర సరిగా పట్టడం లేదు, ఏమి చేయాలన్న ఎటువంటి ఆసక్తి గాని, శక్తి గాని ఉండట్లేదు. మూడు వారాలపాటు అటు ఆఫీసులోనూ, ఇటు ఇంట్లో పనులన్నీ పెండింగ్లో ఉండడం వలన ఒత్తిడి ఇంకా పెరిగింది.

ప్రతిరోజు నన్ను నేను మెరుగుపరుచుకోవటానికి ఎంతో ప్రయత్నం చేస్తున్నాను. కానీ నావల్ల ఏమాత్రం కావట్లేదు ఇంక నా ప్రయత్నాలు చాలు అనిపించింది. నా ప్రయత్నం వలన ఏమీ జరగడం లేదు అని తోచింది. శ్రీ సుబ్బరామయ్య

మాస్టారికి శ్రీ రోశి రెడ్డి తాత చెప్పిన ప్రార్థనా మార్గం గుర్తొచ్చింది. అప్పటివరకు ఏ అనుభవం ఎదురవుతున్న (ముఖ్యంగా అనారోగ్యం గురించి) నా బుద్ధితో యోచించి ఇది ఎందుకు ఇలా జరిగింది? అలా ఎందుకు జరగలేదు? ఇలా ఎన్నో కోణాలలో ఆలోచించి, సమన్వయం చేసుకోలేక, అసలే శారీరకంగా బాగలేక, మానసిక క్షోభ అనుభవిస్తు తీవ్ర నైరాశ్యంలో ఉన్న నాకు శ్రీ రోశి రెడ్డి తాత ప్రార్థన గొప్ప వెలుగుగా దర్శనమిచ్చింది.

తాత ఇలా చెప్పేవారు, శ్రీ స్వామి వారి మాటలను (ఆయనిచ్చే అనుభవాలను) అర్థం చేసుకోవడం చాలా కష్టం, ఒకవేళ అర్థమైనా ఆచరించడం ఇంకా కష్టం, కావున తండ్రి నీవే నా హృదయంలో ఉండి నేనేమి మాట్లాడాలో, ఏమి చేయాలో, ఎటువంటి అనుభవాలు పొందాలో అన్ని నీ ఇష్టానుసారం నడిపించు అని ఆయనకు శరణాగతి చెందడమే ఉత్తమం.

అప్పటివరకి ప్రతిక్షణం తర్వాత ఏం చేయాలి? ఏమి చేస్తే ఎంత ఉపయోగం, నాకెంత మేలు, ఇతరులకెంత మేలు వంటి ఆలోచనలతో ఉండే నేను, అదే విధంగా ఏవేవో (నా దృష్టిలో గొప్ప భావాలు అని)

ఆలోచిస్తూ, ఏమీ ఆచరించలేకుండా, ఇంకా మానసికంగా కృంగిపోతున్న నాకు శ్రీ రోసిరెడ్డి తాత చెప్పిన ఉత్తమ ప్రార్థన తప్ప వేరే దారి లేదనిపించింది.

అప్పుడు స్వామివారికి ఇలా చెప్పుకున్నాను.

స్వామి! నేను ఎన్నో విషయాలు గురించి, పనులు గురించి ఇలా చేయాలి అలా చేయాలనుకుంటాను కానీ ఏమి చేయలేను. ఈ క్షణం నుంచి నా మాట, నా ఆలోచన, నా అనుభవాలు, నేను ఇతరులతో ఉండే తీరు, అన్ని నీవు ఎలా ఆడిస్తే అలానే జరుగుతాయి అని మరలా గట్టిగా నమ్ముతున్నాను. నా ఇష్టము కోరికతో ఎటువంటి సంబంధం లేదు. నాకు ఎటువంటి కర్తృత్వం కూడా వద్దు, అందరిని నియమించి నడిపిస్తున్నావు, నాలో ఉండి నన్ను ఎలా ఆడించాలో అలా ఆడిస్తున్నావు.

నన్ను ఈ భావ దారిద్య్రం నుంచి బయట వెయ్యి అని కూడా ప్రార్థన చేయలేకపోయాను. ఎందుకంటే అది కూడా ఒక కోరిక, ఇష్టము అనిపించింది. ఏమి చేసినా, ఎటువంటి పరిస్థితుల్లో ఉంచినా, ఏ అనుభవం యిచ్చినా, మంచైనా, చెడైనా, ఇది కావాలి, అది వద్దు అనే భావన లేకుండా అన్ని నీ ప్రసాదాలే అన్న భావనతో నాలో ఉండి, నాకు

ఆలోచనలు కూడా కలిగించేది నీవే! అన్న శరణాగతితో కూడిన (with Total acceptance and Total surrender) ప్రార్థన చేశాను.

- **చెప్పింది చెప్పినట్లు చేయటమే సేవ - తక్కినవన్నీ వేషాలు - రమణమహర్షి**

శ్రీ స్వామి వారు అద్భుతమే చేశారు అనిపిస్తుంది, అప్పటివరకి నెల రోజులుగా పెండింగ్లో ఉన్న పనులన్నీ మూడు రోజుల్లో అయిపోయాయి. నన్ను శారీరకంగా మానసికంగా ఎంతో చక్కగా ఉంచుతున్నారు. ఆయన లీలలు ఊహాతీతం. ఏమి చేయలేను అన్న స్థితికి తీసుకెళ్లి, ఆయన పాదాలకు శరణు వేడినంతనే అంతా నా చేత మరలా చేయిస్తున్నారు. అంటే అక్కడ చేయలేనిది మనం కాదు, చేసేది కూడా మనం కాదు. మనలో ఉండి ఆయనే నడిపిస్తున్నాడు. ఇది మనం ఎప్పటికప్పుడు మరిచిపోతుంటాము మన మరుపు తీవ్రతను బట్టి మానసిక, శారీరక ఇబ్బందులు పెట్టి మనల్ని సక్రమంగా నడిపిస్తుంటాడు. ఆ తండ్రి యొక్క ప్రేమ, దయ అందరి మీద ఇలానే ఉంటుంది నాతో పాటు అందరం దాన్ని (మరుపు లేకుండా) గుర్తించుకొని తృప్తి, శాంతి పొందాలని కోరుకుంటున్నాను.

## ● మదన్ కుమార్ తనకు స్వామి కృప అనుభవమైన రీతి ఇలా చెపుతున్నారు

సంస్కారాల మార్పే సాధన అన్నారు శ్రీ సుబ్బరామయ్య మాస్టారు. నేను సాధన లో ఉన్నానో లేనో తెలియదు కానీ శ్రీ సార్ నా జీవితంలోకి ప్రవేశించాక నాకు తెలియకుండానే నాకున్న కొన్ని జంతు సంస్కారాలను మార్చారు. అందులో ముఖ్యంగా

1. నా చేత మాంసాహారం తినడం మాన్పించారు. దీనివలన కొంత సాత్విక స్వభావం అలవడింది.

2. కనీసం రోజులో ఒక్కసారైనా భగవంతుణ్ణి నిష్కారణంగా ఆయన ప్రసాదించిన వాటికి, మనకు ఉన్నవాటికి కృతజ్ఞతతో స్మరించుకోవడం; ఇంతకుముందు కేవలం కష్టమైన సందర్భాలలోనూ మరియు లేని వాటిని (కోరికలను) అడిగే సందర్భంలో మాత్రమే స్మరించుకోవడం అలవాటు.

3. పరిస్థితులను ఉన్నది ఉన్నట్టు అంగీకరించడం; ఇంతకుముందు నేను అనుకున్నట్లు జరగకపోతే విపరీతంగా బాధపడటం, ఆయా వ్యక్తులను, పరిస్థితులను చాలా కాలం పాటు నిందిస్తూ ఉండడం చేసేవాడిని. ఇప్పుడు కూడా ఈ భావాలు మనసులో

ఉన్నప్పటికీ వాటికి బలం కొంత వరకు తగ్గించారు శ్రీ సార్, పూర్తిగా ఎప్పటికి తొలగిస్తారో?

4. భగవంతుడు అంటే కేవలం గుడిలో విగ్రహంలో మాత్రమే ఉంటాడు అనుకునే ధోరణి నుంచి ఆయన సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వ సమర్థుడు అనే అవగాహన కలిగించి (లీలల పారాయణ, స్వానుభవాలు ద్వారా) ఆయన మనకు నిరంతరం బోధించే బోధలను కొన్ని గుర్తించేటట్లు చేయడం; ఇంకా గుర్తించాల్సినవి ఎన్నో ఉన్నాయి..

5. కష్టాలు ఎందుకు వస్తాయి? కొన్నిసార్లు మనం అనుకున్నవి జరుగుతాయి మరి కొన్నిసార్లు జరుగవు! ఎందుకు కొంతమంది నిష్కారణంగా మనకు దూరమవుతారు? ఎప్పుడూ మనం ఒకే లాగా ఉండలేకపోతున్నాము ఎందుకు? ఇటువంటి ఆలోచనలు నాకు ఎక్కువగా ఉండేవి... శ్రీ సార్ పరిచయంతో కర్మసిద్ధాంతం, ఋణానుబంధం అనుసరించి మన జీవిత అనుభవాలు నిర్ణయించబడతాయని, కానీ సద్గురువుకి సంపూర్ణ శరణాగతి చేసినవారి లెక్కలన్నీ ఆయన చేతిలో ఉంటాయి అన్న అవగాహన వచ్చింది... ఆచరణ ఎప్పటికో?

6. ఆ మహనీయుని ప్రేరణతో మొదలుపెట్టిన పనులను సాధ్యమైనంత వరకూ కొనసాగించ గలగడం; ఇంతకుముందు కొద్ది రోజులు మొదలు పెట్టి ఆ తర్వాత ఆపివేసేవాడిని.

7. తక్కిన విషయాల మీద ఆలోచనలు తగ్గిపోవడం; ముఖ్యంగా సినిమాలు, రాజకీయాలు మీద ఆసక్తి తగ్గిపోవడం.

8. ఇతర గ్రంథములు ఏమి చదివినా చక్కగా అర్థమవడం, అవధూత లీల గ్రంథం పారాయణ తర్వాత ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలలో సారం ఇంతకు ముందు కంటే చక్కగా బోధపడటం!

9. ఇంతకుముందు నేను నా చుట్టుపక్కల వారి కంటే అన్ని విషయములలో ముందుండాలి, అందరిలో గొప్పగా ఉండాలి, ఆధ్యాత్మిక పుస్తకాలు చదివి పెద్ద పెద్ద (ముక్తి, మోక్షం) విషయాలు మాట్లాడితే చాలా గొప్ప అనే భావంలో ఉండే వాడిని; ఈ అనంత విశ్వంలో మన ఉనికి అణు మాత్రమేనని భగవంతుడు మనల్ని ఏ పరిస్థితుల్లో ఉంచితే ఆ పరిస్థితులను ఉన్నది ఉన్నట్లు అంగీకరించి ధర్మాన్ని చక్కగా ఆచరించడమే జీవిత లక్ష్యం అన్న అవగాహన వచ్చింది...ఆచరణ ఆయన సంకల్పానుసారమే!

10. వృత్తి ధర్మము, కుటుంబ భాద్యత, ఆధ్యాత్మికత మధ్య సమన్వయం కొంతవరకు వచ్చింది; ఇంతకుముందు ఏదో ఒక దానిని ఎక్కువ అనుకొని మిగతా వాటిని పట్టించుకునే వాడిని కాదు.

ఇంకా మారాల్సినవి ఎన్నో ఉన్నాయి. అందులో ముఖ్యంగా

అహంకారం : ఎన్ని జన్మల నుంచి వస్తుందో గానీ అహంకారం తెలియకుండానే నరనరాల్లో జీర్ణించుకుపోయి ఉంది. “మీ ఆలోచనలు అన్నీ అహంకారమే” అన్న శ్రీ సుబ్బరామయ్య సార్ మాటను పూర్తిగా ఎప్పటికి ఆచరిస్తానో?

సోమరితనం : దీన్ని రూపుమాప లేక పోతున్నాను. శారీరక, మానసిక సోమరితనాన్ని రూపుమాపమని ఆ మహనీయుని వేడుకుంటున్నాను.

నా ఆలోచనల గురించి ఇతరులు ఏమనుకుంటారో అనే భయంతో నిరంతరం దాచుకునే స్వభావం నుంచి అందరికీ ఈ విధంగా పంచుకునే సంస్కారాన్ని కూడా ఆ మహనీయుడే ఇచ్చారు. మారినవి చాలా కొద్ది మాత్రమే, మారవలసినవి ఎన్నో ఉన్నాయి.. కానీ ఏ రోజుకైనా ఆ కరుణామయుడు ఖచ్చితంగా నన్ను శుభ్రమార్గంలో ఉంచుతాడని గట్టి

విశ్వాసం, ఎందుకంటే ఆయన మొండి దున్నపోతులతో వ్యవసాయం చేసే స్వామి (సార్) మరియు జలగ స్వామి కాబట్టి...

జై సద్గురు దేవా!

## అలపాటి అశోక్ కుమార్, సూళ్లూరు పేట

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ధ్యాన మందిరం, సూళ్లూరుపేట నందు ప్రతి గురువారం వెంకయ్య స్వామి వారి జీవిత చరిత్ర, దివ్య బోధలు సత్సంగం జరుగుతుంటుంది. అందులో భాగంగా గత వారం 21.12.2023 నాడు సత్సంగం సమయంలో శ్రీ స్వామి వారు నిత్యసత్యులు, స్వామి వారికి ఇష్టమైన నియమ పాలన చేస్తూ ఉంటే ఖచ్చితంగా వారు మనలను తప్పు చేయనివ్వకుండా నడిపిస్తారు అని ఉదాహరణగా దమ్మపేట నాగేశ్వరరావు గారి లీల గురించి వివరించుకుంటున్నాము. ఆ సందర్భంలో అలపాటి అశోక్ కుమార్ గారు, తన అనుభవాన్ని ఇలా చెబుతున్నారు.

అశోక్ కుమార్ గారు చాలా సంవత్సరాలుగా ప్రతి నెలా గొలగమూడికి వచ్చి స్వామివారి మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని

వెళ్లడం నియమంగా పెట్టుకున్నారు. కొన్ని సంవత్సరముల క్రితం కుటుంబ విహారయాత్ర వలన ఒక నెల వెళ్లలేక పోయారు. కానీ వారు ఆ విషయాన్ని మరిచిపోయారు. శ్రీ స్వామి వారు ఒక ముసలాయన రూపంలో ప్రతిరోజు స్వప్నంలో దర్శనం ఇచ్చి నాకు అప్పు తీర్చాలి, బాకీ ఉన్నావు అని వరుసగా మూడు రోజులు అడుగుతున్నారట.

నేను ఎవరికి ఎటువంటి బాకీ లేను, ఎవరు ఈ ముసలాయన స్వప్నములో రోజు బాకీ తీర్చమంటున్నారు అన్న సందేహాన్ని గొలగమూడికి వెళ్ళినప్పుడు శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారికి విన్నవించుకున్నారు. అశోక్ గారు వారి నియమం గురించి శ్రీ సార్ కి ఏమీ చెప్పకుండానే శ్రీ సార్ "నువ్వు వెంకయ్య స్వామికి ఏదో మొక్కుబడి పెట్టుకుని తీర్చకుండా బాకీ పడ్డావు. అందుకే స్వామి ముసలాయన రూపంలో నిన్ను బాకీ తీర్చమని అడుగుతున్నారు" అని చెప్పారట. తర్వాత అశోక్ గారు తన తప్పును గుర్తించి స్వామి వారిని క్షమించమని వేడుకున్నారు, అంతటితో వారికి ఆ స్వప్నం రావడం ఆగిపోయింది.

గత అనుభవాన్ని పురస్కరించుకొని అశోక్ గారు అమెరికాకు వెళ్లి కొన్ని నెలలు స్వామివారిని

దర్శించుకోలేకపోవడం వలన మరల తిరిగి వచ్చిన తర్వాత అన్ని నెలల బాకీని ప్రదక్షిణ రూపంలో తీర్చారు. మన ప్రయత్నంగా నియమపాలను శ్రద్ధగా చేస్తుంటే మన తప్పులను సరిదిద్ది ధర్మమార్గంలో ఇప్పటికీ, ఎప్పటికీ నడిపిస్తారు శ్రీ స్వామి వారు అందుకే వారు నిత్యసత్యులు.

## శ్రీ సాయి సుబ్రహమణ్యం, తిరుపతి

సాయి తనకు శ్రీ సార్ స్వప్న దర్శనాలను – సందేశాన్ని అందించిన సన్నివేశాలను ఇలా పంచుకుంటున్నాడు.

శ్రీ సార్ సమాది అయ్యాక శ్రీ సార్ తరచూ స్వప్నంలో దర్శనం అయ్యేది. ఒక సంవత్సరం అలా అయ్యాక స్వప్న దర్సనం కొద్ది రోజులో, నెలలో కాలేదు. ఒక రోజు శ్రీ సార్ ఈ మధ్య దర్శనం ఇవ్వలేదే? అను కొని పడుకున్నాడు. ఆ రోజు రాత్రి శ్రీ సార్ స్వప్న దర్శనం ఇవ్వటం – స్వప్నంలోనే సార్ కు నమస్కరించు కోవటం జరిగింది. ఇలానే మరోసారి కూడా. శ్రీ సార్ స్మృతి మాత్ర ప్రసన్నులు అని సమాధి తరువాత కుడా మరల మరల ఎరుక పరుస్తున్నారు.

ఈ మధ్య ఒక సారి సాయి కి ఆఫీస్ లో కొంత భిన్న అభిప్రాయాల వల్ల, దాని ఆలోచన వల్ల నిద్ర సరిగా

పట్టక ఒక రోజు 3 గంటలకు మెలుకవ వచ్చింది. అప్పుడు పూజ రూమ్ లో పటాల వద్ద కూర్చొని శ్రీ సార్ తో విన్న వించు కుంటూ సందేశం కోసం శ్రీ లెటర్స్ బుక్ తెరిస్తే అది లాస్ట్ పేజి లోని "శ్రీ భరద్వాజ మాస్టారి రచనలు" అని వరుసగా మాస్టారి రచనలు వున్నాయి. శ్రీ సార్ మాస్టారి రచనలు చదవ మంటున్నారు అని అనిపించింది. కాని ఇది చివ్వరి పేజి కదా సంపూర్ణ వాక్యం కూడా లేదు అని మధ్య మరో పేజి తీసాను. అచ్చట శ్రీ సార్ రాజు కు వ్రాసిన లెటర్ లో పూర్తి వాక్యం తో "మాస్టారి చరిత్రలు, మరల మరల చదువు. పారాయణాలు అని తొందర పడవద్దు. వారి రచనలలోని సత్యం హృదయగతం చేయమని ప్రార్ధించు" అని వుంది. శ్రీ సార్ దయతో వారి సందేశం మరింత స్పష్టంగా వెంట వెంటనే అనుమానం లేని రితి తెలియ పరిచారు అనిపించింది. శ్రీ సార్ భౌతికం గా ఉన్నప్పుడు సాయి తో ఒక సందర్భంలో నీకు మాష్టారి చరిత్రలు అన్ని ఇంకో రీడింగ్ ఇప్పించాలి అన్నారు కాని, తరువాత ఆ ప్రస్తావన మరల రాలేదు. సార్ సమాధి అనంతర సందేశం వారి పూర్వ ఆదేశాన్ని మరల తెలపడం శ్రీ సార్ నిత్య సత్యులు అని, స్మృతి మాత్రప్రసన్నులు అని తెలుపుతోంది.

ఈ సందర్భము లోనే ఆఫీస్ లో ఒక నిర్ణయం కోసం “ఇప్పుడు ఉన్న పొజిషన్ లో (నేను) మార్పు అడగాలా / చేసుకోవాలా ?” అని శ్రీ సార్ (ఫోటో ముందు కూర్చొని) ను మనసులొ ప్రశ్నిస్తే వెంటనే సమాధానంగా” నీవు అడిగితె ఆ పోజిషన్ లో ఉంచారా (ఉంచానా) ? మరి దాని మార్పు నువ్వు చేసుకోవడం / అడగటం ఏమిటి ?” అని హృదయం లో పలికారు, ఆత్మ ప్రేరణాధికారి అయిన ఆ సద్గురు మూర్తి.

సాయి సుబ్రహ్మణ్యం ఇలా చెబుతున్నాడు (శ్రీ సార్ కృపతో కల్గిన మహాత్ముల స్వప్న దర్శనాలు, ఆశీస్సులు - తోడుండి నడిపించుట):

ఒక రోజు రాత్రి శ్రీ సార్ స్వప్న దర్శనమిచ్చి చాలా రోజులు అయింది అనిపించింది. శ్రీ సార్ ఒకసారి దర్శనమిస్తే బాగుండును అని కూడా అనుకొని పడుకోవడం జరిగింది. ఆ రోజు రాత్రి నేను గొలగమూడి శ్రీ సార్ వాళ్ళ ఇంటికి వెళ్ళాను. సార్ కూర్చుని ఉన్నారు. శ్రీ సార్ కు నమస్కరించి కూర్చోగా శ్రీ సార్ ప్రేమతో కొంతసేపు మాట్లాడుతూ వారి సాంగత్యం ప్రసాదించారు. అలా స్మరించిన వెంటనే వారి స్వప్న దర్శనం ప్రసాదించిన స్మృతిమాత్ర ప్రసన్నులు, నిత్య సత్యులు, అనంత కృపానిధి శ్రీ సార్.

## ● సకల దేవతా స్వరూపము

అక్టోబర్ 20, 2020 విజయదశమి పండుగ రోజులు. ఒక రాత్రి స్వప్నంలో నేను, ప్రసాద్ ఒక చోట (తిరుచానూరు ప్రదేశం అనుకుంటా) వీధిలో నడుస్తున్నాము. అచట పెద్ద అమ్మవారి ఆలయ ద్వారం కనబడింది, మూసివేయబడి ఉంది అనుకునేంతలో ఎవరో లోపల నుండి తలుపు తెరిచారు. లోపల గర్భ గుడి ద్వారం మూసి ఉంది. బయట నుండే దండం పెట్టుకుందామని అచట నుండి దండం పెట్టుకుంటే లోపల ద్వారంలో అమ్మవారి దర్శనం అయింది. క్షణాల్లో అమ్మవారి రూపం మారి శ్రీ సార్ గా అచ్చట దర్శనమిచ్చారు. అలా శ్రీ సార్ సకల దేవతా స్వరూపముగా దర్శనమిచ్చి ఆశీస్సులు అందిస్తున్నారు.

## ● Working for E-Magazine is same as Abhishekam

అక్టోబర్ 30 పూర్ణిమ ముందు రోజు రాత్రి శ్రీ సార్ స్వామి సమాధి మందిరంలో శివ తో శ్రీ స్వామివారికి అభిషేకం చేస్తున్నారు. నేను ఇంకా స్నానం చేయకపోవటంతో బయట నుండి చూస్తున్నాను. అంతలో సంపత్ నన్ను పిలిచాడు. సంపత్ శ్రీ సార్ ను ఏదో సందేశం కోరుతూ లెటర్ వ్రాసాడని దాని గూర్చి

చెబుతున్నాడు. తర్వాత నేను మరలా సమాధి మందిరం లోకి వెళ్ళేటప్పటికి అభిషేకం పూర్తి అయ్యింది. శ్రీ సార్ బయట కొంత సేపు కూర్చుని వారి సన్నిధి ప్రసాదించారు. ఇది జరిగిన మాసం e-magzine కి శివ ఎడిటోరియల్ వ్రాయటం శ్రీ సార్ దగ్గర ఉండి చేయించినట్లు అది స్వామి వారి సమాధి అభిషేకంతో సమానం అని తెలుపుతున్నారు అనిపించింది. శ్రీ సార్ దగ్గర ఉండి పనులు చేయిస్తున్నారు అనేది స్పష్టముగా ఈ అనుభవంతో తెలుపుతున్నారు.

శ్రీ సార్ మనకు నియమపాలన చేయించడం లో ఎన్ని మార్గాలు అవలంబిస్తారో ఈ క్రింది అనుభవం కూడా తెలుపుతోంది. ఒక సమయంలో సాయి అపుడపుడు ఇంటర్నెట్ చూస్తూ సమయం వ్యర్ధం అవుతోంది అని ఒక “వారం రోజులు ఇంటర్నెట్ జోలికి పోనని నియమము పెట్టుకున్నాడు.” మూడు రోజులు అయ్యాక పాలు మారి మరల ఇంటర్నెట్ లో ఏవో చూడటంతో కాలం వ్యర్ధం చేయటమే కాక పెట్టుకున్న నియమం ప్రక్కకు తోసి వేసాడు. పైగా సార్ ఉన్నప్పుడైతే హెచ్చరించేవారు, సార్ సన్నిధితోనో, అనారోగ్యం పెట్టి అయినా బయట పడవేసే వారు. ఇప్పుడు ఎలా బయట పడేది ? అనుకున్నాడు. మరో రెండు మూడు రోజులలో

తనకు కొంత అనారోగ్యం రావటం, ఆ అనారోగ్యం తను పెట్టుకున్న నియమం ఉల్లంఘించడం (శ్రీ సార్ కు ఇచ్చిన మాట తప్పిటం) వల్ల నే నని శ్రీ సార్ గుర్తింపు కలుగ చేసారు. శ్రీ సార్ కు క్షమార్పణ చెప్పు కున్నాక మరల రెండు, మూడు రోజులలో ఆరోగ్యం చేకూరింది. సార్ భౌతికంగా ఉండగా తనను నియమ పాలన చేయించుటకు మొండి ఎద్దుల సేద్యం ఉదాహరణ చెబుతూ అవసరమైన సమయాలలో అలానే చేయించేవారు. ఇప్పటికి అంత స్పష్టంగా నడిపిస్తూ మనను ఉద్ధరిస్తున్న సార్ నిత్యసత్యులు.

## కోటేశ్వరరావు

సార్ తమ శరీరం చాలించటానికి ఒక వారం ముందర గురువారం సాయంత్రం స్నానం చేయించిన తర్వాత కోటేశ్వరరావు గారితో మాట్లాడుతూ "వారం తర్వాత ఉండను" అని మరోసారి "వారం తర్వాత ఉండను" అని చెప్పి కోటి గారితో "ఎవరితోను చెప్పవద్దు" అని అన్నారు. కోటి గారికి సార్ అన్న మాటలు పూర్తిగా అర్ధం కాలేదు. సార్ చెప్పవద్దు అన్నారు కాబట్టి ఎవ్వరితోను చెప్పలేదు. ఆ రోజు రాత్రి కలలో ఒక దివ్య దర్శనం అయ్యింది. శ్రీ సార్ వాళ్ళ ఇంటి వద్ద ఎందరో గుమిగూడి ఉన్నారు. షామియానాలు వేసి

ఉన్నాయ్. సార్ వాళ్ళ ఇంటి దగ్గరకు అందరిని తోసుకుంటూ వెళుతుంటే కొందరు అక్కడ ఏడుస్తూ ఉన్నారు. లోపల చూస్తే సార్ కూర్చొని నవ్వుతూ వీళ్ళంతా పిచ్చి వాళ్ళు. ఏమిటి వీళ్ళు అందరు ఏడుస్తున్నారు? నేనెక్కడి పోయాను. ఇక్కడే ఉన్నాను కదా అంటున్నారు. కల మెలుకువ వచ్చింది. మరు రోజు ఉదయం బయలుదేరి కోటేశ్వరరావు గారు వారి బందువుల ఇంటికి వెళ్ళవలసి రావటంతో వెళ్లారు. వారం గడిచింది. శుక్రవారం రోజు ఉదయమే సార్ చెప్పినది ఏమవుతుందో చూడాలనే ఉత్సుకతతో గొలగమూడి బయలుదేరుతుండగా పాబోలు వేంకటేశ్వర్లు వద్ద నుండి సార్ కు బాగులేదని ఫోన్ వచ్చింది. వెళ్లి చూస్తే సార్ చెప్పినట్లే సార్ శరీరం చాలించారు అని తెలిసింది. పూర్తి స్పృహతో, ఎరుకతో సార్ తనువు చాలించారు అనటానికి ఇది ఒక నిదర్శనం.

సార్ చివరి రోజుల్లో సంవత్సరం పైగా కోటిగారు సార్ కు స్నానం చేయించే వారు. సమాధి అనంతరం కూడా రోజు అభిషేకానికి ఉదయ హారతికి వచ్చి సార్ ను సేవించు కొంటున్నారు. ఈ మధ్య జరిగిన ఈ క్రింది అద్భుతమైన అనుభవం సార్ ఇప్పటికి శ్రద్ధతో వారి

సమాధిని వారిని సేవించే వారిపై తన దృష్టి అంతకంటే ఎక్కువగా నిలుపుతారని తెలుపుతోంది.

2018 మే లో ఒకరోజు నారాయణకి సార్ కలలో కనపడ్డారు. స్వప్న వృత్తాంతం

సార్ : "వాడు వారం రోజులు నుండి రావట్లేదు. నాకు తెలుసు ఎందుకు రావట్లేదో"

నారాయణ : ఎవరు సార్?

సార్ : "వాడేరా ఒళ్ళు తుడుస్తాడు కదరా వాడే. నువ్వు అయినా రావచ్చు కదా" అన్నారు.

నారాయణ వెంటనే బయలుదేరి సార్ సమాధి దర్శనం చేసుకున్నాడు. ఎప్పుడు ఉదయం అక్కడ ఉండే కోటేశ్వరరావు గారు లేక పోయేటప్పటికి, సార్ తో స్వప్నంలో జరిగిన సంభాషణ అర్థమై కోటేశ్వరరావుకి ఫోన్ చేసి "ఏం సార్ దగ్గరకు రావట్లేదు?" అని అడిగితే కోటేశ్వరరావు "వారం క్రితం కుడి చేయి భుజం పట్టేసింది నారాయణ! మందులు వాడుతున్న తగ్గట్లేదు' అని చెప్పారు. నారాయణ తనకు జరిగిన స్వప్న వృత్తాంతం చెప్పాడు. వెంటనే నొప్పి అయినా సార్ అభిషేక సేవకు వెళ్ళటం మరలా మొదలు పెట్టారు. మూడవ రోజుకు ఏ మందులూ లేకుండా నొప్పి తగ్గిపోయింది. అంటే సార్ నిర్నిద్రులై ఎవరు సేవ

చేస్తున్నారు, ఎవరు ఏమారుతున్నారు అని ఇప్పటికి మన progress చూడటమే కాక తన ప్రత్యేక పద్ధతిలో సరి చేసి సేవా భాగ్యం కల్గిస్తూ, ఆ సేవ ద్వారా అన్ని ఇబ్బందులు తొలగిస్తామని తెలియచేస్తున్నారు.

## పొత్తూరి వెంకటేశ్వరరావు

పొత్తూరి వెంకటేశ్వరరావు గారు సార్ దగ్గర చీట్లు పెట్టి ఆ ఆజ్ఞల ప్రకారం ఇల్లు కట్టిస్తున్నారు. చాలా రోజుల పాటు అనుకున్న విధంగా కట్టుబడి జరగట్లేదు. దాన్ని చూసి వెంకటేశ్వరరావు సార్ పఠం దగ్గర 'ఏమిటి సార్! మీరు చెప్పినట్లు చేయిస్తుంటే కూడా పని సరిగ్గా జరగట్లేదు' అని వాపోయాడు. తర్వాత సోమవారం వస్తామన్న బేలుదారు శుక్రవారం వచ్చి ఆదివారం కూడా పనిచేస్తూ ఒక వారం లోపల అంతకు ముందు జరగని పని కూడా అయిపోయింది. దానితో సార్ నిత్య సత్యులు అని వెంకటేశ్వర రావుకు ధృడపడింది.

హైదరాబాద్ వెంకటేశ్వర రావు భార్య స్కూటర్ ని ఇంటి బయట పార్క్ చేసి తాళం తీసుకోవటం మర్చిపోయింది. తర్వాత రోజు  తాళాలు కనపడక పోయేసరికి భయమేసి సార్ కి నమస్కరించి మీరే రక్షించాలి అని చెప్పుకుని స్కూటీ దగ్గరకు వచ్చి చూస్తే

అక్కడ తాళాలు లేవు. వెతుకుతూ ఉంటే ఎదురింటి గోడమీద స్కూటీ తాళం ఉన్నది. అలా సార్ రక్షించారు.

వెంకటేశ్వరరావు కి ఒక రోజు హాఫ్ డే లీవ్ పెట్టాడు. అప్పుడు ముఖ్యంగా రెండు పనులు చేయాలి. అవి ఏమిటి అంటే 1. పేపర్ వాల్యుయేషన్ చేయాలి 2. ఇంకోటి పేపర్ మోడరేషన్ చేయాలి అంటే ఇంకొకరు డిజైన్ చేసిన పేపరును రివ్యూ చేసి దాన్ని కరెక్ట్ చేయాలి. సామాన్యంగా అలా చేయటానికి మూడు రోజులు టైం ఉంటుంది. కానీ ఈ రెండు పనులలో ఏమి చేయాలని చీట్లు వేస్తే పేపరు మోడరేషన్ చేయమని వచ్చింది. సార్ మోడరేషన్ చేయమని చీట్ల ద్వారా చెప్పారు. అంతకు ముందు రోజు కాలేజీలో ఒక కొత్త సర్క్యులర్ వచ్చింది. దాంట్లో ఒక్క రోజులో పేపర్ మోడరేషన్ సింగిల్ సిట్టింగ్ లో చేయాలి అని చెప్పి ఉంది. అంటే నాకు తెలియకున్నా స్వామి చిట్ల ద్వారా ఇది తెలిపి ఏది ముందు చేయాలి అనేది, ఎంతో ముఖ్యమైన పనులు మిస్ అవకుండా కూడా చేయిస్తున్నారు అని తెలుస్తోంది.

## జి. రవి, తిరుపతి

శ్రీ సార్ స్మృతి మాత్ర ప్రసన్నులు, స్మృతి రహిత ప్రసన్నులు కూడా అని ఈ క్రింది జి. రవి, తిరుపతి అనుభవం తెలుపుతోంది. 2018 లో ఒక సందర్భంలో

అప్పటి పరిస్థితులు మానసికంగా కష్టం గా తోచి మనసులో భగవంతుని అండ ఉండే ఇలా జరుగుతోందా? లేక నా కర్మ వల్ల భగవంతుని అనుగ్రహానికి దూరంగా వెళ్లి పోతున్నానా ? అనుకున్నాడు. ఆరోజు రాత్రి శ్రీ సార్ స్వప్న లో సార్ కనపడి కష్టాలు వస్తుంటే భగవంతుని అనుగ్రహం ఉన్నట్లా ? లేనట్లా ? అని అడిగారు. రవి "కష్టాలు భగవంతుని అనుగ్రహానికి గుర్తు" అన్నాడు. శ్రీ సార్ అదృస్యులు అయ్యారు. ఇలా శ్రీ సార్ తో అనుబంధం గల వారికీ శ్రీ సార్ ను ఉద్దేశించి ప్రార్థించినా, లేకున్నా వారికి తగు అనుభవం ఇచ్చి సందేహం తీర్చడంలో వారి దయ, ప్రేమ గుర్తించగలము.

## సాయి శివ

సాయి శివ శ్రీ సార్ సమాధి అనంతరం ప్రసాదించిన అనుభవాలు ఇలా పంచుకొంటున్నారు:

శ్రీ సార్ లెటర్ ల ద్వారానూ, తన సన్నిధి ప్రసాదించి తగు సమయంలో తగిన ఆదేశం ఇవ్వటం సాయి శివకు శ్రీ సార్ భౌతికంగా ఉన్నప్పుడు బాగా అనుభవం. ఈ మద్య కాలంలో సాయి శివకు వచ్చిన స్వప్న సందేశం శ్రీ సార్ భోధనా దక్షతను, మనను అప్రమర్తులై శుభ్రమార్గంలో నడిపించే రీతిలో ఇప్పటికి ఏ

మాత్రం కొదవ లేదని తెలుపుతోంది. సాయిశివ కలలో ఒక రోజు తను శ్రీ సార్ వద్దకు గొలగమూడి వెళ్ళాడు. సార్ కుర్చీలో కూర్చొని ఉన్నారు. శివను రమ్మని కూర్చోమని చెప్పారు. శివతో ఇంక T. V. చూడవద్దు అని చెప్పి ఒక పుస్తకం తెప్పించి అందులో "ఇంక T. V చూడను" అని వ్రాయించారు. తరువాత ఒక శ్లోకం కూడా వ్రాయించారు. శివ తనకు అంతగా చూడాలని ఉన్నా, లేకున్నా అప్పుడప్పుడు T.V సీరియల్స్ అవి చూడటం casual గా జరుగుతోంది. శ్రీ సార్ మనం ఆదమరచిన క్షణాలను, లోపాలను గుర్తింప చేసి, తోడుండి ఎప్పటి లానే స్మృతి రహిత ప్రసన్నులుగా సరిచేస్తున్నారని గుర్తించాడు. ఇదివరలో "శ్రీ నాంపల్లి బాబా గారు స్వప్న దర్శనం ఇచ్చినప్పుడు, శివ తనకు ఏ మహాత్ములూ బౌతిక దర్శనం ఇవ్వలేదని అనుకుంటే, మరురోజే శ్రీ సార్ లెటర్ లో "మహాత్ముల స్వప్న దర్శనం, భౌతిక దర్శనం తో సమానమే " అన్న సందేశంతో లెటర్ రావటం శివకు గుర్తు వచ్చింది.

సార్ నిత్య సత్యులై అనుక్షణము చూస్తూ నేర్పించినది సాయిశివ ఇంకా ఇలా చెపుతున్నారు:

ఆఫీస్ లో గానీ ల్యాబ్ లో గానీ సెక్రటరీకి ఏమి చేయాలో చెప్పాను. తర్వాత ఆ సెక్రెటరీ చేసే పని తీరును

బట్టీ ఆమెకి మినిమం ఏమి చెయ్యాలో కూడా తెలియకుండా ఎలా ఉంటారు?, ఈ మాత్రం కూడా తెలియదు అని మనసులో భావన ఉండేది. అంతేకాకుండా కొన్నిసార్లు సెక్రటరీతో ప్రతి ఒక్క విషయము నేను చెప్పాలా? ఈ మాత్రం కూడా తెలియదా నీవు నాకు సెక్రటరీనా?, లేక నీకు నేను సెక్రటరీనా? అనే ఆలోచనలు వచ్చాయి. వాళ్ళలో భగవంతుడిని చూడటం కాక, వారి పట్ల మన భావాలు ఎలా ఉన్నాయో చూపించటానికా? అన్నట్లు ఒకరోజు స్వప్నంలో సార్ శివకు కరెంట్ మీటర్ బిల్లు ఇచ్చి, ఒక ఇల్లు చూపించి పని చేయమని చెప్పారు. సార్ ఏమి చేయమన్నారో శివకు అర్థం కాలేదు. సార్ వెంటనే గబా గబా వచ్చి ఇది చెప్పాను, ఇలా చెయ్యాలని చెప్పాను అని చెపుతున్నారు. (సార్ భౌతికంగా ఉన్నప్పుడూ కూడా చెప్పిన చిన్న పనులు అర్ధం కాకపోయినా సార్ ఏనాడూ ఇది కూడా అర్ధం కాలేదా? ఎందుకయ్యా ఈ చదువులు? అని ఏనాడూ అనలేదు. కానీ నేను ఏమి చేస్తున్నాను? ఈ మాత్రం తెలియకపోతే వీళ్ళు ఇంత చదువుకుని ఉపయోగం ఏముంది? అని అనుకుంటున్నాను, అంటున్నాను.) అంటే నాకు ఏమి చెయ్యాలో నేర్పిస్తున్నారు చెబుతున్నారు ఆ సంఘటనతో మీకు ఎన్ని

సార్లు చెప్పాను, ఎలా చేశాను. మీరు అవతల వారితో ఏమి చేస్తున్నారు అని చెపుతున్నట్లున్నది.

కొంతకాలమైన తరువాత ఆఫీసులో మాట్లాడుతున్నప్పుడు వారు ఇలా చేశారు, వీరు ఇలా చేశారు అని, ఎవరికి ఎలా చెప్పాలి? అనే ఆలోచనలు సాయి శివకి ఎక్కువ వస్తూ ఉండేవి.

డిసెంబర్ 20 2019 రాత్రి అతని కలలో సుబ్బరామయ్య సార్ కనబడ్డారు: కలలో సాయి అన్నయ్య, ప్రసాదు, శివ సార్ దగ్గర సార్ ఇంటి ముందర వరండాలో కూర్చున్నాము. ఎప్పటిలాగే సుబ్బరామయ్య సార్ చెబుతున్నారు “ఎవరితో ఏమన్నా, ఎవరికి ఏమి చేసినా, ఎవరి గురించి ఆలోచనలు వచ్చినా అది భగవంతునికే చెందుతుంది” అని చెప్పారు. సార్ చెప్పినది ప్రసాద్‌కు అర్థం కాకపోవడం వలన సార్ ఏమి చెప్పారు? అని శివను అడిగాడు. శివ తనకు అర్థమైనది ప్రసాద్ తో “ఇతరులతో ప్రవర్తించేటప్పుడు వారిలో భగవంతునే చూస్తూ ఏమి చేసినా అది భగవంతునికే చెందుతుంది అని చెప్పారు” అని అన్నాడు. అంటే శివ భావమేమంటే అలా భగవంతుని చూడకుండా చేస్తే ఎదురుగా ఉన్న మనిషికి చెందుతుంది అని. వెంటనే సార్ నవ్వుతూ “అది కాదు స్వామీ! నేను చెప్పింది.

వారిలో నువ్వు భగవంతుని చూసినా, చూడక పోయినా ఆ ప్రతి చర్యలూ, ఆలోచనలు, మాటలు, పనులూ కూడా భగవంతునికే చెందుతుంది" అని చెప్పారు. అంటే నువ్వు ఎదుటి వ్యక్తిలో భగవంతుని చూసినా చూడకపోయినా నువ్వు చేసేది అనుకునేది ఆ భగవంతునికే చెందుతుంది అని చెప్పారు.

ఎప్పుడు ఏది అవసరమో ఆయా సమయానికి అది చేస్తూ ఆయన నిత్య సత్యులుగా నడిపిస్తున్నారు. మన పిల్లల్ని ఏదైనా పని చెప్పినప్పుడు వారు చేయకపోతే ఒకటి రెండు సార్లు చెప్తాము. అప్పటికీ చేయకపోతే మీకైనా సిగ్గుండాలి, నాకైనా సిగ్గుండాలి ఇంక చెప్పకూడదు, అని ఎన్నటికీ ఈ విషయం వాళ్ల దగ్గర ప్రస్తావన చేయకూడదు అని అనిపిస్తుంది. అలాంటిది సుబ్బరామయ్య సార్ ఎన్నిసార్లు చెప్పారు? ఎన్ని జన్మల నుంచి చెబుతూ ఉన్నారు? మనం చెయ్యకపోయినా ఆయన ఏ మాత్రం పట్టు వదలకుండా ప్రేమతో, కరుణతో మనకు చెప్పే విధానం చూస్తే వారి అనంత కరుణ తెలుస్తుంది. లేకపోతే మనం మన పిల్లల్ని రెండుసార్లు చెప్పి చేయకపోతే వదిలేద్దాం అనుకుంటాము. మరి సార్ ఏనాడూ కూడా ఎన్ని సార్లు చెప్పాలి అని వదేలేసినది,

లేకపోతే అసహనంగా మాట్లాడిన సందర్భాలు లేవు. అనంత కరుణమయులు శ్రీ సార్.

02/03/2021 తెల్లవారుజామున శ్రీ సుబ్బరామయ్య సార్ స్వప్న దర్శనమిచ్చారు. సాయిమాస్టార్ నిలయం ఎదురుగా బావివద్ద అత్తి చెట్టు కన్నా దగ్గర్లో ఉన్న Pin Paper Flowers type చెట్టు పువ్వులు ఎంతో భక్తితో, శ్రద్ధగా పూజచేసే వేషధారణలో (పంచె, కండువా, విభూతి బొట్టు) ఉండి కోస్తున్నారు. నేను కూడా కోయబోవగా, సార్ వద్దని సైగలతో మందలించారు. నేను ఇంకా స్నానం చేయనందున, బహిర్దేశానికి వెళ్లివచ్చిన బట్టలతో ఉన్నందున అన్నారేమోనని బాధపడ్డాను. అది చూసి సార్ నన్ను సరేలే, కోయి పర్వాలేదు అన్నారు. కానీ నేను సార్ ఎంతో భక్తితో వెంకయ్యస్వామి నామస్మరణతో (స్వయంగా వెంకయ్యస్వామికి పూజ చేస్తున్నట్లు) చేసే పని, నేను కేవలం బాధపడుతున్నానని స్వామికి ఇష్టం లేకున్నా చేయనున్నారని కోయకుండా ఉండిపోయాను. సార్ తర్వాత సాయిమాస్టర్ నిలయం గట్టుమీద (వరండాలో) కూర్చుని మాట్లాడటం మొదలు పెట్టారు. సార్ అడిగిన ప్రశ్న “నువ్వు హృదయపూర్వకంగా సాధ్యమైనంత సమయం మానసికంగా స్వామితో కనెక్ట్ అయి

ఉండడానికి ఏది నిన్ను అడ్డుకుంటోంది?” అని, పక్కనే కూర్చున్న అన్నయ్యను చూపుతూ “ఇతని వల్లా?” అన్నారు. అలా పైకి అడిగారే కానీ నా హృదయంలోనే దానికి సమాధానం చెప్పబట్టి వెంటనే నేను “అయ్యో! దానికి ఎవరు కారణం కాదు సార్. నా బలహీనతలే అడ్డుపడుతున్నాయి” అని బాధతో సార్ కు క్షమాపణ చెప్పాను.

01/10/21 ఈరోజు తెల్లవారుజామున శ్రీ సుబ్బరామయ్య సార్ స్వప్న దర్శనం ప్రసాదించారు: నేను గొలగమూడి వెళ్లాను. ఉదయం గొలగమూడి చేరగానే సార్ కనబడి, ఆ ట్రిప్ లో మనోవాక్కాయ కర్మలలో ఎటువంటి మార్పులు తెచ్చుకోవాలో, దానికి తగిన సూచనలు summarise చేసినట్లు, నా మనసులో సాధనపై ఎంతో ఉత్సాహము-పట్టుదల పెంచి స్వామికృపకు అర్హుడనయ్యేందుకు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ఆకాంక్షను (కలలోనే) నాలో రేపారు సార్.

మరునాటి నుండి 40 రోజులు “శ్రీసాయిమాస్టర్ బోధామృతం” పారాయణ చేద్దామన్న నిశ్చయానికి రాగా ప్రసాదించిన ఈ స్వప్న సందేశం ద్వారా సార్ ఈ క్రింది అభయమిచ్చినట్లుగా ఉంది:

"ఆనందాశ్రమంగూర్చి చేసే ప్రయత్నం, అందులో భాగంగా ఈ పారాయణ చేయడం నా ప్రత్యక్ష సాన్నిధ్యంలో - ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. నేనే తగిన బోధచేయడం, అవసరమైన మార్పులు తీసుకువస్తూ మార్గదర్శనం చేస్తున్నాను, చేస్తాను".

2021 విజయదశమి రోజు రాత్రి సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ సమాధి సన్నిధిలో సత్సంగంలో కూడా "శ్రమతో సేవ అంటే - మనస్సులో ఆలోచనలు లేకుండా ఉండటం" అనే విషయాన్ని నొక్కి చెప్పటం పై అభయాన్ని నిరూపించినట్లుగా ఉన్నది!

12/10/21: నిన్న రాత్రి స్వప్నంలో శ్రీ వెంకయ్య స్వామి సమాధి మందిరం వద్ద స్వామి విగ్రహం దేదీప్యమానంగా వెలుగుతూ దర్శనమిచ్చారు. సుబ్బరామయ్య సార్ ధునికి ఇవతల స్వామి విగ్రహానికి ఎదురుగా స్వామి విగ్రహం గురించి, సమాధి మందిరంలోని ప్రత్యేకత (చైతన్య ఘనాయ నమః) స్వామి విగ్రహం విశిష్టత వివరిస్తున్నారు. పై స్వప్నం 12th న బయలుదేరి అంటే ఆ మార్నింగ్ గొలగమూడి డ్రైవ్ చేసుకుని వెళదామని బయలుదేరగా ప్రసాదించిన స్వప్న దర్శనం ద్వారా నేనే తీసుకు వెళుతున్నాను,

స్వామి దర్శనం ప్రసాదిస్తున్నాను అని సార్ తెలిపినట్లుగా ఉంది.

## ప్రసాద్

సార్ తనను ఉల్లిపాయలు తినొద్దు అని 2014 సం||లో చెప్పియున్నారని, అప్పటినుండి తను తినకూడదు అని అనుకున్నా దాని మీద వ్యామోహంతో ఇంట్లో వాళ్ళు ఎప్పుడైనా చేసినప్పుడు లేక ఇతర సందర్భములలో నెలకు రెండు మూడు సార్లు ఉల్లిపాయ తినటం జరిగేది. సార్ సమాధి చెందిన తర్వాత కూడా తింటూ సార్ మాట ఆచరించ లేకపోతున్నానే అని బాధపడడం జరిగేది. కానీ చిత్రంగా 2019 జూలై ఆగస్టు నుంచి తను ఇంక ఉల్లిపాయ తినకుండా ఉండాలి అని చెప్పి నిర్ణయించుకొన్నారు, అప్పటినుండి ఆ నియమము సహజ సిద్ధమైపోయింది. ఉల్లిపాయ మీద వ్యామోహం లేకుండా పోవటం అనేది సార్ యొక్క కృపయని! ఇలానే సార్ బంగాళదుంపలు కూడా తనను తినవద్దని (2014 లో) వాటి వల్ల పెద్ద వయస్సులో మోకాళ్ళ నొప్పుల ఇబ్బంది వస్తుంది అని చెప్పారు. చాలా చిత్రంగా 2019 లోనే అతనికి బంగాళదుంపలు తినటం మానేయటం జరిగింది.

ప్రసాద్ 28 నవంబరు 2019 న బెంగళూరు నుండి హైదరాబాదు బయలుదేరాడు. తర్వాత రోజు ప్లాన్ ప్రకారం తన పిన్ని వాళ్ళ ఇంటికి వెళ్లి ఒక కాన్ఫరెన్సుకి వెళ్ళాలి. ఉదయం పూట సమయం సరిపోదు కానీ నాంపల్లి బాబా దగ్గరికి వెళితే బాగుంటుంది అనుకున్నారు. ఇంటి నుండి బయలుదేరే ముందు సార్ కి నమస్కారం చేసి మీ సేవ చేసేటట్లు అనుగ్రహించండి అని ప్రార్ధన చేసారు. అతను గంట 20 నిమిషాల ముందుగా రైల్వే స్టేషన్ కి బయలుదేరినా ట్రైన్ వెళ్ళిపోయింది. అప్పటికప్పుడు బస్సు టికెట్ రిజర్వేషన్ చేసుకుని హైదరాబాద్ లో స్నేహితుడైన రామకృష్ణ వాళ్ళింటికి వెళ్ళాడు. అక్కడి నుండి నాంపల్లి బాబా సమాధి మందిరం ఒకటిన్నర కిలోమీటర్ల దూరం మాత్రమే. నాంపల్లి బాబా సమాధి మందిరాన్ని దర్శనానికి వెళుతూ రామకృష్ణ రూమ్ లో ఉన్న ధునీవాలా దాదా గారి చరిత్ర గ్రంథం తీసుకెళ్లాడు. అక్కడ పూజారి అప్పారావు గారు ప్రసాద్ చేతిలో ఉన్న పుస్తకం చూసి 'ఇవాళ ధునీవాలా దాదా గారి సమాధి చెందిన రోజు. పొద్దున్నే అనుకుంటున్నాను ఈ రూపంలో ఆయన వచ్చేసారు అని చెప్పి పుస్తకం తీసుకుని కళ్ళకద్దుకుని, ఆ రోజు సుధీంద్రబాబు గారి సమాధి

చెందిన రోజు కూడాను' అని చెప్పారు. అట్లా ఇద్దరు మహనీయులు సమాధి చెందిన రోజు నాంపల్లి బాబా గారి దర్శనం చేసుకోవటం తన యొక్క అదృష్టమని, అంతేకాకుండా ఆ రోజు సాయంత్రం శ్రీ భరద్వాజ మాస్టర్ గారి సతీమణి దర్శనానికి వెళ్లి అక్కడ కొంచెం సేపు ఉండటం సార్ యొక్క కృప వల్ల మాత్రమే సాధ్యమైనదని సార్ కి మనస్ఫూర్తిగా నమస్కారములు తెలుపుతున్నాడు.

2019, ఆగస్టు ఎనిమిదో తారీఖున తెల్లవారుజామున 4:30 కి ప్రసాద్ నిద్ర లేచి వాలు కుర్చీలో కూర్చొని స్వామి వంక చూస్తూ మరలా నిద్రలోకి జారిపోయాడు. కలలో ప్రసాద్ రెడీ అయ్యి సార్ దగ్గరికి వచ్చాడు. సార్ అతనితో అవధూత లీల చదువు అని చెప్పారు. అతను సార్ కూర్చున్న వెనకాల గదిలోకి వెళ్లి వెతికితే అక్కడ పుస్తకం కనబడలేదు. వెంటనే ప్రసాద్ కు నిద్ర నుంచి మెలకువ వచ్చింది. అవధూత లీల తీసుకుని చదవడం స్టార్ట్ చేశాడు. అంటే ఆగస్టులో వెంకయ్య స్వామి ఆరాధన ఉంది. దానికి ముందర స్వామి చరిత్ర పారాయణ చేయడం మంచిది అని సార్ చెప్పినట్లు ఉంది. సార్ గుర్తు చెయ్యక పోతే ప్రసాద్ పారాయణ

చేసేవాడు కాదు. కానీ సార్ అనంత కృపతో ప్రసాద్ కు ఆరాధన ముందు ఏమి చేయాలో అది నేర్పిస్తున్నారు.

## శేషుకృష్ణ

చెన్నైలో వుండే శేషు కృష్ణ గారు 2019 నవంబర్ నెలలో శ్రీ గురుచరిత్ర పారాయణ చేశారు. పూర్తయిన రోజు రాత్రి సార్ కలలో కనపడి "శేషుకృష్ణ, ఏ పని చేస్తున్నా భగవంతుని, మాస్టర్ ని గుర్తుంచుకో" అని చెప్పారు. గురు చరిత్ర పారాయణ చేస్తే సార్ కనపడటం అంటే సార్, శ్రీ దత్తాత్రేయుడు అని చెప్పి నమ్ముతున్నానని తెలుపుతున్నారు.

శేషయ్యకు (సార్ వాళ్ళ అబ్బాయికి) కరోనా వచ్చిందని (2021 ఎండాకాలం) శేషుకృష్ణ బాధపడిన రోజు రాత్రి కలలో శ్రీ సుబ్బరామయ్య సార్ కనపడి "బాధపడకు తగ్గిపోతుంది" అన్నారు. కాలాంతరంలో అలానే జరిగింది.

## బట్టు శ్రీరామకృష్ణ

నేను ఆఫీసుకు లేటుగా వెళితే ఆ పూట అన్నం తినకుండా ఉండే నియమం పెట్టుకున్నాను. కొన్ని రోజులు గడిచింది. తర్వాత నాకొక అనుమానం వచ్చింది ఇదంతా నేను అనవసరంగా పెట్టుకున్న నియమమా లేదా సార్ కి అదేశంగా పెట్టుకున్నానా అని అనుమానం

వచ్చింది. అందువలన నేను వెంటనే సార్ తో మనస్సులో "సార్! పెట్టుకున్న నియమం మీకు ఇష్టమైతే ఎదురుగా వచ్చే కారు నెంబర్ చివర్లో 0 ఉంటే ఈ నియమాన్ని హృదయ పూర్వకంగా పాటిస్తాను"అని చెప్పుకున్నాను. చాలా చిత్రంగా ఎదురుగుండా వచ్చే కారు యొక్క నెంబర్ చివర్లో జీరో ఉన్నది. అంతే ఆ సూచన సార్ ఆజ్ఞాపించింది అన్నట్లు తీసుకొని ఆఫీస్ కు లేటుగా వెళ్లకుండా ఉండేది ఒకవేళ లేటుగా వెళితే ఆ పూట అన్నం తినకుండా పాటిస్తున్నాను. నియమం పెట్టుకున్న తర్వాత ఆఫీసుకి లేటు గా వెళ్ళేది నెల రోజుల్లో ఒకటి రెండు రోజులకు వచ్చింది అంతకు ముందు దాదాపు 4 - 5 రోజులు లేటుగా వెళ్లేవాడిని.

2019 జులై 7వ తేదీన మా అబ్బాయి సైకిల్ మీద వస్తూ రాయి తగిలి క్రిందపడితే తెలిసిన వాళ్ళు హాస్పిటల్ కి తీసుకెళ్లారు. ముందు పళ్ళు ఉడిపోవటం వల్ల, చెన్నై రామచంద్ర మెడికల్ సెంటర్ లో అడ్మిట్ అయ్యి, చిన్న సర్జరీ చేయించుకుని వారం రోజులు ఉండాల్సి వచ్చింది. ఇంత పెద్ద ప్రమాదంలో కూడా వాడికి నొప్పి లేకుండా చేయటం కేవలం సార్ కే చెల్లింది. ప్రతిరోజూ నర్స్ వచ్చి pain killer voveran ఇంజెక్షన్ ఇస్తానంటే వద్దు, నాకు నొప్పి లేదు అనేవాడు. మిగతా

ఇంజెక్షన్ మాత్రం చేయించుకునే వాడు. అంటే మన జాతకం వల్ల గాని, ఆలోచనలు, కర్మ వల్ల గాని ప్రమాదం జరగవలసి ఉండి జరిగినా, కొండంతని గోరంత గా మార్చి రక్షిస్తారు.

అమ్మగారు ఒక ఆదివారంనాడు నెల్లూరు లో ఉన్న వాళ్ళమ్మాయి (సుమతి అక్క) వాళ్ళ ఇంట్లో నుంచి బయలుదేరి గొలగమూడికి సాయంత్రం ఆరు గంటలు దాటిన తర్వాత వచ్చారు. అప్పుడు వచ్చిన అమ్మ గారు నాతో "ఇంట్లో కొన్ని పనులు ఉన్నాయి. నువ్వు చేసి పెడతావా? కానీ నువ్వు చేసే సరికి లేట్ అవుతుంది మరి నీకు ఇబ్బంది అవుతుందేమో అని అడిగారు. అలాగే అమ్మగారు నేను పనిచేసి బయలుదేరి వెళతాను. ఎట్లాగు నేను గుంటూరు వెళ్ళాలి రాత్రి రెండు గంటలకి కూడా గుంటూరుకి ట్రైన్స్ ఉంటాయి. అందువలన ఇబ్బంది లేదు అమ్మగారు అని చెప్పాను. అమ్మ గారే నాతో రైళ్లు ఉంటాయిలే గాని, నీకు రాత్రిపూట ఆటోలు ఎక్కడ దొరుకుతాయి అన్నారు. కానీ పని చేసి మధ్యలో బయటకు వచ్చిన తర్వాత ఒక ఆలోచన వచ్చింది ఆటో బాడుగ మాట్లాడుకుని వెళదాము అని వాకబు చేస్తే ఆటోలు రాత్రుళ్ళు బాడుగకు రావట్లేదు అని చెప్పారు. సరే సార్. అంతా మీ ఇష్టం. ఎలా కుదిరితే అలా జరిపించండి

అనుకున్నాను. ఇంతలో వేణుగోపాల్ గారి పెద్దబ్బాయి సాయి నన్ను చూసి మాట్లాడుతూ మా నాన్నవాళ్ళు పిఠాపురం వెళ్లి వస్తున్నారు అందువలన రాత్రి ఒంటి గంటకి నేను రైల్వే స్టేషన్ కి వెళ్లి ఆయన తీసుకు వస్తాను, అప్పుడు రైల్వే స్టేషన్ దగ్గర మిమ్మల్ని డ్రాప్ చేస్తాను అని చెప్పాడు. అంతే ఆ క్షణం నాకు ఎంతో ఆనందం కలిగింది. సార్ కి మనం సేవ చేయడానికి పూనుకుంటే, మనకు అవసరమైన సమస్తం సార్ సమకూరుస్తారు అని చక్కగా అర్థం అయింది.

ఇలాగే, ఇదివరకు ఒకసారి గొలగమూడి నుండి అమ్మగారి దర్శనం కోసం నెల్లూరు (సుమతి అక్క వాళ్ళ ఇంటికి) వెళ్లటమా లేక సదుపాయంగా వేణుగోపాల్ సార్ కార్లో మద్రాస్ వెళ్ళటమా అని ఆలోచించి, అమ్మ గారి దర్శనానికే వెళ్ళాను. చక్కగా దర్శనం అయినాక ఫోన్ చేస్తే, వేణుగోపాల్ సర్ వాళ్ళ అత్త గారిని దింపటం కోసం నెల్లూరు వచ్చారు అని తెలిసి, నేను అయ్యప్ప గుడి దగ్గర వాళ్లని కలుసుకుని హాయిగా కార్లో మద్రాస్ చేరుకున్నాను.

నేను కళ్ళజోడుని ఐదు వందల రూపాయలకు కొన్నాను. మా ఆఫీస్ లో కళ్ళజోడు కొనుక్కున్నప్పుడు బిల్లు పెట్టుకోవచ్చు. ఎంత బిల్లు పెడితే అంత డబ్బులు

ఇస్తారు. నేను అందువలన 500 రూపాయలు కళ్ళజోడు కి ఐదు వేల రూపాయల బిల్లు పెట్టి డబ్బులు తీసుకున్నాను. ఆ తర్వాత నుండి నాకు కళ్లు తిరగటం ప్రారంభం అయింది. కొన్నాళ్ళ తర్వాత నేను తట్టుకోలేక వెంకయ్య స్వామి! ఇది నేను 500 రూపాయలకు 5000 రూపాయలు తప్పుడు బిల్లు పెట్టడం కారణం అయితే 5000 రూపాయలు అన్నీ మీకు దక్షిణగా ఇచ్చేస్తాను అని చెప్పుకున్నాను. అంతే స్వామికి చెప్పుకున్న తరువాత రోజు నుండి, కళ్ళు తిరగటం పోయింది.

సార్ భౌతికంగా మన మధ్య ఉన్నప్పుడే ఒక రోజు రాత్రి నాకు కలలో కనబడి అన్నం వడ్డించి పిలిస్తే నేను గుడికి వెళ్లి వస్తాను అని అంటే  చెప్పులు వేసుకుని వెళ్ళు అని చెప్పారు. నేను మందిరం నుండి వస్తూ ఒకరితో ఎక్కువ సేపు కబుర్లు చెప్పాను. సార్ దగ్గరకి వెళ్లి కళ్ళు కడుక్కొని వస్తానని చెప్పి వెళ్ళాను. తర్వాత సార్ అక్కడ లేరు. అన్నం తినే అవకాశం కోల్పోయాను. తెల్లవారిన తర్వాత అయ్యో ఎంత అదృష్టం పోయిందో అనిపించింది. గొలగమూడికి వచ్చినప్పుడు సార్ కి చెప్పి సార్ మీరు పెట్టిన అన్నం తినలేకపోయాను కానీ నిజ జీవితంలో అలా జరగకుండా చూడండి అని చెపితే సార్

మొదట మౌనంగా ఉన్నారు. తరువాత మళ్ళీ సారొక్కరే ఉన్నప్పుడు ప్రార్థిస్తే, సరే అన్నారు.

సార్ 2017 లో సమాధి అయ్యారు. 2019 నవంబర్ లో నాకు కలలో ఒక రూములో సార్ మంచం మీద విష్ణుమూర్తి లాగా పడుకున్నారు. అమ్మగారు లక్ష్మీదేవి లాగా కాళ్ళు నొక్కుతున్నారు. వేణు రాలేదా అని అడిగారు. అంతలోనే వేణు గోపాల్ గారు వచ్చారు. తర్వాత క్రింద కూర్చుని అన్నం పెట్టారు. ఇంకా ఎవరైనా ఉన్నారో పిలువు అన్నారు. వేరే వాళ్ళు వస్తే వాళ్ళకి కంచం ఇవ్వాలని నేను త్వరగా తింటున్నాను. దీనిని నాకు సార్ సర్వమూ చూసుకుంటాను అని చెప్పినట్లు ఉన్నది. సమాధి తర్వాత కూడా నాకు ఏమి కావాలో నాకు ఇచ్చిన మాటని నెరవేర్చారు.

శ్రీ రామకృష్ణ బట్టు దాదాపు 6 సంవత్సరముల నుండి సినిమా థియేటర్ కి వెళ్ళలేదు. 2019 లో వాళ్ళ అమ్మగారు చెన్నైలో ఉంటే ఆమెకు మనోరంజకంగా ఉంటుంది కదా సినిమాకి వెళ్ళదామనుకున్నాడు. అందుకని పర్మిషన్ కోసం అమ్మగారికి (సార్ ధర్మపత్ని) చెపితే వెంటనే అమ్మగారు “ఈయన మమ్మల్ని సినిమా థియేటర్ లో దించి సినిమా అయిన తర్వాత వచ్చి తీసుకు వచ్చేవారు” అని చెప్పారు. బట్టు పర్మిషన్ రాలేదని

disappoint అయ్యాడు. కొన్ని వారాల తర్వాత మే 2019లో సార్ దగ్గర చీట్లు పెడితే సార్ సినిమాకు వెళ్ళవద్దని చెప్పారు. బట్టుకు సినిమా థియేటర్ కు వెళ్లకూడదని పట్టుదల పెరిగింది. పైగా అమ్మగారి మాట, సార్ మాట ఒక్కటే అని విశ్వాసం దృఢపడింది.

బట్టు వాళ్ళ పిల్లకు 4 సంవత్సరాలు. అన్నం తిన్న తర్వాత ఐస్ క్రీం తినటం అలవాటు. ఐస్ క్రీం ఇవ్వకపోతే ఏడుస్తుంది. విసిగిస్తుంది. ఒకరోజు రాత్రి బట్టు, వాళ్ళ పిల్ల బయట నుండి ఐస్ క్రీం తీసుకు వచ్చారు. అన్నం తిన్న తర్వాత ఐస్ క్రీం తినాలని ఆలోచన. ఇంటికి రాగానే refrigerator లో పెట్టారు. బట్టు భార్య బట్టుతో 'ఎందుకు తీసుకు వచ్చారు. దానికి జలుబు చేస్తుంది' అని చెప్పేసరికి బట్టు 'ఎందుకు తీసుకు వచ్చాము, పిల్లకి ఏమైనా అయితే బాగుండదు కదా' అని అనుకుంటూ సార్ ని మనస్సులో తలచుకుంటూ 'సార్! మీరు సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు. మేము చేసే ప్రతి పని చూస్తున్నారు కదా అలా అయితే పిల్ల ఐస్ క్రీం అడగకుండా మరిపించ గలరా?' అని అనుకుంటూ అయినా ఇంత చిన్న విషయాలు సార్ కి చెప్పకూడదు అనుకున్నాడు. అన్నం తిన్న తర్వాత refrigerator ముందరే కూర్చుని తినే పిల్ల ఆటల్లో పడి ఐస్ క్రీం

విషయం మరిచిపోయింది. ఆ చిన్న సంఘటనతో సార్ నిరంతరం మనం చేస్తున్న పనులు, ప్రార్థనలు చూస్తూ మనకు శ్రేయస్కరమైనది చేస్తున్నారనే నమ్మకం దృఢపడింది.

1. గత 2-3 సం|| గా మా అమ్మ తనకు ఛాతిలో పట్టేసినట్లుగా ఉందని గుంటూరు లో నే cardiologist లని కలవడం, వాళ్ళు ఇచ్చిన మందులు వాడటం జరుగుతోంది. 2021 సెప్టెంబరు లో ఒకసారి బాధ కొంచెం ఎక్కువై భయపడింది కూడాను. అక్కడి వాళ్ళు ఆంజియోగ్రామ్ చేయించుకోమని సలహా ఇస్తూ ఉంటే, అక్కడి కంటే చెన్నై లో చేయిస్తే better అని Chennai లో మా ఇంటికి తీసుకువచ్చాను. ఇక్కడి Porur-Ramachandra హాస్పిటల్ వాళ్ళు కూడా Master health checkup చేసి ఆంజియోగ్రామ్ చేయిస్తేనే మంచిది అని సలహా ఇచ్చారు. దీపావళి వెళ్లిన మరునాడు (5 Nov, శుక్రవారం) ఉదయం ఆ డాక్టర్ గారికి ఫోన్ చేస్తే, మొదట వచ్చే వారం చేద్దాం అని, మళ్ళీ ఎందుకో గాని, "మీకు ఇష్టమైతే రేపే చేసేద్దాం" అన్నారు. సార్ పటం వైపు చూస్తే "Yes" అన్నట్లు అనిపించింది. అన్ని పనులూ general గా 'చూద్దాం లే, మెల్లగా చేద్దాం లే ' అని వాయిదా వేసే అలవాటు ఉన్న నేను, కేవలం

సార్ YES చెప్పారని మాత్రమే, కొంత అయిష్టం గానే హాస్పిటల్ కి వెళ్లి మా అమ్మని అడ్మిట్ చేశాను. మరురోజు ఉదయం 8 గం|| ల కు ఆ డాక్టర్ గారు angiogram చేసేసి heart valves శుభ్రంగా ఉన్నాయి, ఎటువంటి ఆపరేషన్ అక్కర్లేదు, ఇప్పటి దాకా వాడుతున్న మందులు కూడా ఆపేయండి అని, కేవలం బలానికి, etc., కొన్ని మందులు మాత్రం వాడమన్నారు. అది ఎంత గొప్ప relief అనేది మాటలలో చెప్పలేను. ఆ రోజే డిశ్చార్జ్ అయి ఇంటికి వస్తూ ఉన్నప్పుడే మెల్లగా వర్షం మొదలైంది. ఆ రోజు నుండి దాదాపు ఒక నెల పైనే చెన్నైని వర్షాలు ముంచెత్తినై. నా ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా కేవలం సార్ వెళ్ళమన్నారన్న ఆదేశం follow అవటం వల్ల, ఎంతో హాయిగా హాస్పిటల్ పనులు పూర్తి చేసుకుని, క్షేమంగా ఇంటికి చేరుకున్నాము. లేకుంటే ఈ రోజు వరకు angiogram చేయించటం కుదిరేది కాదు. అంతే కాకుండా మేము హాస్పిటల్ లో ఉన్నప్పుడు నా భార్య కి ప్రేరణ పెట్టి మా terrace రూమ్ క్లీన్ చేయించడం వల్ల, అది నా ఆఫీస్ రూమ్ గా మాత్రమే కాకుండా వర్షాల టైములో బట్టలు ఆరేసుకోడానికి కూడా ఉపయోగ పడుతోంది. ఇంకా జాగ్రత్త గా గమనిస్తే, మా పక్క అపార్ట్మెంట్ వాళ్ళ కోసం

వచ్చిన electrician మా ఇంటికి వచ్చి geyser repair చేయడం వల్ల ఈ వర్షా కాలంలో కూడా ఏ ఇబ్బంది లేకుండా హాయిగా ఉన్నాము అంటే అది కేవలం సార్ కృపే. ఈ లీలలు టైపింగ్ చేస్తున్న ప్రస్తుత టైం (17-Jan-2022) కి కూడా మాకు చెన్నై లో భారీ వర్షం కురుస్తోంది.

2. ఒక వ్యక్తి నాకు రూ.15,000/- ఇవ్వవలసి ఉంది. దాదాపు ఒక సంవత్సరం పైనే గడిచి పోయింది. నేను ఎప్పుడు గట్టిగా అడుగుదాం, కోపంగా మాట్లాడదాం అనుకున్నా సార్ 'వద్దు' అన్నట్లు అనిపించేది. ఇక లాభం లేదని, 2021 March లో సార్ తో 'జూన్ 30వ తేదీ గడువు. ఆ రోజు కల్లా నా డబ్బులు ఇప్పించండి. లేదంటే నేను ఆ వ్యక్తితో గట్టిగా మాట్లాడతాను. అప్పటి దాకా నాకు ఇష్టమైన ice cream తినను అని నియమం పెట్టుకుని" ఎదురు చూసాను. చిత్రంగా ఆ వ్యక్తి కరెక్ట్ గా 30-Jun-2021 న నా 15,000/- నాకు transfer చేసేసాడు. సార్ మాట వింటే, ఇక మనకి దేనికీ worry ఉండదు.

3. అలాగే మా ఎదుటి flat వాళ్లతో కొన్ని విషయాలు మాట్లాడదాం అనుకున్న చాలా సార్లు సార్ నన్ను ఆపేసారు. తరువాత ఒక రోజు నన్ను ప్రేరేపించి వాళ్లతో మాకు కలుగుతున్న ఇబ్బందుల గురించి

ప్రేమగా, మెల్లగా అర్ధం అయ్యేట్లు చెప్పేలా చేశారు సార్. దాంతో ఆ ఇబ్బందులు అన్ని పోయాయి అని వేరే చెప్పాలా.

4. 2021 సెప్టెంబర్ లో అత్యవసరం గా మా అత్త గారిని చెన్నై నుండి మంగళగిరి తీసుకు వెళ్లాల్సి వచ్చింది. Direct ట్రైన్ దొరకనందున తెనాలి లో ట్రైన్ దిగి బస్సు స్టాండ్ వైపు నడుస్తూ, "విజయవాడ బస్సు ఎక్కుదామా, మంగళగిరి బస్సు ఎక్కుదామా, ఏది ఎక్కినా మేము వెళ్లాల్సిన చోటికి చుట్టూ తిరిగి పోవలసి వస్తుందే,... లేకుంటే వడ్లపూడి flyover దగ్గర దిగి ఆటో ఎక్కుదామా" అని బుర్ర బద్దలు కొట్టుకోబోయి, ఇంతలో "శ్రీ మాష్టర్ గారి బోధామృతం లో ఆలోచనలు అనవసరం, సర్వం ఆయనే నడిపిస్తాడు" అని చదివింది గుర్తు వచ్చి, "మీ ఇష్టం గురుదేవా" అనుకుని మెల్లగా నడుస్తున్నాను. "సర్వం నీ దివ్య కళా మయం..." అన్నట్లు ఒక car వచ్చి మా పక్కన ఆగటం, అదే రూట్ లో పోతున్నామని చెప్పి మమ్మల్ని ఎక్కించుకుని నేరుగా మేము చేరాల్సిన చోటు దగ్గరే దిగబెట్టటం జరిగింది.

5. 2021 లో సార్ ఆరాధన కి 'A Day with SIR' అని ప్రోగ్రాం చేద్దాం అని సాయి, ఇంకా మిగతా సభ్యులు అనుకుంటున్నారు. As usual గా, నాకు

ఎందుకులే అని పట్టించుకోలేదు. కానీ ఒక రోజు తెల్లవారు ఝామున చిత్రాతి చిత్రంగా సార్ నాకు ప్రేరణ పెట్టి, ఒక outline వ్రాయించారు. దాన్ని వినిపించగానే అందరూ బాగుంది అన్నారు. అది పూర్తి చేసి rehearsal చేస్తే, అంత గొప్పగా రాలేదు. ఒక దశలో ప్రోగ్రాం మార్చేద్దామా అని కూడా అనుకున్నాము. కానీ సార్ స్వయంగా నా చేత ఇది చేయిస్తున్నారు, ఖచ్చితంగా బాగా చేయిస్తారు అని గట్టిగా అనిపించి, ప్రసాద్ తో ధైర్యంగా ఆ ప్రోగ్రాం బాధ్యత నాకు వదిలేయమని చెప్పాను. నిజానికి final script ఆ ప్రోగ్రాం start అయ్యే సమయానికి కూడా రెడీ కాలేదు. అయినా ఆ ప్రోగ్రాం ఎంతో గొప్పగా సక్సెస్ అయ్యి "సార్ తో మాకున్న దివ్య స్మృతులను కొన్నిటిని, మళ్ళీ అందరి మనో: ఫలకాలు పై ముద్రించింది" అనే చెప్పాలి. కొసమెరుపు ఏమిటంటే అప్పటి వరకూ "Senior Engineering Manager" గా ఉన్న నా office designation నా ప్రమేయం లేకుండానే "Program Director" గా మార్చబడటం.

6. 2021 December 21వ తేదీ ఉదయం సార్ ఆడియో ఫైల్ ఒకటి casual గా విన్నాను (audio link కూడా ఆ magazine లో పైన ఇవ్వబడింది). ఆ

ఆడియో ఎందుకో తెలియకుండానే మళ్ళీ మళ్ళీ వింటూ ఉండి పోయాను. అందులో "income tax ఖచ్చితం గా గవర్నమెంట్ కి కట్టాలని, లేకపోతే రాజద్రోహం చేసినట్లు అని, అట్లా కూడబెట్టిన డబ్బు hospitals కి ఖర్చు పెట్టాల్సి వస్తుంది అని,... అంతే కాకుండా సార్ ధర్మం కోసం నిలబడి, కరెంట్ మీటర్ పెట్టినదాక connection కూడా తీసుకోకుండా strict గా ఉండటం వంటివి" వివరించారు. ఇది విన్న తరువాత, నేను income tax విషయంలో convenient గా చేస్తున్న తప్పులన్నీ నా కళ్ళ ముందు కనిపించాయి. దాంతో నాకు గుర్తు వచ్చినంత మేర, మొత్తం tax కట్టేసి హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. ఇదంతా income tax returns filing కి 10 రోజులు ముందు జరగటం ఎంత చిత్రమో చూడండి.

ఇవన్నీ సార్ నాకు ప్రసాదించిన ఎన్నో లీలల్లో.. నేను గుర్తించ గలిగి, గుర్తు పెట్టుకుని వ్రాసుకున్న వాటిల్లో కొన్ని మాత్రమే. నిజానికి సార్ అహర్నిశలు "నేను నిన్ను అనుక్షణం గమనిస్తూ, రక్షిస్తూ, నడిపిస్తున్నాను. కనుక, అనవసరమైన చెత్త ఆలోచనలు వదిలి వేసి, సంపూర్ణ శరణాగతి చేయి" అని హెచ్చరిస్తున్నారు అనిపిస్తుంది.

**చిత్తరంజన్ గారు**

హైదరాబాద్ లో నాంపల్లిబాబా గారి దర్శనం చేసుకుంటూ ఉండేవారు. తన స్నేహితుడు రామకృష్ణ ద్వారా గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామి, సార్ లా దర్శనం చేసుకున్నారు. సార్ వ్రాసిన గ్రంధాలు తీసుకుని చదువుకుంటుండే వారు. సార్ సమాధి అయిన తర్వాత సార్ లీలలు కల "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" అనే గ్రంధాన్ని నాంపల్లి బాబా సమాధి పూజారి అప్పారావు గారు ఇచ్చారు. ఒకరోజు హైదరాబాద్ నుండి ఇండోర్ కు ఇండిగో flight లో వెళుతూ మనస్సులో నా ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోకూడదు. సాయిబాబాను కూర్చో పెడతాను. మనస్సులో అనుకున్నట్టే నా ప్రక్కనున్న సీట్ లో ఎవరూ కూర్చోలేదు. ఆ ప్రయాణంలో "శ్రమతో సేవ – సేవతో కైవల్యం" గ్రంథం పారాయణ చేశాను. కొన్ని రోజులకు సార్ ఇప్పుడు లేరు కదా అనుకుంటే ఆనాటి రాత్రి నా కలలో "ఒక ఇంట్లో మధ్య సార్ ఇటుక రంగు షర్టు, గళ్ళ లుంగీ, గడ్డంతో కూర్చుని ఉన్నారు. సార్ ముఖం pleasing గా ఉంది". తర్వాత రోజు నుండి చిత్తరంజన్ గారి మనస్సు ప్రశాంతంగా ఉంది.

## పరంధామయ్య గారు

పరంధామయ్య సార్ సమాధి మందిరంలో పూజారిగా ఉంటున్న రోజులలో ఒకరోజు సాయంత్రం శ్రీ

వెంకయ్యస్వామి భజన మందిరంలో భజన చేస్తున్నాడు. సార్ భజన మందిరం ద్వారం దగ్గర పరంధామయ్యకు కనపడ్డారు. వెంబడే సయం ఆరతి 6:15 కి ఉంది కదా, మర్చిపోయనే సార్ గుర్తు చేసారు అని పరంధామయ్య సార్ సమాధికి ఆరతి ఇచ్చాడు.

ఈ లీలల ద్వారా సార్ మనల్ని నిరంతరం గమనిస్తుండటమే గాక సరైన మార్గంలో నడిపిస్తున్నారు. ఇంతటి మహనీయుడు మన చెంతనే ఉండగా మన జీవితాల్ని ఆయనకి అర్పించి, అన్నివేళలా అయన మీద ఆధారపడి, నిర్భయంగా అత్మజ్ఞానానికై కృషి చేసి కృతకృత్యులవ్వాలని సార్ బోధిస్తున్నట్లున్నది.

# శ్రీ సార్ మృత్యువు పై ఘన విజయం

గురుభక్తిలో స్థిరమైన శ్రీ సార్ పొందిన స్థితిని ప్రకటం చేసే అరుదైన సంఘటన :

శ్రీ వెంకయ్య స్వామి సన్నిధిలో 40 రోజులు గడపాలి అనుకొని శ్రీ భరద్వాజ మాష్టారి ప్రత్యక్ష భక్తులైన శ్రీ చింతా లక్ష్మి నారాయణ గారు (హైదరాబాద్), వారి ధర్మ పత్ని చింతా లక్ష్మి గార్లు గొలగమూడిలో సార్ సమాధి మందిరం దగ్గరలో డిసెంబర్ చివరి వారం నుండి ఉంటున్నారు. శ్రీ సార్

సమాధిని రోజూ దర్శించుకోవటం, సమాధికి ప్రదక్షిణలు చేయటం వారి నిత్య విధిలో భాగంగా ఈ 40 రోజులు చేస్తున్నారు. శ్రీ సార్ గురు పాదుకా (సామూహిక)పూజ డిసెంబర్ 30 వ తేదిన చేసుకోవటం లో కూడా వారు పాలు పంచుకొన్నారు. ఆ పూజలో సార్ పాదుకలకు, సార్ బౌతికంగా ఉన్నప్పుడు ధరించిన రబ్బరు చెప్పులకు కూడా పూజ చేయటం శ్రీ చింతా లక్ష్మి గారు చూచి, వారికి సార్ తో గల చనువు వల్ల, శ్రీ భరద్వాజ మాస్టారని వారు సేవిమ్చుకొనేటప్పుడు సార్ కూడా వారి సహ భక్తులు గా, గురుభందువులుగా గల పరిచయం వల్ల వీళ్ళకు పిచ్చా ! ఏమిటి? రబ్బరు చెప్పులు తెచ్చి సమాధి మీద పెట్టారు అనుకున్నారు. వారికి శ్రీ సార్ పై కూడా గల గౌరవం, గురుభావంతో ప్రదక్షిణలు రోజూ చేస్తున్నారు. 2019 జనవరి 8 వ తారికున (మంగళవారం) వారు ప్రదక్షిణ చేస్తుంటే ఉన్నట్టుంది శ్రీ సార్ వారి ఇంటి వైపు నుండి సమాధి వద్దకు వస్తూ భౌతికంగా మద్యాహ్నం అప్పుడు కనబడ్డారు. మరల తొంగి చూసినా సార్ భౌతికంగా వస్తున్నారు. అంతలోనే మరో సెకనులో అదృశ్యమైనారు. ఏదో నా భ్రమ ఏమో అని ఆ రోజు ఎవరికీ చెప్పలేదు. మరల 2019 జనవరి 10 వ తారికు (గురువారం) రోజు మరల స్పష్టంగా

భౌతిక దర్శనం ప్రసాదించారు. మరల, మరల ఒక సెకను వ్యవధిలో కనపడి తరువాత అదృశ్యమైనారు. ఈరీతి వారికి ఆశ్విసులు ఇవ్వటమే కాక మనందరికి "ఒళ్ళు దగ్గర పెట్టు కొని"మరింత శ్రధతో వారి పై గురు భక్తి నిలుపుకోమని ఆచరణతో వారిని మెప్పిస్తే వారు ఎప్పటివలెనే మనను ప్రేమగా నడిపించుటకు సిద్ధమని తెలుపుతున్నారు.

దమ్మపేట నాగేశ్వరరావు గారు తనకు శ్రీ స్వామి శ్రీ సార్ లో అనుగ్రహించిన స్వప్న అనుభవాన్ని ఇలా పంచు కుంటున్నారు: సుమారు డిసెంబర్ 14, 2021 న శ్రీ సుబ్బరామయ్య సార్ స్వప్నంలో మాఉరిలోని వాణి అనే సత్సంగ సభ్యురాలిని చూపించి శ్రీ వెంకయ్య స్వామి యాస లో (మాటగా) "అయ్యా ! ఆమెను ప్రదక్షిణాలు చేయమనయ్య !" అని చెప్పారు. ఇదివరలో వాణి ప్రతిరోజూ గుడికి ప్రదక్షిణలు చేసేవారు. ఇప్పుడు చేస్తున్నారో లేదు తెలియదు. ఆశ్చర్యంతో మరురోజు వాణి గారిని అడిగితే "వారి కుమారుని విషయమై ఏదో ప్రయత్నాలలో ప్రదక్షిణలు చేయటం ఆగి పోయిందని అలాగే అశ్రద్ధ అవుతోంది చేయటం లేదని" చెప్పారు. శ్రీ సార్ ప్రసాదించిన స్వప్న దర్శన్నాన్ని, శ్రీ స్వామి సందేశాన్ని తెలియపరచి తప్పక చేయమని వారి

సహాయం ఉంటుంది అని ప్రోత్సహించాను. వాణి మరల ప్రదక్షణలు కొనసాగిస్తున్నారు. శ్రీ సార్ నిత్యసత్యులు, సర్వజ్ఞులు, సర్వ ప్రేరణాధికారి అయి మనను అనుక్షణము కనిపెట్టి మాతృ ప్రేమతో నడిపించే తీరు ఎంత అద్భుతమో ఈ అనుభవములో చూశాము. శ్రీ స్వామి - సుబ్బరామయ్య సార్ అభేదులు అని నిదర్శనంగా కూడా ఈ అనుభవం మనకు ఉంది.

సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ కార్యక్రమాలు ఏవి చేసేటప్పుడైన శ్రీ సార్ కు ముఖతా నివేదించుకొని ఆశీస్సులు అడిగి సార్ శుభాసీస్సులు వాచా ఇచ్చిన తరువాతనే మొదలు పెట్టడం సాయి మాస్టర్ ముఖ్య నిర్వాహకులైన వేణుగోపాల్ గారికి అలవాటు.

సార్ మొదటి ఆరాధనకు (జూన్ 9, 2018) ఇంకా కొన్ని రోజులు ఉంది. ఆరాధన కార్యక్రమాలు ఎలా జరుగుతాయని వేణుగోపాల్ గారు ఉద్విగ్నతగా ఉన్నారు. సార్ కు నివేదించుకొంటున్నా సార్ మాటగా శుభాసీస్సులు పొందలేము కదా అని వెలితిగా ఉన్నారు. ఒకరోజు ఉదయం స్నానం చేస్తుంటే భౌతికంగా ఉన్నప్పటి సార్ మాటగా హృదయానికి చాలా స్పష్టంగా “అంతా బాగా జరుగుతుంది” అని వినపడింది. అంతే వెంటనే వేణుగోపాల్ గారి కి మనస్సు ప్రసన్నం

అయ్యింది. అలానే అన్ని కార్యక్రమాలు సజావుగా జరిగాయి. కానీ కార్యక్రమాలు బాగా జరిగాయి అని మనం ఎలా నిర్ణయిస్తాము? కొన్ని గుర్తులు:

సాయి, వేణుగారు, ప్రసాద్ లు శ్రీ వెంకయ్యస్వామిని, సార్ ని ప్రార్థిస్తూ "మీకు తృప్తికరంగా ఈ ఆరాధన జరిగేటట్లు చూడండి" అని స్వామి ధునికి టెంకాయ సమర్పించారు. (ఈ విషయం తెలపకుండా చేసినవారూ ఉంటారు)

ఆరాధనలో అందరూ తమ వీలును బట్టి ఒకటి, రెండు రోజులు ముందర వచ్చి తమ ఇంటిలో పనిలాగా సేవ చేసుకోగలిగారు

సార్ సత్సంగం, పూజ, సార్ తో పాటు సార్ కట్టించిన భవనాల సందర్శనం, భజన, సార్ యొక్క వీడియోలు మొదలైన కార్యక్రమాలలో అందరకీ సార్ తో ఉన్నామనే భావన కలిగింది.

సార్ గొప్పదనం గూర్చి తరచు వచ్చే వారికీ కూడా తెలియని క్రొత్త విషయాలు తెలిశాయి.

వేణుగోపాల్ గారి తమ్ముడు నారాయణతో మార్చి 2018లో మాట్లాడుతూ 'సర్లే, సార్ ఆరాధనకు వస్తాలే' అని చెప్పాడు. తర్వాత మర్చిపోయాడు. జూన్ 8 వ తారీఖున అతని కలలో సార్ కనపడి "ఆరాధనకు

వస్తానని మాట ఇచ్చి మర్చిపోయావే” అని హెచ్చరించారు. ఆరాధనకు వచ్చి అతను సార్ దర్శనం చేసుకున్నాడు.

ఈ లీలలు బట్టి సార్ అన్నివేళలా అన్నిటినీ గమనిస్తున్నారనీ, అంతేగాకుండా మనల్ని సరైన మార్గంలో నడిపిస్తున్నారని తెలుస్తోంది! సార్ నిత్యసత్యులు.

**శ్రీ సచ్చిదానంద సద్గురు గురుదేవ శ్రీ శ్రీ శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ కి జై**



**శ్రీ సాయి మాస్టర్ నిలయం 2 నిర్మాణం**



**సార్ దాదాపు 10సం||లు ప్రతిరోజూ తిన్న ఆకుకూర**



శ్రీ సాయి మాస్టర్ విద్యాలయ నిర్మాణ పర్యవేక్షణ



శ్రీ బ్రహ్మంగారి మఠంలో సత్సంగం తరువాత ధ్యానం



శ్రీ సాయి మాస్టర్ నిలయంలో సార్



అభయమిస్తున్న సార్



సార్ సమాధి



సార్ ఇంటిలో నిరామయంగా



శ్రీ శేషమ్మ సమేత సద్గురు సుబ్బరామయ్య సార్



**శ్రీ శేషమ్మ సహిత సద్గురు సుబ్బరామయ్య సార్**